
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 320
సోమవారం 10-2-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'



రోహిట్స్'తో భారత్‌దే సిరీస్
రోహిత్ సెంచరీ. రెండో వన్డేలోనూ ఇంగ్లండ్‌పై టీమిండియా గెలుపు -14లో



పన్ను ఆదా.. పెట్టుబడి!
కొత్త వ్యవస్థలో భారీగా పన్ను మిగులు - 15లో



ఆ కారిడార్ నుంచి వెనక్కు
కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో భాగంగా గాజా నుంచి తమ బలగాల ఉపసంహరణ మొదలైందని ఇజ్రాయెల్ ప్రకటించింది.
- వివరాలు 6లో



ప్రెసిడెంట్ ఎలాన్ మస్క్!
టైమ్ మేగజైన్ 'ప్రెసిడెంట్ ఎలాన్ మస్క్' అంటూ తాజాగా వ్యంగ్యాత్మక కవర్ పేజీ కథనం ప్రచురించింది.
- వివరాలు 6లో



'సైబర్' రిఫండ్ సగమే..
ఖాతాలు ఫ్రీజ్ అయినా సైబర్ నేరగాళ్లు దోచుకున్న సొమ్ము చేతికి వస్తుందన్న గ్యారంటీ లేక బాధితులు ఆవేదన చెందుతున్నారు.
- వివరాలు 16లో



మణిపూర్ సీఎం రాజీనామా
మణిపూర్ సీఎం ఎన్.బిరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేశారు.
- వివరాలు 6లో

ఎరుపెక్కిన ఇంద్రావతి!

ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో భారీ ఎన్‌కౌంటర్

31 మంది మావోయిస్టులు మృతి

ఇద్దరు జవాన్లు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

- తెలంగాణ రాష్ట్ర కమిటీ లక్ష్యంగా సాగిన ఆపరేషన్
- మృతుల్లో చాలా వరకు జన మిలీషియా సభ్యులే..
- తెలంగాణకు చెందిన కీలక మావోయిస్టు కూడా ఉన్నట్టు ప్రచారం
- మృతదేహాల గుర్తింపు చేపడితే వివరాలు వెల్లడయ్యే చాన్స్


మావోయిస్టుల మృతదేహాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చర్ల: ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి ఎరుపెక్కాయి. అక్కడి ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో ఆదివారం ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు కూడా చనిపోగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. చనిపోయిన మావోయిస్టుల వివరాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రావతి నేషనల్ పార్కులో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ, ఇంద్రావతి ఏరియా కమిటీలు ఒకేచోట సంచరిస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. దీనితో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లకు చెందిన జవాన్లు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 8 గంటలకు బలగాలు, మావోయిస్టులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ జరిగింది. అనంతరం ఘటనాస్థలంలో 31 మంది మావోయిస్టుల మృతదేహాలు లభించాయి. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు చనిపోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రత్యేక హెలికాప్టర్‌లో రాయ్‌పూర్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలం నుంచి మిగతా 12వ పేజీలో ▶



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

గడువు కంటే ముందే మావోయిస్టుల అంతం: అమిత్‌షా

మావోయిస్టు ముక్త భారత్ లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్‌కు 'ఇంద్రావతి'తో భారీ విజయం దక్కిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గడువుగా పెట్టుకున్న 2026 మార్చి కంటే ముందే దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామన్నారు. ఎన్‌కౌంటర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లకు దేశం రుణపడి ఉంటుందని చెప్పారు. ఆ జవాన్ల కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా దళాలకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్ వేగంగా జరుగుతున్నాయన్నారు.

40 రోజుల్లో 81 మంది మృతి

ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది మొదలైన 40 రోజుల్లో 81 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. అందులో 65 మంది బస్తర్‌లో జరిగిన ఘటనల్లో కన్నుమూశారు. గతేడాది ఛత్తీస్‌గఢ్‌లో 217 మంది మావోయిస్టులు చనిపోయినట్టు పోలీసులు తెలిపారు.



రేసులో..
పర్వేశ్ వర్మ,
సతీష్ ఉపాధ్యాయ,
విజేందర్ గుప్తా,
ఆశిష్ సూద్,
పవన్ శర్మ
?

ఢిల్లీ సీఎంపై జోరుగా కసరత్తు

ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఎంపికపై బీజేపీ అధిష్టానం కసరత్తు ముమ్మరం చేసింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. కొత్త సీఎం ఎంపికపై చర్చించారు. ముఖ్యమంత్రి రేసులో పర్వేశ్ వర్మ, సతీష్ ఉపాధ్యాయ, విజేందర్ గుప్తా, ఆశిష్ సూద్, పవన్ శర్మ ఉన్నట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 13వ తేదీ తర్వాతే జరిగే అవకాశం ఉంది. 6లో

ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ రాజీనామా
ఢిల్లీ అసెంబ్లీని రద్దుచేసిన లెఫ్టినెంట్ గవర్నర్



ఇక ట్రిపుల్ ఇంజన్!
ఢిల్లీ మేయర్ పదవిపై బీజేపీ గురి

గట్టిపోరులో గట్టెక్కారు
24 అసెంబ్లీ స్థానాల్లో మెజారిటీ 10వేల లోపే..



తగ్గేనా.. పెరిగేనా..?

2025-26 రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలపై సర్వత్రా ఆసక్తి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.2.91 లక్షల కోట్ల మేర ప్రతిపాదనలు

ద్రవ్యోల్బణం అంచనాల మేరకు ఈసారి 5 శాతానికి అటూ ఇటుగా రూ.3 లక్షల కోట్లకు పెరగొచ్చనే అభిప్రాయం

అలాగే బడ్జెట్ తగ్గుతుందనే చర్చ మరోవైపు

రెండు రకాల బడ్జెట్‌పై ఆర్థిక శాఖ కసరత్తు.. ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్

మార్చి 10 తర్వాత అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం

- వివరాలు 12లో ▶

దక్షిణాది రాష్ట్రాలు ఏకమై పోరాడాలి

మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

- రాజ్యాంగం ఇచ్చిన హక్కుల పరిరక్షణకు చేతులు కలపాలి
- అవసరమైతే ఈ విషయంలో నేను చొరవ తీసుకుంటా..
- కేంద్రం అన్ని రాష్ట్రాలకు సమానంగా తోడ్పాటు ఇవ్వడం లేదు.. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' వెనుక మోదీ రహస్య ఎజెండా
- రాష్ట్రాలన్నింటినీ తన అధీనంలోకి తీసుకోవాలని అనుకుంటున్నారని ఆరోపణ
- తెలంగాణను ప్రపంచంలో అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని వెల్లడి


సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగం ప్రసాదించిన గ్యారంటీలు, హక్కులను రక్షించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వివక్షాపూరిత వైఖరికి నిరసనగా దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడుకునేందుకు కలసి పోరాడాలన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఆదివారం జరిగిన 'మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్'సదస్సులో 'తెలంగాణ రైజింగ్, దక్షిణాది రాష్ట్రాలెందుకు కలసి పనిచేయాల'నే అంశాలపై ప్రసంగించారు. ''ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ కారణంగా మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నందుకు కేంద్ర పెద్దలు దక్షిణాదిని శిక్షిస్తున్నారా? కేంద్రం అన్ని రాష్ట్రాలకు సమాన తోడ్పాటు ఇవ్వడం లేదు. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలు, బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలపై వివక్ష చూపుతోంది..''అని రేవంత్ ఆరోపించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను జనాభా ప్రాతిపదికన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని పేర్కొన్నారు.

ప్రపంచంలోనే అత్యుత్తమంగా తెలంగాణ
తెలంగాణ రైజింగ్ అనేది నినాదం మాత్రమే కాదని, అది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష అని రేవంత్ చెప్పారు. తెలంగాణను దేశంలోనే మిగతా 2వ పేజీలో ▶

బీసీ రిజర్వేషన్లపై బీఆర్‌ఎస్ 'చలో కామారెడ్డి'


కాంగ్రెస్ 'కామారెడ్డి డిక్లరేషన్'ను గుర్తుచేసేందుకు సభ

నేటి నుంచి క్షేత్రస్థాయిలో బీసీ చైతన్య సభలు

- బీఆర్‌ఎస్ బీసీ నేతల సమావేశంలో నిర్ణయం.. కులగణన సర్వే నివేదిక చిత్తు కాగితంతో సమానం
- రీసర్వే చేసి అసలైన లెక్కలు బయటపెట్టాలి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కులగణన పేరుతో బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బీఆర్‌ఎస్ ఆరోపించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 'కామారెడ్డి డిక్లరేషన్'లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అక్కడే 'చలో కామారెడ్డి' పేరిట భారీ సభ నిర్వహించాలని నిర్ణయించింది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అధ్యక్షతన ఆదివారం తెలంగాణ భవన్‌లో పార్టీ బీసీ నేతల సమావేశం జరిగింది. సుమారు 500 మంది ఈ సమావేశానికి హాజరయ్యారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని ప్రభుత్వం మిగతా 2వ పేజీలో ▶



ఎన్నిసార్లు చెప్పినా మారరా?

శుక్రవారం నోటీసులిచ్చి.. ఆదివారం కూల్చివేతలా?

సెలవు దినాల్లో కూల్చివేస్తే కఠిన చర్యలు.. హైడ్రాను హెచ్చరించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: 'ఎన్నిసార్లు చెప్పినా మీరు మారరా? అక్రమ నిర్మాణమని శుక్రవారం నోటీసు లిచ్చి.. శనివారం హాజరుకు ఆదేశాలిచ్చి.. ఆదివారం కూల్చివేస్తారా? అంత తొందరేముంది? కూల్చివేతలు చేపట్టే ముందు సహేతుక సమయం ఇవ్వాలి కదా?' అని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలోని తన ఆస్తుల కూల్చివేతను సవాల్ చేస్తూ సామ్రెడ్డి బాల్‌రెడ్డి హైకోర్టులో ఆదివారం హౌజ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. హైడ్రా నోటీసులు చట్టవిరుద్ధమని, వాటిని రద్దు చేస్తూ ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్‌కు న్యాయమైన అవకాశం ఇవ్వకుండా తదుపరి చర్యలు తీసుకోవద్దని హైడ్రాను ఆదేశించారు. అవసరమైన పత్రాలు సమర్పించడానికి పిటిషనర్‌కు ఒక వారం సమయం ఇచ్చారు. ముఖ్యంగా సెలవు దినాల్లో కూల్చివేతలు చేపట్టవద్దని, కాదని చేపడితే కఠిన చర్యలు ఉంటాయని హైడ్రాను హెచ్చరించారు.

ఒక్కరోజులో పత్రాలు సమర్పించటం ఎలా సాధ్యం?..: తన ఆస్తులకు సంబంధించిన పత్రాలు సమర్పించేందుకు హైడ్రా ఒక్క రోజే సమయం ఇచ్చిందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. 'అక్రమ నిర్మాణమని శుక్రవారం అధికారులు నోటీసులు జారీ చేశారు. వ్యక్తిగతంగా హాజరుకావాలని శనివారం సమయం ఇచ్చారు. ఆ వెంటనే ఆదివారం కూల్చివేత ప్రక్రియ చేపట్టారు. టైటిల్ లింక్ పత్రాలు, పట్టాదార్ పాస్‌బుక్, ఇతర అన్ని డాక్యుమెంట్లతో రావాలని ఆదేశించిన అధికారులు.. ఒక్క రోజే సమయం ఇచ్చారు. అధికారుల తీరు చట్టవిరుద్ధం. నోటీసులను నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇవ్వండి' అని కోరారు. దీంతో హైడ్రా తీరుపై అసహనం వ్యక్తంచేసిన ధర్మాసనం.. వారంలోగా అధికారులకు డాక్యుమెంట్లు అందజేయాలని ఆదేశించింది. వాటిని పరిశీలించి చట్టప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిస్తూ విచారణను వాయిదా వేసింది.

స్థానిక సమరానికి సై

పంచాయతీ, పరిషత్ ఎన్నికలకు సిద్ధమవుతున్న పార్టీలు

గ్రామాల్లో పెరుగుతున్న హడావుడి.. ఆశావహుల్లో కదలిక
- వివరాలు 2లో ▶



ఆర్డీఎస్‌ఎస్‌లో చేరగానే.. ప్రీపెయిడ్ మీటర్లు

వ్యవసాయ ఫీడర్ల విభజన.. వాటికి ఏఎంఆర్ మీటర్ల ఏర్పాటు

- ఈఆర్సీకి నివేదించిన రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు
- గతంలో ఆర్డీఎస్‌ఎస్‌ను వ్యతిరేకించిన మాజీ సీఎం కేసీఆర్
- ఇప్పుడు ఆ పథకంలో చేరేందుకు డిస్కంల ప్రయత్నాలు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్‌ఎస్)లో తెలంగాణ చేరిన తర్వాత విద్యుత్ వినియోగదారులందరికీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు మిగతా 16వ పేజీలో ▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Venkob CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates


12 Eggs Retail Rate ₹ 64	Ex Farm Live Bird 97 kg	Dressed with Skin 173 kg
	Retail Live Bird 119 kg	Skin Less 196 kg

Conditions Apply
Issued in the interest of consumers

ఇదంజగత్



వచ్చే ఎన్నికల్లో నోటాను కూడా కలుపుకొనిపోదాం కామ్రేడ్!



అక్కడ కష్టాలుపడటం అవసరమా?

మన దేశంలోనూ బాగుంటదంట..

బిడ్డా.. తిరిగొచ్చెయ్!

- అమెరికా నుంచి పిల్లలను వచ్చేయాలంటున్న తల్లిదండ్రులు
- ప్రతిరోజూ వాకబు చేస్తున్న పేరెంట్స్.. ఇండియాలో అవకాశాలపై విద్యార్థుల ఆరా
- ఏఐ ఆధారిత ఉద్యోగాలకు ఇదే మంచి సమయం.. భారత్‌లో కావాల్సినంతగా అవకాశాలు

సాక్షి, హైదరాబాద్: అమెరికా రాజకీయ ముఖచిత్రం మారిపోవడంతో.. అక్కడ చదువుకుంటున్న మన దేశ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన పెరుగుతోంది. మెజారిటీ భారతీయ విద్యార్థులకు ఇప్పటికిప్పుడు సమస్య లేకున్నా.. భవిష్యత్ ఆశాజనకంగా లేదనే భయం వెంటాడుతోంది. పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి లేక, జీవన వ్యయం సమకూర్చుకునే దారి లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. డబ్బులు పంపాలంటూ ఇండియాలోని కుటుంబాలను కోరుతున్నారు. కానీ ఇప్పటికే అప్పులు చేసి పిల్లలను అమెరికా పంపిన తల్లిదండ్రులు తలకు మించిన భారం మోయలేక అల్లాడుతున్నారు. ఈ క్రమంలో మిగతా 3వ పేజీలో ▶



అమెరికా టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత

ఆర్థిక వ్యవస్థ బలపడుతున్నా ఉద్యోగులను తగ్గిస్తున్న సంస్థలు

బాబూ.. బయటకు దయచెయ్

49,795 మందికి జనవరిలో ఉద్వాసన

డిసెంబర్‌తో పోలిస్తే **28%** అధికం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు మొగ్గే కారణం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికా టెక్ కంపెనీల్లో ఉద్యోగుల కోత కొనసాగుతోంది. ఆ దేశ టెక్ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్, సేల్స్‌ఫోర్స్, వాల్‌మార్ట్, స్ట్రైప్ తదితర సంస్థలు లేఆఫ్స్ ప్రకటించాయి. 2025లో మరిన్ని ఉద్యోగాల కోతలకు తాము సిద్ధంగా ఉన్నామని కంపెనీలు ముందస్తు సంకేతాలను చూపడంతో, యూఎస్ జాబ్ మార్కెట్ ఈ ఏడాది బలహీనపడవచ్చని నివేదికలు చెబుతున్నాయి. యూఎస్‌కు చెందిన కోచింగ్ కంపెనీ చాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ తాజా నివేదిక ప్రకారం డిసెంబర్‌తో పోలిస్తే జనవరిలో యూఎస్‌లోని కంపెనీలు అధికంగా ఉద్యోగులను మిగతా 3వ పేజీలో ▶

స్థానిక సమరానికి సై

పంచాయతీ, పరిషత్ ఎన్నికలకు సిద్ధమవుతున్న పార్టీలు

- గ్రామాల్లో పెరుగుతున్న హడావుడి..
- ఎమ్మెల్యేలపైనే పూర్తి భారం వేసిన అధికార కాంగ్రెస్
- లీడర్లు, కేడర్‌ను కదిలించే పనిలో గులాబీ దళం
- సంస్థాగత మార్పుల ప్రక్రియలో బీజేపీ
- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సంఘం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 15వ తేదీలోపు ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్న అంచనాలతో కేడర్‌ను కదిలించే పనిలో పడ్డాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ అధిష్టానాలు గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు కార్యాచరణ రూపొందించుకుంటున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల్లో కూడా కదలిక కనిపిస్తోంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న వారంలోపే ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు చేసుకుంటోంది. బీసీ రిజర్వేషన్ల ఖరారు దిశలో డెడికేటెడ్ బీసీ కమిషన్ కూడా నేడు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

కాంగ్రెస్‌కు కీలకం: అధికార కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికలు కీలకం మారాయి. రాష్ట్రంలో పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసుకోవడం, తమ ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తిగానే ఉన్నారని నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకంగా మారాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ నెలరోజులుగా ఈ ఎన్నికల కోసం కసరత్తు చేస్తోంది. అభ్యర్థులను గెలిపించే బాధ్యతను ఎమ్మెల్యేల భుజాలపై పెట్టింది. కనీసం 80 శాతం స్థానాలు గెలిపించాలని ఎమ్మెల్యేలకు సీఎం, పీసీసీ అధ్యక్షుడు నిర్దేశించారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు ఎన్నికల బిజీలో పడిపోయారు.

ప్రభుత్వ వ్యతిరేకతపై బీఆర్ఎస్ ఆశలు
ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా స్థానిక ఎన్నికల కోసం సిద్ధమవుతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేని స్థితిలో పడిపోయిన ఆ పార్టీ.. స్థానిక ఎన్నికల్లోనైనా పట్టు నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. కేడర్, లీడర్లను చైతన్యపరిచే పనిలో పడింది. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తోంది. వికారాబాద్, సిర్పూర్ సమావేశాల్లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎవరికి టికెట్లు ఇచ్చినా అందరూ కలసి పనిచేయాలని స్పష్టంచేశారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను సద్వినియోగం చేసుకొని ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

అటు సంస్థాగతం.. ఇటు స్థానికం

సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో బిజీగా ఉన్న బీజేపీ కూడా స్థానిక ఎన్నికల కోసం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 27వ తేదీన జరిగే మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుస్తామనే ధీమాతో ఉన్న బీజేపీ నేతలు, స్థానిక ఎన్నికలకు కూడా సిద్ధమవుతున్నారు. జిల్లా అధ్యక్షుల నియామకంలోనూ సామాజిక న్యాయాన్ని పాటిస్తున్నామనే సంకేతాలను ప్రజల్లోకి పంపుతున్నారు. పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవడం, వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో గెలవడమనే ద్విముఖ వ్యూహంతో ముందుకెళుతోంది.

క్లుప్తంగా...

బీసీలకు న్యాయాన్ని భరించలేని కేటీఆర్
టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బీసీలకు న్యాయం జరుగుతుంటే బీఆర్ఎస్ నేత కేటీఆర్ భరించలేకపోతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. శాస్త్రీయంగా ఇల్లిల్లూ పరిశీలించి చేసిన కులగణనపై ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చేసిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలను కూడా బయటపెట్టలేని బీఆర్ఎస్ నేతలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆదివారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. అసలు కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు మళ్లీ సర్వే నిర్వహించాలని కోరడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల తరహాలోనే.. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీకి బీఆర్ఎస్ సహకరిస్తోందని ఆరోపించారు.

నేడు ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంలో విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: కారు గుర్తుపై గెలిచి అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ నేతలు దాఖలు చేసిన ఎస్ఎల్‌పీ, రిట్ పిటిషన్లపై సోమవారం దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారించనుంది. జనవరి 31న ఎస్ఎల్‌పీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారించినప్పుడు, దీంతోపాటు రిట్ పిటిషన్‌ను కూడా ఫిబ్రవరి 10న విచారిస్తామని చెప్పింది. రిట్ పిటిషన్ ప్రతిని ప్రతివాది అయిన స్పీకర్ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గికి అందచేయాలని జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ రెండు పిటిషన్లపై విచారణ జరగనుంది. ఇటీవలే పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చామని, వాళ్ల నుంచి సమాధానం రావడానికి సమయం పడుతుంది కాబట్టి ఈ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి మరికొంత సమయం కావాలని స్పీకర్ కోర్టును కోరే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

ఉపఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం
ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హనుమకొండ చౌరస్తా: 'ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ సుప్రీంకోర్టులో ఉంది. ఈనెల 10న వాదనల అనంతరం తీర్పు రానుంది. సుప్రీం తీర్పును శిరసావహిస్తా. ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉన్నా.. ఎక్కడికీ పారిపోయేది లేదు' అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేల పార్టీ మార్పుపై రాద్ధాంతం చేస్తున్న బీఆర్ఎస్.. వెనుదిరిగి చూసుకోవాలని సూచించారు. గతంలో ఇతర పార్టీల్లో గెలిచిన 36 మంది ఎమ్మెల్యేలను చేర్చుకుని అందులో కొందరికి మంత్రి పదవులు సైతం కట్టబెట్టిందన్నారు. అప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, ఇప్పుడు సుద్దపూసలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఫిరాయింపులపై మాట్లాడే నైతికత బీఆర్ఎస్‌కు లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో బీజేపీ గెలిస్తే ఆ పార్టీ కంటే కేటీఆర్ ఎక్కువ సంతోష పడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌తో చేసిన స్నేహం కారణంగానే ఆమ్‌ఆద్మీ పార్టీ ఓటమి పాలైందని, లిక్కర్ స్కామ్‌లో ఆప్ పరువు గంగలో కలిసిపోయిందని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉందన్న కడియం.. ఆప్, కాంగ్రెస్ కలసి పోటీ చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

మిగిలింది రిజర్వేషన్ల లెక్కే!

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు
- బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ సూచనలే కీలకం
- నేడు ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్న కమిషన్
- ఆ వెంటనే రిజర్వేషన్ల ఖరారుకు కసరత్తు చేపట్టనున్న సర్కారు
- రాష్ట్రంలో 570 జెడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీ సీట్లు, 12,848 సర్పంచ్ స్థానాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. స్థానిక సంస్థల్లో అమలు చేసే రిజర్వేషన్ల లెక్క తేలడమే మిగిలింది. బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం ఏర్పాటైన డెడికేటెడ్ బీసీ కమిషన్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. సోమవారం ఈ మేరకు ప్రత్యేక సమావేశం జరగనుంది. కమిషన్ నివేదికలో చేసిన సిఫార్సులకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలనే నిబంధన ఉండటంతో.. ఆ మేరకు రిజర్వేషన్లకు ఖరారు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12,848 గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలు 5,817, ఎంపీపీలు 570, జెడ్పీటీసీ స్థానాలు 570 ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీలన్నీ ఎస్టీలకు రిజర్వ్ చేస్తారు. మిగతా ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయిస్తారు. సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకుండా ఉండేలా చర్యలు చేపట్టనున్నట్టు అధికారులు చెబుతున్నారు. మరోవైపు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సైతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్లకు సంబంధించి ప్రాథమిక నివేదికను సిద్ధం చేసుకుంది.

బీసీ రిజర్వేషన్లు 23శాతంలోపే..!
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రకారం.. రాష్ట్ర జనాభాలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) 17.43 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) 10.45 శాతం ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి, అదే సమయంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదు. దీనితో ఎస్సీలకు 17.43 శాతం, ఎస్టీలకు 10.45 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. వీటిని మినహాయిస్తే.. బీసీలకు 22.12 శాతమే రిజర్వేషన్లు అందుతాయి. ఇందులో డెడికేటెడ్ బీసీ కమిషన్ ఇచ్చే నివేదికకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలనే డిమాండ్ వస్తోంది.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధమైంది. ఈ నెల 10న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఓటర్ల జాబితాలను జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లలో పరిశీలన కోసం ప్రదర్శించాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ చైర్మన్ రాణీ కుముదిని ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాలను ఎంపీటీసీ, జెడ్పీటీసీ నియోజకవర్గాల వారీగా విభజించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై 11న జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ కూడా కొనసాగుతోంది. ఈనెల 15న పోలింగ్ స్టేషన్ల తుది జాబితాలను ప్రచురించనున్నారు. మొత్తంగా ఎన్నికలకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి.

దక్షిణాది రాష్ట్రాలు ఏకమై పోరాడాలి

▶ మొదటి పేజీ తరువాయి


కాకుండా ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలపాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. దాదాపు 200 బిలియన్ డాలర్లుగా ఉన్న తెలంగాణ జీడీపీని 2035 సంవత్సరం నాటికి ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌ను న్యూయార్క్, లండన్, సింగపూర్, టోక్యో, సియోల్ వంటి నగరాలతో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫ్యూచర్ సిటీ, స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, మూసీ పునరుజ్జీవం లాంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దేశానికి డేటా సెంటర్, పంప్డ్ స్టోరేజీ హబ్‌గా తెలంగాణ నిలవబోతోందన్నారు. దేశంలోని నాలుగు దిక్కులకు అనుసంధానమై దక్షిణాది రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉన్న తెలంగాణను దేశానికి లాజిస్టిక్ సెంటర్‌గా నిలపాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్ ఆ లింకు మిస్సవుతోంది

సదస్సులో భాగంగా మాతృభూమి ఎడిటర్ మనోజ్.కె.దాస్‌తో పాటు పలువురు సభికులు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానాలు ఇచ్చారు. ఆయా అంశాలు ఆయన మాటల్లోనే..

- ''ఎన్నికల్లో జాతీయ నేతలను రంగంలోకి దింపితేనే పెద్ద మొత్తంలో ఓట్లు వస్తాయి. 'రేవంత్‌రెడ్డికి ఓట్లేయండి' అని అడిగితే.. ఆయన రెడ్డి, అగ్రకులం అంటారు. బీసీలు, ఎస్సీలంటూ రకరకాల విభేదాలు సృష్టిస్తారు. జాతీయ నాయకత్వం పేరు చెప్పి ఓట్లు అడిగితే ఈ భావనలు రావు. అందుకే సర్పంచ్ ఎన్నికల్లో అయినా బీజేపీ నరేంద్ర మోదీని చూపించే ఓట్లు అడుగుతుంది. గ్రామ సర్పంచి, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు, మోదీకి ఏం సంబంధం? కాంగ్రెస్ ఆ లింకు మిస్సవుతోందనేది నా పరిశీలన. పార్టీ కూడా ఆ దిశగా ఆలోచించాలి.
- దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు పుదుచ్చేరి ప్రజలు ఏకమవ్వాలి. దక్షిణాది ప్రజలు ఏవిధంగానైనా పోరాడేందుకు ఏకం కావాలి. తప్పనిసరైతే ఈ విషయంలో నేను చొరవ తీసుకుంటా.
- కేజ్రీవాల్ హరియాణాలో కాంగ్రెస్‌ను దెబ్బతీశారు. ఇది ఆయనకు ఢిల్లీ ఎన్నికల్లో ప్రతికూలమైంది. అంతిమంగా బీజేపీ లాభపడింది. ఈ విషయంలో ఇండియా కూటమి ఆలోచించాలి.
- జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపడితే బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో గెలిచే సీట్లతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చు. అప్పుడు దక్షిణాది రాష్ట్రాల అవసరమే ఉండదు. ఇది ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుంది. నియోజకవర్గాలను పెంచాల్సి వస్తే ప్రస్తుతమున్న సీట్ల ప్రకారమే.. ప్రతి రాష్ట్రంలోనూ 50శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీని కోరాను.
- ఒక దేశం–ఒక ఎన్నికను మేం అంగీకరించబోం. జాతీయ స్థాయి ఎన్నికలు వేరు, రాష్ట్రాల ఎన్నికలు వేరు. రాష్ట్రాల ప్రాథమిక హక్కులను హరించలేరు. రాష్ట్రాలన్నింటినీ మోదీ తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని అనుకుంటున్నారు. రాష్ట్రాలను స్థానిక సంస్థలుగా మార్చాలనుకుంటున్నారు. కేంద్ర జాబితా, రాష్ట్రాల జాబితా, ఉమ్మడి జాబితా అని రాజ్యాంగం నిర్ణయించింది. కానీ మోదీ మాత్రం అంతా కేంద్రం చేతుల్లోనే ఉండాలంటున్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలు దీన్ని పూర్తిగా పసిగట్టడం లేదు. మేధావులు దీనిపై ఆలోచన చేయాలి. ఒక దేశం ఒక ఎన్నిక వంటి అంశాల్లో ప్రజా ఉద్యమం అవసరం.
- కేరళ ప్రభుత్వం కేవలం సంక్షేమంపై పనిచేస్తోందే తప్ప అభివృద్ధి, పెట్టుబడులపై దృష్టి సారించడం లేదు. కేరళకు అనేక అవకాశాలున్నాయి. పర్యాటకం, ఎనర్జీ, పెట్టుబడులపై పాలసీలు రూపొందించుకోవాలి.
- మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కాంగ్రెస్ సరైన గౌరవం ఇవ్వలేదనేది బీజేపీ, నరేంద్ర మోదీ వాట్సాప్ యూనివర్సిటీ సృష్టించిన భావన మాత్రమే. ఆ వర్సిటీ అనేక అపోహలను సృష్టిస్తోంది. ఆ మాయాజాలంలో పడొద్దు.''

బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ 'చలో కామారెడ్డి'



బీఆర్ఎస్ బీసీ నేతల సమావేశంలో కేటీఆర్, గంగుల, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

నెరవేర్చేలా ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో చలో కామారెడ్డి సభను నిర్వహించాలని ఈ భేటీలో నిర్ణయించారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు వారం రోజులపాటు మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో సమావేశాలు, ప్రెస్‌మీట్లు నిర్వహించాలని తీర్మానించారు. ఈ నెలాఖరులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. ఆ సభకు అంతరాయం కలగకుండా చలో కామారెడ్డి సభ నిర్వహించాలని నిర్ణయించారు. కాగా, కేటీఆర్ సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని కోస్గిలో రైతుల సభలో పాల్గొననున్నారు.

కులగణన నివేదిక ఒక చిత్తు కాగితం
కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడక అని కేటీఆర్ విమర్శించారు. పార్టీ బీసీ నేతల సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రీసర్వే చేసి కులాల వారీగా కచ్చితమైన లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీల జనాభాను 5.5 శాతం తక్కువగా చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేసిందని విమర్శించారు. కులగణన నివేదిక చిత్తుకాగితంతో సమానమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు, ఇండ్ల కేటాయింపులు, ఆరు గ్యారంటీల్లో తమ వాటా తగ్గుతుందేమోనని ఎంబీసీలు, బీసీలు భయపడుతున్నారని కేటీఆర్ అన్నారు. 'కాంగ్రెస్ ఎమ్మెల్సీయే కులగణన సర్వేను చిత్తు కాగితంతో సమానమని తగులబెట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తారని భావించాం. బిల్లు తేలేదు కానీ.. సొల్లు మాత్రం చెప్పారు' అని కేటీఆర్ మండిపడ్డారు.

బీసీలకు న్యాయం చేసింది బీఆర్ఎస్ మాత్రమే
రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేసింది బీఆర్ఎస్ మాత్రమేనని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు 50 శాతానికి పైగా టికెట్లు ఇచ్చామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో 34 సీట్లు బీసీలకు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, 19 సీట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై సోమవారం నుంచి నియోజకవర్గాలు, మండలాలు, జిల్లా కేంద్రాల వారీగా ప్రజలను చైతన్యం చేస్తామని ప్రకటించారు. బీసీలకు న్యాయం చేయడానికి రాజ్యాంగ సవరణ చేయాలని కేటీఆర్ కోరారు.

12న తిరుమలలో పౌర్ణమి గరుడ సేవ



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఫిబ్రవరి 12న పౌర్ణమి గరుడ సేవ జరగనుంది. ప్రతి నెలా పౌర్ణమి నాడు టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తోంది. ఆ రోజు రాత్రి 7–9 గంటల నడుమ శ్రీ మలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధులలో విహరించనున్నారు. ఈ వాహన సేవను ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు
తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 76,598 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.46 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేనివారికి 18 గంటల్లో, ఎస్ఈడీ టోకెన్‌లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఖాయం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధీమా



విజయోత్సవ ర్యాలీలో పార్టీ జెండాలతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్పొరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్పొరేటర్లంతా పూర్తి సమయం కేటాయించాలని కిషన్ రెడ్డి కోరారు. వచ్చే ఏడాది జరిగే గ్రేటర్ ఎన్నికలకు.. ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు, ప్రజలకు చేకూరే లబ్ధి, ప్రాజెక్టులు, నిధులను వివరించాలని కోరారు. జీహెచ్ఎంసీ మేయర్ పీఠం సాధిస్తే.. అనంతరం రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందనే సంకేతాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. స్టాండింగ్ కమిటీపై మరోమారు సమావేశమై నిర్ణయం తీసుకుందామని చెప్పారు. జీహెచ్ఎంసీ పాలకవర్గంపై అవిశ్వాస తీర్మానంపై బీఆర్ఎస్, ఎంఐఎంలు ఎలా వ్యవహరిస్తాయో చూసి.. దానికనుగుణంగా బీజేపీ వ్యూహం ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా.. పార్టీ కార్యాలయంలో విజయోత్సవాలు నిర్వహించారు.

కేజ్రీవాల్ ఓటమితో బీఆర్ఎస్‌లో కలకలం
బీజేపీని ఓడించేందుకు ప్రాంతీయ పార్టీలతో జతకట్టాలంటూ రాహుల్ గాంధీకి కేటీఆర్ సూచించడంపై కేంద్రమంత్రి, జి.కిషన్‌రెడ్డి స్పందించారు. 'లిక్కర్ స్కామ్ భాగస్వామి' అయిన కేజ్రీవాల్ ఓడిపోవడంతో.. బీఆర్ఎస్ పార్టీలో కలవరం మొదలైందని, అందుకే పాత దోస్తు అయిన కాంగ్రెస్‌తో మరోసారి బహిరంగంగా జతకట్టేందుకు కేటీఆర్ బహిరంగ ఆహ్వానం పలికారని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు.

ముస్లింలను బీసీల్లో ఎలా చేర్చుతారు?

బీసీలను ఉద్ధరిస్తామని చెప్పుకునే సంఘాలు ఏం చేస్తున్నాయి?

- ఇలాగైతే గ్రామాల్లోనూ బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేస్తారు
- కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'బీసీ జాబితాలో ముస్లింలను ఎలా కలుపుతారు? ఇదేమైనా మీ అయ్య జాగీరనుకుంటున్నారా' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. అలా చేస్తుంటే బీసీలను ఉద్ధరిస్తామని చెప్పుకునే సంఘాలు ఏం చేస్తున్నాయని, ఎవరు అధికారంలో ఉంటే వారికి మద్దతు పలుకుతారా అని ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఆదివారం నల్లగొండకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల్లో ముస్లింలను కలిపి హిందువులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయాలని చూస్తోందని ఆరోపించారు. గ్రామాల్లోనూ బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేస్తారని, తద్వారా వారి ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. ఒవైసీ, రేవంత్ గ్యాంగ్ కలిసి బీసీలను దెబ్బతీసేందుకు ముస్లింలను బీసీ జాబితాలో కలిపే కుట్రకు తెరతీసిందన్నారు. అగ్రకులాల ప్రజలు కూడా బీసీలకు జరిగిన అన్యాయంపై సానుభూతి తెలుపుతుంటే, బీసీ సంఘాలు ఎందుకు నోరు మూసుకున్నాయని విమర్శించారు. బీసీలతోపాటు హిందువులంతా ఏకమై కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని, ఆ రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. అర్బన్ నక్సల్స్ చేతిలో తెలంగాణ విద్యావ్యవస్థ బందీ అయిందన్నారు. విద్యా కమిషన్‌లో నక్సల్స్ భావజాలమున్న వారికి చోటు కల్పించారని ఆరోపించారు. గన్నుల పాలన కావాలా? పెన్నుల పాలన కావాలా? ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో ఇన్ని సమస్యలుంటే కులగణన పేరుతో బీసీ జనాభాను తగ్గించే కుట్రకు తెరతీశారని చెప్పారు. ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిందేమీలేదని, వారి తరఫున అన్ని సందర్భాల్లో పోరాడే బీజేపీకే మద్దతివ్వాలని తెలిపారు.

42% రిజర్వేషన్లు ఇవ్వకుండా కుట్ర

సర్కారుపై బీసీ సంఘాల నేతల ధ్వజం



సదస్సులో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, వకుళాభరణం, చిరంజీవులు

లక్డీకాపూల్ (హైదరాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీసీ సంఘాల నేతలు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మేనిఫెస్టోతో పాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం ఓ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన కులగణన నివేదికపై బీసీ మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కులగణన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే పూర్తి స్థాయిలో లెక్కలు సేకరించలేదని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు లెక్కల ప్రకారమే రాష్ట్రంలో నాలుగు కోట్లకుపైగా జనాభా ఉందని.. కానీ సర్వేలో 3.5 కోట్ల మందిని మాత్రమే లెక్కించారని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం .. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరిట బీసీల లెక్కలను తక్కువ చేసి చూపించిందన్నారు. బీసీలు 42 శాతం రిజర్వేషన్లు కావాలని అడగలేదని, కాంగ్రెస్ పార్టీయే తమ మేనిఫెస్టోలో రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్లపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీల గణాంకాలపై సమగ్ర సమీక్ష చేయాలని, లేని పక్షంలో తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆన్‌లైన్ బాటలో అన్నదాతలు



- సాంకేతికతను ఒడిసిపట్టుకున్న రైతులు
- 2022తో పోలిస్తే గణనీయంగా పెరిగిన డిజిటల్ పేమెంట్లు
- దేశవ్యాప్తంగా రైతుల డిజిటల్ చెల్లింపులపై మెకెన్సీ సంస్థ సర్వేలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా అన్నదాతలు శరవేగంగా ఆన్‌లైన్ బాట పడుతున్నారు. గ్రామీణ స్థాయికి వడివడిగా చేరుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టుకుంటున్న రైతాంగం డిజిటల్ పేమెంట్ల విషయంలో అంతే వేగంగా ముందుకెళుతోందని గణాంకాలు చెబుతున్నాయి. గత రెండేళ్ల కాలంలో రైతుల డిజిటల్ పేమెంట్లు గణనీయంగా పెరిగాయని, 2022 సంవత్సరంలో 11 శాతం రైతులు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసే వారని, రెండేళ్ల తర్వాత 2024లో అది 43 శాతానికి పెరిగిందని మెకెన్సీ అనే సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. వ్యక్తిగత, పంటల బీమా ప్రీమియంలు మొదలు.. పురుగు మందుల కొనుగోళ్లు, ఇతర అవసరాలకు కూడా రైతులు ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేస్తున్నారని ఈ సర్వేలో వెల్లడైంది. సర్వే ప్రకారం... పంటల బీమా ప్రీమియం కింద 2022 సంవత్సరంలో 8 శాతం మంది మాత్రమే డిజిటల్ పేమెంట్ చేయగా, 2024లో అది 37 శాతానికి చేరింది. అదే విధంగా వ్యవసాయ సామగ్రికి బీమా చేయిస్తున్న వారి సంఖ్య కూడా గత రెండేళ్లలో పెరిగింది. 2022లో కేవలం 4 శాతం మంది రైతులు మాత్రమే తమ సామగ్రికి బీమా చేయించగా, అదే 2024 నాటికి అది 23 శాతానికి చేరింది. ఇక, బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుంటున్న రైతులు 2022లో 9 శాతం ఉండగా, 2024 నాటికి అది 36 శాతానికి చేరింది. అదే విధంగా ఎక్కువ దిగుబడి సాధించడం కోసం తమ పొలాల్లో జీవ ఉద్దీపనలను వాడే రైతుల సంఖ్య కూడా పెరుగుతోంది. గత రెండేళ్ల కాలంలో ఇది 2 నుంచి 11 శాతానికి పెరగడం గమనార్హం.

అందుబాటులో స్మార్ట్ ఫోన్‌లు.. తక్కువ ధరలకే డేటా



రైతాంగం డిజిటల్ బాట పట్టడంలో అనుకూలతలతో పాటు అడ్డంకులు కూడా ఉన్నాయని మెకెన్సీ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడయింది. దేశంలో విరివిగా స్మార్ట్ ఫోన్‌లు అందుబాటులోకి రావడం, మొబైల్ డేటా తక్కువ ధరలకే లభ్యమవుతుండడం, ఎక్కువ సంఖ్యలో యూపీఐలు అందుబాటులోకి రావడం ఈ వైపు మొగ్గడానికి కారణాలని ఈ సర్వేలో పాల్గొన్న రైతులు అభిప్రాయపడ్డారు. అదే విధంగా ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా కొనే వస్తువులకు గ్యారంటీతో పాటు కస్టమర్ సర్వీస్ సరిగా ఉండదని, ఆన్‌లైన్‌లో తమకు అనుకూలమైన చెల్లింపు విధానాలు సరిగా అందుబాటులోకి రావడం లేదనే అభిప్రాయాన్ని కూడా రైతులు వెల్లడించారు. సర్వేలో పాల్గొన్న 42 శాతం మంది ఇబ్బందుల గురించి వివరించడం గమనార్హం.

కేంద్ర బడ్జెట్‌లో కౌలు, చిన్నకారు రైతుల ప్రస్తావన ఏదీ?

- జస్టిస్ చంద్రకుమార్



బాధిత రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట(హైదరాబాద్): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చిన్న, కౌలు రైతుల కోసం కేటాయింపులు చేయకపోవడం దారుణమని జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. వ్యవసాయంలో నష్టాలు వచ్చి మెదక్ జిల్లా కూచన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు ప్రవీణ్, మహబూబాబాద్ జిల్లా సక్రాంనాయక్ తండాకు చెందిన రైతు శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోగా, వారి కుటుంబాలకు రూ. 10వేల చొప్పున ఆర్థికసాయం ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అందించారు. ఈ సందర్భంగా చంద్ర కుమార్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సూచించిన నివేదికలు అమలు చేయాలన్నారు. అన్ని రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయింపులు చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని... తెలంగాణకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. బిహార్‌కు రూ. 50 వేల కోట్లు, ఏపీ రూ.50 వేల కోట్లు కేటాయించారని, ఈ రెండు రాష్ట్రాల మద్దతు కోల్పోతే కేంద్రంలో బీజేపీ సర్కార్ ఉండదని కేవలం ఆ రాష్ట్రాలకే బడ్జెట్ కేటాయింపులు చేయడం సరికాదన్నారు.

ప్రధాని సూచనలతో రైతు నేస్తాన్ని ముందుకు తీసుకెళ్తా

- పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనల మేరకు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం విస్తరణకు తనవంతు కృషి చేస్తానని పద్మశ్రీ పురస్కార గ్రహీత, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఇటీవల ఢిల్లీలో ప్రధానిని కలిసిన సందర్భంగా.. భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వ్యవసాయం గురించి ప్రధానమంత్రి ఆరా తీసారని, గుజరాత్ గవర్నర్‌ను కలిసి మాట్లాడాలని సూచించారని తెలిపారు. నేచురల్ ఫార్మింగ్‌ను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతునేస్తం ఫౌండేషన్ ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై రైతుల అవగాహన కోసం చేస్తున్న కృషి, ప్రచురించిన పుస్తకాలు, చిరుధాన్యాలు, మిద్దె తోటల గురించి వివరించినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు టీచర్ల సంఘాల మద్దతు



మద్దతు లేఖను అందిస్తున్న టీచర్ల సంఘాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పీఆర్‌టీయూటీఎస్ సంఘం తరపున పోటీ చేస్తున్న పింగిలి శ్రీపాల్ రెడ్డి, వంగ మహేందర్ రెడ్డికి.. ఆరు ఉపాధ్యాయ సంఘాలు ఆదివారం మద్దతు ప్రకటించాయి. హైదరాబాద్ సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ గెజిటెడ్ అసోసియేషన్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ తెలంగాణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ, ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, తెలంగాణ కేజీబీవీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నేతలు.. పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థులను కలిశారు. వారి విజయానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డా.. తిరిగొచ్చెయ్

▶ మొదటి పేజీ తరువాయి

మన దేశంలో పరిస్థితి బాగుంటుందనే అంచనాలను గుర్తు చేసుకుంటూ.. పిల్లలను తిరిగి వచ్చేయాలని కోరుతున్నారు. మరోవైపు ఇక్కడ (ఏఐ) నిపుణులకు డిమాండ్ పెరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే దిశగా..

కోవిడ్ తర్వాత ఐటీ రంగం క్రమంగా కుదేలైంది. ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. దీంతో అమెరికాలో ఎంఎస్ (ఇంజనీరింగ్ పీజీ) చేయడం, అక్కడే ఉద్యోగం సంపాదించడం విద్యార్థుల లక్ష్యంగా మారింది. ఫలితంగా అమెరికా వెళ్లే భారతీయుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం అమెరికాలో 11.26 లక్షల మంది విదేశీ విద్యార్థులున్నారు. అందులో 29 శాతం భారతీయులే. 2022–23లో 1,96,567 మంది, 2023–24లో 3,31,602 మంది అమెరికా వెళ్లారు. వారికి నాలుగేళ్ల వీసా ఇస్తారు. ఎంఎస్ రెండేళ్లు ఉంటుంది. మిగతా రెండేళ్లలో పూర్తిస్థాయి ఉద్యోగం పొందితే అక్కడే కొనసాగవచ్చు. దీనికోసం మనవాళ్లు చదువు పూర్తవగానే తాత్కాలిక ఉద్యోగాల కోసం ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) చేస్తారు. ఈ శిక్షణ కోసం ఈ ఏడాది 97,556 మంది నమోదు చేసుకున్నారని, ఇది గతేడాదికన్నా 41 శాతం ఎక్కువని అమెరికన్ ఎంబసీ ఇటీవలే వెల్లడించింది. మన దేశం నుంచి వెళ్లిన విద్యార్థులు కన్సల్టెన్సీల ద్వారా ఏదో ఒక కంపెనీలో ఉద్యోగం పొంది వీసాను పొడిగించుకోవడం, అవకాశాన్ని బట్టి పార్ట్ టైం ఉద్యోగాలు చేసి డబ్బు సంపాదించడం జరుగుతూ వస్తోంది. కానీ ట్రంప్ రావడంతో పార్ట్‌టైం ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. భవిష్యత్తులో హెచ్1-బి వీసా రావడం కష్టమనే భావన బలపడుతోంది.

ఇప్పుడే చాన్స్..: ఏఐ దూకుడు చూస్తుంటే ఇండియాలోనూ మంచి అవకాశాలు లభిస్తాయని చాలామంది తల్లిదండ్రులు భావిస్తున్నారు. అమెరికన్ ఐటీ కంపెనీలు ప్రాజెక్టుల కోసం ఇండియాలో మానవ వనరులపై ఆధారపడటం పెరిగిన నేపథ్యంలో.. డేటాసైన్స్, ఏఐ అంశాల్లో ఎంఎస్ చేసినవారు మంచి ఉద్యోగం పొందవచ్చని భావిస్తున్నారు. ఇంకా అమెరికాలో వేచి చూస్తే.. అప్పటికే ఇండియాలో ఉద్యోగులకు అనుభవం పెరుగుతుందని, తర్వాత వస్తే ప్రయోజనం ఉండదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. భారత్‌లోని కన్సల్టెన్సీలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. ఇప్పుడు సాధారణ ఐటీ ఉద్యోగాలు తగ్గినా.. ఏఐ ఎంఎల్, బ్లాక్‌చైన్, ఏఆర్‌వీఆర్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఓపెన్ టెక్నాలజీ వంటి నైపుణ్యాలకు డిమాండ్ పెరిగిందని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో 2026 నాటికి 10 లక్షల మంది ఏఐ నిపుణులు అవసరమని వీబాక్స్ అనే కన్సల్టెన్సీ సంస్థ అంచనా వేసింది. ఏఐపై పనిచేస్తున్న ఉద్యోగులు భారత్‌లో ప్రస్తుతం 4.16 లక్ష ల మంది ఉన్నారు. ఫిక్కీ అంచనా ప్రకారం.. ఈ ఏడాది చివరికి 6.29 లక్షల మంది, 2026 నాటికి 10 లక్షల మంది అవసరం. దీనితో ఇక్కడికి వచ్చి ఉద్యోగం చేసుకోవడం మేలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావిస్తున్నారు.

కొన్ని నెలల్లో పరిస్థితి చక్కబడే చాన్స్

మరోవైపు అమెరికాలో ప్రస్తుత పరిస్థితి మూడు, నాలుగు నెలలకు మించి ఉండదనే నమ్మకం మనవారిలో కనిపిస్తోంది. అక్కడి హోటల్స్, చిన్నాచితకా వ్యాపార సంస్థల్లో పనిచేయడానికి మానవ వనరులు అవసరమని.. ఎల్లకాలం పార్ట్ టైం ఉద్యోగాలను అడ్డుకోలేరని కొందరు విద్యార్థులు అంటున్నారు.



కష్టంగానే ఉంది..

డేటా సైన్స్‌పై ఎంఎస్ చేశాను. ఇంతకాలం స్కిల్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ పార్ట్ టైం జాబ్ చేశాను. ఇప్పుడు పార్ట్‌టైం చేయడం కష్టంగా మారింది. ఇంకో మూడు నెలలు ఈ పరిస్థితి ఉండొచ్చు. ఇక్కడా సిబ్బంది కావాలి కాబట్టి కొంతకాలం తర్వాత పరిస్థితి మెరుగవ్వొచ్చు. అప్పుచేసి యూఎస్ వచ్చాను. ఇంటి దగ్గర్నుంచి ఇంకా డబ్బులు తెప్పించుకోవడం ఇబ్బందే.

– కృష్ణమోహన్ దూపాటి, అమెరికాలోని భారతీయ విద్యార్థి

కొంత ఆశ ఉంది

రూ.40 లక్షలు అప్పు చేసి అమెరికా వచ్చాను. పార్ట్ టైం ఉద్యోగం చేసే పరిస్థితి లేక, ఖర్చులు పెరిగి ఇబ్బందిగా ఉంది. ఏడాది అయితే ఎంఎస్ పూర్తవుతుంది. తర్వాత ఇండియాలోనే మంచి ఉద్యోగం చూసుకోవచ్చని మా నాన్న చెబుతున్నారు. అదే మంచిదనిపిస్తోంది.

– నవీన్ చౌదరి, అమెరికాలో ఎంఎస్ చేస్తున్న వరంగల్ విద్యార్థి

ఇండియాలో బూమ్ ఉంటుంది

అమెరికాలోనే జాబ్ చేయాలనే ఆశలు పెట్టుకోవడం మంచిది కాదు. భవిష్యత్ మొత్తం ఏఐదే. ఇప్పుడిప్పుడే భారత్‌లో దానికి డిమాండ్ పెరుగుతోంది. నిపుణుల కొరత ఉంది. అమెరికాలో ఎంఎస్ చేసిన విద్యార్థులకు మన దేశంలోనే మంచి వేతనంతో ఉద్యోగాలు వచ్చే చాన్స్ ఉంది.

– విశేష్ వర్మ, ఏఐ ఆధారిత కంపెనీలో హెచ్‌ఆర్ మేనేజర్

ప్రతీ క్షణం టెన్షన్..

ఏడాది క్రితం కుమారుడిని అమెరికా పంపాను. రోజూ ఫోన్ చేసి మాట్లాడితే సంతోషంగా ఉండేది. ఇప్పుడు ఫోన్ వచ్చిందంటే భయం వేస్తోంది. ఖర్చులకు డబ్బులు అడిగితే ఇవ్వలేక.. ఇప్పటికే ఉన్న అప్పులు తీర్చలేక ఆవేదన పడుతున్నాం. ఇండియాలో ఏఐ ఆధారిత ఉద్యోగాలకు మంచి డిమాండ్ ఉంటుందని, ఎంఎస్ తర్వాత ఇండియా వచ్చేస్తే బాగుంటుందని సలహా ఇచ్చాను.

– జనార్దన్‌రెడ్డి రేపల్లె, అమెరికా వెళ్లిన విద్యార్థి తండ్రి

యూజీసీని కీలుబొమ్మలా ఆడిస్తున్న కేంద్రం: ప్రొ. హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కాచిగూడ(హైదరాబాద్): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)ని కేంద్ర ప్రభుత్వం కీలుబొమ్మలా ఆడిస్తుందని ప్రొఫెసర్ హరగోపాల్ మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అధ్యక్షతన ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'యూజీసీ 2025 నిబంధనలు– విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిపై దాడి'అనే అంశంపై ఏర్పాటు చేసిన జాతీయసదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన యూజీసీ నూతన మార్గదర్శకాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తూ విద్య కాషాయీకరణకు పూనుకున్నారని ఆరోపించారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ఆచార్యుల నియామకాలు, పదోన్నతుల కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణ పేరిట యూజీసీ జనవరి 6న ముసాయిదా డ్రాఫ్ట్‌ను విడుదల చేసిందన్నారు. ఇది రాష్ట్రాల హక్కులు, నిర్ణయాధికారాన్ని బలహీనపరుస్తూ ఫెడరల్ స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ రాజ్యాంగ మూలసూత్రాలకు వ్యతిరేకంగా ఉందని మండిపడ్డారు. పూర్తిగా గవర్నర్ చేతిలో వీసీల నియామకాలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్‌దేవాంగ్, జాతీయ ప్రధానకార్యదర్శి దినేష్ సిరంగరాజ్, ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ పాండ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధి ఆపొద్దు

అంజన్న ఆలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు



అంజన్న ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న ఆలయాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని కోరారు. అంజన్న ఆలయంలో ఆదివారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, మాజీ సీఎం కేసీఆర్ రూ.100 కోట్ల నిధులతో కొండగట్టు ఆలయ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించారని, ప్రస్తుత ప్రభుత్వం దానిని కొనసాగించాలని సూచించారు. ఆలయ భూములు కాపాడేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

బాబూ.. బయటకు దయచెయ్

▶ మొదటి పేజీ తరువాయి



తగ్గించాయి. జనవరిలో 49,795 ఉద్యోగాల కోత పడింది. డిసెంబర్‌లో ప్రకటించిన 38,792తో పోలిస్తే ఇది 28 శాతం అధికం. 2024 జనవరిలో ప్రకటించిన 82,307 లేఆఫ్స్ కంటే ఈ సంఖ్య 40 శాతం తక్కువ. లాభాలు పెంచుకునేందుకు కంపెనీలు ఇన్వెస్టర్ల ఒత్తిడికి గురవుతున్నాయి. ఈ అంశమే తొలగింపునకు దారితీస్తోంది. ముఖ్యంగా కొవిడ్ సమయంలో కంజ్యూమర్ టెక్‌పై వ్యయాలు పెరగడంతో అందుకు తగ్గ సిబ్బందిని కంపెనీలు నియమించుకున్నాయి. వారిపైనే ఇప్పుడు కత్తి వేలాడుతోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సర్వే ప్రకారం 41 శాతం అంతర్జాతీయ కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా వచ్చే ఐదేళ్లలో శ్రామిక శక్తిని తగ్గించుకోవాలని భావిస్తున్నాయి.

కనీసం 25 కంపెనీలు..

అమెరికా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నప్పటికీ కంపెనీలు ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. జనవరిలో యూఎస్ ఆర్థిక వ్యవస్థ 3,53,000 కొత్త ఉద్యోగాలను జోడించింది. మరోవైపు మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా వంటి పెద్ద కంపెనీలు జనవరిలో తమ ఉద్యోగులకు పింక్ స్లిప్‌లు అందజేశాయి. యూఎస్‌లో కనీసం 25కు పైగా సంస్థల్లో వేల మంది ఉద్యోగాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. పనితీరు సంతృప్తికరంగా లేని 3,600 మందిని ఈ ఏడాది తొలగిస్తున్నట్లు ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ప్రకటించారు. ఏఐ ఆధారిత సేవలు, పరికరాలను రూపొందించడంలో కంపెనీ ముందుకు సాగుతోందని తెలిపారు.

వరుస కట్టిన సంస్థలు..


సాఫ్ట్‌వేర్ కంపెనీ వర్క్‌డే 1,750 మందికి ఉద్వాసన పలుకుతోంది. ఏఐ ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. వాల్‌మార్ట్ తాజాగా కాలిఫోర్నియా, ఆకన్సస్‌లలోని కన్సాలిడేషన్‌లో భాగంగా వందలాది మందిని తొలగిస్తోంది. నార్త్ కరోలినాలో ఒక కార్యాలయాన్ని మూసివేస్తోంది. అమెజాన్ తన కమ్యూనికేషన్స్ యూనిట్‌లో డజన్ల కొద్దీ ఉద్యోగాలను కుదించింది. పనితీరు ప్రమాణాలకు అనుగుణంగా లేనందున ఉద్వాసన పలుకుతున్నట్టు మైక్రోసాఫ్ట్ తన సిబ్బందికి పంపిన నోటీసులో తెలిపింది. ఈ టెర్మినేషన్ లెటర్స్ ప్రకారం బాధిత ఉద్యోగులు తక్షణమే ఉద్యోగాలను కోల్పోతారు. అంతేగాక వారికి ఎటువంటి ప్యాకేజీ ఉండదు.

గూగుల్‌లో స్వచ్ఛందంగా..

ఆండ్రాయిడ్, పిక్సెల్, క్రోమ్, నెస్ట్ వంటి కీలక ఉత్పత్తులకు బాధ్యత వహిస్తున్న తన ప్లాట్‌ఫామ్స్, డివైజెస్ ఆర్గనైజేషన్‌లోని యూఎస్ ఆధారిత ఉద్యోగులకు గూగుల్ స్వచ్ఛంద నిష్క్రమణ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేసింది. వీరికి పరిహారం అందించనుంది. 1,000 మందిని తగ్గించాలని సేల్స్‌ఫోర్స్ యోచిస్తోంది. అలాగే ఏఐ ఆధారిత ఉత్పత్తుల్లోకి విస్తరణకు మద్దతుగా కొత్త సిబ్బందిని ఏకకాలంలో నియమిస్తోంది. జనవరి 20 నాటి అంతర్గత మెమో ప్రకారం ప్రొడక్ట్, ఇంజనీరింగ్, ఆపరేషన్స్ విభాగాల్లో 300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు స్ట్రైప్ ప్రకటించింది. అయితే, కంపెనీ తన మొత్తం ఉద్యోగుల సంఖ్యను 2025 చివరినాటికి 10 వేలకు పెంచాలని నిర్ణయించింది. ఖర్చులను తగ్గించుకునేందుకు వాషింగ్టన్ పోస్ట్ తన సిబ్బందిలో 4 శాతం లేదా 100 కంటే తక్కువ మందిని తొలగిస్తున్నట్టు జనవరిలో పేర్కొంది.

రైతు డిక్లరేషన్ ఊసేది?

సీఎంకు హరీశ్‌రావు బహిరంగ లేఖ



సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను చూపుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట జోన్/సాక్షి, హైదరాబాద్: 'సీఎం రేవంత్‌రెడ్డి గారూ.. మీది కోతల ప్రభుత్వంలా మారింది.. వరంగల్ రైతు డిక్లరేషన్ ఏమైంది? మరోవైపు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించి, దొంగ సర్వే చేయించి బీసీల సంఖ్యను తగ్గించారు' అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఇచ్చిన 2 లక్షల రుణమాఫీ నామమాత్రంగా జరిగిందన్నారు. రైతు పెట్టుబడి సాయంలో కోతలు విధించారని, ఇప్పుడు సన్నరకం వడ్లకు ప్రకటించిన బోనస్ విషయంలో యూటర్న్ తీసుకున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,64,000 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన రూ.432 కోట్ల బోనస్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. 50 రోజులు గడిచినా రైతుల ఖాతాల్లో జమ కాలేదని.. వరంగల్ రైతు డిక్లరేషన్ బూటకమా? మీరిచ్చిన బాండ్ పేపర్లు బూటకమా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 48 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించినా నేటికీ అమలు కాలేదన్నారు. క్రాప్ బుకింగ్ మిస్సింగ్ పేరిట కంది రైతుల పంట కొనుగోలును ప్రభుత్వం తిరస్కరించడం సరికాదన్నారు. మహబూబ్‌నగర్‌లో సీఎం ఇచ్చిన రూ. 250 కోట్ల చెక్కు ఎందుకు పడలేదని, అది ఉత్తుత్తి చెక్కా అని హరీశ్‌రావు నిలదీశారు.

రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది..

గడిచిన ఏడాదిన్నరగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని పలు సర్వే సంస్థలు స్పష్టం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నష్ట నివారణ చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని హరీశ్‌రావు విమర్శించారు. నిజాన్ని దాచిపెడుతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించడం తప్ప ప్రభుత్వం చేస్తుందేమీ లేదని మండిపడ్డారు. రియల్టర్లు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని, హైదరాబాద్ బాగుంటేనే, తెలంగాణ బాగుంటుందని, అభివృద్ధి సాధ్యం అవుతుందని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.





ఒక మనిషి చదివే పుస్తకాలను బట్టి అతడు ఏమిటో తెలుసుంది.
- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి

సోమవారం, 10 ఫిబ్రవరి 2025

'తెలివి' తెల్లారకూడదు!

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' – పొడి అక్షరాలలో 'ఏఐ' – ఇంతింతై వటుడింతయై అన్నట్టుగా రోజు రోజుకూ విశ్వరూపాన్ని సంతరించుకుంటోంది. 'కృత్రిమ మేధ'గా మనం అనువదించుకుంటున్న ఆ మాట చూస్తుండగానే మన నిత్య వ్యవహారంలో భాగమైపోతోంది. అమెరికా అభివృద్ధి చేసిన 'చాట్ జీపీటీ' అనే ఏఐ లాంగ్వేజ్ నమూనాకు పోటీగా చైనా అభివృద్ధి చేసిన 'డీప్ సీక్' కొన్ని రోజులుగా చర్చనీయమవుతోంది. చాట్ జీపీటీ కన్నా ఇది మెరుగైన సాంకేతికత అనీ, ఏఐ రంగంలో చైనా పురోగమనాన్ని ఇది చాటి చెబుతోందనీ అంటున్నారు. ఇప్పటికే ఏఐ రంగంలో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా; చైనా, బ్రిటన్ రెండు, మూడు స్థానాలలో ఉన్నాయని సమాచారం. కృత్రిమమేధా రంగంలో ముందున్నవారే ప్రపంచాన్ని ఏలగలరని ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేసిన వ్యాఖ్య, ఈ సాంకేతికాద్భుతం ప్రపంచాన్ని ఏ స్థాయిలో ప్రభావితం చేయబోతోందో స్పష్టం చేస్తోంది.

ఇంతటి కీలకరంగంలో మనదేశం ఏ స్థానంలో ఉందన్న ప్రశ్న తలెత్తడం సహజమే. మరీ వెనకబడి లేము కానీ, చైనా మొదలైన దేశాలతో పోల్చితే వెళ్లవలసినంత ముందుకూ వెళ్లలేదనే మాట వినిపిస్తోంది. ఇప్పటికైనా వేగాన్ని పెంచుకుని పోటాపోటీగా మన ఉనికిని స్థాపించుకోగల సత్తా మనకుందన్న భావన వ్యక్తమవుతోంది.

అదలా ఉంచితే, ఏఐ సాంకేతికత సృష్టించే అద్భుతాలను సామాజిక మాధ్యమాల తెరపై ఇప్పటికే చూస్తున్నాం. ఇటీవలి కుంభమేళాలో కొందరు విదేశీ ప్రముఖులు కాషాయవస్త్రాలు ధరించి పవిత్ర స్నానాలు చేసినట్టు చూపే చిత్రాలు సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్షమయ్యాయి. అవి ఏఐ సాంకేతికతతో సృష్టించినవని చెప్పకపోతే నిజమని నమ్మేసే ప్రమాదం ఉండనే ఉంటుంది. ఇలాగే, తను కుంభమేళాలో స్నానం చేస్తున్నట్టు చూపించే ఏఐ చిత్రం ఒకటి చక్కర్లు కొడుతుండటం గమనించి ప్రముఖ సినీనటుడు ప్రకాశ్ రాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే రకరకాల మాధ్యమాలలో హోరెత్తుతున్న నకిలీ సమాచారానికి తోడు ఇప్పుడు నకిలీ చిత్రాలు కూడా అడుగు పెట్టాయనీ, వీటికి వ్యతిరేకంగా తన వంతు పోరాటంగా పోలీసులకు ఫిర్యాదు చేశాననీ ఆయన చెప్పుకొచ్చారు. నిక్కమైన సమాచారానికి నకిలీ వార్తల బెడద విడుపులేని రాహుగ్రహణంగా మారిన మాట నిజం. మంచి, చెడులు రెంటికీ పనికొచ్చే రెండంచుల కత్తి లాంటి సాంకేతిక సాధనాల జాబితాలో ఏఐ కూడా ఇలా చేరిపోతోంది. ఈ ప్రమాదానికి అడ్డుకట్ట వేయడం, ఏఐలో పురోగతిని సాధించడాన్ని మించిన సవాలు కాబోతోంది.

ఇంకోవైపు, ఆకాశమే హద్దుగా ఏఐ సాంకేతికత సాధించగల అద్భుతాలను ఊహించుకున్న కొద్దీ, అది అచ్చంగా మాయల ఫకీరు చేతిలోని మంత్రదండాన్ని గుర్తుచేస్తుంది. తలకాయలను, వేషభాషలను మార్చడమే కాదు; స్త్రీ, పురుషుల రూపాలను కూడా అది తారుమారు చేయగలదు. ఆ విధంగా మంత్రాలూ, మహిమలతో నిండిన పౌరాణిక మాయాప్రపంచాన్ని కొత్తరూపంలో కళ్ళముందు ఆవిష్కరించగలదు. ఉదాహరణకు రామాయణంలోనే చూడండి, యుద్ధరంగంలో రాముని ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి ఇంద్రజిత్తు ఒక మాయాసీతను సృష్టించి తన రథం మీద యుద్ధభూమికి తీసుకొచ్చి అందరూ చూస్తుండగా ఆమెను నరికి చంపుతాడు. రాముడంతటివాడు కూడా ఆమెను నిజ సీత అనుకుని దుఃఖంతో మూర్ఛపోతాడు. వినాయకుడికి ఏనుగు తలను, మరో పౌరాణిక పాత్రకు గుర్రం తలను అతికించడమూ పురాణాలలో కనిపిస్తాయి. ఒక రాకుమారుడు వేటకెళ్లి ఓ వనంలోకి ప్రవేశించగానే స్త్రీగా మారిపోయినట్టు చెప్పే కథ ఒకటి మహాభారతంలో ఉంది. అభిమన్యుని వధకు కారణమైన సైంధవుని సూర్యాస్తమయంలోగా చంపి తీరుతానన్న అర్జునుని ప్రతిజ్ఞను నిజం చేయడానికి కృష్ణుడు కృత్రిమ సూర్యాస్తమయాన్ని సృష్టిస్తాడు. ఏఐ సాంకేతికత ఇటువంటి అనేకానేక ఉదంతాలను తలపించి మరిపించే ఒక సరికొత్త మాంత్రిక ప్రపంచాన్ని సృష్టించి ఏది నిజమో, ఏది అబద్ధమో పోల్చుకోలేని ద్వైదీస్థితిలో మనిషిని నిలబెట్టే అవకాశం పుష్కలంగా ఉంది.

మనిషి సృష్టించిన సాంకేతికత తిరిగి ఆ మనిషినే పునఃసృష్టి చేయడం మానవ చరిత్ర పొడవునా జరుగుతూ వచ్చింది. రాతియుగంలో మనిషి కనిపెట్టిన శిలాసాధనాలే అన్నసంపాదనలో కొత్త మార్గాలు తెరచి భద్రమైన మనుగడ దిశగా అతణ్ణి ముందడుగు వేయించాయి. అతను కనిపెట్టిన ధనుర్బాణాలే ఆ అడుగుకు మరో పదడుగులు జమచేశాయి. ఆ తర్వాత అతనే కనిపెట్టి విడిచిపెట్టిన చక్రం వందల వేల సంవత్సరాలలో వేనవేల రూపాల్లోకి మారి, అతణ్ణి కూడా మార్చి ప్రపంచ యాత్ర చేయిస్తూ అప్రతిహతంగా తిరుగుతూనే ఉంది. ఆహార సేకరణ, పెరటి సాగు దశలను దాటి మనిషి సృష్టించిన వ్యవసాయ సాంకేతిక జ్ఞానమే, తిరిగి అతడికి నాగరికుడిగా కొత్త అవతారాన్ని సంతరించి సరికొత్త యుగావిష్కరణ వైపు నడిపించింది. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, మనిషి తను సృష్టించిన సాంకేతికతను తన అదుపులో ఉంచుకున్నప్పుడే అది ఉపయుక్తంగా మారి అతని మనుగడను ఎవరెస్టు ఎత్తుకు తీసుకెడుతుంది; కళ్లేలు వదిలేస్తే సమస్యలు, సంక్షోభాల లోయల్లోకి పడదోస్తుంది. ఏఐ లాంటి ఎంతటి అత్యాధునిక సాంకేతికత అయినా ఇందుకు మినహాయింపు కాదు. మనిషి సృష్టించిన కృత్రిమ మేధ మనిషి మేధనే కృత్రిమంగా మార్చివేయకుండా చూసుకోవాలి; ప్రపంచాన్నే మయసభగా మార్చి మాయావుల పరం చేయకుండా జాగ్రత్తపడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.7.20 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పునర్వసు సా.6.40 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.6.49 నుండి 8.21 వరకు, తదుపరి రా.2.46 నుండి 4.22 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.40 నుండి 1.28 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** సా.4.20 నుండి 5.55 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం: 5.55
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

నిక్కచ్చిగా తొలి పాతికేళ్ల 'సోర్స్ కోడ్'!

విశ్లేషణ



తెంపల్లె వేణుగోపాలరావు

మహాకవి పోతన రచించిన ఒక పద్యం 'ఒక సూర్యుండు సమస్త జీవులకు దానొక్కక్కడై తోచు' అని మొదలవుతుంది. శత కోటీశ్వరుడు, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాకుడు బిల్ గేట్స్‌ను ప్రపంచంలో ఒక్కొక్కరు ఒక్కోలా చూస్తారు. కొందరికి ఆయన తిరుగులేని విజయం సాధించిన కార్పొరేట్ దిగ్గజం. రాగల దశాబ్దాల్లో ప్రపంచాన్ని శాసించే సాంకేతికతను ముందే పసిగట్టి, అందుకోసం యాభైయ్యేళ్ల నాడే ఒక సంస్థను స్థాపించిన దార్శనికుడు. మరికొందరికి ఆయన దాతృత్వశీలి. తన స్వచ్ఛంద సంస్థ మెలిందా–గేట్స్ ఫౌండేషన్ ద్వారా వెనకబడిన దేశాల్లో ఎన్నో సేవా కార్యక్రమాల్లో, ఆరోగ్య పరిరక్షణలో పాటుపడుతున్న మహనీయుడు. కానీ అనేకులకు ఆయన అనుమానాస్పదుడు. ఆయన సేవా కార్యకలాపాల వెనక స్వప్రయోజనాలున్నాయని వారు సంశయిస్తారు. బిల్ గేట్స్ గురించి చాలా పుస్తకాలొచ్చాయి. అందులో ఆయన్ను కీర్తించినవీ ఉన్నాయి, తూర్పారబట్టినవీ ఉన్నాయి. కానీ ఇంతకూ బిల్ గేట్స్ ఎవరు? తన గురించి తాను చెప్పుకోవాల్సి వస్తే ఏం చెబుతారు? వీటన్నిటికీ జవాబుగా ఫిబ్రవరి 4న తన స్వీయచరిత్ర 'సోర్స్ కోడ్–మై బిగినింగ్స్' పుస్తకం వెలువరించారు. మొత్తం మూడు భాగాలుగా వచ్చే స్వీయచరిత్రలో ఇది తొలి భాగం. ఇందులో బాల్యం నుంచి తొలి పాతికేళ్ల ప్రస్థానం ఉంది. బిల్ గేట్స్ వరకూ పుస్తకం వచ్చిన సందర్భం అనేక విధాల ముఖ్యమైనది. ఆయనకు ఈ సంవత్సరంతో 70 ఏళ్లు వస్తాయి. మైక్రోసాఫ్ట్ కంపెనీ స్థాపించి 50 ఏళ్లవుతుంది. దివంగతుడైన ఆయన తండ్రికి ఇది శతజయంతి సంవత్సరం. ఏడాదిన్నర క్రితం తన గురించి తాను రాసుకోవాలనిపించిందని, ఇందులో తన ఎదుగుదలకు కారకులైన తల్లితండ్రుల గురించీ, కుటుంబం గురించీ, ఇద్దరు బాల్యస్నేహితుల గురించీ చెప్పాలనిపించిందని ఆయనే ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. తన సమకాలీకులతో పోలిస్తే ఆయనెప్పుడూ కొన్ని దశాబ్దాల ముందు ఆలోచించేవారని బిల్ గేట్స్ గురించి ఇప్పటికే చాలామంది చెప్పారు. కానీ ఈ పుస్తకం కోసం ఆయన కొన్ని దశాబ్దాల వెనక్కి వెళ్లారు. ఒక మనిషి ఎదుగుదలకైనా, పతనానికైనా కుటుంబ ప్రభావం, పెంపకం ఎలా దోహదపడతాయో ఈ పుస్తకంలో వివరించారు.

తండ్రికి కోపం తెప్పించిన సందర్భం

స్వీయచరిత్ర రాయదల్చుకున్నవారికి నిజాయితీ ముఖ్యం. తన తప్పొప్పులన్నిటినీ నిర్భయంగా చెప్పగలిగినప్పుడే ఆత్మకథకు పూనుకోవాలి. తాను మానవాతీతుడినన్న అహం ఉండకూడదు. తన ఎదుగుదల ఎలా సాధ్యమైందో, జీవితం ఏయే మలుపులు తిరిగిందో, తన ప్రతి అడుగులోనూ ఎవరెవరు అండదండలు అందించారో, ఎవరిపట్ల తాను నిర్దయగా వ్యవహరించాడో, ఆ తప్పును ఏ దశలో గుర్తించాడో, ఎలా సరిదిద్దుకున్నాడో చెప్పగలగాలి. ఈ చట్రంలో ఇమిడే స్వీయచరిత్రలు మనదగ్గరే కాదు, ప్రపంచవ్యాప్తంగా కూడా చాలా తక్కువ. బిల్‌గేట్స్ తన గురించి తాను ఏం చెప్పుకుంటారన్న ఆసక్తి అందరిలో ఉంటుంది. తొలి భాగం 'సోర్స్ కోడ్' ఆ విషయంలో అందరి మన్ననలూ పొందే అవకాశం ఉంది. ఇది బాల్యం గురించే కనుక, ఆ దశలో ఆయన్ను వివాదాలు చుట్టుముట్టే అవకాశం లేదని అనుకుంటారు. కానీ బాల్య జీవితంలోని కొన్ని అంశాలను నిస్సంశయంగా చెప్పటం ద్వారా బిల్ ఫుల్‌మార్కులు కొట్టేశారు.

అది అమెరికా కనుక 1970ల నాటికే అందరికీ కంప్యూటర్ గురించి తెలిసిపోయింది. పర్సనల్ కంప్యూటర్ల వాడకమూ మొదలైంది. కాకపోతే ఇప్పటిలా నిత్యావసర వస్తువు కాదు. బాగా ధనవంతులకు మాత్రమే సాధ్యపడే విలాసవంతమైన ఉపకరణం. అలాగని బిల్ గేట్స్ తల్లిదండ్రులు నిరుపేదలు కాదు. వారి కుటుంబం ఇతరులతో పోలిస్తే సుఖంగానే జీవనం సాగించేది. తండ్రి గేట్స్ సీనియర్ సమాజం పట్లా, కుటుంబం పట్లా ఎంతో నిబద్ధతతో ఉండేవాడని బిల్ గుర్తు చేసుకున్నారు. ఆచితూచి వ్యవహరించేవాడని, పిల్లల పట్ల దయతో, శ్రద్ధాసక్తులతో ఉండేవాడని రాశారు. ఆయన ఒకే ఒకసారి ఉగ్రుడయ్యాడట. అది కూడా తన లోపమేనని ఆయనంటారు. డైనింగ్ టేబుల్ దగ్గర ఏదో విషయమై మూర్ఖంగా వాదించేసరికి ఉండబట్టలేక ఆయన గ్లాసులో ఉన్న నీటిని బిల్ గేట్స్ ముఖంపై చిమ్మారట. 'థాంక్స్ ఫర్ ద షవర్' అంటూ అక్కడి నుంచి బిల్ నిష్క్రమించారు. 'ఎప్పుడూ ఎంతో శాంతంగా, ప్రేమగా ఉండే తండ్రిని నా ప్రవర్తన ద్వారా సహనం కోల్పోయేలా చేశాను' అని బిల్ రాశారు. 'చిన్నప్పుడంతా 'జటిలమైన కొడుకు'గానే ఉండేవాడిని' అంటారు. 'ఇప్పుడైతే ఆ ప్రవర్తన చూసి కచ్చితంగా ఆటిజంతో బాధపడేవాడిగా పరిగణించివుండేవారు' అని చెబుతారు.

చిన్ననాడే మద్యపానం, గంజాయి, ఎల్ఎస్‌డీ వంటివి అలవాటైన సంగతి, వాటికి దూరమైన సంగతి కూడా బిల్ దాచుకోలేదు. కొన్ని విషయాల్లో తమ పిల్లాడు ఎందుకంత ఆలోచిస్తాడో, ప్రవర్తిస్తాడో తెలుసుకోవటానికి అవసరమైన పుస్తకాలు, ఇతరేతర సమాచారం తల్లితండ్రులకు ఉండేది కాదంటాడు. 'పెద్దవాళ్లను కలవటం, వారితో చర్చించటం, వారి సలహాలు, సూచనలు పాటించడం అనే సంస్కృతిని అమ్మానాన్న, అమ్మమ్మ అలవాటు చేశారు. అందుకే ఎక్కడికి తీసుకెళ్లినా పెద్దవాళ్లతో చొరవగా మాట్లాడటం, వారిని ప్రశ్నలతో వేధించటం, సంతృప్తికరమైన జవాబు వచ్చేవరకూ ఆ ప్రశ్నల పరంపరను కొనసాగించటం అలవాటైంది. అది జీవితంలో ఎదగటానికి తోడ్పడింది' అని బిల్ గేట్స్ అభిప్రాయపడతారు. ముఖ్యంగా అమ్మ, అమ్మమ్మ తనలో పోటీతత్వాన్ని ఎంతగానో పెంచారంటారు. తన జీవితంలో చోటుచేసుకున్న ఈ అంశాలను చెప్పటం అవి అందరికీ ఉపయోగపడతాయన్న ఉద్దేశమేనని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. తన పుట్టుకే అయాచితంగా అదనపు హక్కు (ప్రివిలేజ్)ను ఇచ్చిందని నిజాయితీగా ఒప్పుకోవటం ప్రశంసించదగ్గది. అప్పటికే జాతిపరమైన విభేదాలతో నిలువునా చీలివున్న సియాటెల్ సమాజంలో తాను శ్వేతజాతిలో పుట్టడం, అందులోనూ మగవాడిని కావటం ఎంతో కలిసొచ్చిందని బిల్ స్వీయాభిప్రాయం. పుట్టుకతోనే ప్రతిభావంతులమని స్వోత్కర్షకు పోయేవారికి ఇదొక కనువిప్పు.


మేము లేకుండా కంప్యూటర్ విప్లవమా?

హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి మధ్యలోనే చదువుకు స్వస్తి చెప్పేనాటికి బిల్ గేట్స్‌కూ, ఆయన బాల్యస్నేహితుడు, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు పాల్ అలెన్‌కూ, 17 యేళ్లవయసులోనే మృత్యువాత పడిన మరో స్నేహితుడు కెంట్ ఇవాన్స్‌కూ పర్సనల్ కంప్యూటర్‌పై అవగాహన ఉంది. ఎయిత్ గ్రేడ్‌లో ఉన్నప్పుడు పాఠశాల కొచ్చిన కంప్యూటర్‌తో ఎక్కువ సమయం గడిపేందుకు కంప్యూటర్‌లో బగ్స్ సృష్టించామని, అది కనిపెట్టి తననూ, ఇవాన్స్‌నూ వెళ్లగొట్టారని బిల్ గేట్స్ చెప్పారు. తర్వాత కాలంలో కంప్యూటర్లలో బగ్స్ గుర్తించి తొలగించే పనికి కుదిరి కొంత డబ్బు సంపాదించిన ఉదంతాలూ ఉన్నాయి. కంప్యూటర్‌ను నిర్వ హించే సీసీసీ కంపెనీ మూతపడటంతో దాని నిర్వహణ భారాన్ని స్కూల్‌లో తనకు అప్పగిస్తే, మిత్రుడు అలెన్ సాయంతో దాన్ని పూర్తిచేశారు. తన తొలి వ్యాపార భాగస్వామిగా ఇవాన్స్ తనతో జతకట్టి ఆత్మవిశ్వాసాన్ని పెంచాడని, అతని మరణం ఒక్కటే తన బాల్యంలో చోటుచేసుకున్న విషాదకర సంఘటనని ఆయన వివరిస్తారు. తమ ప్రమేయం లేకుండానే కంప్యూటర్ విప్లవం వెల్లువెత్తుతుందేమోనన్న ఆత్రుత గేట్స్‌కూ, అలెన్‌కూ ఉండేదంటే... తాము అందులో పాలుపంచుకుని ప్రముఖంగా ఎదగాలనుకున్నారంటే వారి తపన ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవచ్చు. అప్పుడే ఈ ఇద్దరు మిత్రులూ ఎంఎస్–డాస్ ఆపరేటింగ్ సిస్టమ్, బేసిక్ వంటి సాఫ్ట్‌వేర్ రూపకల్పనలు చేయగలిగారు.

ఇవాళ్టిరోజున మైక్రోసాఫ్ట్‌లో బిల్ గేట్స్ వాటాల విలువ 10,780 కోట్ల డాలర్లు. ప్రపంచంలో ఆయన 13వ అతి పెద్ద ఐశ్వర్యవంతుడు. 2021లో ఆయనతో విడిపోయిన మాజీ భార్య మెలిందా ఫ్రెంచ్ గేట్స్ వాటాలు 3,040 కోట్ల డాలర్ల పైమాటే. అన్నట్టు, దీని అనంతరం రాబోయే పుస్తకాల్లో చాలా వివాదాస్పద విషయాలుంటాయి. 'సోర్స్ కోడ్' విడుదల సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలు గమనిస్తే ఆయన దేన్నీ దాచదల్చలేదని స్పష్టమవుతుంది. మిత్రుడు అలెన్‌ను దూరం చేసుకోవటం తప్పేనని అంగీకరించారు.

మైక్రోసాఫ్ట్‌లో కొందరు మహిళా ఉద్యోగినులతో తన వివాహేతర సంబంధాలు, లైంగిక నేరాలకు పాల్పడ్డాడని ఆరోపణలొచ్చిన ఫైనాన్షియర్ జెఫ్రీ ఎపిస్టీన్‌తో తనకున్న అనుబంధం, 27 ఏళ్ల వివాహబంధం అనంతరం భార్యతో విడాకులు, స్టీవ్ జాబ్స్‌తో పరిచయం, గొడవలు వంటి వ్యవహారాలపై బిల్ గేట్స్ అరమరికలు లేకుండా మాట్లాడారు. ఇంకా పర్యావరణం, ఏఐ వరకూ అభివృద్ధిపరిచిన సాంకేతికత, కరోనా మహమ్మారి, డోనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్‌ల తీరుతెన్నులు వగైరాలు ఈ ఇంటర్వ్యూల్లో ప్రస్తావనకొచ్చాయి. కనుక రాబోయే రెండు భాగాల్లో వీటికి సంబంధించి మరిన్ని వివరాలందిస్తారని తెలుస్తూనే ఉంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు
venujourno@gmail.com



> పెద్దవాళ్ళను కలవడం, వారితో చర్చించడం, వారి సలహాలు, సూచనలను పాటించడం అమ్మానాన్న, అమ్మమ్మ అలవాటు చేశారు. చొరవగా మాట్లాడటం, ప్రశ్నలతో వేధించటం, సంతృప్తికరమైన జవాబు వచ్చేదాకా కొనసాగించటం అలవాటైంది. అది జీవితంలో ఎదగటానికి తోడ్పడింది.

> ఎయిత్ గ్రేడ్‌లో ఉన్నప్పుడు పాఠశాల కొచ్చిన కంప్యూటర్‌తో ఎక్కువ సమయం గడిపేందుకు కంప్యూటర్‌లో బగ్స్ సృష్టించాం. అది కనిపెట్టి నన్నూ, ఇవాన్స్‌నూ వెళ్లగొట్టారు.

> నేను నా జీవితంలో అత్యధిక భాగం... భవిష్యత్తులో వచ్చే మార్పులపైనే దృష్టి కేంద్రీకరించాను. జరుగుతాయో జరగవో తెలియనప్పటికీ, ఒకవేళ జరిగినా అనేక సంవత్సరాలు పట్టే అవకాశాలున్నప్పటికీ... అలాంటి భవిష్యత్ ఆలోచనలపై ఇవాళ్టికీ నేను ఎక్కువగా శ్రమిస్తుంటాను. వయసు పెరుగుతున్న కొద్దీ... వెనక్కి తిరిగి, గతంలో జరిగినది మరింతగా సింహావలోకనం చేసుకుంటాను. జ్ఞాపకాలను ప్రోది చేసుకోవడం వల్ల నన్ను నేను మరింత బాగా అర్థం చేసుకోగలుగుతున్నాను.

సోషల్ మీడియా

రెండు విషయాలు



హిందూత్వ విషయంలో బీజేపీని అనుకరించే ఏ పార్టీ అయినా అసలు పార్టీ చేతిలో ఓడిపోతుందని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమి తెలియజేస్తోంది. అలాగే 'ఇండియా' కూటమి అనేది ఏ భావజాలమూ, సమగ్రతా లేని స్వార్థ, అవకాశవాదుల సమూహమని అర్థమవుతోంది.

– అనుభవ్ సింగ్, మార్కిస్ట్

ఇదే నయం



భారీ జరిమానాలు విధించకుండా, జైళ్లలో వేయకుండా అక్రమ వలసదారులను తమ స్వదేశానికి పంపడం అనేది ఉన్నంతలో వారికి అత్యుత్తమం దక్కినట్టు! వాళ్లలో కొందరికి కదిలించే మానవీయ కథనం ఉండొచ్చు! అయినా వాళ్లను హీరోలుగానో, బాధితులుగానో చూడకూడదు.

– జకర్ డాక్టర్, ఫిజీషియన్

సమయం లేదు!



ఉత్త మాటలతో సమయం వృథా చేయొద్దు. చేయవలసింది ఎంతోవుంది. కానీ సమయం తక్కువగా ఉంది. రేపు అనేది ఎవరికీ వాగ్దానం కాదని గుర్తుంచుకోండి. ఉన్నది ఈ రోజే! ఏ పనులు ముఖ్యమో ఆలోచించండి. మీ మార్కును చూపండి. వృథా చేయడానికి జీవితం అంత పెద్దదేం కాదు.

– ముఫ్తి మెంక్, ఆధ్యాత్మిక బోధకుడు

ట్రాఫిక్ పెరగకుండా...



వీఐపీలు కుంభమేళాలో స్నానం చేయడానికి రాత్రిపూట వచ్చే మార్గమే లేదా? వాళ్లు రావడం వల్ల ట్రాఫిక్ అంతా గందరగోళం అవుతోంది.

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

అది సులభం



నిర్మించడం కష్టం. నాశనం చేయడం సులభం. విధ్వంసకారులకు ఈ అడ్వాంటేజ్ ఎప్పుడూ ఉంటుంది.

– ఎమీ దార్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

అరణ్య ఘోష

రాముడి నాటి దండకారణ్య దురాక్రమణ
ప్రజాస్వామ్యంలోనూ కొనసాగిస్తావా!
తిరిగి మొలకెత్తే గుణమున్న జాతిని
అంతమొందిస్తాననడం హాస్యాస్పదం!
అరణ్యాన్ని కాస్తున్నదెవరు
అడవిని అమ్ముకుంటున్నదెవరు!
చంపుకు పోవడం రాజ్యం ఉద్దేశమైతే
ఎదురు తిరగడం పౌరుడి హక్కు!

ఇరుపక్ష పార్థివ దేహాలూ పేదవే
ఆడిస్తున్నావన్న సత్యం ఆ వర్గానికి
అందించగలిగితే ఆట ముగిసినట్టే!
నీకేసే ఓటు సిరా ఆరకముందే
కాటేయడం ప్రజాస్వామ్యమా!
రక్షించమని కత్తి నీకందిస్తే
ఇచ్చిన వాడినే చంపడం
ఎంత దుర్మార్గం!
సమాధితో సహజీవనం చేసిన వేళైనా
అలెగ్జాండర్ చేతుల సత్యం అర్థమౌతుందా?

– గార రంగనాథం | 98857 58123

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com

హిట్లర్‌ను మానవుడన్న మహాత్ముడు!

కామెంట్




కరణ్ థాపర్

ఇప్పుడు రాస్తున్న దానిని గతవారమే నేను ఈ కాలమ్‌లో రాసి ఉంటే, అప్పుడది మహాత్మాగాంధీ వర్ధంతి రోజుకు మరింత సందర్భోచితంగా ఉండి ఉండేదని అనిపించవచ్చు. అదే కారణంతో అలా నేను రాసి ఉంటే సమయం, సందర్భం చూసి, రెచ్చకొట్టడానికి నేను రాసినట్లుగా ఉండేది. లేదంటే, మనోభావాలను దెబ్బతీసినట్లయ్యేది. కాబట్టి, ఈరోజు నేను లేవనెత్తుతున్న విషయాలపై మీ ప్రతిస్పందన భావావేశాలకు లోను కాని విధంగా ఉంటుందని ఆశిస్తాను.

గాంధీ మరణించిన డెబ్బై ఐదు సంవత్సరాల తర్వాత ఇప్పుడైనా – ఆయనకున్నటువంటి కొన్ని వివాదాస్పద, లేదా విరుద్ధమైన, అదీ కాకుంటే ఆమోదయోగ్యం కానివైన అభిప్రాయాలను మనం ఎలా పరిగణించాలన్న దానిని పరిశీలించవలసిన అవసరం ఉంది. 2024లో అవి మనకు దిగ్భ్రాంతిని గొల్పవచ్చు. 1940ల లోనైనా వాటికి ఇప్పటి కన్నా ఎక్కువగానే సమ్మతి లభించి ఉంటుందని నాకైతే నమ్మకం లేదు.

భారత స్వాతంత్ర్యం, దేశ విభజనలపై అలెక్స్ వాన్ తంజల్‌మాన్ (బ్రిటిష్ చరిత్రకారిణి) పుస్తకం 'ఇండియన్ సమ్మర్' (2007)ను జాగ్రత్తగా చదివినప్పుడు–రెండో ప్రపంచ యుద్ధం, హిట్లర్, ఆనాటి మారణహోమం పైన గాంధీజీ దృష్టికోణం ఏమిటో తెలిసి నిర్ఘాంతపోయాను.

గాంధీ శాంతి కాముకులని, అహింస పట్ల ఆయన నిబద్ధత తిరుగులేనిది, కొదవలేనిదని మనకు తెలిసిందే. ఆ నిబద్ధతే ఆయనను... హిట్లర్, ముస్సోలినీల దురాక్రమణ ప్రయత్నాలను అడ్డుకోవద్దని బ్రిటన్‌కు సలహా ఇచ్చేంతవరకు తీసుకెళ్లిందా! ''వారిని మీ అందమైన దీవిని జయించనివ్వండి. పురుషుల్ని, స్త్రీలను, పిల్లల్ని చంపేయటానికి మీకై మీరు వారిని అనుమతించండి. అయితే వారికి విధేయంగా ఉండటానికి మాత్రం నిరాకరించండి'' అని చెప్పారాయన.



జర్మన్ నియంత హిట్లర్

> ఏమైనా మహాత్ముడు భీతికొల్పేంత స్థిర చిత్తుడు అయియుండాలి. అంతేకానీ కపటి మాత్రం కాదు.

1962లో ఇండియాపై చైనా దాడి, లేదా ఇండియాపై పాకిస్తాన్ పదే పదే చేస్తుండే దాడుల విషయంలో కూడా గాంధీ అలాగే స్పందించే వారా? ఏమైనా మహాత్ముడు భీతికొల్పేంత స్థిర చిత్తుడు అయియుండాలి కానీ కపటి మాత్రం కాదు.

మరీ అధ్వాన్నం... హిట్లర్ దుష్టుడు అంటే గాంధీకి నమ్మబుద్ధి కాకపోవటం! ''గౌరవనీయులైన హిట్లర్‌ను – ఆయన్ని చిత్రీకరించినంత – చెడ్డవారిగా నేను పరిగణించను'' అని 1940లో గాంధీ రాశారు. ''ఎక్కువ రక్తపాతం లేకుండా విజయాలు సాధించే అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా ఆయన నాకు కనిపిస్తారు'' అన్నారు. ''భవిష్యత్ జర్మన్లు శ్రీ హిట్లర్‌ను మేధావిగా, ధీశాలిగా, సాటిలేని కార్యాచరణశీలిగా, మరెన్నో విధాలుగా గౌరవిస్తారు'' అని గాంధీ భావించారు.

దీనికన్నా కూడా, మాటల్లో వివరించలేనిది ఏమిటంటే – యూదుల పట్ల నాజీల అమానవీయ ప్రవర్తనపై గాంధీ ప్రతిస్పందన. లూయీ ఫిషర్ (అమెరికన్ జర్నలిస్ట్) రాసిన మహాత్ముడి జీవిత కథను ఉటంకిస్తూ, వాన్ తంజల్ మాన్... యూదులు సానుకూలమైన ప్రతిఘటనను మాత్రమే నాజీలకు అందించాలనీ, అవసరం అయితే తమ జీవితాలను సైతం త్యాగం చేయాలనీ గాంధీ సలహా ఇచ్చారని వెల్లడించారు. అడాల్ఫ్ హిట్లర్ కోసం ప్రార్థించమని కూడా ఆయన వారిని కోరారట. ''కనీసం ఒక యూదుడు ఇలా చేసినా అతడు తన ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నట్లేనని, అందువల్ల ఒక మంచి ఉదాహరణగా నిలుస్తాడని, ఆ మంచితనం అంటువ్యాధిలా విస్తరించి మొత్తం యూదు జాతినే కాపాడుతుందని, మానవాళికి సుసంపన్నమైన ఒక గొప్ప వారసత్వాన్ని వదిలివెళుతుందని గాంధీ అన్నారు'' అని లూయీ ఫిషర్ రాసినట్లు వాన్ పేర్కొన్నారు.

యూదుల నిర్బంధ శిబిరాలను కనుగొన్నాక కూడా, వాటిల్లో జరుగుతున్న అతి భయానక దారుణాలు ప్రపంచం దృష్టికి వచ్చాక కూడా లూయీ ఫిషర్‌తో గాంధీ ఇలా అన్నారు: ''హిట్లర్ 50 లక్షల మంది యూదులను చంపాడు. ఇది మనకాలపు అతి పెద్ద నేరం. కానీ యూదులు తమకై తాము కసాయి కత్తికి తమను సమర్పించుకుని ఉండాల్సింది. తమను తాము శిఖరం అంచులపై నుండి సముద్రంలోకి తోసుకుని ఉండాల్సింది...''

హింసపై పూర్తి వ్యతిరేకత, అహింస పట్ల అచంచలమైన నిబద్ధత కలిగి ఉన్న కారణంగానే గాంధీ అలా అని ఉంటారనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే అంతవరకే అది ఏకైక ఆమోదయోగ్యమైన ప్రతిస్పందన. హిట్లర్‌ను ఎదిరించవద్దని, హిట్లర్ కోసం ప్రార్థించమని, తమకు తాము ఆత్మార్పణం చేసుకోవాలని ఆయన యూదులకు చెప్పటం మాత్రం విడ్డూరం. కనికరం లేకపోవటం, కించపరచటం, క్రూరత్వం.

1984లో సిక్కులకు, 2002లో ముస్లింలకు, నేటి ఆదివాసీలకు గాంధీ ఇచ్చే సలహా కూడా అదే విధంగా ఉండేదా? బహుశా... ఉండేది! మళ్లీ అడిగినా ఇదే సమాధానం.

బ్రహ్మచర్యంతో గాంధీ చేసిన ప్రయోగాల మాదిరిగా కాకుండా... యుద్ధం మీద, హిట్లర్ మీద, మారణహోమం మీద ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు వ్యక్తిగత వ్యామోహాలు, బలహీనతల స్థాయికి మించినవి. ఆయన ఒకవేళ దేశాన్ని పరిపాలించి ఉంటే అవి విధానాలుగా మారి ఉండేవి. అందుకే వాటిని చర్చించి, పరిష్కరించాల్సి ఉంది. అంతిమంగా, వాటికి ఆమోదయోగ్యమైన వివరణ లభించకపోతే వాటిని విమర్శించాలి. తిప్పికొట్టాలి. ఇలా అంటున్నందుకు నేను చిక్కుల్లో పడతాననే మాటనైతే నేను కాదనను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మెచ్చుకోలు!

ప్రత్యక్షే గురవః స్తుత్యాః, పరోక్షే మిత్ర బాంధవాః!
కర్మాంతే దాస భృత్యాశ్చ, న కదాచన పుత్రకాః!!

గురువులను వారి సమక్షంలో ప్రస్తుతించాలి. మిత్రులనూ, బంధువులనూ వారి పరోక్షంలో ప్రశంసించాలి. మిత్రులు, బంధువులు మనతో లేనపుడు ఏమి అనుకుంటామో అదే మన నిజమైన అభిప్రాయం అవుతుంది. దాసులను, సేవకులను వారికి అప్పగించిన పని పూర్తి చేసిన వెంటనే ప్రస్తుతించాలి. సంతానాన్ని మాత్రం ఎప్పుడూ పొగడకూడదు. వారిని తగు విధంగా ప్రోత్సహించటం మాత్రమే చేయాలి.

భారవి రాస్తున్న కవిత్వాన్ని ఊళ్ళో పండితులందరూ మెచ్చుకుంటారు. తండ్రి మాత్రం ఒక్కమాటా అనడు. ఇది భారవికి కోపంగా అన్పిస్తుంది. అది తారస్థాయికి చేరుకొని, ఒకరోజు అటకపైనుండి, తండ్రి భోజనం చేస్తున్నపుడు తలపై బండరాయి వేయాలనుకుంటాడు. భారవి తల్లి ఇది గ్రహించి, భర్త భోజనానికి కూర్చున్నప్పుడు, కొడుకు కవిత్వాన్ని ఎందుకు మెచ్చుకోరని అడుగుతుంది. కొడుకు కవిత్వానికి మనసులో ఎంతో సంతోషిస్తున్నాననీ, సంతానాన్ని పొగిడితే వారికి ఆయుక్షీణమనీ అంటాడాయన. తండ్రిని అపార్థం చేసుకున్నందుకు క్షమించమని ప్రార్థిస్తాడు భారవి.

బాల్యం నుంచి ప్రశంసలకు అలవాటు పడితే పిల్లలకు అహం వస్తుంది. తమంత వారు లేరనే గర్వం అతిశయిస్తుంది. ప్రవర్తనలో మార్పు వస్తుంది. అందుకే అతిగా పొగడకూడదు. వారి అభివృద్ధికి మనసులోనే సంతోషించాలి. ప్రశంసను పన్నీటిలా చిలకరించాలి. లేకపోతే విలువుండదు, ఎదుటివారిలో ఎదుగుదలా ఉండదు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

మానసిక ఆరోగ్యమే మన భాగ్యం

యువత మానసికంగా దృఢంగా ఉంటేనే ఆర్థిక వ్యవస్థ పురోగమనం సాధ్యం



"మిమ్మల్ని శారీరకంగా, మేధోపరంగా, ఆధ్యాత్మికంగా బలహీనపరిచే ఏ విషయమైనా విషపూరితంగా భావించి తిరస్కరించండి".
- స్వామి వివేకానంద

నూరు శాతం ఆచరించి, అనుసరించి తీరాల్సిన వ్యాఖ్యలివి. మనల్ని క్రిందికి లాగి, ప్రతికూలతను వ్యాప్తి చేసే ఈ విషయంపైనైనా లోతైన ఆత్మపరిశీలన అవసరం. ఇక్కడ, ఇప్పుడు వివేకానందుని పిలుపును యువత తమ మానసిక ఆరోగ్యానికి కూడా వర్తింపజేయాల్సిన సమయమిది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన అంశం అయినందునే 2024–25 ఆర్థిక సర్వేలో ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు.

– సాక్షి, సెంట్రల్ డెస్క్

జంక్ ఫుడ్.. 'పాయిజన్'

అల్ట్రా–ప్రాసెస్డ్ లేదా ప్యాక్డ్ జంక్ ఫుడ్‌ను చాలా అరుదుగా తినే వ్యక్తులు రెగ్యులర్‌గా తీసుకునే వారి కంటే మెరుగైన మానసిక స్థితిని కలిగి ఉంటారని ఆర్థిక సర్వే పేర్కొనడం గమనార్హం. సంపాదించిన డబ్బు.. వైద్యానికి సరిపోని పరిస్థితికి ఆహారపు అలవాట్లు కారణంగా మారుతుండడం గమనార్హం. మన సమాజంలో సంపాదన పెరుగుతున్నా, ఆరోగ్య సమస్యలతో చికిత్స ఖర్చులు పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ముఖ్యంగా, ఆహారపు అలవాట్లు ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. నిత్యం ప్రాసెస్డ్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్, అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు ఉన్న ఆహార పదార్థాల వినియోగం పెరుగుతోంది. ఇవి ఊబకాయాన్ని, మధుమేహం, రక్త పోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయి. ఆరోగ్య సమస్యలు పెరగడంతో వైద్య ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. ఫలితంగా, సంపాదించిన డబ్బు చాలాచోట్ల వైద్య ఖర్చులకే వెళ్లిపోతోంది. దీని వల్ల కుటుంబ ఆర్థిక స్థితి కూడా దెబ్బతింటోంది. సమతులమైన ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం తప్పనిసరి. సంపాదనను వైద్య ఖర్చులకు కాకుండా, మంచి జీవన విధానానికి ఉపయోగించుకోవడం మంచిది. మానసిక ఆరోగ్య పరిరక్షణలో ఇది కీలక అంశం.

కింకర్తవ్యం..

పిల్లలను, యుక్తవయస్కులను ఇంటర్నెట్‌కు దూరంగా ఉంచడం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించాల్సిన తక్షణ తరుణమిది. స్నేహితులతో కలవడం, బయట ఆడుకోవడం, సన్నిహిత కుటుంబ బంధాలను ఏర్పరచుకోవడంలో సమయాన్ని వెచ్చించడం వంటి ఆరోగ్యకరమైన కాలక్షేపాలను ప్రోత్సహించడానికి పాఠశాల, కుటుంబ–స్థాయి జోక్యాల తక్షణ అవసరం ఉంది. మానవ సంక్షేమం, మానసిక ఆరోగ్యం ఆర్థిక ఎజెండాలో కేంద్రంగా ఉండాలి. యువ జనాభా అధికంగా ఉండడం వల్ల ఎకానమీకి ఒనగూడే ప్రయోజనాలు ఊరికే ఊడిపడవు. విద్య, శారీరక ఆరోగ్యం, ముఖ్యంగా యువత మానసిక ఆరోగ్యం ఇక్కడ చాలా కీలకం. ఇందుకు ఆచరణీయమైన, ప్రభావవంతమైన వ్యూహాలు, చొరవలపై దృష్టి పెట్టాల్సిన తక్షణ అవసరం ఉంది.

యువ భారత్ దారి ఎటు..?

భారత్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్ పురోగతి గురించి చర్చించేటప్పుడు దేశంలో అధికంగా ఉన్న యువశక్తి గురించి ప్రస్తావనకు వస్తుంది. అయితే ఈ యువత మెజారిటీ ఎటువైపు అడుగులు వేస్తోందన్నది ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్న అంశం. సోషల్ మీడియాలో ఖాళీ సమయాన్ని గడపడం లేదా అరుదుగా వ్యాయామం చేయడం లేదా కుటుంబాలతో తగినంత సమయం గడపకపోవడం, గంటల కొద్దీ కూర్చున్నచోటు నుంచి లేవకుండా కంప్యూటర్ల ముందు పనిచేయడం యువత మానసిక ఆరోగ్యాన్ని దిగజార్చుతోంది. ఆరోగ్యమే మహాభాగ్యమన్న మన పెద్దల అనుభవ సారానికి తూట్లు పొడుస్తోంది. మన మూలాలవైపు ఇప్పుడు యువత తిరిగి చూడాల్సిన అవసరం ఉంది. ఇది యువతను అత్యున్నత స్థానానికి చేర్చడానికి వీలుకల్పిస్తుంది. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థను నడిపించడానికి యువత మానసిక ఆరోగ్యం కీలకమైనదంటూ తాజా ఆర్థిక సర్వే విశ్లేషణను నిజం చేస్తుంది.

సమాజ పురోగతికి పునాది

జీవితంలోని సవాళ్లను అధిగమించగలిగిన సామర్థ్యాన్ని మానసిక ఆరోగ్యం అందిస్తుంది. ప్రతి రంగంలో ఉత్పాదకత పురోగతికి దోహదపడే అంశం ఇది. ఇంతేకాదు, మానసిక–భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం, విజ్ఞాన సముపార్జన, సమాజ పురోగతికి వినియోగం, శారీరక సామర్థ్యాల సాధన... వంటి ఎన్నో ప్రయోజనాలను ఇక్కడ మనం ప్రస్తావించుకోవచ్చు. జీవనశైలి ఎంపిక, అరమరికలు లేని స్నేహపూర్వక కార్యాలయ పని సంస్కృతి, కుటుంబ పరిస్థితులు దేశ ఎకానమీ పురోభివృద్ధికి మార్గాలు. ఇంత ప్రాముఖ్యత ఉన్న అంశం కాబట్టే భారత్ ఆర్థిక ఆశయాలు నెరవేరాలంటే బాల్యం, యవ్వనం దశ నుంచే జీవనశైలి ఎంపికలపై తక్షణ శ్రద్ధ ఉండాలని ఎకనమిక్ సర్వే గుర్తుచేసింది.

ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్రభావం

పిల్లలు, యుక్తవయస్కులలో మానసిక ఆరోగ్య సమస్యల పెరుగుదల తరచుగా ఇంటర్నెట్ ప్రత్యేకించి సోషల్ మీడియా మితిమీరిన వినియోగంతో ముడిపడి ఉందన్నది కాదనలేని విషయం. స్మార్ట్‌ఫోన్ల వ్యాప్తి, సోషల్ మీడియా, ఓవర్ ప్రొటెక్టివ్ పేరెంటింగ్ వంటి అంశాలు భావి భారత బాల్యాన్ని నిరాశాజనకంగా మార్చుతాయనడంలో సందేహం లేదు. బొమ్మరిల్లు సినిమాలో ఒక సందర్భంలో తండ్రితో హీరో ''అంతా నువ్వే చేశావు'' అన్న డైలాగ్‌ను ఇక్కడ మనం గుర్తుచేసుకోవాల్సిందే. 'ది యాంగ్జియస్ జనరేషన్: హౌ ది గ్రేట్ రివైరింగ్ ఆఫ్ చిల్డ్రన్ ఎపిడెమిక్ ఆఫ్ మెంటల్ డిసీజ్' శీర్షికన ప్రఖ్యాత సామాజిక మనస్తత్వ శాస్త్రవేత్త జోనాథన్ హైడ్ట్ రాసిన పుస్తకాన్ని ఎకనమిక్ సర్వే రిఫర్ చేయడం గమనార్హం. ''ఫోన్ ఆధారిత బాల్యం'' పిల్లల ఎదుగుదల అనుభవాలను అడ్డదారి పట్టిస్తుంది. ఇక చిన్న పిల్లలు ఏడుస్తుంటే చాలు.. వారికి మొబైల్ ఫోన్ ఇచ్చి బుజ్జగిస్తున్నాం. ఇది వారి మానసిక ఆరోగ్య అధోగతి పట్టడానికి తొలి మెట్టు.

వినియోగం వివేకంతో ఉండాలి...

రెండు దశాబ్దాల క్రితం సెల్‌ఫోన్, సోషల్ మీడియా, ఇంటర్నెట్ వినియోగం చాలా తక్కువ. ఇప్పుడు పెరిగింది. సాంకేతిక పరిజ్ఞానం అన్ని స్థాయిల్లో ఎంతో ప్రయోజనాలను అందిస్తుంది. అయితే సాంకేతికత అతి, విచక్షణా రహిత వినియోగం అనర్థాలకు దారి తీస్తోంది. ముఖ్యంగా ఇప్పుడు పసితనం నుంచే పిల్లలకు సెల్‌ఫోన్‌లు, సోషల్ మీడియాను తల్లిదండ్రులు అలవాటు చేస్తున్నారు. పిల్లలు పెద్ద అయ్యే కొద్దీ అలవాటు వ్యసనంగా మారుతోంది. పెద్దలు సైతం సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు బానిసలుగా మారుతున్నారు. ఈ వ్యసనం.. చేసే పని మీద ఏకాగ్రతను దెబ్బతీస్తోంది. పిల్లల చదువుల్లో, పెద్దలు చేసే పనుల్లో నాణ్యత, ఉత్పాదకత తగ్గిపోతోంది. అంతేకాకుండా సోషల్ మీడియాలో వచ్చే నెగెటివ్ కంటెంట్ ప్రతికూల ప్రభావం చూసి చాలా మంది మానసికంగా కుంగిపోతున్నారు. బలహీన మనస్కులు మరింత బలహీనంగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్, సోషల్ మీడియా అతిగా వినియోగించడాన్ని ×బిహేవియరల్ అడిక్షన్₹ అనే మానసిక రుగ్మతగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. దీనికి చికిత్స అవసరం అని సైతం సూచించింది. తల్లిదండ్రులు చిన్న వయస్సు నుంచే పిల్లల ప్రవర్తనను నియంత్రిస్తుండాలి. పిల్లల్లో మానసిక పరిపక్వత వచ్చే వరకూ సెల్‌ఫోన్‌లు ఇవ్వద్దు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా సెల్‌ఫోన్ ఇవ్వాల్సి వస్తే స్క్రీన్ సమయంపై నియంత్రణ ఉంచాలి. ఎప్పటికప్పుడు వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తుండాలి.

– డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి,
జాతీయ మానసిక వైద్యుల సంఘం పూర్వ అధ్యక్షులు

కాళేశ్వరంలో మహాకుంభాభిషేకం

- సచ్చిదానంద సరస్వతీస్వామి చేతుల మీదుగా నిర్వహణ



సంప్రోక్షణ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

కాళేశ్వరం: మహాకుంభాభిషేక కలశ సంప్రోక్షణ క్రతువును వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి దేవస్థానంలో నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఆదివారం ఉదయం 10.42 గంటలకు తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామి చేతుల మీదుగా ప్రధాన ఆలయ గోపురం కలశానికి మహాకుంభాభిషేకం చేశారు. అనంతరం మంత్రపుష్పం నిర్వహించారు. ఒకే సమయంలో దేవస్థానం తూర్పు రాజగోపురంతోపాటు ఇతర గోపు రాలు, అనుబంధ ఆలయాలకు కుంభాభిషేక సంప్రోక్షణను వేదపండితులు చేప ట్టారు. పూజా కార్యక్రమాలన్నీ ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 42 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఈ మహాకుంభాభిషేక ఘట్టాన్ని తిలకించడానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. ఈ మహోత్సవంలో మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలాజారామయ్యర్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే పాల్గొన్నారు.

స్వర్ణ గోపురం సిద్ధం

- యాదగిరిగుట్టలో చివరిదశకు బంగారు తాపడం పనులు



విమాన గోపురానికి బిగించిన శ్రీస్వామి ప్రతిమ

యాదగిరిగుట్ట: మహా కుంభ సంప్రోక్షణ వేడుక కోసం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ దివ్య విమాన స్వర్ణ గోపురం సిద్ధమవుతోంది. ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనున్న మహా కుంభ సంప్రోక్షణ వేడుక సందర్భంగా.. స్వర్ణ దివ్య విమాన గోపురానికి బంగారు తాపడం పనులను ప్రత్యేక శిల్పులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పనులు చివరి దశకు వచ్చినట్లు ఆలయాధికారులు చెబుతున్నారు. విమాన గోపురంపై బంగారు పూతతో తయారు చేసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి రూపాలతో పాటు.. వివిధ దేవతా మూర్తుల రూపాలను బిగించే పనులను శిల్పులు చేపట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆలయాధికారులు ఆదివారం విడుదల చేశారు.

సమతాకుంభ్ ఉత్సవాలకు అంకురార్పణ

- ఈనెల 19 వరకు కార్యక్రమాలు



సమతాకుంభ్‌కు అంకురార్పణ చేస్తున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న సమతాస్ఫూర్తి కేంద్రంలో ఆదివారం సమతాకుంభ్ ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. 3వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజు స్వర్ణ భగవద్రామానుజులకు ఆర్ద్ర నక్షత్రం ఉత్సవారంభ స్నపనం నిర్వహించారు. ఈ నెల 19 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల విశేషాన్ని తెలుపుతూ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి భక్తులకు ప్రవచనం చేశారు. సాయంత్రం విశ్వక్సేన ఆరాధనతో అంకురార్పణ, సంప్రోక్షణ నిర్వహించారు. 108 దివ్య క్షేత్రాలకు కంకణ ధారణ చేసి బ్రహ్మోత్సవాలకు సిద్ధం చేశారు. యాగశాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి, మైహోంగ్రూపు చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు దంపతులు పాల్గొన్నారు.

నేడు గరుడ ప్రసాదం..

సత్సంతానం కోసం భక్తులకు సోమవారం గరుడ ప్రసాదం అందజేయనున్నారు. ధ్వజారోహణం సందర్భంగా శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి చేతుల మీదుగా ఈ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయనున్నారు. ప్రసాదం కోసం భక్తులు ఉదయం 7.30 గంటల వరకు సమతాస్ఫూర్తి కేంద్రం మూడవ నంబరు గేటు వద్దకు చేరుకోవాలని సూచించారు. దంపతులిద్దరూ సాంప్రదాయ దుస్తుల్లో రావాలని తెలిపారు.

మేడారానికి పోటెత్తిన భక్తజనం

- మినీ జాతరకు మిగిలింది రెండు రోజులే..



వనదేవతల దర్శనానికి తరలి వచ్చిన భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం మినీ జాతరకు ఇంకా రెండు రోజులే మిగిలి ఉండడంతో.. ఆదివారం భక్తులు పోటెత్తారు. మినీ జాతర ఫిబ్రవరి 12న ప్రారంభం కానుంది. తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మొదట జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెలకు చేరుకుని కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తల్లుల గద్దెలు భక్తజనంతో కిక్కిరిశాయి. మొక్కుల అనంతరం మేడారం ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట, జంపన్నవాగు పరిసరాల్లో విడిది చేశారు. అక్కడే వంటావార్పు, సహపంక్తి భోజనాలు చేశారు. కాగా, సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

వైభవంగా నృసింహుని ఎదుర్కోలు

- నేటి రాత్రి 8 గంటలకు కల్యాణం



సింహవాహనంపై శ్రీలక్ష్మీనారసింహుడు

యాదగిరిగుట్ట: యాదగిరి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన స్వామి, అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవానికి తెర లేచింది. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన ఎదుర్కోలు మహోత్సవం నయనానందకరంగా సాగింది. వేడుకకు అర్చకులు స్వామివారిని పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి.. అశ్వవాహనంపై, అమ్మవారిని వధువుగా పల్లకీలో మేళతాళాలతో మండపానికి తోడ్కొని వచ్చి ఎదుర్కోలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి సోమవారం రాత్రి 8 గంటలకు సుముహూర్తంగా నిర్ణయించారు. అంతకుముందు ఉదయం స్వామి, అమ్మవారిని సింహ వాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు.

ఇంటికి ఆలస్యంగా వచ్చాడని..

- మద్యం మత్తులో కుమారుడిని కొట్టిన తండ్రి
- బలమైన దెబ్బ తగలడంతో మృతిచెందిన బాలుడు
- సొంతూరులో గుట్టుగా అంత్యక్రియలకు ఏర్పాట్లు
- విషయం తెలుసుకుని అడ్డుకున్న పోలీసులు



భానుప్రసాద్

చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్: పాఠశాల నుంచి ఆలస్యంగా ఇంటికి వచ్చాడన్న కోపంతో మద్యం మత్తులో ఉన్న తండ్రి.. కొడుకును కొట్టడంతో ఆ బాలుడు మృతి చెందాడు. శనివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో జరిగిన ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన కట్ట సైదులు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబంతో కలసి చౌటుప్పల్ పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సైదులు మూడో కుమారుడు భానుప్రసాద్ (14) చౌటుప్పల్‌లోని అన్న మెమోరియల్ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ పార్టీలో పాల్గొన్న భానుప్రసాద్ రాత్రి 7.30కి ఇంటికి వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తండ్రి సైదులు.. కుమారుడు ఇంటికి ఆలస్యంగా రావడంతో కోపంతో అతడిని చితకబాదాడు. తండ్రి కొట్టిన దెబ్బలకు తాళలేక భానుప్రసాద్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అరగంట తర్వాత తండ్రి కోపం తగ్గిందని భావించిన భాను, ఇంట్లోకి రావడంతో సైదులు మరోసారి విచక్షణారహితంగా కొట్టాడు. ఛాతీపై తన్నడంతో భాను అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి బాలుడు చనిపోయాడని నిర్ధారించారు. దీంతో శనివారం రాత్రే హుటాహుటిన స్వగ్రామం ఆరెగూడేనికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఈ విషయం బయటకు తెలియకుండా జాగ్రత్త తీసుకున్నారు. ఆదివారం ఉదయం దహనసంస్కారాలు చేస్తుండగా.. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆరెగూడెం గ్రామానికి చేరుకున్నారు. చితిపై ఉంచిన మృతదేహాన్ని కిందకు దింపారు. పోస్టుమార్టం చేసిన తర్వాతే దహన సంస్కారాలు చేయాలని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మథకుమార్ మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ ఘటనపై మృతుడి తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

తల్లి సెల్‌ఫోన్ ఇవ్వలేదని కూతురు ఆత్మహత్య

- కుమురంభీం జిల్లా కౌటాలలో ఘటన



స్ఫూర్తి

కౌటాల: తల్లి తనకు సెల్‌ఫోన్ ఇవ్వలేదని పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కుమురంభీం జిల్లా కౌటాల మండల కేంద్రంలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఎస్సై మధుకర్ కథనం ప్రకారం.. కౌటాలలోని ప్రగతి కాలనీకి చెందిన బొమ్మకంటి సదానందం, రమాదేవి దంపతులకు కుమారుడు, కుమార్తె స్ఫూర్తి (16) ఉన్నారు. స్ఫూర్తి స్థానిక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శనివారం మధ్యాహ్నం కాగజ్‌నగర్ నవోదయలో నిర్వహించిన ఇంటర్ ప్రవేశ పరీక్ష రాసింది. పరీక్ష అనంతరం తండ్రి సదానందం స్ఫూర్తిని ఇంటివద్ద దించి బయటకు వెళ్లాడు. కాగా, పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను చూసుకోవడానికి సెల్‌ఫోన్ ఇవ్వాలని స్ఫూర్తి తన తల్లి రమాదేవిని కోరింది. అయితే సెల్‌ఫోన్ ఇస్తే గేమ్స్ ఆడి సమయం వృథా చేస్తావని, మెటీరియల్‌ను జిరాక్స్ తీసుకు వస్తానని ఆమె తెలిపింది. కాసేపటి తర్వాత తల్లి జిరాక్స్ సెంటర్‌కు వెళ్లింది. ఈ క్రమంలో తల్లి తనకు సెల్‌ఫోన్ ఇవ్వలేదని మనస్తాపం చెందిన స్ఫూర్తి.. ఫ్యాన్‌కు ఉరేసుకుంది. జిరాక్స్ పత్రాలతో ఇంటికి వచ్చిన తల్లికి కుమార్తె ఉరి వేసుకుని ఉండడంతో భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పింది. వెంటనే ఇంటికి వచ్చిన అతను కుమార్తెను కిందకు దింపి కౌటాల పీహెచ్‌సీకి తరలించాడు. వైద్యులు పరీక్షించి సిర్పూర్(టీ) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికి బాలికను తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో స్ఫూర్తి మృతదేహాన్ని ఎస్సై మధుకర్ పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి సదానందం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ప్రభుత్వ హామీని స్వాగతిస్తున్నాం'

సాక్షి, హైదరాబాద్: కులగణన వివరాలను పునఃసమీక్షిస్తామని తమతో శనివారం సెక్రటేరియట్‌లో జరిగిన ప్రభుత్వం హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన రాష్ట్రవ్యాప్త కమిటీల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు కుల గణనలో నమోదు చేసుకోని కుటుంబాలకు ప్రత్యేక మొబైల్ యాప్, ఆన్లైన్ వెబ్ పోర్టల్‌ను లేదా గ్రామ పంచాయతీ, ఎమ్మార్వో, మీసేవ, కలెక్టర్ కార్యాలయాల్లో నమోదు చేసుకునేలా పది రోజుల గడువు ప్రకటించాలని కోరారు.

తక్షణం తునికాకు సేకరణ టెండర్లు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: గిరిజనులు, గిరిజనేతర పేదలకు ఉపాధి కల్పిస్తున్న తునికాకు సేకరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏటా జనవరి నాటికే టెండర్ల ప్రక్రియను అటవీశాఖ పూర్తి చేస్తుందని గుర్తు చేశారు. ఈ ఏడాది ఇంకా తాత్సారం చేయడంతో ఆదివాసీలు ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు.

తల్లితో సహజీవనం.. కూతుళ్లపై లైంగిక దాడి..

- ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు..

సూర్యాపేటటౌన్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఓ మహిళతో సహజీవనం చేస్తూ ఆమె కుమార్తెలపై లైంగికదాడికి ఒడిగట్టాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చర్చి కాంపౌండ్‌లో నివాసముండే జాటోతు సునీల్‌కుమార్ మామిళ్లగడ్డ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నాడు. 2018 నుంచి భార్యకు దూరంగా ఉంటూ మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. భర్త లేకపోవడంతో కూతుళ్లను చదివించుకుంటూ ఆమె సునీల్‌కుమార్‌తోనే ఉంటోంది. ఇటీవల కాలంలో సునీల్‌కుమార్ కన్ను ఆ మహిళ కూతుళ్లపై పడింది. వారిని ఎలాగైనా లొంగతీసుకోవాలని కొద్దిరోజులుగా ముగ్గురికి నిద్ర మాత్రలు ఇస్తూ ఆ ఇద్దరిపై అత్యాచారం చేశాడు. తల్లితో చెబితే చంపేస్తానని బెదిరింపులకు సైతం పాల్పడ్డాడు. కూతుళ్లకు జరిగిన విషయం తల్లికి తెలియడంతో ఆమె సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 5వ తేదీన సునీల్‌కుమార్‌పై ఫిర్యాదు చేయగా, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ వీరరాఘవులు తెలిపారు. సునీల్‌కుమార్ తనను పెళ్లి కూడా చేసుకున్నాడని, హెచ్‌ఐవీతోపాటు పలు సుఖ వ్యాధులు ఉన్నట్టు ఆ ఫిర్యాదులో పేర్కొంది. సునీల్‌కుమార్‌తోపాటు, సదరు మహిళ, ఆమె ఇద్దరు కూతుళ్లకు హెచ్ఐవీ టెస్ట్ చేయిస్తామని పట్టణ సీఐ తెలిపారు.

పాలసీ తెచ్చారు.. గైడ్‌లైన్స్ మరిచారు!

- రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పాలసీ విడుదల చేసి ఐదు నెలలు..
- చిన్న పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటన
- నేటికీ ఖరారుకాని ఎంఎస్ఎంఈ పాలసీ మార్గదర్శకాలు.. జాడలేని స్టీరింగ్ కమిటీ
- ఉత్పత్తుల కొనుగోలు విధానంపై స్పష్టత కోసం పారిశ్రామికవేత్తల ఎదురుచూపులు
- మరో ఐదు పారిశ్రామిక పాలసీలు తెచ్చే అంశంపైనా సర్కారు నుంచి అస్పష్టత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి ఊతమివ్వడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో నూతన ఎంఎస్ఎంఈ పాలసీని విడుదల చేసింది. ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఐదేళ్లలో రూ.4 వేల కోట్లు వెచ్చిస్తామని ప్రకటించింది. భూ కేటాయింపులు, ఆర్థిక వనరులు సమకూర్చడం, సులభంగా ముడి సరుకులు– కార్మికుల లభ్యత, సాంకేతిక, మార్కెటింగ్ అవకాశాల్లో పరిశ్రమలకు అండగా నిలుస్తామని పేర్కొంది. ఎంఎస్ఎంఈల ఉత్పత్తుల కొనుగోలు పాలసీ (ప్రొక్యూర్‌మెంట్ పాలసీ)ని కూడా రూపొందిస్తామని, ప్రొక్యూర్‌మెంట్ పాలసీని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్తగా 25వేలకు పైగా ఎంఎస్ఎంఈలు ఏర్పాటవుతాయని పరిశ్రమల శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది కూడా. కానీ పాలసీ విడుదలై ఐదు నెలలు గడిచినా దాని అమలుకు అవసరమైన మార్గదర్శకాలు, ప్రొక్యూర్‌మెంట్ పాలసీ విడుదల కాలేదు. దీనితో పాలసీ విడుదలైనా ఆశించిన లక్ష్యం నెరవేరే పరిస్థితి లేకుండా పోయిందని ఎంఎస్ఎంఈ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుకానున్న పరిశ్రమలు ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాలు, ప్రోత్సాహకాల కోసం ఎదురుచూస్తున్నాయని పేర్కొంటున్నాయి.

ప్రొక్యూర్‌మెంట్ పాలసీనే కీలకం..

కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈల ఉత్పత్తులను ప్రత్యేకంగా కొనుగోలు చేసేందుకు 'ప్రొక్యూర్‌మెంట్ పాలసీ'ని సిద్ధం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఎంఎస్ఎంఈ పాలసీ విడుదల చేసిన మూడు నెలల్లోపే ప్రొక్యూర్‌మెంట్ పాలసీ ప్రకటిస్తామని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), రాష్ట్ర ప్రభుత్వం సుమారు 400 రకాలైన ఉత్పత్తులను ఎంఎస్ఎంఈల నుంచి కొనుగోలు చేసేలా ఈ విధానం ఉంటుందని సూచనప్రాయంగా వెల్లడించింది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఎంఎస్ఎంఈల ఉత్పత్తుల కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తామనీ ప్రకటించింది. దీనికి సంబంధించి ముసాయిదా సిద్ధమైనా ప్రభుత్వం ఆమోదించడం లేదు. దీనితో కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ అమలు మార్గదర్శకాల విడుదలలోనూ జాప్యం జరుగుతోంది.

స్టీరింగ్ కమిటీ ఏర్పాటులోనూ ఆలస్యం

నూతన ఎంఎస్ఎంఈ పాలసీ అమలును పర్యవేక్షించేందుకు స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పరిశ్రమల శాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎంఎస్ఎంఈ విభాగం డైరెక్టర్, పరిశ్రమల ప్రతినిధులు సభ్యులుగా ఉండే స్టీరింగ్ కమిటీ... ఎంఎస్ఎంఈల ఏర్పాటును పర్యవేక్షించడంతోపాటు పాలసీ అమల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపింది. కానీ దీనికి సంబంధించి నేటికీ ఉత్తర్వులు జారీ కాలేదు. స్టీరింగ్ కమిటీకి అనుబంధంగా పరిశ్రమల శాఖ కార్యదర్శి, జాయింట్ డైరెక్టర్, ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు, నలుగురు ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులతో కూడిన 'ప్రత్యేక ఎంఎస్ఎంఈ వింగ్'ఏర్పాటు నిర్ణయం కూడా కార్యరూపం దాల్చలేదు. ఎంఎస్ఎంఈల యాజమాన్యాలు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపడం, అవసరమైన మార్గదర్శనం చేయడం కోసం ఈ వింగ్‌ను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

మరో ఐదు పాలసీలు ఎప్పుడో?

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధితోపాటు పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ఆరు నూతన పారిశ్రామిక పాలసీలను రూపొందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం ప్రకటించింది. వీటిలో ఎంఎస్ఎంఈ పాలసీని విడుదల చేయగా.. మరో ఐదు పాలసీల రూపకల్పన మందకొడిగా సాగుతోంది. ఎగుమతులు, లైఫ్‌సైన్సెస్, నూతన ఎలక్ట్రిక్ వాహనాలు, మెడికల్ టూరిజం, గ్రీన్ ఎనర్జీ అంశాలపై ఈ పాలసీలు ఉండనున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్ పాలసీల ముసాయిదా సిద్ధమైనట్లు వెల్లడించాయి.

గట్టిపోరులో గట్టెక్కారు

ఢిల్లీ ఎన్నికల్లో 24 చోట్ల మెజారిటీ 10వేల లోపే ● 'టగ్ ఆఫ్ వార్' స్థానాల్లో అత్యధికం బీజేపీకే

ఏకంగా 27 ఏళ్ల తర్వాత రాజధాని ఎన్నికల కొలనులో చీపురును నిండా ముంచేస్తూ కమల వికసించింది. అందుకోసం రెండు పార్టీల మధ్య హోరాహోరీ పోరే సాగినట్టు శనివారం వెల్లడైన అసెంబ్లీ ఫలితాల సరళిని విశ్లేషిస్తే అర్థమవుతోంది. తక్కువ మెజారిటీ నమోదైన అసెంబ్లీ స్థానాల సంఖ్య 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి బాగా పెరిగింది. ఏకంగా 24 స్థానాల్లో మెజారిటీ 10,000 లోపే నమోదైంది. 2020 ఎన్నికల్లో వీటి సంఖ్య 15 మాత్రమే! సదరు 24 స్థానాల్లో 16 బీజేపీ సొంతం కాగా ఆప్‌కు 8 మాత్రమే దక్కాయి. అంతే కాదు, 2020లో 33 స్థానాల్లో 10 వేలకు మించి మెజారిటీ రాగా ఈసారి అది 29 స్థానాలకు తగ్గింది.

13 చోట్ల 5,000 లోపే

ఈసారి 13 అసెంబ్లీ స్థానాల్లో 5,000 ఓట్ల లోపు మెజారిటీ నమోదైంది. అదే సమయంలో మరోవైపు భారీ మెజారిటీతో గెలిచిన స్థానాల సంఖ్య కూడా తగ్గింది. 2020లో 22 చోట్ల 25,000కు పైగా మెజారిటీ నమోదైతే ఈసారి అది 17 స్థానాలకు పరిమితమైంది. అతి తక్కువగా సంగం విహార్ స్థానంలో బీజేపీ నేత చందన్ కుమార్ చౌదరి కేవలం 344 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారు. త్రిలోక్‌పురిలో 392, జంగ్‌పురాలో 675 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఈ రెండు సీట్లూ బీజేపీ ఖాతాలోకే వెళ్లాయి. మాటియా మహల్‌లో మొహమ్మద్ ఇక్బాల్ (ఆప్) 42, 724 ఓట్ల మెజారిటీ సాధించారు. వేయిలోపు మెజారిటీలు 2020లో రెండే నమోదు కాగా ఈసారి మూడుకు పెరిగాయి. 5,000 లోపు మెజారిటీలు 20 20లో 7 కాగా 10కి పెరిగాయి. 5,000 నుంచి 10,000 మెజారిటీ విజయాలు 6 నుంచి 11కు పెరిగాయి.

మార్జిన్లలో కమలనాథుల హవా

అత్యధిక మెజారిటీ సాధించిన అభ్యర్థుల్లో బీజేపీ వాళ్లే ఎక్కువగా ఉన్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 10వేలకు మించి మెజారిటీతో ఆప్ ఏకంగా 51 చోట్ల విజయం సాధించగా ఈసారి ఏకంగా 14కు పరిమితమైంది. 2020లో బీజేపీ 10వేల మెజారిటీతో కేవలం 4 స్థానాలను దక్కించుకోగా ఆ సంఖ్య ఈసారి ఏకంగా 32కు పెరిగింది! 2020 ఎన్నికల్లో ఆప్ ఆరు చోట్ల 1,000–5,000 మెజారిటీ సాధిస్తే ఈసారి బీజేపీ ఆ ఫీట్ సాధించింది. ఆప్ మాత్రం 4 స్థానాలకు పరిమితమైంది. ఇక 5,000–10,000 మధ్య మెజారిటీతో ఆప్ కేవలం 4 చోట్ల గెలిస్తే బీజేపీ 7 చోట్ల గెలిచింది. ఆప్ 2020లో ఏకంగా 30 చోట్ల 10,000–25 వేల మధ్య మెజారిటీ సాధించగా ఈసారి కేవలం 3 చోట్ల మాత్రమే ఆ ఘనత సాధించగలిగింది. 2020లో కేవలం 9 చోట్ల 10,000–25 వేల మధ్య మెజారిటీ సాధించిన బీజేపీ ఈసారి ఏకంగా 20 చోట్ల ఆ ఘనత సాధించింది. ఆప్ 2020లో ఏకంగా 21 స్థానాల్లో పాతిక వేల పైగా మెజారిటీ సాధించిన ఆప్ ఈసారి కేవలం 5 నియోజకవర్గాల్లోనే ఆ ఫీట్ సాధించింది. 2020లో కేవలం 5 చోట్ల పాతిక వేల పై చిలుకు మెజారిటీతో నెగ్గిన బీజేపీ ఈసారి 12 చోట్ల ఆ ఘనత సాధించింది.



అన్ని వర్గాల్లోనూ ఆప్ డీలా...

అన్ని వర్గాల ప్రజల్లోనూ ఆప్‌తో పోలిస్తే బీజేపీకే ఆదరణ కనిపించడం మరో విశేషం. 2020తో పోలిస్తే బీజేపీకి నిరుపేదలు 3.5 శాతం ఎక్కువగా, పేదలు 10.1 శాతం, మధ్య తరగతి 7.3 శాతం, సంపన్నులు 9.3 శాతం ఎక్కువగా బీజేపీకే ఓటేశారు. ఆప్‌కు అన్ని వర్గాల్లోనూ ఓట్లు తగ్గాయి. 2020తో పోలిస్తే నిరుపేదలు 8.2 శాతం తక్కువగా, పేదలు 11.1 శాతం, మధ్య తరగతి 6.6 శాతం, సంపన్నులు ఏకంగా 12 శాతం తక్కువగా ఓటేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏ పార్టీకి ఎన్ని స్థానాలు?

మెజారిటీ	బీజేపీ	ఆప్
1,000 లోపు	3	0
1,000-5,000	6	4
5,000-10 వేలు	7	4
10 వేలు-25 వేలు	20	9
25 వేలకు పైగా	12	5

గత రెండు ఎన్నికల్లో మెజారిటీ మార్జిన్లు

(మొత్తం అసెంబ్లీ స్థానాలు 70)

మెజారిటీ	2025	2020
1,000 లోపు	3	2
1,000-5,000	10	7
5,000-10 వేలు	11	6
10 వేలు-25 వేలు	29	33
25 వేలకు పైగా	17	22

ముస్లిముల్లోనూ బీజేపీకే ఆదరణ

ఈసారి ముస్లింలు ఆప్ కంటే బీజేపీని ఎక్కువగా ఆదరించడం విశేషం. చూస్తే 25 శాతానికి పైగా ముస్లిం జనాభా ఉన్న అసెంబ్లీ స్థానాల్లో బీజేపీకి 32.9 శాతం ఓట్లు పడ్డాయి. 2020 ఎన్నికలతో పోలిస్తే ఇది 1.3 శాతం ఎక్కువ. వారి జనాభా 10 నుంచి 25 % ఉన్నచోట్ల 44.7% ఓట్లు పడటం విశేషం. ఇది 2020 కంటే ఏకంగా 8.1 శాతం ఎక్కువ. ముస్లింలు 10 శాతం లోపున్న నియోజకవర్గాల్లో 49.7 శాతం ఓట్లొచ్చాయి. ఇది గతం కంటే 8.5 శాతం ఎక్కువ. ఆప్‌కు వస్తే ముస్లింలు 25 శాతానికి పైగా ఉన్న స్థానాల్లో 12.3 శాతం తక్కువగా 49.5 శాతం ఓట్లు పడ్డాయి. 10 నుంచి 25% ముస్లిం జనాభా ఉన్న చోట్ల కూడా గతంతో పోలిస్తే 7.5 శాతం తగ్గి 45 శాతం పడ్డాయి. వారు 10 శాతం లోపున్న చోట్ల మాత్రం ఏకంగా 10.3 శాతం తగ్గి 42.4 శాతం పడ్డాయి.

ఇక ట్రిపుల్ ఇంజన్!

ఢిల్లీ మేయర్ పదవిపై బీజేపీ గురి ● త్వరలో అవిశ్వాసం?

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చరిత్రాత్మక విజయం సొంతం చేసుకుంది. 27 ఏళ్ల తర్వాత అధికార పీఠం దక్కించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ సహా కేంద్ర మంత్రులు, బీజేపీ పెద్దలు చెప్పినట్లుగానే డబుల్ ఇంజన్ ప్రభుత్వం కొలువుదీరబోతోంది. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంటే అభివృద్ధి వేగవంతమవుతుందంటూ వారు చేసిన ప్రచారం ప్రజలపై బాగానే ప్రభావం చూపింది. దాంతో ఇప్పుడిక ఢిల్లీలో ఏకంగా ట్రిపుల్ ఇంజన్‌పై బీజేపీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అత్యంత కీలకమైన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మేయర్ ఎన్నిక రెండు నెలల్లో జరగనుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ నెగ్గితే దేశ రాజధానిలో ట్రిపుల్ ఇంజన్ ప్రభుత్వం కొలువుదీరినట్లే. కేంద్రంలో, రాష్ట్రంలో, కార్పొరేషన్‌లో బీజేపీ ఆధిపత్యం సుస్థిరమవుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో ఉత్సాహంగా ఉన్న బీజేపీ నాయకత్వం ఇక ఎంసీడీ మేయర్ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహ రచన చేస్తోంది.



పుంజుకున్న కమలం

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో 250 కౌన్సిలర్ స్థానాలున్నాయి. వీరిని ప్రజలు నేరుగా ఓట్లేసి ఎన్నుకుంటారు. ఢిల్లీలోని ఏడుగురు లోక్‌సభ ఎంపీలు, ముగ్గురు రాజ్యసభ ఎంపీలు, ఎంసీడీ పరిధిలోని 14 మంది ఎమ్మెల్యేలకు కూడా మేయర్ ఎన్నికల్లో ఓటు హక్కుంది. ఎంసీడీలో బీజేపీకి ప్రస్తుతం 120 మంది, ఆప్‌కు 122 మంది కౌన్సిలర్లున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 8 మంది బీజేపీ కౌన్సిలర్లు, ముగ్గురు ఆప్ కౌన్సిలర్లు ఎమ్మెల్యేలుగా నెగ్గారు. బీజేపీ కౌన్సిలర్ కమల్జీత్ షెరావత్ గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో వెస్ట్ ఢిల్లీ నుంచి ఎంపీగా గెలిచారు. అలా ఎంసీడీలో 12 కౌన్సిలర్ స్థానాలు ఖాళీ అయ్యాయి. వాటికి ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎంసీడీలో తాజాగా బీజేపీ బలం 112, ఆప్ బలం 119గా ఉన్నాయి. 2024 నవంబర్‌లో మేయర్ ఎన్నిక జరిగింది. ఆప్ అభ్యర్థి మహేశ్ కిచీ మేయర్‌గా ఎన్నికయ్యారు. పోలైన 263 ఓట్లలో కిచీకి 133, బీజేపీ అభ్యర్థి కిషన్ లాల్‌కు 130 ఓట్లు లభించాయి. అయితే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎంసీడీలో బీజేపీ బలం పెరిగింది. మేయర్ ఎన్నికల్లో ఓటు హక్కున్న 14 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు బీజేపీకి చెందినవారే. మేయర్ పదవిని సులభంగా దక్కించుకోగలదు. కనుక రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరగానే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి గద్దె దించాలని పార్టీ అధిష్టానం నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. తర్వాత మేయర్ పదవిని సొంతం చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

మేళా కిటకిట

● ఆదివారం 1.42 కోట్ల మంది
● ఇప్పటికి 42 కోట్లు దాటిన భక్తులు

ప్రయాగ్‌రాజ్ (యూపీ): మహా కుంభమేళాకు వేదికైన ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కనీవినీ ఎరగనంతగా వచ్చి పడుతున్న జనసందోహంతో కిటకిటలాడుతోంది. దాంతో కొద్ది రోజులుగా నగరానికి నాలుగు వైపులా ఎటు చూసినా పదుల కొద్దీ కిలోమీటర్ల ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. జనం తాకిడిని తట్టుకోలేక ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్‌ను ఇప్పటికే మూసేశారు. ప్రయాగ్‌రాజ్, లక్నో మధ్య 30 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి! వాహనదారులు గంటలపాటు పడిగాపులు కాస్తున్నారు. షాహీ స్నానాల వంటి విశేషమైన ప్రత్యేకత ఏదీ లేకున్నా ఆదివారం భక్తులు త్రివేణి సంగమానికి పోటెత్తారు. సాయంత్రం 6 గంటలకే 1.42 కోట్ల మందికి పైగా పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో కుంభమేళాలో ఇప్పటిదాకా పుణ్య స్నానాలు ఆచరించిన వారి సంఖ్య 42 కోట్లు దాటినట్టు అధికార యంత్రాంగం తెలిపింది. ఇంతటి రద్దీని ఇప్పటిదాకా ఏ కుంభ మేళాలోనూ చూడలేదని అధికారులే విస్తుపోతున్నారు. ''షాహీ స్నాన్, పర్వదినాలు మినహాయిస్తే ఇతర రోజుల్లో భక్తుల రద్దీ తక్కువగానే ఉండేది. ఈసారి సాధారణ రోజుల్లోనూ విపరీతంగా వస్తున్నారు'' అని చెబుతున్నారు. రద్దీని తట్టుకునేందుకు ప్రయాగ్‌రాజ్ స్టేషన్‌లో సింగిల్ డైరెక్షన్ ట్రాఫిక్ సిస్టమ్‌ను అమల్లోకి తెచ్చారు.


ప్రయాగ్‌రాజ్ జంక్షన్ ఫ్లై ఓవర్‌పై ఒక రోజుకు పైగా కొనసాగుతున్న జామ్

ఆ కారిడార్ నుంచి వెనక్కు

గాజాలో అమలవుతున్న కాల్పుల విరమణ

టెల్ అవీవ్: హమాస్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో భాగంగా గాజాలోని కీలకమైన నెట్‌జరిమ్ కారిడార్ నుంచి తమ బలగాలను ఉపసంహరించుకున్నట్లు ఇజ్రాయెల్ ఆదివారం ప్రకటించింది. ఉత్తర, దక్షిణ గాజా ప్రాంతాలను నెట్‌జరిమ్ కారిడార్ విడదీస్తుంది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య పోరాటం, ఆంక్షల కారణంగా లక్షలాదిమంది పాలస్తీనియన్లు దక్షిణ భాగంలో చిక్కుకుపోయారు. ఒప్పందంలో భాగంగా వీరిని నెట్‌జరిమ్ మీదుగా తిరిగి ఉత్తర గాజాలోకి వెళ్లేందుకు ఇజ్రాయెల్ అనుమతిస్తుంది. ఇందులో భాగంగానే బలగాల ఉపసంహరణ అమలైంది. అయితే, ఆదివారం ఎన్ని బలగాలు వెనక్కి వెళ్లిపోయిందీ ఇజ్రాయెల్ వెల్లడించలేదు. మొత్తం 42 రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందం అమలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు సగం రోజులు గడిచాయి. ఒప్పందం ప్రకారం..22వ రోజైన ఆదివారం గాజాలో జనసమ్మర్దం ఉండే ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ బలగాల ఉపసంహరణ పూర్తి కావాలి. గాజాలోని దక్షిణ ప్రాంతం నుంచి ఉత్తరం వైపు వెళ్లే పాలస్తీనియన్లను ఎలాంటి తనిఖీలు జరపకుండా ఇజ్రాయెల్ బలగాలు అనుమతించాల్సి ఉంటుంది. మొదటి విడతలో హమాస్ తమ వద్ద ఉన్న 33 మంది ఇజ్రాయెలీలను విడతల వారీగా విడిచిపెట్టాల్సి ఉంది.

ఒప్పందం పొడిగింపు ప్రశ్నార్థకమే

కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు ఇరుపక్షాలు మరోసారి చర్చలు ప్రారంభించాల్సి ఉంది. పొడిగింపుపై ఏకాభిప్రాయం కుదిరిన పక్షంలో హమాస్ వద్ద బందీలుగా ఉన్న మొత్తం ఇజ్రాయెలీలకు, ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న వందలాది మంది పాలస్తీనియన్లకు స్వేచ్ఛ లభించనుంది. మళ్లీ చర్చలపై ఇరుపక్షాలు ఆసక్తి కనబరచక పోవడంతో కాల్పుల విరమణ పొడిగింపు అంశం ప్రశ్నార్థకంగా మారింది. కాల్పుల విరమణ ఒప్పందానికి ఖతార్ కీలక మధ్యవర్తిగా ఉంది. ఈ దఫా చర్చలకు తక్కువ స్థాయి అధికారులను ఖతార్‌కు పంపనున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అంటున్నారు. ఈ నేపథ్యంలో కాల్పుల విరమణను పొడిగించే అవకాశాలపై ఆశలు వదులుకోవాల్సిందేనంటున్నారు పరిశీలకులు. ఈ వారంలో నెతన్యాహూ మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి, ఒప్పందంపై చర్చిస్తారని భావిస్తున్నారు. అయితే, ఈ సమావేశం ఎప్పుడు జరగనుందనే విషయంలో స్పష్టత రాలేదు. 2023 అక్టోబర్ 7న హమాస్ మెరుపుదాడులు జరిపి 250 మంది ఇజ్రాయెలీలను బందీలుగా పట్టుకుపోవడంతో ఇరుపక్షాల మధ్య యుద్ధం మొదలుకావడం తెలిసిందే.

ఢిల్లీ సీఎంపై జోరుగా కసరత్తు

అమిత్ షాతో నడ్డా భేటీ
● రేసులో ముందంజలో పర్వేశ్
● తెరపైకి మరికొందరి పేర్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ దంగల్‌లో ఆప్‌ను చిత్తు చేసిన బీజేపీ నూతన ముఖ్యమంత్రి ఎంపికపై కసరత్తు ముమ్మరం చేసింది. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. కొత్త సీఎం ఎంపికపై వారిద్దరూ చర్చించారు. ముఖ్యమంత్రి రేసులో పర్వేశ్ వర్మ ముందంజలో ఉన్నట్టు తెలుస్తోంది. సతీశ్ ఉపాధ్యాయ, విజేందర్ గుప్తా, ఆశిష్ సూద్, పవన్ శర్మతో పాటు పార్టీ ఎంపీ మనోజ్ తివారీ పేరు కూడా చక్కర్లు కొడుతోంది. జాట్ నేత అయిన పర్వేశ్ ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించి సంచలనం సృష్టించడం తెలిసిందే. ఆయనే సీఎం అవుతారని ప్రచారం జరుగుతున్నా రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా మాదిరిగా కమలనాథులు అనూహ్య నిర్ణయం తీసుకున్నా ఆశ్చర్యం లేదంటున్నారు. పూర్వాంచల్ నేపథ్యమున్న నేతను, లేదా మహిళను, లేదంటే సిక్కు వర్గం నాయకుడిని సీఎం ఎలా చేస్తే ఎలా ఉంటుందన్న దానిపైనా బీజేపీ పెద్దలు సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, భవిష్యత్తు అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో పెద్దగా పేరు ప్రఖ్యాతుల్లేని నేతలను ముఖ్యమంత్రులుగా బీజేపీ నియమించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీలో ఏం చేస్తారన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. కొత్త సీఎం ఎంపికపై తుది నిర్ణయం అధిష్టానానిదేనని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా పునరుద్ఘాటించారు. తమ కొత్త ఎమ్మెల్యేలందరికీ సీఎంగా రాణించగల సత్తా ఉందన్నారు.

అతిశీ రాజీనామా

ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ రాజీనామా చేశారు. ఆదివారం లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనాకు రాజీనామా లేఖ సమర్పించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరేదాకా కొనసాగాలని ఆయన కోరారు. మరోవైపు ఫలితాల నేపథ్యంలో ఢిల్లీ అసెంబ్లీని ఎల్జీ రద్దు చేశారు. ఈ నిర్ణయం శనివారం నుంచే అమల్లోకి వచ్చింది. అతిశీ గతేడాది సెప్టెంబర్‌లో అరవింద్ కేజ్రీవాల్ రాజీనామాతో సీఎంగా అతిశీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం తెలిసిందే. తాజా ఫలితాల్లో కేజ్రీవాల్ ఓడినా ఆమె మాత్రం నెగ్గారు.

పథకాలను బీజేపీ ఆపకుండా చూస్తాం: ఆప్

22 మంది ఆప్ కొత్త ఎమ్మెల్యేలతో పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం సమావేశమయ్యారు. ప్రజల కోసం పనిచేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని వారిని కోరారు. తమ పార్టీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని అనంతరం ఆతిశీ మీడియాకు చెప్పారు. ''మార్చి 8 నుంచి మహిళలకు బీజేపీ నెలకు రూ.2,500 కచ్చితంగా ఇవ్వాలి. ప్రజలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇతర సౌకర్యాలు కల్పించాలి. పదేళ్లుగా ఆప్ అమలు చేసిన ఉచిత సేవలు, పథకాలను నిలిపేయకుండా మేం చూస్తాం'' అన్నారు.


ఆదివారం తన నివాసంలో అభిమానులు ఇచ్చిన త్రిశూలంతో పర్వేశ్

మోదీ అమెరికా నుంచి తిరిగి వచ్చాకే!

ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్, అమెరికా దేశాల్లో పర్యటించనున్నారు. 13వ తేదీన ఆయన తిరిగొస్తారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారం ఆ తర్వాతే జరిగే అవకాశముందని బీజేపీ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. సీఎం ఎంపిక కూడా మోదీ వచ్చాకే జరగవచ్చని తెలిపాయి.

'అరుదుగా మాత్రమే దర్యాప్తు బదిలీ'

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల దర్యాప్తును ఎంతో అరుదైన, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఒక విభాగం నుంచి వేరే విభాగానికి బదిలీ చేయాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర యంత్రాంగంలోని ఉన్నత స్థాయి అధికారులతో సంబంధమున్నప్పుడు మాత్రమే ఇలాంటివి అవసరమని పేర్కొంది. అదే సమయంలో, దీనివల్ల పోలీసుల నైతికత స్థైర్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతినకుండా చూడాలంది. దర్యాప్తు బాధ్యతలను వేరే విభాగానికి అప్పగించడానికి కేవలం ఆరోపణలు సరిపోవని, అందుకు తగ్గ ఆధారాలు కూడా తెలిపింది. ఓ చీటింగ్ కేసును ఢిల్లీ పోలీసు శాఖలోని ఆర్థిక నేరాల విభాగం దర్యాప్తు చేస్తోంది. కేసును సీబీఐకి లేదా సిట్‌కు బదిలీ చేయాలంటూ నిందితులు పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సుబ్రమణియమ్ ప్రసాద్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పోలీసుల దర్యాప్తుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారి పిటిషన్‌ను కొట్టివేశారు.

మెక్సికో ప్రమాదంలో 41 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దక్షిణ ప్రాంతంలోని టబాస్కోలో శనివారం తెల్లవారుజామున బస్సు ట్రక్కును ఢీకొనడంతో 41 మంది మృతి చెందారు. మరణించిన వారిలో 38 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. బస్సు 48 మంది ప్రయాణికులతో దక్షిణ మెక్సికోలోని కాన్కున్ నుంచి టబాస్కోకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సు ట్రక్కును ఢీకొనడంతో తీవ్రమైన మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో బస్సు పూర్తిగా కాలిపోయింది. మెటల్ ఫ్రేమ్ మాత్రమే మిగిలిపోయింది. 41 మంది సజీవ దహనమయ్యారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో వారిని గుర్తించడం కష్టమవుతోంది. 18 మందిని మాత్రమే గుర్తించగలిగామని టబాస్కో రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

యమున రివర్‌ఫ్రంటే ప్రాథమ్యం: పర్వేశ్

న్యూఢిల్లీ: యమున రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి తమ పార్టీ అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనుందని ఢిల్లీ బీజేపీ సీనియర్ నేత పర్వేశ్ వర్మ చెప్పారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆయన ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. పర్వేశ్ వర్మ ఆదివారం దివంగత ముఖ్యమంత్రి, తన తండ్రి సాహిబ్‌సింగ్ వర్మకు నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గత ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఢిల్లీ శివారు ప్రాంతాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రహదారులు దారుణంగా ఉన్నాయని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంలో యమున నది ప్రక్షాళనకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. తన తండ్రి హయాంలో ప్రారంభమైన పూర్తి కాకుండా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తానని తెలిపారు. ఢిల్లీ ప్రజల ఆశీర్వాదం, ప్రధాని నరేంద్ర మోదీ కృషితో అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఘన విజయం దక్కిందని పేర్కొన్నారు.

ప్రెసిడెంట్ ఎలాన్ మస్క్!

● టైమ్ మేగజైన్ వ్యంగ్యాత్మక కవర్ పేజీ
● ఆ మేగజైన్ ఇంకా నడుస్తోందా?
● అంతే వ్యంగ్యంగా ట్రంప్ స్పందన

వాషింగ్టన్: చరిత్రాత్మక కవర్ పేజీలకు పెట్టింది పేరైన టైమ్ మేగజైన్ 'ప్రెసిడెంట్ ఎలాన్ మస్క్' అంటూ తాజాగా వ్యంగాత్మక కవర్ పేజీ కథనం ప్రచురించింది. అందులో టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ వైట్‌హౌస్‌లోని ఓవల్ కార్యాలయంలోని ప్రెసిడెంట్ స్థానంలో కూర్చుని కన్పిస్తున్నారు. ఎరుపు బ్యాక్‌గ్రౌండ్ ముఖచిత్రంలో చేతిలో కాఫీ కప్పు పట్టుకొని ఉన్నారు. జనవరి 20న డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఫెడరల్ ప్రభుత్వాన్ని సమూలంగా మార్చేందుకు మస్క్ ప్రయత్నిస్తుండటం తెలిసిందే. ఆ క్రమంలో ఆయనే అధ్యక్షుడిలా వ్యవహరిస్తున్నానే అర్థంలో టైమ్ ఇలా కవర్ పేజీని డిజైన్ చేసింది. అధ్యక్ష సింహాసనం వెనుక ఉన్న అసలైన శక్తి మస్కేనని పరోక్షంగా చెప్పుకొచ్చింది. కవర్ స్టోరీలోనూ ఈ అంశాన్ని గట్టిగానే ఎండగట్టింది. లక్షలాది మంది ప్రభుత్వోద్యోగులు మస్క్ దయపై ఆధారపడి బతకాల్సి వస్తోందని పేర్కొంది. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న స్పృహ ఆయనలో కన్పించడం లేదని ఆక్షేపించింది. 'డోజ్ పనితీరుపై మా పత్రిక వైట్‌హౌస్‌కు కొన్ని ప్రశ్నలు పంపింది. కానీ వాటికి బదులివ్వడానికి వైట్‌హౌస్ నిరాకరించింది'' అని కథనంలోనే పేర్కొంది. మస్క్ టైమ్ మేగజైన్‌పై కనిపించడం ఇది రెండోసారి. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆయనను 'కింగ్ మేకర్'గా అభివర్ణిస్తూ ఇటీవలే మేగజైన్ ఓ ఫీచర్ రాసింది. టైమ్ తాజా కవర్ పేజీ ఉదంతంపై ట్రంప్‌ను ప్రశ్నించగా, 'ఆ మేగజైన్ ఇంకా నడుస్తోందా? నాకు తెలియదు' అంటూ అంతే వ్యంగ్యంగా స్పందించారు.


టైమ్ మేగజైన్ తాజా కవర్ పేజీ

మణిపూర్ సీఎం బిరేన్ రాజీనామా

ఎమ్మెల్యేల్లో అసంతృప్తే కారణం!

ఇంఫాల్: మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు అందజేశారు. అంతకుముందు, ఆయన ఢిల్లీలో హోం మంత్రి అమిత్ షా, పార్టీ చీఫ్ జేపీ నడ్డాతో సమావేశమయ్యారు. ఢిల్లీ నుంచి వచ్చిన వెంటనే రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా లేఖను అందజేశారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావాల్సి ఉండగా బిరేన్ వైదొలగడం విశేషం. ఆయన ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడతామని కాంగ్రెస్ ఇటీవలే ప్రకటించింది. బిరేన్ నాయకత్వంపైనా, శాంతి భద్రతలను కాపాడటంలో విఫలమయ్యారంటూ కేంద్ర నాయకత్వంపైనా రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. బిరేన్‌ను తొలగించకుంటే మరోదారి చూసుకుంటామని కొందరు ఎమ్మెల్యేలు ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను తప్పించినట్లుగా చెబుతున్నారు. బిరేన్ కేబినెట్ రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలను రద్దు చేశారు.



అసెంబ్లీలో బలాబలాలివీ..

అసెంబ్లీలోని 60 మంది సభ్యులకు గాను అధికార కూటమికి 43 మంది సభ్యుల బలముంది. ఇందులో బీజేపీకి 37 మంది, ఎన్పీఎఫ్‌కు ఐదుగురు, జేడీయూకు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న హింసాత్మక ఘటనలను బిరేన్ సింగ్ ప్రభుత్వం నిలువరించ లేకపోతోందంటూ సంకీర్ణంలోని మేఘాలయ సీఎం కొన్రాడ్‌కు చెందిన ఎన్పీపీ, అనంతరం జేడీయూ కూడా వైదొలిగాయి. కాంగ్రెస్ సహా ప్రతిపక్షానికి అసెంబ్లీలో 16 మంది సభ్యులున్నారు. 2023 మే నుంచి రాష్ట్రంలో తెగల మధ్య జరుగుతున్న హింసాకాండలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

ఘర్షణలతో అప్రతిష్ట

రాష్ట్రంలో తెగల మధ్య ఘర్షణలకు బిరేన్ సింగే ఆజ్యం పోశారంటూ వచ్చిన ఆరోపణలకు సంబంధించిన వీడియోపై సుప్రీంకోర్టు నివేదిక కోరింది. అల్లర్ల సమయంలో ప్రభుత్వానికి చెందిన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని లూటీ చేయాలని మెయితీ వర్గం వారికి బిరేన్ చెబుతున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. ఈ మేరకు ఇటీవలే అధికారులు సీల్డు కవర్‌లో సుప్రీంకోర్టుకు నివేదిక అందించారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం ׀ 10 ׀ ఫిబ్రవరి ׀ 2025



మళ్లీ ఫీ'జులుం'..
మళ్లీ ఫీజులుం మొదలైంది. వార్షిక పరీక్షల గడువు సమీపిస్తుండటంతో పలు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. -8లో



మట్టితో మమేకం..
వ్యవసాయానికీ.. పల్లె జీవన విధానానికీ ముడిపడినదే మట్టి.. అలాంటి మట్టితో మమేకమైన జీవన విధానంపై 'నైమిసం ఎర్త్ ఫెస్టివల్' పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 33.0/20.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు ఆవరిస్తుంది. గరిష్టంగా 33, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

నడకతో ఆరోగ్య జీవనం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- నెక్లెస్ రోడ్డులో ఆర్థోపెడిక్ వాకథాన్



జెండా ఊపి ఆర్థోపెడిక్ వాకథాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్: దేహ దారుఢ్యం, ఎముకల పటుత్వం మెరుగుపర్చుకోవడానికి నడక ఉత్తమ మార్గమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం జల విహార్ వేదికగా మూనోట్ హెల్త్‌కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థోపెడిక్ వాకథాన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు.. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. వృద్ధులు బలహీనమైన ఎముకలు, కీళ్ల కారణంగా తరచుగా గాయాల పాలవుతున్నారన్నారు. పాదాలు, చీలమండలు, కీళ్ల పటుత్వం పెంచుకోవడంలో నడక దోహదపడుతుందన్నారు. ఎముకల ఆరోగ్యానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటే వృద్ధాప్యంలో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ.. ఎముకలు, కీళ్ల సమస్యలతో వృద్ధాప్యంలో బాధపడకుండా తీసుకునే జాగ్రత్తల గురించి ప్రతి పౌరుడూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రదీప్ మూనోట్ మాట్లాడుతూ గతంలో పూణే, జోధ్‌పూర్‌లలో ఆర్థోపెడిక్ వాకథాన్‌లను నిర్వహించామని తెలిపారు.

హెచ్– సిటీ పనులను వేగిరం పూర్తి చేయాలి: దాన కిషోర్

సాక్షి, సిటీబ్యూరో: నగర ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులను తీర్చేందుకు హెచ్– సిటీ కింద మంజూరైన పనులను వేగిరం పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ప్రాజెక్ట్ (హెచ్–సిటీ) కింద మంజూరైన పనులను దాన కిషోర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తితో కలిసి ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తొలుత గచ్చిబౌలి ఐఐటీ జంక్షన్‌ను సందర్శించి ఫ్లై ఓవర్ పనులపై అధికారులతో చర్చించారు. ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున పనులను ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. అనంతరం గచ్చిబౌలి స్టేడియం పక్కన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మధ్యన ప్రతిపాదించిన రోడ్డును పరిశీలించారు. విప్రో జంక్షన్ వెళ్లకుండా గోపనపల్లి నుంచి టీఎన్జీఓ కాలనీకి వెళ్లేలా ప్రతిపాదనలు చేసిన రోడ్డును పరిశీలించారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డిపో జంక్షన్, లింగంపల్లి ఆర్‌ఓబీ పనులను పరిశీలించారు. డీఎల్‌ఎఫ్ నుంచి రాడిసన్ హోటల్‌కు వచ్చే రోడ్డును, రాడిసన్ నుంచి ఏఐజీ వెళ్లే రోడ్డు ఫ్లైఓవర్‌ను ప్రపోజల్‌కు సిద్ధం చేయాలన్నారు. గచ్చిబౌలి ఓఆర్‌ఆర్ నుంచి కొత్తగూడకు వచ్చే ఫ్లైఓవర్‌ను వేగంగా పూర్తి చేయాలన్నారు. మైండ్ స్పేస్ వద్ద టీజీఐఐసీ ల్యాండ్ రోడ్డులో అభివృద్ధికి ప్రతిపాదనలు త్వరగా సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) భాస్కర్ రెడ్డి, జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ పొడిగింపునకు సీపీ నిరాకరణ



అబిడ్స్: ఈ నెల 15న ముగియనున్న ఎగ్జిబిషన్‌ను మరో రెండు రోజులు (17వ తేదీ వరకు) పొడిగించేందుకు పోలీసు శాఖ అనుమతించాలనే విన్నపాన్ని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ తిరస్కరించారు. ప్రతి సంవత్సరం జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు 46 రోజుల పాటు ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈసారి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప దినోత్సవం నేపథ్యంలో 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన శాల (నుమాయిష్) జనవరి 3న ప్రారంభం కావడంతో ఫిబ్రవరి 17 వరకు పొడిగించే అవకాశం ఉన్నట్లు అందరూ ఆశించారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి పెట్టుకున్న దరఖాస్తును పరిశీలించిన పోలీస్ శాఖ.. ప్రస్తుత పరిస్థితుల్లో బందోబస్తు కల్పించలేమని స్పష్టం చేస్తే ఈ నెల 15తోనే నుమాయిష్ ముగించాల్సిందేనని నగర పోలీస్ కమిషనర్ మెమో జారీ చేశారు. దీంతో నుమాయిష్ పొడిగింపుపై ఆశలు ఆవిరయ్యాయి. ప్రైమ్ పేరుతో ఎక్కువ ధరకు స్టాళ్లను దక్కించుకున్న యజమానుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఎగ్జిబిషన్‌ను పొడిగిస్తే సరి.. లేదంటే ప్రైమ్ రుసుము చెల్లించడం కుదరదంటూ కొందరు స్టాళ్ల నిర్వాహకులు బాహాటంగా చెబుతుండటంతో పరిస్థితులు ఎటు దారి తీస్తాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

రామానుజుల మార్గంలో నడుద్దాం

త్రిదండి చినజీయర్ స్వామి

125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నుంచి పీపుల్స్ ప్లాజా వరకు సమతా యాత్ర





సమాజానికి మన వంతు సేవలను, విజ్ఞానాన్ని, శారీరక శ్రమను అందించాలనే వాస్తవాన్ని వెయ్యేళ్ల క్రితమే సూచించిన రామానుజాచార్యుల మార్గంలో మనమంతా నడవాలని.. తోటి వారిని నడిపించాలని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. ఆదివారం శ్రీ రామానుజాచార్యుల తృతీయ బ్రహ్మోత్సవాల సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నుంచి పీపుల్స్ ప్లాజా వరకు సమతా కుంభ్– 2025 పేరిట నిర్వహించిన సమతా యాత్రలో చినజీయర్ స్వామి, అహోబిల రామానుజ జీయర్ స్వామి, దేవనాథ్ జీయర్ స్వామితో పాటు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చినజీయర్ స్వామి మాట్లాడారు. ఉగ్రవాదాలు, తీవ్రవాదాలు, మతాల పేర్లతో సమాజాన్ని విడదీసే శక్తులు కనిపిస్తున్నాయి కానీ కలిపే శక్తులు కానరావడం లేదన్నారు. అలా కలిపే శక్తులు రావాలని రామానుజాచార్యులు కోరుకున్నారని స్పష్టం చేశారు. సమతా యాత్ర ఉత్సవాలు ఈ నెల 19 వరకు కొనసాగుతాయని వికాస్ తరంగిణి అధ్యక్షుడు జగదీశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అద్దంకి దయాకర్, వికాస్ తరంగిణి పూర్వ అధ్యక్షుడు రమేష్ గుప్తా, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి జగదీశ్వర్, స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ చైర్మన్ లక్ష్మీ నర్సింహారావు, డాక్టర్ కల్యాణ్, దేవకీ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. –ఖైరతాబాద్

నాలుగేళ్లుగా.. ఏమీ లేదుగా!



చేసిన పనులూ లేవు.. చెప్పుకోవడానికేదీ లేదు!!

- కప్పగంతులతో మారిన పార్టీల బలాలు
- ఖాళీ అయిన స్థానాల భర్తీ లేదు.. కో ఆప్షన్ ఎన్నికలూ లేవు
- అవినీతి మకిలి.. అధ్వానపు పాలన
- బల్దియా పాలకమండలికి నేటితో నాలుగేళ్లు పూర్తి

సాక్షి, సిటీబ్యూరో: అయిదేళ్ల కాల పరిమితి కలిగిన జీహెచ్‌ఎంసీ పాలక మండలికి నేటితో నాలుగేళ్ల పదవీకాలం పూర్తవుతోంది. రేపట్నుంచి అయిదో (చివరి) సంవత్సరంలోకి అడుగిడనుంది. 2021 ఫిబ్రవరి 11వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన పాలకమండలికి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 10వ తేదీ వరకు గడువు ఉంది. ప్రస్తుతం 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం 150 డివిజన్లుగా ఉన్న జీహెచ్‌ఎంసీ విభజన జరిగే అవకాశాలుండటంతో ఆ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కొత్త పాలక మండలికి ఎన్నికలయ్యే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా ముందస్తుగానే పాలకమండలి ఎన్నికలు జరిగే అవకాశం దాదాపు లేదు. ఏవైనా కారణాలతో నెల, రెండు నెలల ముందుగానే ఎన్నికలు జరిగినా ఈ పాలకమండలికి మిగిలింది పది నెలల గడువే. అందుకే ఈలోగా ఇంటిని చక్కదిద్దుకునేందుకు కాబోలు.. కార్పొరేటర్లు కాలికి పని చెబుతున్నారు. తిరిగి ఓట్ల కోసం ప్రజల ముందుకు వెళ్లేందుకో, లేక పనుల టెండర్లలో వచ్చే కమీషన్ల కోసమో స్థానిక సమస్యలంటూ నిధుల కోసం కొట్లాడుతున్నారు. కార్పొరేటర్ల డివిజన్లకు నిధులివ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. మేయర్ విజయలక్ష్మి సైతం గతంలో లేని విధంగా క్షేత్రస్థాయి పర్యటనలు విస్తృతం చేశారు. హోటళ్ల తనిఖీలు వంటివి చేస్తున్నారు. కార్పొరేటర్లు సైతం తమ డివిజన్లలో పర్యటిస్తున్నారు.



కప్పదాట్లు..

పాలకమండలిలో చెప్పుకోదగిన అంశాల్లో పార్టీ మార్పిడులు ప్రముఖంగా ఉన్నాయి. పాలకమండలికి జరిగిన ఎన్నికల్లో తొలుత కేవలం రెండుస్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ బలం ఇప్పుడు 24కు చేరడం ఇందుకు దృష్టాంతం. చివరకు ఒక పార్టీ(బీఆర్‌ఎస్)లో ఉండి మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన వారు సైతం మరో పార్టీ(కాంగ్రెస్)లోకి మారడం ఇందుకు నిలువెత్తు నిదర్శనం.

కోఆప్షన్ ఎన్నిక లేదు.. వార్డు కమిటీలూ లేవు

పాలకమండలికి నాలుగేళ్లు పూర్తవుతూ.. అయిదో ఏట అడుగుపెడుతున్నా ఇప్పటి వరకు కోఆప్షన్ సభ్యుల ఎన్నిక జరగలేదు. వార్డు కమిటీలు, ఏరియా కమిటీలు కూడా ఏర్పాటు కాలేదు. ఈ ఎన్నికలేవీ జరగకుండానే నాలుగేళ్లు పూర్తి చేసిన పాలకమండలి బహుశా ఇదేనేమో. మరణించిన కార్పొరేటర్ల స్థానాల్లో.. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కార్పొరేటర్ల స్థానాల్లో వాటి భర్తీకి ఉప ఎన్నికలూ జరగలేదు. ఇలా.. రాజ్యాంగం ప్రకారం జరగాల్సిన పనుల ఊసే లేకుండాపోయింది.

స్టడీ లేని టూర్లు

సభ్యులు స్టడీ టూర్ల పేరిట వివిధ నగరాలు చుట్టి వచ్చినా అక్కడి బెస్ట్ ప్రాక్టీసెస్ ఏమిటో, వాటిల్లో వేటిని ఇక్కడ అమలు చేయవచ్చో నివేదిక ఇవ్వని పాలకమండలి కూడా ఇదే. ఇక పాలకమండలి సర్వసభ్య సమావేశాల్లోనూ ప్రతిసారీ గందరగోళాలే. ఏనాడూ సమావేశాలు సవ్యంగా సాగలేదు. ఇలా.. చెబుతూపోతే నెగెటివ్ అంశాలు తప్ప పాజిటివ్ అంశాలు కనిపించకపోవడం దురదృష్టకరం.

ప్రత్యేకంగా చేసిందేమిటి?

నాలుగేళ్లు పూర్తయినా.. ఈ పాలకమండలి హయాంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంటూ ఒక్కటి కూడా లేకపోవడమే దీని ప్రత్యేకత. పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిషేధం, కల్తీ లేని ఆహారం .. ఇలా ఏ కార్యక్రమం చూసినా అమలులో విఫలమైంది. విజయవంతం చేయలేకపోయింది. పరమ అధ్వానపు పరిపాలన కూడా ఈ పాలకమండలి హయాంలోదే కావడం గమనార్హం. బర్త్, డెత్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, ఇతరత్రా ఎన్నో అంశాల్లో అవినీతి వెల్లడైంది. వెలుగునిచ్చే వీధి దీపాల్లోనూ అవినీతి చీకట్లే నిండుకున్నాయి.

మహా ప్రణాళికకు మరో ఏడాది

2026 ఏప్రిల్ నాటికి మాస్టర్ ప్లాన్ సిద్ధం

- కన్సల్టెన్సీల ఎంపికకు హెచ్‌ఎండీఏ కసరత్తు
- మార్చిలో ఆసక్తుల వ్యక్తీకరణకు దరఖాస్తులు
- రీజినల్ రింగ్‌రోడ్డు వరకు బృహత్తర ప్రణాళిక

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ బృహత్తర ప్రణాళికను వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) లక్ష్యంగా పెట్టుకొంది. రీజినల్ రింగ్‌రోడ్డు వరకు అర్బన్ తెలంగాణ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నట్లు ప్రభుత్వం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసి రీజినల్ రింగ్ రోడ్డు వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తూ మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నారు.

కన్సల్టెన్సీల ఎంపిక...

బృహత్తర ప్రణాళికను రూపొందించేందుకు త్వరలో కన్సల్టెన్సీలను ఎంపిక చేయనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు. వచ్చే మార్చి నెలలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆసక్తుల వ్యక్తీకరణ దరఖాస్తులను (రిక్వెస్ట్ ప్రపొజల్స్)ను స్వీకరించేందుకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఎంసీహెచ్. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, సైబరాబాద్, ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీలుగా 5 మాస్టర్‌ప్లాన్‌లు ఉన్నాయి. వీటన్నింటినీ ఒకే మాస్టర్ ప్లాన్‌గా రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నివాస సముదాయాలు, రహదారులు, ప్రజా రవాణా సదుపాయాలు, నీటి వనరులు అంశాల ప్రాతిపదికన హైదరాబాద్ మహానగర విస్తరణకు అనుగుణంగా ఈ ప్రణాళిక ఉండనుంది. హెచ్‌ఎండీఏ పరిధి ఇప్పుడున్న 7,450 చదరపు కిలోమీటర్ల నుంచి సుమారు 14,000 చదరపు కిలోమీటర్ల వరకు పెరగనున్నట్లు అంచనా. రీజినల్ రింగ్ రోడ్డు వెలుపల 5 కిలోమీటర్ల వరకు అమలయ్యేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నారు. ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించి ఇచ్చేందుకు అన్ని విధాలుగా సాంకేతిక సామర్థ్యం ఉన్న సంస్థలను ఎంపిక చేయనున్నారు. 'మార్చి నెలలో దరఖాస్తులను స్వీకరించి ఒకటి, రెండు నెలల్లో కన్సల్టెన్సీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం' అని హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు చెప్పారు.



గందరగోళానికి తావు లేకుండా...

ఇప్పుడున్న అయిదు మాస్టర్‌ప్లాన్‌ల వల్ల నిర్మాణ రంగంలో గందరగోళం నెలకొంది. ఒక మాస్టర్ ప్లాన్ ఇళ్ల నిర్మాణానికి అనుమతిస్తే మరో మాస్టర్ ప్లాన్‌లో అది రోడ్డు లేదా చెరువు లేదా మరో విధంగా నిర్ధారిస్తోంది. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌ను ప్రామాణికంగా పరిగణిస్తున్నప్పటికీ సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలకు అది సరైన పరిష్కారం చూపించడం లేదు. దీంతో గూగుల్ మ్యాప్‌లు, ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. మరోవైపు చెరువులు, కుంటలు తదితర జలవనరుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను శాస్త్రీయంగా అంచనా వేయకపోవడంతోనూ చిక్కులు ఎదురవుతున్నాయి. వీటన్నింటికీ పరిష్కారంగా రాబోయే 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నారు.

కోహెడలో హైడ్రా పంజా

అక్రమ కట్టడాలను కూల్చేసిన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఆదివారం పంజా విసిరింది. అక్కడి అనేక ప్రాంతాల్లో వెలసిన అక్రమ కట్టడాలను అధికారులు కూల్చేశారు. సర్వే నంబర్ 951, 952ల్లోని గ్రామపంచాయతీ లేఔట్‌లో తమ ప్లాట్లను సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించారని, రహదారులు లేకుండా అడ్డుగోడలుగా కట్టారని రాధే ధామం లే ఔట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పలువురు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా అధికారులు పలు పత్రాలను పరిశీలించారు. 1986లో భూ యజమానులు కె.రాములు, పెద్దయ్య, ఈసయ్య గ్రామ పంచాయతీ లేఔట్ వేసినట్టు నిర్ధారించారు. సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి ఆ భూమిని స్వాధీనం చేసుకుని, ఫాం హౌస్ నిర్మించడంతో పాటు లే ఔట్‌లోని పలు ప్లాట్లను సొంతం చేసుకుంటూ అంతర్గత రహదారులను బ్లాక్ చేసినట్టు వెల్లడైంది. దీంతో అన్ని పత్రాలతో తమ కార్యాలయంలో హాజరు కావాలని ఇరుపక్షాలకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. శనివారం వారు హాజరు కాగా రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలించింది. ఫామ్‌హౌస్, షెడ్, కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవంటూ తుర్కయాంజాల్ మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. ప్లాట్లను తమకు అమ్మిన తర్వాత సమ్మిరెడ్డి ఈ భూమిని తాను కొన్నట్టు రికార్డులు సృష్టించారని ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధుల ఆరోపించారు. హైడ్రా ఇరుపక్షాలతో పాటు రెవెన్యూ, మున్సిపల్ అధికారులను విచారించి సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి నిర్మించిన ఫాంహౌస్‌తో పాటు ప్రహరీ, ఫెన్సింగ్ కూల్చివేతకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఆదివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్రమ కట్టడాలను కూల్చేశారు. ఈ సందర్భంగా సుమారు 170 ప్లాట్లకు కబ్జాదారుల నుంచి అధికారులు విముక్తి కల్పించారు. వీటిలో పార్కులు, క్రీడా స్థలాలు ఉన్నాయి.







- కంపెనీలో తనను డైరెక్టర్ చేయలేదని వెల్జన్ గ్రూప్ అధినేత జనార్దన్ రావును ఆయన మనవడు కీర్తి తేజ దారుణంగా పొడిచి చంపాడు.
- పంజగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది.
- అక్వేరియం పగులకొట్టిందనే కారణంగా తల్లిపై చేయి చేసుకున్న కుమారుడు హన్మంతు... అడ్డు వచ్చిన తండ్రిని కొట్టి చంపాడు.
- శామీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో గత నెల 15న ఈ ఉదంతం జరిగింది.
- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందని భార్య వెంకట మాధవిని చంపి ముక్కలు చేసిన గురుమూర్తి వాటిని 'మాయం' కూడా చేసేశాడు.
- మీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో గత నెల 24న ఈ ఘటన వెలుగు చూసింది.

.. ఇలా రాజధాని కేంద్రంగా జరిగిన రక్త సంబంధాల నెత్తుటి పాతాలు ఎన్నో ఉన్నాయి. డబ్బుకు, బలహీనతలకు బంధాలు, బంధుత్వాలు దాసోహం అవుతున్నాయి. ఆస్తి కోసం కొందరైతే ఎంతకైనా తెగిస్తున్నారు. సొంత వారి గొంతు కోసేందుకు వెనుకాడటం లేదు. వ్యసనాలు, జల్సాలు వంటివి ఈ పరిస్థితికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. సమాజంలో యాంటీ సోషల్ పర్సనాలిటీ డిజార్డర్ (ఏఎస్‌పీడీ) పెరగడమే దీనికి కారణమని మానసిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

'రక్త సంబంధాల'పై

నెత్తుటి మరకలు

డబ్బు కోసం సొంత వారిని సైతం చంపేస్తున్నారు

- క్షణికావేశంలోనూ ఇలాంటి అనేక దారుణాలు
- జనార్దన్‌రావు హత్యోదంతమే తాజా ఉదాహరణ
- పెరుగుతున్న ఏఎస్‌పీడీతోనే అఘాయిత్యాలు: నిపుణులు
- నగరంలో ఇటీవల నివ్వెరపరుస్తున్న ఘటనలు

నగరంలో పెరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, విలాస జీవన సంస్కృతి బంధాల మధ్య చిచ్చుపెడుతోంది. జల్సాలు తీర్చుకోవడానికి అవసరమైన డబ్బు కోసం అనేక మంది హత్యలకు తెగబడుతున్నారు. సొంత వారిపైనా కత్తి గట్టడానికీ వెనుకాడట్లేదు. కొందరు నేరుగా రెచ్చిపోతుంటే.. మరికొందరు సుపారీ ఇచ్చి మరీ హత్యలు చేయిస్తున్నారు. ఆర్థిక, ఆస్తి వివాదాల నేపథ్యంలో జరిగే హత్యలు అనేకం ఉంటున్నాయి. బాడీలీ అఫెన్స్‌గా పిలిచే హత్య కేసులకు పోలీసులు చాలా ప్రాధాన్యం ఇస్తారు. వీటి దర్యాప్తు కోసం అవసరమైతే ప్రత్యేక బృందాలనూ రంగంలోకి దింపుతారు. సాధారణంగా ఓ వ్యక్తి/వ్యక్తులు మరొకరిని చంపడానికి బలమైన కారణాలు, ఆర్థిక లావాదేవీలు ఉంటాయని భావిస్తాం. గత ఏడాది రాష్ట్రంలో నమోదైన 856 హత్య కేసుల్లో అత్యధికంగా 229 (26.75 శాతం) కేసులు కుటుంబ కలహాల వల్లే జరిగాయి. వీటిలో హతులు, హంతకులు కుటుంబీకులే ఉంటారు. ఆర్థిక కారణాల వల్ల 53, అక్రమ సంబంధాల కారణంగా 102, భూ వివాదాలతో 82, చిరు వివాదాల వల్ల మరో 82 హత్యలు జరిగాయి. వీటిలోనూ అనేక కేసుల్లో కుటుంబీకులే నిందితులుగా ఉంటున్నారు.

ఏఎస్‌పీడీ ధోరణి పెరుగుతోంది:

ప్రస్తుతం సమాజంలో అనేక అనివార్య కారణాల నేపథ్యంలో యాంటీ సోషల్ పర్సనాలిటీ డిజార్డర్ (ఏఎస్‌పీడీ) ధోరణి పెరుగుతోంది. ఇది స్వభావ సిద్ధమైన పర్సనాలిటీ. చిన్నప్పటి నుంచే వారిలో ఈ విపరీత ధోరణులు కనిపిస్తూ ఉంటాయి. సమాజం, కట్టుబాట్లు, నిబంధనలు తదితరాలు వారికి నచ్చవు. ప్రతి అంశంలోనూ వీటిని విభేదిస్తూ ఉంటారు. స్వార్థం ఎక్కువగా ఉండే విపరీతంగా ప్రవర్తించడంతో పాటు ఎదుటి వారి గురించి ఆలోచించరు. వీరికి తమ భావోద్వేగాల మీద నియంత్రణ ఉండదు. ఎక్కువగా వ్యసనాలకు బానిసలై ఉంటారు. ఈ డిజార్డర్‌లో సాఫ్ట్ ఏఎస్‌పీడీ అనేది మరోటి ఉంటుంది. వీళ్లు చూడటానికి సాధారణంగానే కనిపించినా ఆయా సందర్భాల్లో మాత్రం ఆ ధోరణి బయటపడుతుంది. ఈ ఏఎస్‌పీడీ రావడానికి జెనిటిక్స్, చుట్టుపక్కల పరిస్థితులు కారణమవుతాడు. దీంతో పాటు నిర్లక్ష్యానికి గురైన వాళ్లు, ఫిజికల్, సైకలాజికల్, ఎమోషనల్, ఫైనాన్షియల్‌గా అబ్యూజ్‌కు గురైన వాళ్లు, తల్లిదండ్రులు వేరుపడిన కుటుంబాలకు చెందిన వాళ్లు తదితరుల్లో ఈ ఏఎస్‌పీడీ ధోరణి కనిపిస్తుంటుంది. – మానసిక నిపుణుల విశ్లేషణ

మళ్లీ ఫీ'జులుం'!

వార్షిక పరీక్షల వేళ.. విద్యార్థులపై ఒత్తిడి

- టెన్త్ సబ్జెక్ట్ బోధన పేరుతో తొమ్మిదో తరగతి విద్యార్థుల నుంచి వసూళ్లు
- ఫీజు చెల్లించని విద్యార్థులను బయటే నిలబెడుతున్న యాజమాన్యాలు
- విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: మళ్లీ ఫీ'జులుం' మొదలైంది. వార్షిక పరీక్షల గడువు సమీపిస్తుండటంతో పలు ప్రైవేటు యాజమాన్యాలు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. కార్పొరేట్ రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ కాలేజీ యాజమాన్యాలు దీపావళికి ముందే విద్యార్థుల నుంచి పూర్తి ఫీజులు వసూలు చేయగా, ఈ విషయంలో తామేమీ తక్కువ తిన్నమా అన్నట్లు ప్రైవేటు/కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా తొమ్మిదో తరగతి పూర్తి చేసుకుని, వచ్చే అకాడమిక్ ఇయర్‌లో పదో తరగతిలో అడుగుపెట్టబోయే విద్యార్థుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. తొమ్మిది, పదో తరగతిలో కామన్‌గా ఉండే పలు పాఠ్యాంశాలను ముందే (ఫిబ్రవరి 15 నుంచి) బోధించాల్సిందిగా విద్యాశాఖ సూచించింది. దీన్ని పలు ప్రైవేటు యాజమాన్యాలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. ఫీజు చెల్లించిన వారికి పదో తరగతి పాఠ్యాంశాల బోధన పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ .. చెల్లించని వారిని వేరుగా చూపిస్తున్నాయి. తాజాగా హస్తినాపురం సిగ్నల్ సమీపంలోని ఓ ప్రముఖ పాఠశాల యాజమాన్యం ఇదే తరహాలో వ్యవహరిస్తున్నా.. జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బలవంతపు వసూళ్లు

జిల్లాలో 2,863 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా, వీటిలో 6.84 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1.40 లక్షల మంది చదువుతుండగా, మిగిలిన విద్యార్థులంతా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలోనే విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఆయా యాజమాన్యాలు కనీస మౌలిక సదుపాయాలు, అనుభవం ఉన్న అధ్యాపకులు లేకపోయినా ఇష్టం వచ్చినట్లు ఫీజులు నిర్ణయించి, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. అదేమంటే ఇష్టం లేకపోతే టీసీ తీసుకుని వెళ్లిపోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నాయి. ఈ అంశంపై ఎవరైనా తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఏ ఒక్క యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. విధిలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు స్థానిక నేతలను ఆశ్రయిస్తుండటం విశేషం. తాజాగా లింగోజిగూడలోని ఓ కార్పొరేట్ స్కూల్ ఇదే తరహా వసూళ్లకు పాల్పడుతుండటంతో స్థానిక కార్పొరేటర్ తన అనుచరులతో కలిసి సదరు స్కూలు ఎదుట ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే.

అప్పుడే ఇంటర్ అడ్మిషన్లు షురూ

మార్చి 5 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ప్రాక్టికల్స్ నడుస్తున్నాయి. అకాడమిక్ ఇయర్ ఇంకా పూర్తి కాలేదు. కానీ కోహెడ, హయత్‌నగర్, ఆదిబట్ల, కొంగర, రావిర్యాల, కొండాపూర్ కేంద్రంగా వెలసిన పలు కార్పొరేట్ ఇంటర్మీడియట్ కాలేజీలు అప్పుడే ఫస్టియర్ కోర్సులకు అడ్మిషన్లు చేపడుతున్నాయి. ముందస్తుగా పేరు నమోదు చేసుకుని రూ.10 వేలు అడ్వాన్స్‌గా చెల్లించిన వారికి మొత్తం ఫీజులో కొంత రాయితీ కల్పిస్తున్నాయి. కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులకు టార్గెట్లు ఇచ్చాయి. ఒక్కో అధ్యాపకుడికి వందకుపైగా అడ్మిషన్లు లక్ష్యంగా ఇచ్చినట్లు తెలిసింది. అడాకమిక్ ఇయర్ ప్రారంభ సమయంలోనే 60 శాతం ఫీజులు తీసుకుంటున్నాయి. మిగిలిన మొత్తాన్ని దసరా, దీపావళిలోపే వసూలు చేస్తున్నాయి. చెల్లించడానికి నిరాకరించిన విద్యార్థులను లోనికి అనుమతించడం లేదు. విధిలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. యాజమాన్యాలు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి కనీసం అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల వెలుగు చూస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలకు ఈ బలవంతపు ఫీజు వసూళ్లు కూడా ఓ కారణమని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	ఫస్ట్ ఇయర్	సెకండ్ ఇయర్
రంగారెడ్డి	77,863	69,348
హైదరాబాద్	88,398	1,05,920
మేడ్చల్	64,107	62,316

మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	విద్యార్థులు
రంగారెడ్డి	51,806
హైదరాబాద్	72,900
మేడ్చల్	47,257

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌పై దాడి..

బీజేపీ నేత కుమారుడు సహా మరొకరి అరెస్టు


సాయితేజ


చెల్లారావు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కొట్లాడుకుంటున్న యువకులను వారించి..ఇంత అర్ధరాత్రి ఏం చేస్తున్నారు..ఇళ్లకు వెళ్లిపోండి అంటూ హితవు పలికిన టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌ను తీవ్రంగా కొట్టి గాయపర్చిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే..నార్త్‌జోన్ ట్రాఫిక్ కానిస్టేబుల్ టి.ఈశ్వర్‌రావు శనివారం రాత్రి 12.30 గంటల ప్రాంతంలో విధి నిర్వహణలో భాగంగా ఓ కేసు విషయమై యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ సి–బ్లాక్ నుంచి వెళ్తున్నాడు. అదే సమయంలో ఓ ఇంటి అరుగుపై ముగ్గురు యువకులు మద్యం సేవిస్తూ తమలో తామే గొడవ పడుతూ కొట్టుకుంటున్నారు. రాత్రి 12 గంటల సమయంలో వీధుల్లో తాగుతూ ఈ ఘర్షణలు ఏమిటని ఈశ్వర్‌రావు వారిని నిలదీసి ఇళ్లకు వెళ్లిపోవాలని చెప్పాడు. అందులో ఒకరు ఇంటికి వెళ్లిపోగా, మిగతా ఇద్దరు కృష్ణానగర్‌కే చెందిన బీజేపీ నేత కొడుకు కుంభాల సాయితేజ (30), జంగం చెల్లారావు (35) కానిస్టేబుల్ వెళ్తుండగా అడ్డుకుని ముఖంపై పిడిగుద్దులతో బాదారు. వారి నుంచి తప్పించుకునేందుకు కానిస్టేబుల్ ప్రయత్నించగా కిందకు నెట్టేసి తొక్కారు. ముక్కు నుంచి నోటి నుంచి రక్తం కారుతుండగా కానిస్టేబుల్ వారి నుంచి తప్పించుకునేందుకు యత్నించగా మరోసారి అడ్డుకుని కిందకు తోస్తూ ఆయన సెల్‌ఫోన్ లాక్కొన్నారు. సుమారు 20 నిమిషాల పాటు బీభత్సం సృష్టించారు. కానిస్టేబుల్ డయల్ 100కు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చేలోగానే నిందితులిద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు. బాధిత కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కుంభాల సాయితేజ, జంగం చెల్లారావులపై బీఎన్ఎస్ 126 (2), 115 (2), 292, రెడ్‌విత్ 3 (5) సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి.. పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న భర్త

- ప్యాట్నీ సెంటర్‌లోని ఓ వస్త్రదుకాణంలో ఘటన
- సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెనుముప్పు


షోరూంలోని ఘటనా స్థలం

రాంగోపాల్‌పేట్: భార్యతో గొడవ పడిన భర్త..ఆమె పనిచేసే దుకాణానికి వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దోమలగూడ తాళ్లబస్తీకి చెందిన శ్రవణ్‌కుమార్ రాణిగంజ్‌లోని బేరింగ్ షాపులో పనిచేస్తున్నాడు. ఇతనికి మౌనికతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు ఉంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఆమెపై అనుమానంతో కొట్టడం, తిట్టడం చేస్తుండటంతో ఎనిమిదేళ్లుగా ఇద్దరూ విడిగా ఉంటున్నారు. శ్రవణ్‌కుమార్ తాళ్లబస్తీలో ఉంటుండగా మౌనిక దోమలగూడలో నివసిస్తూ ప్యాట్నీ సెంటర్‌లోని కామాక్షి సిల్క్స్‌లో రెండున్నరేళ్లుగా క్యాషియర్‌గా పని చేస్తోంది. విడివిడిగా ఉంటున్నా ఇద్దరూ అప్పుడప్పుడూ మాట్లాడుకునేవారు. అలాగే కుమార్తె కూడా గత 8 నెలల నుంచి శ్రవణ్‌కుమార్ వద్దే ఉంటోంది.

పెట్రోల్ బాటిళ్లతో వచ్చి..

ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ప్యాట్నీ సెంటర్‌లోని కామాక్షి సిల్క్స్‌కు కుమార్తెతో సహా వచ్చిన శ్రవణ్‌కుమార్ భార్యతో గొడవ పడ్డాడు. షాపులో పనిచేసే సిబ్బంది అతడిని వారించి బయటకు పంపించారు. మళ్లీ 8.15 గంటలకు షాపు వద్దకు వచ్చిన శ్రవణ్‌కుమార్ తనతో పాటు వాటర్ బాటిళ్లలో పెట్రోల్ తీసుకుని వచ్చాడు. రావడం రావడమే ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని బాటిల్‌లోని పెట్రోల్‌ను కింద పోశాడు. సిబ్బంది అతడిని వారిస్తుండగానే చేతిలో ఉన్న లైటర్‌తో నిప్పంటించాడు. వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగి అతనికి అంటుకున్నాయి. అక్కడ ఉన్న కొన్ని చీరెలు, సామగ్రితో పాటు సిబ్బంది మొబైల్ ఫోన్లు కాలిపోయాయి.

50 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రికి...

సిబ్బంది వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది, మార్కెట్ పోలీసులు, షోరూం సిబ్బంది కలిసి మంటలను ఆర్పివేశారు. సకాలంలో మాల్‌లోని సిబ్బంది తమ దగ్గర ఉన్న అగ్నిమాపక పరికరాలతో మంటలను కొద్దిగా అదుపులోకి తేవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. శ్రవణ్‌కుమార్ 50శాతంకు పైగా కాలిన గాయాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహంకాళి ఏసీపీ సర్దార్‌సింగ్, మార్కెట్ ఎస్ఐ శ్రీవర్ధన్ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

భర్త మృతి..బంధువులకు చెప్పని భార్య

సైదాబాద్: భర్త మృతి చెందిన విషయం బంధువులకు ఎవరికీ చెప్పకుండా భార్య దహన సంస్కారాలకు స్వగ్రామానికి తీసుకెళ్లింది. ఆరోగ్యంగా ఉన్న సోదరుడు హఠాత్తుగా మరణించడం, మరదలు తమకి చెప్పక పోవటంతో సోదరుడి మరణంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి సోదరి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి... జనగాం జిల్లా దేవరుప్పల గ్రామానికి చెందిన కాసాని నారాయణ (42) నగరానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ సైదాబాద్ భానునగర్‌లో భార్య, పిల్లలతో కలిసి ఉంటున్నాడు. అయితే శుక్రవారం మధ్యాహ్నం నారాయణ చనిపోయాడని నిజామాబాద్ జిల్లా ఖానాపురంలోని అతని సోదరి బుచ్చమ్మకు బంధువుల నుండి సమాచారం అందింది. వెంటనే ఆమె హైదరాబాద్‌లోనే నివసించే వారి మరో సోదరి లక్ష్మికి ఫోన్ చేయగా ముందు రోజు కూడా నారాయణ ఆరోగ్యంగానే ఉన్నాడని, అతని మృతి విషయం తమకు కూడా ఎవరూ సమాచారం ఇవ్వలేదని చెప్పింది. మృతుడు నారాయణ భార్య అతని తరపు బంధువులు ఎవరికీ చెప్పకుండానే దహన సంస్కారాల కోసం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించినట్లు బుచ్చమ్మ తెలుసుకుంది. దాంతో సోదరుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గురుమూర్తి తల్లి, సోదరి, సోదరుడిపై కేసు నమోదు

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన పరిధిలో మాజీ సైనిక ఉద్యోగి గురుమూర్తి తన భార్యను హత్య చేసిన కేసులో పోలీసులు అతడి తల్లి, సోదరి, తమ్ముడిపై కూడా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే గురుమూర్తి ఏ1గా ఉండగా, తాజాగా పోలీసులు ఏ2గా సోదరి ఎస్కల సుజాత, ఏ3గా తల్లి సుబ్బలక్ష్మమ్మ, ఏ4గా సోదరుడు పుట్టా కిరణ్‌ను చేర్చారు. హత్య కేసులో వీరి ముగ్గురికి ఎలాంటి ప్రమేయం లేదని.. అయితే కొంత కాలంగా మృతురాలు వెంకట మాధవిని అదనపు కట్నం విషయంలో భర్తతో పాటు వీరు ముగ్గురు మానసికంగా వేధింపులకు గురిచేశారని. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేధింపుల కింద కేసులు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

పార్కు స్థలంపై ఇరువర్గాల ఘర్షణ

మీర్‌పేట: పార్కు స్థలం విషయమై జరిగిన గొడవలో మీర్‌పేట పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. జిల్లెలగూడ శక్తినగర్ కాలనీలోని 350 గజాల పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం యజమానిని అడ్డుకున్నారు. దీంతో కాలనీ ప్రతినిధులు, యజమాని అనుచరుల మధ్య తోపులాట జరిగి గొడవకు దారితీసింది. ఈ మేరకు ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒక రు ఫిర్యాదులు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

డంపింగ్ యార్డ్‌లో అగ్ని ప్రమాదం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల డంపింగ్ యార్డ్ (డీఆర్‌సీ సెంటర్)లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు యార్డ్‌లోని చెత్తకు నిప్పు అంటించడంతో మంటల పెద్ద ఎత్తున చెలరేగాయి. గమనించిన మున్సిపల్ సిబ్బంది ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చారు.





సీజే లెవన్‌దే విజయం...

సాక్షి, హైదరాబాద్: ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (ప్రెసిడెంట్ లెవన్) జట్టుపై న్యాయమూర్తుల (ప్రధాన న్యాయమూర్తి లెవన్) జట్టు 93 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీజే లెవన్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 167 పరుగులు చేసింది. చేజింగ్‌లో బరిలోకి దిగిన ప్రెసిడెంట్ లెవన్ జట్టు కేవలం 74 పరుగులకే ఆలౌట్ అయ్యింది. జస్టిస్ నర్సింగ్‌రావు నందికొండ, జస్టిస్ మధుసూదన్‌రావు బౌలింగ్, బ్యాటింగ్‌లో ప్రతిభ కనబర్చగా, జస్టిస్ సురేందర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ ఎస్‌వీ శ్రావణ్‌కుమార్, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి, జస్టిస్ శ్రీనివాస్‌రావు, హెచ్‌సీఏ అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి, కార్యదర్శులు శాంతిభూషణ్, సంజీవ్‌రెడ్డి, అదనపు కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు లారీ బీభత్సం


అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్


లారీ ఢీకొట్టడంతో ఒంగిన విద్యుత్ స్తంభం, తెగిపడ్డ విద్యుత్ వైర్లు

- విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో ధ్వంసం..
- లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎంఐఎం ఎమ్మెల్సీ
- లారీని, డ్రైవర్‌ను వదిలేయాలని పోలీసులతో వాగ్వాదం
- విద్యుత్ అధికారి వివరణతో వదిలేసిన పోలీసులు

అబిడ్స్: ధూల్‌పేట జుమ్మేరాత్‌బజార్‌లో శనివారం అర్ధరాత్రి వేళ ఓ ట్రాన్స్‌పోర్ట్ లారీ అదుపు తప్పి రెండు విద్యుత్ స్తంభాలను ఢీ కొట్టింది. విద్యుత్ స్తంభాలు ఒరగడంతో పాటు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అక్కడే ఉన్న ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు, హమాలీలు, స్థానిక ప్రజలు ఈ ఘటనతో బెంబేలెత్తిపోయారు. విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టిన లారీని, లారీ డ్రైవర్‌ను షాహినాయత్‌గంజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యుత్ వైర్లు క్షణాల్లో కిందపడినప్పటికీ అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మజ్లిస్ ఎమ్మెల్సీ

లారీని, లారీ డ్రైవర్‌ను ఎందుకు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారంటూ మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ పోలీసులను ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ప్రమాదం విషయం తెలిసి అర్ధరాత్రి వేళ షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు అనుచరులతో కలిసి వచ్చారు. ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు, లారీ ఓనర్ తరపున మాట్లాడారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ మాత్రం చట్టప్రకారమే లారీని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. విద్యుత్ అధికారులు ఫిర్యాదు చేయందే మీరెందుకు లారీ డ్రైవర్‌ను తీసుకువచ్చారని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తిని ధ్వంసం చేసిన లారీ డ్రైవర్, లారీని చట్ట ప్రకారమే అదుపులోకి తీసుకున్నామని పోలీసులు వివరించారు.

విద్యుత్ అధికారుల వివరణ..డ్రైవర్‌ను, లారీని వదిలేసిన పోలీసులు

అర్ధరాత్రి సమయంలో టీఎస్ఎస్‌పీడీసీఎల్ విద్యుత్ అధికారి స్టేషన్‌కు వచ్చి లారీని, లారీ డ్రైవర్‌ను వదలాలని లిఖితపూర్వకంగా పోలీసులకు వివరణ ఇచ్చారు. విద్యుత్ స్తంభాలు ఒంగి వైర్లు తెగిపోయాయని, దాని మరమ్మతులకు అవసరమైన డబ్బు లారీ యాజమాన్యం విద్యుత్ సంస్థకు చెల్లిస్తుందని ఆ అధికారి లిఖితపూర్వంగా పోలీసులకు రాసిచ్చారు. దీంతో పోలీసులు లారీని, లారీ డ్రైవర్‌ను వదిలిపెట్టారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఈ ఘటనపై విచారణ జరిపి విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అక్కా అంటూ పరిచయం చేసుకుని...

- ఆమె కూతురిపై లైంగికదాడి

బంజారాహిల్స్: అక్కా అంటూ పిలుస్తూ ఓ కుటుంబంతో పరిచయం పెంచుకున్న యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఆమె కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..మోతీనగర్‌లో నివసించే బత్తుల శివ (33) కారు డ్రైవర్‌గా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లోని ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ డైరెక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. అదే కంపెనీ బిల్డింగ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మహిళను పరిచయం చేసుకుని అక్కా అంటూ తరచూ ఇంటికి వెళ్తూ ఆమె భర్తతో కలిసి మద్యం తాగేవాడు. శనివారం రాత్రి బాధిత యువతి తండ్రి తీర్థయాత్రలకు వెళ్లగా, తల్లి అదే బిల్డింగ్ మొదటి అంతస్తులో పని కోసం వెళ్లింది. బాధితురాలి సోదరుడు కూడా అదే బిల్డింగ్‌కు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా మొదటి అంతస్తులో ఉన్నాడు. రాత్రి 8 గంటల సమయంలో బాధిత యువతి ఇంట్లో ఉండగా బత్తుల శివ వచ్చాడు. రాత్రి 11.30 గంటల వరకు ఇద్దరు మాట్లాడుకున్నాక..ఇక తాను వెళ్తానని శివ చెప్పగా యువతి బెడ్‌పై నిద్రకు ఉపక్రమించింది. అరగంట తర్వాత ఆమె మేల్కొనగా..శివ కదలికలు కనిపించడంతో ఒక్కసారిగా అరవాలని ప్రయత్నించింది. దిండుతో ఆమె నోరు నొక్కేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని, నువ్వు ప్రేమించిన యువకుడితో పెళ్లి చేస్తానని నమ్మించాడు. అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంట్లో నుంచి వెళ్లిపోగా జరిగిన ఘటనపై బాధిత యువతి తీవ్రంగా రోదిస్తూ తల్లికి విషయం చెప్పింది. ఈ మేరకు పోలీసులు బత్తుల శివపై బీఎన్ఎస్ సెక్షన్ 64 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్ లిఫ్ట్ గుంతలో పడి వాచ్‌మెన్ మృతి

నాగోలు: అపార్ట్‌మెంట్ లిఫ్ట్ గుంతలో పడి వాచ్‌మెన్ మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ వారాసిగూడ చెందిన ఎన్.శ్రీనివాస్ (50) చింతలకుంట సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వివేరా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం డ్యూటీకి వచ్చిన శ్రీనివాస్‌కు లిఫ్ట్ లాక్ ఓపెన్ చేయాలని అపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ చెప్పాడు. దీంతో శ్రీనివాస్ లిఫ్ట్ ఓపెన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు లిఫ్ట్ డోర్ ఓపెన్ అయి నాలుగో ఫ్లోర్ నుంచి కింద ఉన్న గుంతలో పడి మృతి చెందాడు. కానీ ఈ విషయాన్ని అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న వారు, సెక్యూరిటీ సిబ్బంది సైతం బయటకు వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. ఏమీ తెలియనట్లుగా శ్రీనివాస్ కనిపించడం లేదని ఎల్‌బీనగర్ పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిన పోలీసులు అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా శ్రీనివాస్ లిఫ్ట్ గుంతలో పడిపోయినట్లు గుర్తించి..బయటకు తీశారు. అతను అప్పటికే మృతి చెందాడు. దీంతో శనివారం రాత్రి ఎల్‌బీనగర్ పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకులు శ్రీనివాస్ లిఫ్ట్ గుంతలో పడిన విషయం తమకు తెల్పలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చాదర్‌ఘాట్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం న్యూ మలక్‌పేటకు చెందిన మహమ్మద్ మొయిన్‌ఖాన్ (60) ఆదివారం తెల్లవారుజామున చాదర్‌ఘాట్ చమన్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా..వెనుక నుండి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో...

ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సయ్యద్(45) మలక్‌పేట మార్కెట్ మెయిన్ గేట్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE
- Nagole House for Sale G+1 = 2BHK + 3BHK Car Parking 167yards West Face 30 Feet Road Ph: 9885202404 [SCA25001592]

LAND FOR SALE
- Rs.6300 గజం 200+200 total 400 గజాల ప్లాటు అమ్మబడును @ మన్సాన్‌పల్లి క్రాస్ రోడ్, ఇండ్లకు దగ్గర DTCP ఫైనల్ అప్రూవల్. Ph: 9966521191 [SCA25001560]

PLOT FOR SALE
- బంపర్ ఆఫర్ కేవలం రూ. 6 లక్షలకే 120గ. గేటెడ్ కమ్యూనిటీలో హౌసింగ్ ప్లాట్లు HMDA పరిధిలో కలవు. రిజిస్ట్రేషన్ ఫ్రీ. 6309771255 / 7799717179 [SCA25001562]

Services

BUSINESS SERVICE
- మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 9160077916 స్పాట్ క్యాష్. [SCA25001608]

- మీ బంగారం మణప్పురం ముత్తూట్ మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001519]

PERSONAL CARE

OLD AGE HOME
- వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానసున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783367]

Wanted
- త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. Ph:8520980099, 8520874499 [SCA25001603]
- MG కార్ షోరూం శంషాబాద్‌లో పని చేయుటకు సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, సర్వీస్ సూపర్ వైజర్, మెకానిక్స్ కావలెను. సెల్: 9492628629, 9491402020. [J-521]
- పోచమ్మెలారం ఇస్నాపూర్‌లో ప్రముఖ పెస్ట్ కంట్రోల్ సర్వీసెస్‌లో పని చేయుటకు నూతన & అనుభవం కల్గి ఉత్సాహవంతులైన యువకులు కావలెను. 9640989796 [HA-99783]
- శ్రీలక్ష్మి హోంకేర్ HYD నందు వృద్ధులకు పేషంట్లకు సేవ చేయుటకు బేబీకేర్/ ఇంటి వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం:-18-24 వేలు. రూం+ మీల్స్ ఫ్రీ . 9347148051 [G-1933]
- మియాపూర్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గంటల డ్యూటీ మరియు ESI, PF. జీతం : 18 వేలు. సంప్ర॥ సెల్ : 6304719869 [SCA25001625]
- Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [SCA25001537]
- క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-1]
- Wanted any Degree holder to work in Field Investigation (FI) across AP & TS in a reputed audit firm. Interested persons (male only) send bio data mail kowthahr@gmail.com ✆ 70323 71423 / 99639 75952 [B-489]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక: జాబ్ పైన మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా వరలక్ష్మి



నియామక పత్రం అందుకుంటున్న వరలక్ష్మి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా స్వామి వివేకానందనగర్ బస్తీకి చెందిన వరలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు వరలక్ష్మికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు సునీతారావుకు, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డికి, టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడంతో పాటు పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈసారైనా స్విమ్మింగ్‌పూల్ తెరిచేనా..?



ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని స్విమ్మింగ్‌పూల్‌ను ఐదేళ్లుగా మూసి ఉంచారు. గతేడాది ఆలస్యంగా ప్రారంభించి కేవలం 20 రోజులు కొనసాగించి మూసివేశారు. యేటా మార్చి మొదటి వారంలో స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభిస్తారు. ఈసారైన సకాలంలో ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు. అయితే ప్రారంభానికి నెల రోజుల ముందు స్విమ్మింగ్‌పూల్‌ను మరమ్మతులు చేయించిన తర్వాత నీటితో నింపేందుకు 15 రోజుల పడుతుంది. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని విద్యార్థులు పేర్కొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు చేయూతనివ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్‌సీసీ విద్యార్థులకు చేయూతనివ్వాలని సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.గంగాధర్ దాతలను కోరారు. గత నెల 26న ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న ముగ్గురు ఎన్‌సీసీ విద్యార్థులు గీత, రమ, శ్రీధర్‌కు ప్రిన్సిపాల్ తనవంతుగా ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున రూ.15వేల చెక్కును అందజేశారు. విద్యార్థులకు దాతలు ఆర్థిక సాయం చేస్తే దేశానికి మరిన్ని సేవలు అందించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమాండర్ ప్రశాంత్ సూర్య వంశీ, తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ శరత్, కల్నల్ మంజిల్ శర్మ, ఎన్‌సీసీ ఆఫీసర్ డా.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ రిజిస్ట్రేషన్ సొసైటీలకు అనుమతులివ్వాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రజకుల ఉపాధి కల్పనకు ఫిషర్‌మెన్ రిజిస్ట్రేషన్ సొసైటీలకు అనుమతులు ఇవ్వాలని రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆమనగంటి సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సొసైటీల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమనగంటి సైదులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రజకులకు ఉపాధి కల్పించేందుకు జీవో నం.343 ప్రకారం గ్రామ సొసైటీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి రజకుల అభివృద్ధికి తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో రజకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రజకులకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. ఈ విషయంపై త్వరలో ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దూదిగాని చంద్రశేఖర్, చాకలి రామస్వామి, రమేష్, నర్సింహులు, నరేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ మేయర్ పీఠమే లక్ష్యంగా పనిచేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఢిల్లీ ఫలితాల స్ఫూర్తితో గ్రేటర్ పరిధిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మేయర్ పీఠమే లక్ష్యంగా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన గుండగోని భరత్‌గౌడ్ అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అందుకు నిదర్శనం భరత్‌గౌడ్ అని అన్నారు. ప్రజా సమస్యలపై నాయకులు ఉద్యమించాలని సూచించారు. అధికార పార్టీ హామీల అమలుపైన పోరాటం చేయాలన్నారు.

‘నులి’పేద్దాం..!

- నేడు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం
- 1–19 ఏళ్లలోపు వారందరికీ మాత్రల పంపిణీ
- తీసుకోనివారికి ఈనెల 17న వేసేలా చర్యలు



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: నులి పురుగులు ఉండే పిల్లలు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. అయితే వాటిని నివారించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10న (నేడు) జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1–19 ఏళ్లలోపు వారందరికీ ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని 8 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 22 బస్తీ దవాఖానాల పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆల్బెండజోల్ మాత్రలు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మాత్రలు ఎలా వేయాలో టీచర్లు చూపించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

◆ నులి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరి అయినా కొన్ని పరిస్థితుల్లో వైద్య సిబ్బంది సూచన మేరకే వేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. పలు రోగాలతో ఉన్నావారు. వేరే ఇతర మందులు వాడుతున్నా పిల్లలకు ఈ మాత్రలు ఇవ్వడంలో తగు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. పిల్లలు గ్లాస్ నీటితో పాటు నమిలి మింగాలి. ఇది తప్పనిసరిగా వైద్య సిబ్బంది సమక్షంలోనే ఈ మాత్రను వినియోగించాలి. కడుపులో నులి పురుగులు ఉన్న పిల్లల మలంతో నులి పురుగుల గుడ్లు నేలను కలుషితం చేస్తాయి. ఈ గుడ్లు లార్వాగా వృద్ధి చెందుతాయి. ఇతర పిల్లలు ఆహారం ద్వారా, మురికి చేతుల ద్వారా లార్వా చర్మంలోకి వెళ్లడం వల్ల నులి పురుగుల సంక్రమణ జరుగుతుంది. దీంతో పిల్లలు అనారోగ్యానికి గురవుతుంటారు.

ఇవీ లక్షణాలు..

◆ రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, అతిసారం, మలంలో రక్తం పడడంతో పాటు వయస్సుకు తగిన ఎదుగుదల ఉండదు. నులి పురుగుల నివారణ చేపడితే రక్తహీనత నియంత్రణ సాధ్యమవుతుంది. పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

మాత్ర తప్పనిసరిగా వేయించాలి..

అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సమన్వయంతో మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత ఆల్బెండజోల్ మాత్ర వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు సహకరించాలి. ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా నులి పురుగుల నివారణలో భాగం కావాలి. ఇప్పటికే టీచర్లకు అవగాహన కల్పించాం. ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర ఇవ్వాలి. ఈ నెల 10న వేయకపోతే 17న మరోసారి వేసేలా చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై ఇప్పటికే అన్ని పాఠశాలలకు సమాచారం ఇచ్చాం.

– పురుషోత్తం, మండల రీసోర్స్ పర్సన్, షేక్‌పేట

అసలే మలుపు..ఆపై బస్టాప్ నిర్మాణం!

కేర్ ఆస్పత్రి పక్కన నిర్మించాలని ప్రయాణికుల విజ్ఞప్తి



కేర్ ఆస్పత్రి సమీపంలోని మలుపు వద్ద బస్టాప్ నిర్మాణానికి చేపట్టిన పనులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–1లోని కేర్ ఆస్పత్రికి కొద్ది దూరంలోని మలుపు వద్ద బస్టాప్ నిర్మాణానికి సంబంధిత అధికారులు పనులు మొదలు పెట్టారు. అయితే తాజ్‌కృష్ణా వైపు నుంచి సుబ్బిరామిరెడ్డి ఇంటి మీదుగా కేర్ ఆస్పత్రికి వెళ్లేరోడ్డులో ఇరుకుగా ఉన్న మలుపు వద్దే బస్టాప్ నిర్మాణం చేపడుతుండడంతో ప్రయాణికులతో పాటు స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మలుపు వద్ద బస్సులు ఆగితే వెనుకాల వచ్చే వాహనాలన్నీ సిటీ సెంటర్ వైపు జామ్ అవుతాయని, దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాప్‌ను కేర్ ఆస్పత్రి పక్కనే ఉన్న ఎస్వీఎం గ్రాండ్ హోటల్ ఎదుట నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్టీసీ, జీహెచ్ఎంసీ అధికారులు ఇక్కడి పరిస్థితిని పరిశీలించి బస్టాప్ నిర్మించాలని వారు కోరుతున్నారు.

వడ్డెర కూలీల నివాసాలకు క్వారీ స్థలం కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేముల యాదయ్య

రహమత్‌నగర్: క్వారీ స్థలాన్ని వడ్డెర కూలీల నివాసాలకు కేటాయించాలని తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ.. క్వారీ స్థలంలో రాళ్లు కొడుతూ జీవనోపాధి పొందుతున్న వడ్డెర కూలీలకు నివాస స్థలాలు కేటాయించాలని దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్, పీజేఆర్ అప్పటి ప్రభుత్వాలకు నివేదికలు ఇచ్చారని గుర్తు చేశారు. క్వారీ స్థలం తమకు చెందేవరకు న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో తమిళులకు వసతులు కల్పిస్తాం



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో తమిళులు

అడ్డగుట్ట: మహాశివరాత్రిని పురస్కరించుకుని కీసరగుట్టలో జరిగే జాతర కోసం వారం ముందుగానే మౌలిక వసతులు కల్పించేలా అధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. హైదరాబాద్ నగర పరిధిలో నివసిస్తున్న పలువురు తమిళులు ఆదివారం తుకారాంగేట్‌లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాశివరాత్రికి వారం ముందు నుంచే తమిళులు పూజలు చేసేందుకు వెళ్తారన్నారు. ప్రభుత్వం, ఆలయ కమిటీ, అధికారులు కేవలం 2 రోజులు మాత్రమే భక్తులకు ఏర్పాటు చేస్తారని చెప్పారు. అందువల్ల తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు వారం రోజుల నుంచే కల్పించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ను కలిసి వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న బైరగోని రాజుగౌడ్

కాచిగూడ: రాష్ట్రంలో అసంఘటిత కార్మికులుగా ఉన్న డ్రైవర్లకు తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరగోని రాజుగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్ లైసెన్స్‌పై ఉన్న ప్రమాద బీమా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని అలాగే సాధారణ మరణం పొందితే కూడా వర్తింపజేయాలన్నారు. అర్హులైన ప్రతి డ్రైవర్‌కు సబ్సిడీ వాహనాలు అందించాలని, పెంచిన గ్రీన్ ట్యాక్స్, క్వార్టర్ ట్యాక్స్‌లను తగ్గించాలని, ఓలా, రాపిడో, ఉబెర్‌ను నిషేధించి ప్రభుత్వమే రవాణా యాప్‌ను రూపొందించాలన్నారు. అనంతరం తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొంతం మహేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా బి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పొడుగు శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా జి.అనిల్, డి.పవన్, కోశాధికారిగా జె.కుమార్, సలహాదారులుగా వంగ కృష్ణకర్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా నరసింహ, పి.మహేందర్, సీహెచ్ రమేశ్, ఎస్ఎం మహేశ్, వై.వీరన్నను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

23 నుంచి హనుమత్ వైభవ ఉత్సవాలు



పోస్టర్ విడుదల చేస్తున్న ధర్మకర్తలు, పూజారులు

వెంగళరావునగర్ : మధురానగర్‌కాలనీలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 23 నుంచి మాఘమాస హనుమత్ వైభవ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్తలు తోటకూర నరసింహారావు, వెంకటరమణ తెలిపారు. దేవస్థానంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. 23న ఉదయం 7 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయన్నారు. 24న ఉదయం 7 నుంచి 24 గంటల పాటు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం, 25న ఉదయం 7.30 గంటలకు విశేష పంచామృతాభిషేకం ఉంటుందని తెలిపారు. అదేరోజు ఉదయం 9 నుంచి లక్ష అరటి పండ్లతో ప్రత్యేక అర్చన రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, సాయంత్రం 6.30 తిరువీధి ఉత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్తలతో పాటు ఆలయ ప్రధాన అర్చకుడు కె.పవన కుమార ఆచార్యులు, పూజారులు వీరేశం, సత్యం స్వామి, మహేశ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పీఈటీలపై ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ సంక్షేమ గురుకుల స్కూల్స్ వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి పీఈటీల కృతజ్ఞత సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1600 పోస్టుల వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేశ్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.పర్వతాలు గౌడ్, సైదులు, వేముల రామకృష్ణ, జిల్లాపెల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్సై నాగరాజు

పంజగుట్ట: సమైక్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ సహకారంతో తుమ్మలబస్తీలోని సమైక్య భారతి భవన్ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఖైరతాబాద్ ఎస్సై నాగరాజు, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాజేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 115 మందికి సాధారణ, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కిడ్నీ, డెంటల్, థైరాయిడ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, డాక్టర్లు శ్రీహరి, సుధాకర్, అబ్దుల్ రహమాన్, సిబ్బంది సాయిలేఖ, సౌజన్య, సునీత, భార్గవి, వైష్ణవి, సునీల్ కుమార్ సమైక్య భారతి ప్రతినిధులు అబ్దుల్ సత్తార్, మున్ని, అయుబ్ ఖాన్, భరత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని పట్టించిన ఫోన్ పే



నిందితుడు పర్హాన్‌బేగ్

ఫిలింనగర్: ‘గే’ యాప్‌లో పరిచయం చేసుకుని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు దండుకుంటున్న నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు ఫోన్ పే ద్వారా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. డబీర్‌పురాలో నివసించే పర్హాన్‌బేగ్ (25) జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం జెండర్ యాప్‌లో ‘గే’లను పరిచయం చేసుకుంటూ వారిని తనవద్దకు రప్పించి వీడియోలు తీస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు దండుకుంటున్నాడు. షేక్‌పేట జైహింద్‌నగర్‌కు చెందిన ఓ యువకుడి (22)ని గత నెల జెండర్ యాప్‌లో పరిచయం చేసుకుని తన వద్దకు రప్పించుకున్నాడు. ఇంటికి వెళ్లిన సదరు యువకుడితో సన్నిహితంగా మెలుగుతూ వీడియో రికార్డ్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించి రూ.15 వేలు డిమాండ్ చేశాడు. అయితే బాధితుడు రూ.10 వేలను ఫోన్ పే ద్వారా నిందితుడికి బదిలీ చేశాడు. తాను మోసపోయానని తెలుసుకుని ఈ నెల 1న ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడి ఫోన్ పే ఆధారంగా కాల్ డేటా సేకరించి ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పర్హానబేగ్ ‘గే’ కాదని, కేవలం ‘గే’లను పరిచయం చేసుకుని బ్లాక్ మెయిల్ చేసేందుకు జెండర్ యాప్‌లో ఉన్నాడని, గతంలో కూడా ఇలాంటి బ్లాక్‌మెయిలింగ్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో ఫేర్‌వెల్ హంగామా



ప్రిన్సిపాల్ అస్మతున్నీసాతో విద్యార్థినులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునంబర్–10లోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

కారుతో డ్రైవర్ పరార్

బంజారాహిల్స్: అద్దెకు కార్లు ఇచ్చే వ్యాపారి వద్ద నమ్మకంగా పనిచేస్తూ కళ్లుగప్పి కారుతో ఉడాయించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డునంబర్–3లో నివసించే అనీష్ ఉబర్ క్యాబ్‌లు నిర్వహిస్తుంటాడు. ఆయన వద్ద కొంతకాలంగా నాగారపు వెంకటేశ్ డ్రైవర్‌గా చేరి అద్దె కార్లు తిప్పుతుండేవాడు. ఈనెల 2న తాను ఉద్యోగం మానేస్తున్నానని చెప్పి కారుతో సహా ఉడాయించాడు. కారు జీపీఎస్ ట్రాక్‌ను పరిశీలించగా ఏపీలోని ఏలూరు జిల్లా ఒంగుటూరు టోల్‌ప్లాజా వద్ద గుర్తించారు. కారుతో సహా ఉడాయించడమే కాకుండా పేమెంట్ కూడా చెల్లించలేదని, చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం దగ్ధం

రహమత్‌నగర్: క్వారీ మైదానంలో నిలిపిన ఓ టాటా ఏస్ వాహనం ఆదివారం దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానంలో (ఏపీ11వై0170) నంబర్ గల వాహనం పార్క్ చేసి ఉంది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వాహనం పక్కనే ఉన్న చిత్తు కాగితాల్లో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ తాగి పడేయడంతో మంటలు అంటుకుని పక్కనే ఉన్న వాహనానికి అంటుకుని ఇంజిన్ భాగం పూర్తిగా కాలిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పి వేశారు. బోరబండ పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొ.శంకర్‌కు సత్కారం

ఉస్మానియా యూనివర్సిటీ: నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బీటీ) ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 9 వరకు ప్రపంచ పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో ‘ది రోల్ ఆఫ్ అన్ డివైడెడ్ ఆంధ్రప్రదేశ్ ఇన్ కాన్‌స్టిట్యూట్ అసెంబ్లీ’అనే అంశంపై జరిగిన చర్చలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వర్సిటీల అధ్యాపకులు పాల్గొన్నారు. చర్చలో అత్యంత ప్రతిభ కనబరిచిన ప్రొ.శంకర్‌ను ఎన్‌బీటీ చైర్మన్ మిలింద్ మరాఠీ శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రస్తుతం ప్రొ.శంకర్ న్యూఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.



ప్రమాణ స్వీకారానికి తరలిన బీజేపీ శ్రేణులు

శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీజేపీ సీనియర్ నాయకుడు బంగారు ప్రశాంత్ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివెళ్లారు. దీపక్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నేతలు కానూరి బాలకృష్ణ, కొల్లూరు మోహన్, గడ్డం పవన్, వెంకటస్వామి, భుజేంద్ర, ప్రేమ్‌రాజ్, రవిక్రాంత్, రవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న తెలంగాణ సెంట్రల్ స్పౌజ్ ఫోరం ప్రతినిధులు

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వ తరహాలోనే కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పౌజ్ బదిలీలు చేపట్టాలని తెలంగాణ సెంట్రల్ స్పౌజ్ ఫోరం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫోరం ప్రతినిధులు కుమారస్వామి, నాందేవ్ జాదవ్, శైలజ తదితరులు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 317 వల్ల ఉద్యోగులు స్థానికతను కోల్పోయారన్నారు. ఆ జీవో కారణంగా నష్టపోయిన స్పౌజ్ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రివర్గం సబ్ కమిటీ తీసుకువచ్చిన జీవో 243తో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పౌజ్ బదిలీలు చేపట్టారన్నారు. కానీ భార్యాభర్తల్లో ఒకరు రాష్ట్ర ప్రభుత్వం, మరొకరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని పరిగణలోకి తీసుకోలేదన్నారు. దీంతో తమ పిల్లలకు దూరమై తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము తెలంగాణ ప్రాంతానికి చెందిన ఉద్యోగులమే అని, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న వారందరిని సొంత జిల్లాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నారాయణ, బి.రవీందర్, ప్రవీణ, సంధ్యా మిత్ర, లలిత, చారి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామంలో ఒడిశా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- జూబ్లీహిల్స్ రోడ్ నెం.36, సీబీఐ కాలనీలోని జయ చాంబర్‌లో ఫిఫ్టీ పర్సెంట్ ఆఫ్ పేరిట డీజే ఉమేష్ నాన్ స్టాప్ మ్యూజిక్ (నైట్ డ్యాన్స్) ప్రోగ్రామ్ రాత్రి 8 గంటల నుంచి కొనసాగుతుంది.
- హైటెక్ సిటీ సత్వ నాలెడ్జ్ సిటీ రోడ్‌లో శిల్ప గ్రామ క్రాఫ్ట్ విలేజీలోని షాట్ హైదరాబాద్‌లో ఉదయం 11 గంటలకు మైండ్ బ్లోయింగ్ గేమ్ కార్యక్రమంలో జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఆఫ్‌లైన్‌లోనే కొత్త రేషన్ దరఖాస్తులు?

ఎఫ్ఎస్‌సీ లాగిన్ పునరుద్ధరణ.. గంటల వ్యవధిలోనే నిలిపివేత

- ప్రజాపాలన దరఖాస్తుల విచారణ తర్వాతే...
- కొత్త దరఖాస్తులపై గందరగోళ పరిస్థితి

సాక్షి, సిటీ బ్యూరో: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు పరేషాన్ తప్పడం లేదు. దరఖాస్తుల ప్రక్రియ గందరగోళంగా మారింది. పేదలు అయోమయానికి గురవుతున్నారు. మళ్లీ పాత పరిస్థితి పునరావృత్తమైంది. కలెక్టరేట్ ప్రజావాణి. జీహెచ్ఎంసీ జోన్ ఆఫీసుల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం మీ సేవా ద్వారా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు అనుమతించిన ఆ శాఖ అదేరోజు రాత్రి 8.30 గంటలకు మీ–సేవ వెబ్ సైట్‌లో ఎఫ్ఎస్‌సీ లాగిన్ ఆప్షన్ సైతం ఇచ్చింది. శనివారం ఉదయం వరకు కొనసాగిన ఆప్షన్ ఆ తర్వాత నిలిచిపోయింది. అప్పటికే నిరుపేదలు కొత్త రేషన్ కార్డులను దరఖాస్తు చేసుకునేందుకు క్యూ కట్టగా ఆ ఆప్షన్‌ను తొలగించారని మీ సేవ నిర్వాహకులు చెప్పడంతో నిరాశకు గురయ్యారు.



ప్రజాపాలన దరఖాస్తుల తర్వాతనే...

ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ జరిపిన తర్వాతనే ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిర్వహించిన ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలతోపాటు కొత్త రేషన్ కార్డుల కోసం పేదలు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు కలెక్టరేట్, ప్రజాభవన్ ప్రజావాణిలో సైతం పెద్ద ఎత్తున కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే వాటిని పట్టించుకోకుండా సమగ్ర కటుంబ సర్వేలో గుర్తించిన రేషన్ కార్డులు లేని కుటుంబాలపై క్షేత్రస్థాయి విచారణ జరిపి సుమారు 30 శాతం కుటుంబాలు అనర్హులని అధికారులు తేల్చారు. వార్డు సభలను పెండింగ్‌లో పెట్టారు. ఎన్నికల కోడ్ కారణంగా లాగిన్ నిలిచిపోయిందని జరిగిన ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది.

5.73 లక్షలకుపైనే దరఖాస్తులు...

ప్రజాపాలనలో పేదకుటుంబాలు ఆరు గ్యారంటీల పథకాలతోపాటు ప్రత్యేకంగా కొత్త రేషన్ కార్డుల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలో సుమారు 5.73 లక్షల కుటుంబాల నుంచి దరఖాస్తులు వచ్చి చేరాయి. అయితే ప్రభుత్వం వాటిని పక్కకు పెట్టి ఇటీవల జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డులు లేని కుటుంబాలను గుర్తించి విచారణ జరిపింది. అయితే అది విమర్శలకు దారితీయడంతో తిరిగి ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తుల స్వీకరణకు సిద్ధమై అభాసుపాలైంది.

పది లక్షల కుటుంబాల ఎదురుచూపులు..

మహానగరంలో మరో 10 లక్షల కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయి. సుమారు కోటిన్నర జనాభా కలిగిన మహానగరంలో 40 లక్షల కుటుంబాలు ఉండగా, అందులో దారిద్ర్యరేఖకు దిగువ నున్న కుటుంబాలు 27.21 లక్షలు లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం 17.21 లక్ష కుటుంబాలు మాత్రమే తెల్ల రేషన్‌కార్డులు కలిగి ఉన్నాయి. మిగతా కుటుంబాలు రేషన్ కార్డులు లేక వివిధ సంక్షేమ పథకాల వర్తింపు కోసం తల్లడిల్లుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త దరఖాస్తుల ప్రక్రియలో గందరగోళ పరిస్థితి నెలకొంది.

చెస్ టోర్నీ విజేత భరత్ కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: చెస్ కార్నివాల్–2025 ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో పోలూరి భరత్ కుమార్‌రెడ్డి విజేతగా నిలిచాడు. కమ్యూనిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని డ్రేపర్ స్టార్టప్ హౌస్‌లో ఈ టోర్నీ జరిగింది. స్విస్ ఫార్మాట్‌లో ఆరు రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో మొత్తం 95 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నిర్ణీత ఆరు రౌండ్ల తర్వాత భరత్ కుమార్ రెడ్డి, శ్రీసాయి బస్వంత్ 5.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... భరత్ కుమార్‌రెడ్డికి టైటిల్ ఖరారైంది. శ్రీసాయి బస్వంత్ రన్నరప్‌గా నిలిచాడు. భరత్ కుమార్, బస్వంత్ ఐదు గేముల్లో ప్రత్యర్థులపై గెలిచి, ఇద్దరి మధ్య జరిగిన చివరిదైన ఆరో రౌండ్ గేమ్‌ను 'డ్రా'చేసుకున్నారు. 5 పాయింట్ల చొప్పున సాధించిన కార్యశీల్, కోగంటి అశ్లేష్, రేపల్లె అఖిల్, వైభవ్ కులకర్ణి, సిక్కం సాయివిష్ణు, మండల్ అక్షయ్ కుమార్, జె.ప్రభాత్ లక్ష్మీనారాయణ వరుసగా మూడు నుంచి తొమ్మిది స్థానాల్లో నిలిచారు. ఈ టోర్నీకి టోర్నమెంట్ డైరెక్టర్‌గా ఎం.వంశ్, చీఫ్ ఆర్బిటర్‌గా సుబ్బరాజు, ఆర్బిటర్‌గా రవిబాబు వ్యవహరించారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



నైమిసం ఎర్త్ ఫెస్టివల్‌లో నిర్వాహకులతో మంత్రి జూపల్లి కృష్ణారావు

- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

రాయదుర్గం: పర్యావరణ సవాళ్ల పరిష్కారంలో సమష్టి చర్యలే కీలకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జె.కృష్ణమూర్తి సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'నైమిసం ఎర్త్ ఫెస్టివల్–2025'లో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ప్రొఫెసర్ ఆసీమ్ శ్రీవాస్తవ, వాన్వాడి ఫారెస్ట్ కలెక్టివ్ వ్యవస్థాపకుడు భరత్‌మాన్సత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో యువతరం చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. 60కి పైగా ఎన్‌జీఓలు, విద్యాసంస్థలు, పర్యావరణ కార్యకర్తలు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు, ప్రేరణ, డాక్టర్ నందితా రే, ప్రొఫెసర్ రజత్ టాండన్, శ్యాంసుందర్ శ్రీధర్, పలువురు పర్యావరణవేత్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

'నైమిసం ఎర్త్ ఫెస్టివల్–2025'లో భాగంగా పలువురు కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా అటవీ రక్షణ, భూమి, పర్యావరణంపై ఆలపించిన గీతాలు, సంప్రదాయ కళారూపాలు, గుస్సాడి నృత్యకారులు, ఉత్సాహభరితంగా చేశారు.

కళాప్రక్రియలో బాహుబలి బ్నిం

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బుర్రా సుబ్రమణ్య శాస్త్రీ కళాపీఠం ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల నటుడు బుర్రా సుబ్రమణ్యశాస్త్రీ 88వ జయంతి వేడుకలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారులు కళారత్న బ్నింకు బుర్రా సుబ్రమణ్య శాస్త్రీ చిత్రలేఖన పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హన్మంతరావు మాట్లాడుతూ బ్నిం గా పిలువబడే నర్సింహారావు కళాప్రక్రియలో బాహుబలి అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ నాట్య గురువు పసుమర్తి శేషుబాబు, రచయిత శంఖు, కిన్నెర థియేటర్స్ కార్యదర్శి మద్దాలి రఘురాం, కళాపీఠం అధ్యక్షులు రేవతి రామకృష్ణ, కార్యదర్శి శివశంకర శాస్త్రీ పాల్గొన్నారు.



బ్నింకు పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

నకిలీ సబ్‌స్క్రిప్షన్ల పేరిట వల

- ఆన్‌లైన్‌లో ఓటీటీ మెంబర్‌షిప్‌ల పేరుతో ప్రకటనలు
- నకిలీ లింక్‌లు పంపించి మోసం
- అధికారిక వెబ్‌సైట్ల నుంచే కొనుగోలు చేయాలని సూచన
- అప్రమత్తంగా లేకపోతే బ్యాంక్ ఖాతాలు ఖాళీ

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్‌లో ఓటీటీ మెంబర్‌షిప్‌ల ప్రకటనల పేరిట సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. అమాయకులను బురిడీ కొట్టి వారి బ్యాంకు ఖాతాలను గుల్ల చేస్తున్నారు. అమెజాన్ సబ్ స్క్రిప్షన్ ఏడాదికి రూ.50, డిస్నీప్లస్ హాట్‌స్టార్ జీవితకాల సభ్యత్వం రూ.1,499, రూ.20 కట్టి నెట్‌ఫ్లిక్స్ నెలంతా వాడుకోవచ్చు అంటూ నకిలీ ఆఫర్లను గుప్పిస్తున్నారు సైబర్ నేరస్తులు. సామాజిక మాధ్యమాలు, మొబైల్ నంబర్లకు సందేశాలు పంపిస్తూ అమాయకులను మభ్యపెడుతున్నారు. భలే ఆఫర్ అనుకొని లింకు క్లిక్ చేసి ఓటీపీ నమోదు చేశారో నిండా మునిగినట్టే. నకిలీ సందేశాలతో రూ.లక్షలు కొట్టేస్తున్నారు. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ తరహా కేసులు నమోదవుతున్నాయి.

ఓటీపీతో మాయ..


కరోనా తర్వాత అమెజాన్ ప్రైమ్, హాట్ స్టార్, నెట్‌ఫ్లిక్స్ తదితర ఓటీటీల వినియోగం విస్తృతంగా పెరిగింది. ప్రకటనలు లేకుండా ఒకేసారి ఎక్కువ తెరపై కంటెంట్ చూసేందుకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నాయి. కొన్ని సంస్థలు నెలవారీ సభ్యత్వానికి బదులు, వార్షిక చందా తీసుకుంటే ధర తగ్గిస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు ఇలాంటి ఆఫర్లతోనే అమాయకులను మోసం చేస్తున్నారు. సాధారణంగా ఓటీటీ సంస్థలు నెలవారీ, వార్షిక గడువు ముగిస్తే పునరుద్ధరించుకోవడానికి ఖాతాలో నమోదు చేసిన ఈ–మెయిల్‌కు సందేశం పంపిస్తాయి. అచ్చం సైబర్ ముఠాలు ఇదే పని చేసి బోల్తా కొట్టిస్తున్నాయి. ఈ లింకుపై క్లిక్ చేశాక అచ్చం ఓటీటీ చెల్లింపుల తరహాలోనే బ్యాంకు డెబిట్, క్రెడిట్ కార్డు నంబర్లు, పిన్ నమోదు చేసే వ్యవస్థలుంటాయి. ఇవి నమోదు చేస్తే బ్యాంకు ఖాతాలోని డబ్బంతా క్షణాల్లో మాయమవుతుంది.

గూగుల్ అల్గారిథమ్..

నేరగాళ్లు మోసం చేసేందుకు గూగుల్ అల్గారిథమ్ వ్యవస్థ కూడా కారణమే. ఆన్‌లైన్‌లో ఓటీటీ సభ్యత్వ రుసుములు, ఇతర వివరాలను వెతికినప్పుడు అదే అంశానికి సంబంధించిన ప్రకటనలు వస్తుంటాయి. ఇందులోనే సైబర్ నేరగాళ్లు రూపొందించిన నకిలీ ప్రకటనలు వస్తాయి. వాటిని కొందరు క్లిక్ చేసి మోసపోతున్నారు. కోట్లాదిమంది వ్యక్తిగత ఈ–మెయిళ్ల వివరాలు డేటా ప్రొవైడర్ల దగ్గర లభిస్తున్నాయి. ఈ–మెయిళ్లకు సందేశాలు పంపి సైబర్ నేరస్తులు అమాయకుల బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బు కాజేస్తున్నారు.

'వక్ఫ్' సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

ధర్నాచౌక్‌లో ముస్లిం సంఘాల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఇన్‌సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్

కవాడిగూడ: వక్ఫ్‌బోర్డు సవరణ కోసం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని పలువురు ముస్లిం సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ముస్లిం యునైటెడ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ బిల్లు–2024ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నా చేపట్టారు. ముస్లిం యునైటెడ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా హకీం సూఫీ సయ్యద్ కై రోద్దీన్ ఖాద్రీ, పలు ముస్లిం సంఘాల నేతలు నయూముల్లా షరీఫ్, సనాఫ్ ఉల్లాఖాన్, మహ్మద్ అబ్దుల్ అజీద్, మునీర్ పటేల్, అఫ్జల్, సల్మా షకీర్, సాలేబిన్ అబ్దుల్లా మాట్లాడారు. ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బీజేపీతో కుమ్మక్కై వక్ఫ్ సవరణ బిల్లు–2024ను వ్యతిరేకించడం లేదని వారు ఆరోపించారు. ఈ బిల్లు వల్ల దేశవ్యాప్తంగా దాదాపు 20 కోట్ల మంది ముస్లిం మైనార్టీలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల ఎంపీలు పార్లమెంటులో బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంటే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ వీరికి మద్దతు ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

చిరుధాన్యం.. ఆరోగ్యానికి ప్రాధాన్యం

భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ తారా సత్యవతి

ఏజీవర్సిటీ: ప్రతిరోజూ 33 శాతం చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ఎలాంటి వ్యాధులు దరిచేరవని భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ తారా సత్యవతి, నార్మ్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆర్‌సీ అగర్వాల్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి) 10వ వ్యవస్థాపక వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాలతో కేవలం ఆహారమే కాకుండా అనేక రకాల బిస్కెట్లు, కేక్‌లు తయారు చేయవచ్చని తెలిపారు. టిఫిన్స్ తయారు చేసుకోవడానికి ప్రత్యేకంగా చిరుధాన్యాల ఇడ్లీ రవ్వ, పిండి లాంటివి మార్కెట్‌లో లభిస్తున్నాయని చెప్పారు. 2025 సంవత్సరంలో పరిశోధన సంస్థల నుంచి రైతులకు చిరుధాన్యాల అదనపు విలువలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంచేందుకు పథకాలను రూపొందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఐసీఐసీఐ బ్యాంకు జోనల్ మేనేజర్ ఆసిఫ్ ఇక్బాల్, ఏఓ శివప్రసాద్, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ తారా సత్యవతి



పాల్గొన్న శాస్త్రవేత్తలు, సిబ్బంది

టీబీ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

లాలాపేట: టీబీ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర బయో టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ డాక్టర్ రాజేష్ గోఖలే అన్నారు. ఈ మేరకు హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలుక్యూలర్ బయోలజి(సీసీఎంబీ)లో ఆదివారం జరిగిన టీబీ పరిశోధకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాథెజెన్ హెటెరో జెనిటీపై ఈఎంబీఓ వర్క్‌షాపులో దాదాపు 200 మందికిపైగా దేశ, విదేశాల నుంచి క్షయ(టీబీ)పరిశోధకులు పాల్గొన్నారు. టీబీ కారణమైన మైక్రోబ్యాక్టీరియాను అర్థం చేసుకోవడంలోని సంక్లిష్టతలను రాజేశ్ గోఖలే వివరించారు. ఈ బ్యాక్టీరియా ఊపిరితిత్తుల కణాలు, కాలేయ కణాలలో ఆశ్రయం పొందుతాయని పేర్కొన్నారు. యాంటీ బయోటిక్ ఔషధాలు టీబీ నుంచి ఎలా రక్షిస్తాయనే అంశాలపై సోదాహరణంగా తెలియజేశారు. బ్యాక్టీరియా ఎలా సోకుతుందనే విషయాలపై వక్తలు చర్చించారు. సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ కె.నందికూరి మాట్లాడుతూ ఐదేళ్ల తరువాత జరుగుతున్న ఈ వర్క్‌షాపు టీబీ నివారణకు పరిష్కార మార్గాలను అన్వేషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్క్‌షాపు 170 మంది రీసెర్చ్ స్కాలర్లు , పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్ మాట్లాడుతూ తమ పరిశోధనా అనుభవాలను వివరించారు. ఈ వర్క్‌షాపులో డాక్టర్ అమిత్ సింఘాల్, డాక్టర్ ధీరజ్‌కుమార్, డాక్టర్ ప్రిసిల్లా బ్రోడిన్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న డాక్టర్ రాజేష్ గోఖలే

ఇక ఇక్కడ డబుల్ ఇంజిన్ సర్కారే

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

కాచిగూడ: ఇటీవల హరియాణా, నిన్న ఢిల్లీలో బీజేపీని ప్రజలు గెలిపించారని, ప్రధాని నరేంద్ర మోదీపై విశ్వాసంతోనే దేశవ్యాప్తంగా ప్రజలు తమను ఆదరిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి ఆదివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోనూ వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కారేనని, మోదీ నాయకత్వాన్ని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ నేతల కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకుందని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక రకాల హామీలిచ్చి ఏ ఒక్కదానిని కూడా నెరవేర్చలేకపోతున్నదని విమర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ కోరలు పీకి కాషాయ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, శ్యామ్‌రావు, కేశబోయిన శ్రీధర్ పాల్గొన్నారు.

ట్రావెల్స్ నిర్వాహకుడి ఆత్మహత్య



శ్రీనివాస్

చిక్కడపల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ ట్రావెల్ నిర్వాహకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిక్కడపల్లి సీఐ రాజునాయక్ కథనం ప్రకారం... చిక్కడపల్లిలో నివాసముండే ఎం.శ్రీనివాస్(50) అనే వ్యక్తి కార్లను అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల కుమార్తె వివాహం చేశాడు. ఓ కుమారుడు కెనడాలో ఉన్నతవిద్య అభ్యసిస్తున్నాడు. అయితే కుటుంబ, ఆర్థిక సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాస్ పాపయ్య ఎస్టేట్‌లోని తన కార్యాలయ బిల్డింగ్‌పై నుంచి కిందికి దూకి అక్కడికక్కడే మరణించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

టోలిచౌకీలో కాల్పుల కలకలం

గోల్కొండ: టోలిచౌకీలో శనివారం అర్ధరాత్రి కాల్పుల కలకలం చెలరేగింది. హుమాయున్ నగర్ పోలీసుల కథనం ప్రకారం... గోల్కొండకు చెందిన షకీల్ అలీఖాన్, టోలిచౌకీ పెట్రోల్ బంక్ ప్రాంతవాసి సయ్యద్ అక్తర్‌కు మధ్య ఓ ఆస్తి విషయంపై గొడవలు ఉన్నాయి. అయితే సర్దుబాటు కోసం ఓ ఎమ్మెల్యే సమక్షంలో సయ్యద్ అక్తర్ ఇంట్లో నిర్వహించిన పంచాయతీ ఇరువర్గాల మధ్య తోపులాటకు దారితీసింది. షకీల్ ఆలీఖాన్‌ను అక్కడి నుంచి ఎమ్మెల్యే పంపించి తాను కూడా వెళ్లిపోయారు. తిరిగి రాత్రి 11.30 గంటల సమయంలో షకీల్ తన అనుచరులతో కలిసి అక్తర్ ఇంటిపై దాడికి పాల్పడగా, అక్తర్ రివాల్వర్‌తో కాల్పులు జరిపినట్లు తెలిసింది. అయితే పరిసరాల్లో కాల్పులు జరిగిన ఆధారాలు లభ్యం కాలేదని పోలీసులు అంటున్నారు.

ఆర్‌పీఎల్‌తో కమ్యూనిటీల మధ్య సత్సంబంధాలు

చందానగర్: కమ్యూనిటీలు ఒక్కతాటిపై రావడానికి రాంకీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) చాలా అవసరమని బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్, మాజీ భారత జట్టు క్రీడాకారుడు ఎంఎస్‌కే ప్రసాద్ అన్నారు. శనివారం రాత్రి గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో ఆర్‌పీఎల్ సీజన్ 2కు సంబంధించిన కప్‌లను రాంకీ గ్రూప్ సీఎఫ్ఓ ఎస్ఎస్ రావు, రీజినల్ డైరెక్టర్ శరణ్ అల్లాలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఎంఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తి, కమ్యూనిటీ స్పిరిట్‌తో రెసిడెన్షియల్ కమ్యూనిటీల మధ్య సత్సంబంధాలు ఏర్పడుతాయన్నారు. సీజన్ 2లో డే అండ్ నైట్ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారని, ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతాయన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ గత సంవత్సరం 12 క్రికెట్ జట్లు పాల్గొన్నాయని, ఈ సీజన్ 2లో 16 జట్లు పాల్గొననున్నాయని చెప్పారు. ఫిబ్రవరి 15వ తేదీన టోర్నమెంట్ ప్రారంభమై మార్చి 8న ఫైనల్ మ్యాచ్‌తో ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎల్ సీజన్ 2 జట్ల కెప్టెన్లు, వైస్‌కెప్టెన్లు పాల్గొన్నారు.



ఆర్‌పీఎల్ సీజన్ 2ను ఎస్ఎస్ రావు, శరణ్ అల్లాలతో కలిసి ప్రారంభిస్తున్న ఎంఎస్‌కే ప్రసాద్

పనులు ఎక్కడెక్కడ.. ఆస్తుల సేకరణ ఎట్లా!

- కేబీఆర్ చుట్టూ ఆరు ఫ్లై ఓవర్లు.. ఏడు అండర్ పాస్‌లు
- రూ.1,090 కోట్ల మేరకు టెండర్ల ప్రక్రియకు కసరత్తు
- విస్తృతంగా అధికారుల చర్చ
- జోనల్ కమిషనర్‌కు పనుల పర్యవేక్షణ బాధ్యత



కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న జంక్షన్లు జామ్ కాకుండా, ట్రాఫిక్ ఇక్కట్లకు తావు లేకుండా సరికొత్త ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు రూపుదిద్దుకోనున్నాయి. ఈ మేరకు ఆరు జంక్షన్లలో ఆరు ఫ్లై ఓవర్లు, ఏడు చోట్ల అండర్‌పాస్‌లు నిర్మించేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఇందుకోసం 1,090 కోట్ల మేర టెండర్ ప్రక్రియకు కసరత్తు సాగుతోంది. ఎక్కడెక్కడ స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించాలనే అంశంపై ఆదివారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ప్రాజెక్ట్స్ ఈఈ నామ్యానాయక్, ఖైరతాబాద్ జోనల్ ఎస్ఈ రత్నాకర్, సిటీ ప్లానర్ సాంబయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సంతోష్, ఈఈ విజయ్‌కుమార్ విస్తృతంగా చర్చించారు. డిజైన్ మ్యాప్‌లను పరిశీలిస్తూ సమన్వయంగా అన్ని కూడళ్లలో పరిశీలన చేపట్టారు. నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో భూసేకరణ, ఆస్తుల సేకరణ తదితర అంశాలన్నీ జోనల్ కమిషనర్ స్థాయిలో సిటీ ప్లానర్లు గుర్తించనున్నారు. కేబీఆర్ పార్కు చౌరస్తాతోపాటు జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 బాలకృష్ణ చౌరస్తా, ఫిలింనగర్ సీవీఆర్ న్యూస్ చౌరస్తా, బంజారాహిల్స్ రోడ్ నెం. 12 అగ్రసేన్ చౌరస్తా, బంజారాహిల్స్ రోడ్ నెం. 10 బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చౌరస్తాలలో ఆరు చోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం జరగనుంది. కేబీఆర్ పార్కు చౌరస్తాతోపాటు బంజారాహిల్స్ రోడ్ నెం.3 సాగర్ సొసైటీ చౌరస్తా, బసవతారకం చౌరస్తా, అగ్రసేన్, సీవీఆర్ న్యూస్, రోడ్ నెం. 45 బాలకృష్ణ నివాసం చౌరస్తా, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులలో అండర్‌పాస్‌లు నిర్మాణం కానున్నాయి.

ఆస్తుల సేకరణపై చర్చ..

ఆస్తుల సేకరణ, భూసేకరణలో వైశాల్యంపై కూడా చర్చ జరిగింది. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు.

క్లాక్‌వైజ్‌లో అండర్‌పాస్‌లు...

కేబీఆర్ పార్కు చౌరస్తా నుంచి బసవతారకం, అగ్రసేన్ చౌరస్తా మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, సాగర్ సొసైటీ వరకు ఏడు చోట్ల క్లాక్ వైజ్‌లో అండర్‌పాస్‌లు నిర్మితం కానున్నాయి. యాంటీ క్లాక్‌వైజ్‌లో కేబీఆర్ పార్కు చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, బాలకృష్ణ నివాసం మీదుగా, యాంటీ క్లాక్ వైజ్‌గా వంతెనల నిర్మాణం చేపట్టనున్నారు. కేబీఆర్ పార్కు చుట్టూ అయిదు కిలోమీటర్ల మేర ఈ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు రూపుదిద్దుకోనున్నాయి. వీటి నిర్మాణానికి రూ.1,090 కోట్లు అవసరం అవుతాయని అధికారుల అంచనా. వీటిల్లోంచి రూ.460 కోట్లు భూసేకరణకు వెచ్చించనున్నారు. ఇప్పటికే కేబీఆర్ పార్కు చుట్టూ 400 వరకు ఆస్తులను గుర్తించారు. త్వరలోనే ఆయా ప్రాంతాల్లోని ఇళ్ల వద్ద ఎంత స్థలం పోనుందనే దానికి సంబంధించి మార్కింగ్ చేసే ప్రక్రియ ప్రారంభంకానున్నది. ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం కోసం కేబీఆర్ పార్కు చుట్టూ 120 అడుగుల రోడ్డును విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. త్వరలోనే చట్ట ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి ప్రజాభిప్రాయ సేకరణతో వీటిని సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశముంది. ఇప్పటి నుంచే ఈ ప్రక్రియను ముమ్మరం చేయాలని నిర్ణయించారు. స్టీల్ వంతెనల నిర్మాణం చేపట్టడం ద్వారా ట్రాఫిక్‌కు నిర్మాణ సమయంలో పెద్దగా అంతరాయం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.



గ్రామాలు, పల్లెల జీవన విధానం.. స్వచ్ఛమైన ఆహారం, ప్రకృతితో సావాసం, సంస్కృతితో కలగలిసిన సంప్రదాయం, పలు వృత్తుల కలయిక ఇలా.. మనిషి జీవనానికీ పల్లెలకు ఎప్పటి నుండో ఏర్పడిన బంధం.. వీటన్నింటికీ ప్రధానమైనది వ్యవసాయం.. అలా వ్యవసాయానికీ..పల్లె జీవన విధానానికీ ముడిపడినదే మట్టి.. అలాంటి మట్టితో మమేకమైన జీవన విధానంపై నగరంలో వినూత్న పద్ధతిలో 'నైమిసం ఎర్త్ ఫెస్టివల్' పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా పలు సంస్థలు భాగస్వామ్యమయ్యాయి. పల్లెల్లోని సహజ జీవన విధానాలను తెలియజేస్తూ ప్రదర్శనలు ఏర్పాటు చేశాయి.. ఈ నేపథ్యంలో దీని గురించి మరిన్ని విశేషాలు.. - సాక్షి, సిటీ బ్యూరో

మట్టితో మమేకం..

నగరంలో వినూత్నంగా 'నైమిసం ఎర్త్ ఫెస్టివల్'

- రాష్ట్ర వ్యాప్తంగా పలు సంస్థల ప్రదర్శనలు
- ఆకట్టుకుంటున్న సహజ జీవన విధానం
- వ్యవసాయం, సంప్రదాయ వృత్తులపై అవగాహన

సంప్రదాయ వృత్తులు, జీవన విధానాలు అంతరించిపోతున్న ప్రస్తుత తరుణంలో గతకాలపు సాంస్కృతిక జీవన వైవిధ్యం.. ప్రకృతితో మమేకమయ్యే జీవన విధానం.. కలగలిసి ఇవన్నీ ఒకే వేదికగా నగరవాసులకు పరిచయం చేస్తూ.. ప్రస్తుత తరం ఆ తరహా జీవనశైలిలో భాగస్వాములు కావలనే లక్ష్యంతో 'నైమిసం ఎర్త్ ఫెస్టివల్ 2025' ఏర్పాటు చేశారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా దీనికి వేదికైంది. జె. కృష్ణమూర్తి సెంటర్ నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమం నగరానికి సహజ జీవన విధానాన్ని, అందులోని మాధుర్యాన్ని, తన్మయత్వాన్ని రుచి చూపించింది. ఈ ఎర్త్ ఫెస్టివెల్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంస్థలు, వ్యక్తులు ఏర్పాటు చేసిన స్టాల్స్ గత కాలపు జ్ఞాపకాలను, జీవన శైలిని ఇప్పటికీ కొనసాగిస్తున్న సుస్థిర విధానాలను అద్భుతంగా ప్రదర్శించారు.

ఎర్త్ అండ్ ఆర్ట్ స్టూడియో..

ఇంటిని, గార్డెన్‌ను అందంగా అలంకరించే టెర్రకోట బొమ్మలు, మట్టి పాత్రలు, దారం అల్లికలు వంటివి తయారు చేస్తున్నాం. నగరంలోని కార్ఖానాలో ఎర్త్ అండ్ ఆర్ట్ అనే మా స్టూడియోలో స్టోన్ కార్వింగ్, బ్లాక్ ప్రింటింగ్, రేడియం తదితర వర్క్‌షాపులను నిర్వహిస్తున్నాం. వీటికి అవసరమైన మట్టిని కర్ణాటక నుంచి ప్రత్యేకంగా తీసుకొస్తాం. ఆర్టిఫీషియల్ హంగుల కన్నా సహజమైన కళతో రూపొందించిన ఈ ఉత్పత్తులు ఇంటికే కాకుండా జీవితానికీ సౌందర్యాన్నిస్తాయి.
- ఫాతిమా ఖుజీమా, ఎర్త్ అండ్ ఆర్ట్



రసాయనాలు లేకుండా..

శాశ్వత వ్యవసాయంగా పిలుచుకునే పర్మాకల్చర్ విధానంలో పంటలు పండిస్తున్నాం. జహీరాబాద్ సమీపంలోని బిడకన్నె గ్రామంలో విభిన్న రకాల పంటలను ఎలాంటి రసాయనాలూ వేయకుండా పండిస్తున్నాం. నరన్న కొప్పుల ఆధ్వర్యంలోని అరణ్య సంస్థ ఈ వ్యవసాయంపై మరింత అవగాహన కల్పిస్తోంది. నాలాగే 500 మంది మహిళా రైతులు ఈ పర్మాకల్చర్ చేస్తున్నారు. తల్లిలాంటి భూమిని రసాయన మందులు వేసి చంపదల్చుకోలేదు. ఆవులు, బర్రెల పేడతో సహజ ఎరువును తయారు చేసుకుని పంటలు పండిస్తున్నాం. పొన్నగంటి, తోటకూర, దొగ్గల్ కూర, తడక దొబ్బుడు వంటి ఆరోగ్యకరమైన ఆకు కూరలు పండిస్తున్నాను. ఎకరంలో దాదాపు 20 రకాల కూరగాయలు, ఇతర పంటలను పండించగలను. మందులతో పండిన పంటతో లభాలు ఎక్కువ వస్తాయేమో.. కానీ ఆరోగ్యం కోల్పోయి ఆస్పత్రుల్లో చేరాలి. కరోనా తరువాత ఈ వ్యవసాయం పై మరింత గౌరవం, నమ్మకం పెరిగింది. నా మనుమరాలి పెళ్లి కూడా చేశాను.. ఇంకా ఆరోగ్యంగా ఉన్నాను. మా పంటను ఇష్టపడే వారే మా వద్ద ప్రత్యేకంగా కొంటున్నారు.
- తుల్జమ్మ, పర్మాకల్చర్ రైతు





సంస్కృతులపై అవగాహన కోసం..

సెంటర్ ఫర్ ఎంబారీ నాలెడ్జ్ పేరుతో ఒక సంస్థగా ఆనాటి జీవన విధానం, వ్యవసాయం, నివాసాలు, సంస్కృతులు, పద్ధతులను ఈ తరానికి చేరువ చేసే ప్రయత్నం చేస్తున్నాం. ఇందులో భాగంగా వర్క్‌షాపులు, కథలు, పాటలు, ప్రాజెక్టుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. తరతరాల వారసత్వంగా వచ్చిన అద్భుత సంస్కృతిని కోల్పోతున్నాం. ఆరేళ్లుగా ఈ అంశాలపైనే కృషి చేస్తున్నాం. ఒక్కో అంశంలో నిపుణులైన ఒక్కొక్కరు బృందంగా ఏర్పడి పనిచేస్తున్నాం. ఒక అరుదైన గ్రామీణ సంగీత కళ లేదా వ్యాయిద్యాన్ని చెప్పుకోవచ్చు. మా ప్రయత్నంలో భాగంగా కొందరికి మట్టి ఇళ్లు కట్టించాం, కథలను చెబుతాం, అసక్తి ఉన్నావారిని ప్రత్యక్షంగా ఈ మూలాల్లోకి తీసుకెళ్లి చూపిస్తాం. నగరానికి సమీపంలోని చౌటుప్పల్ వంటి ప్రాంతాల్లోని గ్రామాలు మొదలు భద్రాచలం వంటి దూరప్రాంతాల్లోనూ మా ప్రాజెక్టును కొనసాగిస్తున్నాం.
- ధీరజ్, సెంటర్ ఫర్ ఎంబారీ నాలెడ్జ్

అలరించిన నృత్యాలు..

ఈ సందర్భంగా నిర్వహించిన గుస్సాడి నృత్యం అలరించింది. డబ్ల్యూడబ్ల్యూఎఫ్, సొసైటీ టు సేవ్ రాక్స్, యానిమల్ వారియర్స్, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్ వంటి సంస్థలు పర్యావరణ పరిరక్షణ కోసం వినూత్న ఆలోచనలతో చేపట్టిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవంలో వాన్వాడి ఫారెస్ట్ కలెక్టివ్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ అసీమ్ శ్రీవాత్సవ వంటి వక్తలు ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

నేనొక చేనేతకారుడిని..

చిన్నప్పటి నుంచి బట్టలు నేయడం మాత్రమే తెలుసు. ఎంత గొప్ప భవిష్యత్తు ఉందన్నా మరో పనికి వెళ్లే ఆలోచన లేనివాళ్లం. ఎక్కువగా సిల్క్ చీరలు నేస్తాను. ఒక్కో చీర నేయడానికి నాలుగు రోజులు పడుతుంది. ఇలా నెల్లో 7, 8 చీరలు నేస్తాను. వినియోగించే దారం, డిజైన్ బట్టి ధర ఉంటుంది. అన్నీ పోనూ ఓ 12 వేల వరకూ మిగులుతుంది. గిట్టుబాటు ధరలు లేకపోవడం ప్రధాన సమస్య. అయినప్పటికీ మా వృత్తిలోనే మాకు సంతృప్తి. ముగ్గురు ఆడపిల్లు.. వారిని పీజీలో, డిగ్రీలో చేర్పించాను. - రామక్రిష్ణ, సంస్థాన్ నారాయణపురం







మట్టి ఇళ్ల నిర్మాణంపై..

100, 150 ఏళ్లపాటు ఘనంగా మనగలిగిన నాటి మట్టి ఇళ్లను మళ్లీ ఈ తరానికి అందించడమే లక్ష్యంగా నిలాలిన్ సంస్థను నా సహవ్యవస్థాపకురాలు యామినితో కలిసి ప్రారంభించాం. ఈ నివాసాల్లోని వైవిధ్యాన్ని, విశిష్టతను ఈ తరానికి తెలియజేస్తున్నాం. ఇందులో భాగంగా ఔత్సాహికులకు జనగామలో మరుతం లెర్నింగ్ సెంటర్, ఒడిస్సాలో కమ్యూనిటీ సెంటర్, మహబూబ్‌నగర్‌లో మరో మట్టి ఇంటి ప్రాజెక్టు వంటివి చేపట్టాం. ఈ ఇళ్ల నిర్మాణంలో మట్టిలో దృఢత్వానికి ఆవు పేడ, ఫైబర్ రిచ్ వంటివి కలుపుతాం. స్థానికంగా నాటి మట్టి నిర్మాణం తెలిసిన వారి నైపుణ్యాలను వాడుతున్నాం. - ఐశ్వర్య, నిలాలిన్



అత్యాధునిక ఆడియో ఐ వేర్.. ఫోనిక్..

సాక్షి, సిటీబ్యూరో: మల్టీ టాస్కింగ్ చేసే నేటి తరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రపంచ స్థాయి సాంకేతికతతో రూపొందిన ఫోనిక్ ఆడియో ఐ వేర్‌ను నగర మార్కెట్‌లోకి విడుదల చేసినట్టు లెన్స్‌కార్ట్ బ్రాండ్ సీఈఓ పీయూష్ భన్సాల్ తెలిపారు. ఈ కంటి అద్దాలు జూమ్ కాల్స్ రిసీవ్ చేసుకోవడం దగ్గర నుంచి సంగీతం వినడానికి, వాయిస్ కమాండ్స్ వంటి విభిన్న రకాల ఆడియో ఫీచర్లను కలిగి ఉంటాయని, మల్టీ టాస్కింగ్ చేసే నవతరానికి ఇవి సరైన ఎంపికని ఓ ప్రకటనలో వివరించారు.

నగదు రహిత ఆరోగ్య సేవలు

సాక్షి, సిటీబ్యూరో : దేశవ్యాప్తంగా కార్పొరేట్ ఉద్యోగులకు ప్రాథమిక, ముందస్తు వ్యాధి నివారణా సేవలు అందించేందుకు నగరానికి చెందిన ఫిన్‌టెక్ సంస్థ జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్ నడుంకట్టింది. దీనిలో భాగంగా ఆరోగ్య రంగంలో సమీకృత సేవలు అందించే ఏఐ ఆధారిత ప్లాట్‌ఫార్మ్ ఎకిన్ కేర్‌తో చేతులు కలిపింది. ఈ విషయాన్ని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. తద్వారా నగదు రహిత ఆరోగ్య సేవలను కార్పొరేట్ క్లైంట్స్, ఉద్యోగులకు అందుతాయని, వైద్య పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, టెలీ-మెడిసిన్ సేవలు, దంత, దృష్టి సంబంధిత వైద్య సేవలతో పాటు మానసిక ఆరోగ్యానికి అవసరమైన మద్దతు, ఫిట్‌నెస్ ఫెసిలిటీస్ అత్యవసర వైద్యం.. వంటివి లభిస్తాయని వివరించింది.





చిన్న వయసు.. పెద్ద మనసు

వయసులో ఆమె చాలా చిన్నది.. కానీ గొప్ప మనసుందని ప్రపంచానికి చాటి చెప్పింది.. తాను మరణిస్తున్నానని తెలిసి.. మరో ఐదుగురి ప్రాణాలను కాపాడాలని నిర్ణయించుకుంది. అంతేకాదు..మరణానంతరం మరో ఐదుగురికి ప్రాణంపోయడమే కాదు.. వారి రూపంలో తాను జీవించి ఉందనేలా.. ఆమె తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయం. అవయవ దానంపై ఆమె నిర్ణయం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పలువురు కొనియాడుతున్నారు. ఇంతటి గొప్ప త్యాగానికి.. రూపమిచ్చిన ఆమె పేరు డాక్టర్ భూమికారెడ్డి..
- రాయదుర్గం

ఐదుగురికి అవయవ దానం చేసిన యువ డాక్టర్

- తాను మరణిస్తూ.. మరో ఐదుగురికి ప్రాణం పోసి
- గొప్ప మనసు చాటుకున్న డాక్టర్ భూమికారెడ్డి
- తల్లిదండ్రుల సహకారం ప్రశంసనీయం : కాంటినెంటల్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ గురు ఎన్ రెడ్డి

యువ డాక్టర్ నంగి భూమికారెడ్డి (24) స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గం, తలుపుల మండలం, నంగివాండ్లపల్లి. నంగి నందకుమార్ రెడ్డి, లోహిత దంపతుల ఏకైక కుమార్తె. ఇటీవలే వైద్య విద్యను పూర్తి చేసి హైదరాబాద్ నగరంలోని ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రిలో హౌస్ సర్జన్‌గా వైద్య సేవలను అందిస్తోంది. ఫిబ్రవరి 1న తెల్లవారు జామున నాలుగున్నర గంటలకు తాను ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొని అనుకోకుండా ప్రమాదానికి గురైంది. అపస్మారక స్థితిలో ఉన్న భూమికారెడ్డిని సమీపంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోని న్యూరో సర్జన్ డాక్టర్ శివానందరెడ్డి నేతృత్వంలో వైద్య బృందం చికిత్సలు చేసింది. క్రానియోటమీ సర్జరీ చేసినా ఫలితం లేకుండా పోయింది. వారం రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు ఆదివారం తుది శ్వాస విడిచింది.

బిడ్డ మాట కోసం..

భూమికారెడ్డి తమతో పదే పదే అవయవ దానం గురించి మాట్లాడుతుండేదని, ఆ మేరకు తమ బిడ్డ మాట కోసం భూమికారెడ్డి అవయవాలను దానం చేయడానికి తమ కుటుంబ సభ్యులతో చర్చించి చివరకు అంగీకరించారు తల్లిదండ్రులు. మృతదేహం వద్ద తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటూ గుండెలవిసేలా రోదిస్తుంటే.. ఆస్పత్రిలోని సందర్శకులు, ఇతర రోగుల కళ్లు చెమ్మగిల్లాయి. బిడ్డను కోల్పోయిన బాధను దిగమింగుకుని మరో ఐదుగురి ప్రాణాలను నిలబెట్టాలనే నిర్ణయానికి వచ్చిన భూమికారెడ్డి తల్లిదండ్రులను అక్కడి డాక్టర్లు అభినందించారు. అనంతరం భూమికారెడ్డి మృతదేహానికి కాంటినెంటల్ ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనం చేశారు.

> **భూమికారెడ్డి త్యాగం వెలకట్టలేనిది..**
>
> యువ డాక్టర్ భూమికారెడ్డి మన మధ్య లేకపోయినా ఆమె చేసిన త్యాగం వెలకట్టలేనిది. ఆమె, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సమిష్టిగా నిర్ణయించి అవయవదానం చేయడానికి ముందుకురావడం కలకాలం గుర్తిండిపోతుంది. భూమికారెడ్డి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం. వైద్య రంగం ఓ మంచి వైద్యురాలిని కోల్పోయింది.
> - కాంటినెంటల్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ గురు ఎన్ రెడ్డి




అవయవదానం వివరాలు..

డాక్టర్ భూమికారెడ్డి అవయవాల్లో గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, రెండు కిడ్నీలను అవయవదానం చేశారు. ఇందులో భాగంగా ఊపిరితిత్తులను కిమ్స్ ఆస్పత్రికి, గుండెను జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి, కాలేయం కాంటినెంటల్ ఆస్పత్రికి, కిడ్నీల్లో ఒకటి నిమ్స్ ఆస్పత్రికి, మరొకటి కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించారు.

కొమ్మ కొమ్మకో సన్నాయి..





- కొత్తగూడ బొటానికల్ గార్డెన్స్‌లో బర్డ్స్ వాక్
- రెండు రోజులపాటు ఉల్లాసంగా కార్యక్రమం
- 55 మంది వీక్షకులు, 62 రకాల పక్షి జాతుల గుర్తింపు

కొమ్మ కొమ్మకో సన్నాయి.. కోటి రాగాలు ఉన్నాయి.. అన్నట్లు కొత్తగూడ బొటానికల్ గార్డెన్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన బర్డ్స్ వాక్ కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. ఇందులో 55 మంది వీక్షకులు భాగస్వామ్యం కాగా.. 62 రకాల పక్షి జాతులను గుర్తించారు. ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, మేనేజర్ సుమల్ పర్యవేక్షణలో వివిధ రకాల థీమ్ పార్కులు, వృక్షపరిచయ క్షేత్రం, వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ గురించి వీక్షకులకు వివరించారు..
- గచ్చిబౌలి

జీవావరణ పరిరక్షణకు..

ప్రకృతి, జీవావరణ వ్యవస్థలో పక్షులు ప్రధాన భూమిక పోషిస్తాయని పక్షుల నిపుణులు సందర్శకులకు వివరించారు. విత్తనాల వ్యాప్తి, పర్యావరణ సమతుల్యతలో పక్షుల భాగస్వామ్యం ఎంతో కీలకమని, అందుకే ఆయా జాతుల మనుగడ మానవ మనుగడకు, ప్రకృతి మనుగడకు కీలకమన్నారు.





పికిలిపిట్ట, షిక్రా, లొట్టకన్నుజిట్ట, నల్ల ఎత్రింత, అడవిరామదాసు, మగ నెమలి, ఆడ నెమలి, లకుముకి పిట్ట, టైగర్ స్వాలోటైల్ సీతాకోకచిలుక వంటి పక్షులను సందర్శకులు వీక్షించారు. రెండు రోజులపాటు నిర్వహించిన 'బర్డ్స్‌వాక్' లో 62 రకాల పక్షి జాతులను సందర్శకులు గుర్తించారు. కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్స్ ఈ కార్యక్రమానికి వేదికైంది. ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, మేనేజర్ సుమల్ పర్యవేక్షణలో 55 మంది వీక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పక్షిజాతుల పేర్లు, వాటి శాస్త్రీయ నామాలు, సహజమైన పేర్లు, వాటి అలవాట్లు, ప్రవర్తన గురించి పక్షుల నిపుణులు అపరంజని, ప్రవర్తన, మనోజ్



థామ్సన్, అబ్దుల్ వివరించారు. పాకెట్ గైడ్ ద్వారా పక్షులను ఎలా గుర్తించాలో, అవి ఎలాంటి శబ్దాలు చేస్తాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పక్షులను తమ కెమెరాల్లో బంధించారు.

ఎకో టూరిజమ్‌లో భాగంగా..

"బొటానికల్ గార్డెన్స్‌లో బర్డ్స్‌వాక్ కార్యక్రమంలో భాగంగా అడవుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పక్షుల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి 23న వికారాబాద్‌లో, మార్చి 2న గజ్వేల్ ఫారెస్ట్‌లో బర్డ్స్ వాక్ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించాం.
- రంజిత్‌నాయక్, ఎకో టూరిజమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ

తగ్గేనా.. పెరిగేనా?

2025-26 రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలపై సర్వత్రా ఆసక్తి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్ పద్దు ఈసారి (2025–26) పెరుగుతుందా..? లేక తగ్గుతుందా? అనే చర్చ రాష్ట్ర ఆర్థిక శాఖ వర్గాల్లో జరుగుతోంది. కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు, జాతీయ స్థాయి ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం పెరుగుదలను దృష్టిలో పెట్టుకుంటే 2024–25 ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలకు, సవరించే బడ్జెట్ అంచనాలకు మధ్య భారీ తేడా ఉంటుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే 2025–26 రాష్ట్ర బడ్జెట్ పెరుగుతుందా? లేక తగ్గుతుందా? అనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. కేంద్ర బడ్జెట్ పరిమాణం పెరిగిన మేరకు రాష్ట్ర బడ్జెట్ కూడా పెరిగే అవకాశముందని, ఈ లెక్కన ఈసారి బడ్జెట్ రూ.3 లక్షల కోట్లకు చేరవచ్చన్న అభిప్రాయం ఒక పక్కన వ్యక్తం అవుతుంటే.. బడ్జెట్ ప్రతిపాదనల కంటే సవరించబోయే అంచనాలు రూ.50 వేల కోట్లకు పైగా తగ్గవచ్చనే అంచనాల నేపథ్యంలో, వాస్తవికత దృష్ట్యా ఈసారి బడ్జెట్ పరిమాణం తగ్గుతుందనే అభిప్రాయం ఆర్థిక నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

నెరవేరని కేంద్ర సాయం ఆశలు

ఆర్థిక శాఖ గత రెండు నెలల నుంచే బడ్జెట్ ప్రతిపాదనలపై కసరత్తు చేస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించే బడ్జెట్ వివరాలను అన్ని శాఖల నుంచి పద్దుల వారీగా ఆన్‌లైన్ ద్వారా సేకరించే ఈ ప్రక్రియ పూర్తయింది. అయితే ఈ వివరాలకు తుది రూపం ఇచ్చే విషయంలోనే ఆర్థిక శాఖ అధికారులు తర్జనభర్జనలు పడుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాయోజిత పథకాలు, పన్నుల్లో వాటా మినహా తెలంగాణకు ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు లేవు. ట్రిపుల్ ఆర్, మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం రూ.1.63 లక్షల కోట్లు సాయం చేయాలని కేంద్రాన్ని కోరినా ఫలితం లేకుండా పోయింది. తమ విజ్ఞప్తిలో నాలుగో వంతు అంటే కనీసం రూ.40 వేల కోట్ల ఆర్థిక సాయమైనా కేంద్రం నుంచి వస్తుందన్న ఆశలు అడియాశలయ్యాయి. మరోవైపు గత బడ్జెట్‌లో (2024–25)లో కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.21 వేల కోట్లకు పైగా వస్తుందని అంచనా వేసినా చివరి త్రైమాసికం ప్రారంభమయ్యే నాటికి రూ.5 వేల కోట్లు కూడా రాలేదు. ఈ నేపథ్యంలోనే ఈసారి బడ్జెట్ పద్దును ఆచితూచి వాస్తవికతకు దగ్గరగా ప్రతిపాదించాలని ఆర్థిక శాఖ యోచిస్తోంది. ప్రతి ఏటా బడ్జెట్ పరిమాణాన్ని పెంచాలనే సూత్రప్రాయ నిబంధన అమలు చేయాల్సి వస్తే ద్రవ్యోల్బణం అంచనాల మేరకు 5 శాతానికి అటూ ఇటుగా పెంచి మొత్తం రూ.3 లక్షల కోట్లకు ప్రతిపాదనలు చేయవచ్చని తెలుస్తోంది.

ఖర్చు తక్కువ..ఆదాయమూ తక్కువే..!

మరోవైపు గత బడ్జెట్ ప్రతిపాదనల లెక్కలు ఆర్థిక శాఖను కలవరపరుస్తున్నాయి. రూ.50 వేల కోట్ల కంటే ఎక్కువ స్థాయిలో అప్పులు తెచ్చినా బడ్జెట్ లెక్కలు చివరి త్రైమాసికం ప్రారంభం నాటికి 60 శాతం మించలేదు. రూ.2.91 లక్షల కోట్ల ప్రతిపాదనలకు గాను రూ.2.20 లక్షల కోట్ల రెవెన్యూ వ్యయాన్ని ప్రతిపాదించగా అందులో కేవలం రూ.1.32 లక్షల కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. మొత్తం రూ.2.74 లక్షల కోట్ల ఆదాయ అంచనాలకు గాను రూ.1.60 లక్షల కోట్లు మాత్రమే అన్ని రకాల పద్దుల ద్వారా సమకూరాయి. చివరి మూడు నెలల్లో మరో రూ.60 వేల కోట్లు వచ్చినా కనీసం రూ.50 వేల కోట్ల అంతరం ఏర్పడుతుందని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. అంతకు ముందు ఏడాది (2023–24)లో రూ.2,90,296.00 వ్యయం అంచనా వేయగా రూ.2,31,017.19 ఖర్చు మాత్రమే జరిగింది. ఈ నేపథ్యంలో ఈసారి ప్రతిపాదిత బడ్జెట్ కంటే సవరించే అంచనాలు కనీసం రూ.50 వేల కోట్ల మేరకు తగ్గే అవకాశం ఉంది. దీంతో ఆ రూ.50 వేల కోట్ల మేర తగ్గించి వాస్తవిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే కసరత్తును కూడా ఆర్థిక శాఖ ప్రారంభించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ ఆలోచనను బట్టి ముందుకెళతామని, ప్రభుత్వ విధానాలను బట్టి బడ్జెట్ పెరగడం లేదా తగ్గడం జరుగుతుందని ఆర్థిక శాఖలోని కీలక అధికారి ఒకరు వెల్లడించారు. వచ్చే నెల పదో తేదీ తర్వాత అసెంబ్లీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశముందని ఆయన తెలిపారు.

పాలకులకు దడ పుట్టేలా పదిలక్షల మందితో బహిరంగసభ



సమావేశంలో మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర, చిత్రంలో డాక్టర్ కె.లక్ష్మణ్, బండి సంజయ్, గంగుల కమలాకర్, తీన్మార్ మల్లన్న, నరేందర్

- మున్నూరు కాపులను ప్రభుత్వం అవమానించింది
- కులగణనకు వ్యతిరేకంగా జరిగిన సదస్సులో పాల్గొన్న బండి, వద్దిరాజు, లక్ష్మణ్, గంగుల తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జరిపించిన కులగణన సర్వేలో తమ సామాజిక వర్గం సంఖ్యను తక్కువ చేసి చూపడాన్ని మున్నూరుకాపులు తీవ్రంగా ఖండించారు. జనాభాలో అత్యధికులుగా ఉన్న తమను తక్కువ చేసి చూపి ప్రభుత్వం అవమానించిందని మున్నూరుకాపు ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సర్వేకు వ్యతిరేకంగా హైదరాబాద్ నగరంలో 10 లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించాలని వారు నిర్ణయించారు. మున్నూరుకాపు అపెక్స్ కౌన్సిల్ పిలుపు మేరకు 'కులగణన ఫలితాలు–జరిగిన తప్పిదాలు' అనే అంశంపై సికింద్రాబాద్ సిఖ్ విలేజ్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం సాయంత్రం అత్యవసరంగా సమావేశమయ్యారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, డాక్టర్ కోవా లక్ష్మణ్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితర ప్రముఖులు సమావేశంలో మాట్లాడారు. కులగణన సర్వేను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే రీసర్వే జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రి సంజయ్ మాట్లాడుతూ, మున్నూరుకాపులకు నష్టం చేయాలని చూసిన పాలకులకు దడ పుట్టేలా 10 లక్షల మందితో భారీ బహిరంగసభ జరుపుదామన్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ మన జనాభా తక్కువ చేసి చూపిన ఈ కులగణనను అంగీకరించే ప్రసక్తే లేదని, వెంటనే రీ సర్వేకు ముక్తకంఠంతో డిమాండ్ చేద్దామని చెప్పారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ మున్నూరుకాపుల ఎదుగుదలను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యసభ సభ్యులు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా మనమందరం ఒకే వేదికపైకి రావడం సంతోషమని అన్నారు. సమావేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు సి.విఠల్, మున్నూరుకాపు మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మక్క, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నన్నపనేని నరేందర్, సోమారపు సత్యనారాయణ, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



సౌర విద్యుత్..సాగు భళా

సౌర విద్యుత్ ద్వారా పంటలు సాగు చేస్తూ ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దుర్వగూడ గ్రామానికి చెందిన రైతు రమేశ్ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. పంట చేలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నాలుగేళ్ల క్రితం నాబార్డు ద్వారా రూ. 5,17,806 ఆర్థికసాయంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశాడు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తో తనకున్న 8 ఎకరాలు సాగు చేశాడు. అందులో 2 ఎకరాల్లో పెసర్లు, మినుములు, గోధుమ, శనగ, మిరప వంటి వాణిజ్య పంటలేశాడు. గతేడాది విద్యుత్ సౌకర్యం సమకూరగా, కరెంట్ లేని సమయంలో సోలార్ విద్యుత్ వాడుతున్నాడు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఎరుపెక్కిన ఇంద్రావతి

▶ మొదటి పేజీ తరువాయి

ఏకే 47, ఇన్సాస్, ఎస్‌ఎల్‌ఆర్ రైఫిళ్లను, పేలుడు పదార్థాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.



మృతుల్లో తెలంగాణ నేతలు?

ఛత్తీస్‌గఢ్ – మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఇంద్రావతి నేషనల్ పార్కులో మావోయిస్టు తెలంగాణ స్టేట్ కమిటీ షెల్టర్ తీసుకోగా, ఇంద్రావతి ఏరియా కమిటీ రక్షణగా ఉందని పోలీసులకు సమాచారం అందింది. దీనితో వివిధ భద్రతా దళాలకు చెందిన 650 మందికిపైగా జవాన్లు వేర్వేరు దిశల నుంచి శుక్రవారం రాత్రి కూంబింగ్ చేపట్టారు. శనివారం రాత్రికల్లా మావోయిస్టులు ఉన్న ప్రదేశాన్ని భద్రతా దళాలు చుట్టుముట్టాయి. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో బలగాలను గమనించిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఎన్‌కౌంటర్ మృతుల్లో ఎక్కువ మంది జనమిలీషియా సభ్యులే ఉన్నట్టు సమాచారం. వారితోపాటు తెలంగాణ కమిటీకి చెందిన కీలక నేత కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. మృతదేహాల గుర్తింపు ప్రక్రియ మొదలైతే ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశముంది. కాగా.. ఎదురు కాల్పుల్లో మృతి చెందిన పోలీసులలో ఒకరు డీఆర్‌జీ జవాన్ నరేశ్‌కుమార్ (42)గా, మరొకరు స్పెషల్ టాస్క్ ఫోర్స్ జవాను వసిత్ రావ్ (32) అని అధికారులు ప్రకటించారు.

టార్గెట్ చేసి.. రెండోసారి..

భద్రతా దళాలు కొన్ని నెలలుగా మావోయిస్టు తెలంగాణ కమిటీ టార్గెట్‌గా పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని పూజారీ కాంకేర్ అడవులను జల్లెడపట్టడం మొదలుపెట్టాయి. ఈ క్రమంలో జనవరి 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోగా.. మిగిలినవారు తప్పించుకున్నారు. ఆ ఘటనలో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి దామోదర్ అలియాస్ బడే చొక్కారావు మృతి చెందినట్టు ప్రచారం జరిగింది. కానీ దామోదర్ సురక్షితంగానే ఉన్నారని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ క్రమంలో రెండోసారి తెలంగాణ కమిటీ లక్ష్యంగా ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి.

దండకారణ్యంపై భద్రతా దళాల పట్టు

మావోయిస్టులు స్థాపించిన జనతన సర్కారుకు దండకారణ్యమే కేంద్ర బిందువుగా నిలిచింది. కానీ గడిచిన ఏడాదిలో భద్రతా బలగాలు దండకారణ్యాన్ని క్రమంగా తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నాయి. గత ఏడాది చివరిలో కొండపల్లిలో భద్రతా దళాల క్యాంపు ఏర్పాటైన తర్వాత.. దండకారణ్యం తమకు సురక్షితం కాదని మావోయిస్టులు నిర్ణయానికి వచ్చారు. అక్కడున్న వివిధ కమిటీలు, దళాలకు చెందిన కీలక నేతలు సమీపంలో ఉన్న టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు తరలివెళ్లినట్టు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం.

టైగర్ రిజర్వ్‌లపై ఫోకస్

ఇంద్రావతి నేషనల్ పార్క్ 2,779 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించి ఉంది. దీన్ని 1983లో టైగర్ రిజర్వ్‌గా ప్రకటించారు. మావోయిస్టుల అడ్డాలైన అబూజ్‌మడ్, దండకారణ్యం మధ్య ఈ అడవి వారధిగా నిలిచింది. ఇందులో సగానికిపైగా మావోయిస్టుల ఆధీనంలోనే ఉంది. ఫారెస్టు గార్డులు కూడా అక్కడ కాలు పెట్టలేని పరిస్థితి ఉందని అంటారు. ఇలా టైగర్ రిజర్వులలో షెల్టర్ తీసుకుంటున్న మావోయిస్టులపై కొన్నేళ్లుగా భద్రతా దళాలు ఫోకస్ చేశాయి. ఇంతకుముందు ఉదంతి – సీతానది టైగర్ రిజర్వ్‌లో భాగంగా ఉన్న ఘరియాబండ్ అడవుల్లో జనవరి 24న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి సహా 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పుడు ఇంద్రావతి రిజర్వు ఫారెస్ట్‌లో ఏకంగా 31 మంది మృతి చెందారు.

చిలుకూరు బాలాజీ అర్చకుడు రంగరాజన్‌పై దాడి

- రామరాజ్యం సైన్యం పేరుతో పూజారికి బెదిరింపులు
- ఉగాదిలోపు సైన్యం, ధనం సమకూర్చాలని డిమాండ్
- ఒప్పుకోకపోవటంతో రంగరాజన్‌పై దాడి
- రంగరాజన్ తండ్రి ఫిర్యాదుతో నిందితుడు వీరరాఘవరెడ్డి అరెస్టు



అర్చకుడు రంగరాజన్‌ను బెదిరిస్తున్న వీరరాఘవరెడ్డి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై దాడి జరిగింది. రామరాజ్యం సైన్యం పేరుతో ఓ సంస్థను నడుపుతున్న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన వీర రాఘవరెడ్డి శుక్రవారం ఉదయం 20 మంది అనుచరులతో రంగరాజన్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బెదిరింపులకు దిగాడు. ఉగాదిలోపు సైన్యాన్ని, ధనాన్ని సమకూర్చాలని డిమాండ్ చేశాడు. అందుకు అంగీకరించకపోవటంతో రంగరాజన్‌పై చేయిచేసుకున్నాడని ఆయన తండ్రి ఎంవీ సౌందరరాజన్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదుచేసి నిందితుడు వీరరాఘవరెడ్డిని ఆదివారం అరెస్టు చేసినట్లు మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నల్ల దుస్తులు, కాషాయ కండువాలు ధరించిన వ్యక్తులు అర్చకుడు రంగరాజన్‌ను బెదిరిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నిందితులే ఈ వీడియోను పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

రాజ్యాంగ బద్ధంగానే నడుచుకుంటాం

చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి ఆలయాల పరిరక్షణ ఉద్యమాన్ని నడిపాం. రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటూ ఆలయాలను పరిరక్షిస్తున్నాం. రామరాజ్యం పేరుతో కొంతమంది వచ్చి మద్దతివ్వాలని బెదిరించారు. నేను కుదరదని చెప్పటంతో దాడి చేశారు. పోలీసులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటారు.

– రంగరాజన్, అర్చకుడు.

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ పోలీసుల ఆరా

- మృతుల్లో వెస్ట్ బస్తర్ డీవీసీ ఉంగన్న ఉన్నట్టుగా ప్రాథమిక సమాచారం
- మరికొందరు తెలంగాణకు చెందిన మావోయిస్టుల సమాచారం సేకరిస్తున్న ఉన్నతాధికారులు
- భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో భద్రత కట్టుదిట్టం

సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఆదివారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 31 మంది మావోయిస్టులు, ఇద్దరు జవాన్లు మృతిచెందినట్టు బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజు ఇప్పటికే ధ్రువీకరించారు. ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే రెండో భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో మృతుల్లో తెలంగాణకు చెందిన మావోయిస్టు నాయకులెవరైనా ఉన్నారా? అని తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ప్రాథమికంగా అందుతున్న సమాచారం ప్రకారం.. వెస్ట్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడు ఉంగన్న ఉన్నట్టుగా తెలంగాణ పోలీసులు అనుమానిస్తున్నారు. అదేవిధంగా ఇతరుల సమాచారంపైనా ఛత్తీస్‌గఢ్ పోలీసులతో ఆరాతీస్తున్నారు. కాగా, తెలంగాణ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల ఎస్పీలను పోలీస్ ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో నిఘా పెంచారు. ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు తెలంగాణ వైపు రాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీస్, స్థానిక పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు కూంబింగ్ ఆపరేషన్లు.. వాహనాల తనిఖీలు ముమ్మురం చేశాయి. తెలంగాణ ప్రాంతానికి చెందిన మావోయిస్టుల మృతిపై సమాచారం సేకరిస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

మధ్యవర్తిత్వానిదే భవిష్యత్

వలంటీర్ల శిక్షణకార్యక్రమంలో ఏసీజే సుజోయ్‌పాల్



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్ మధ్యవర్తిత్వానిదేనని, కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని కమ్యూనిటీ మీడియేటర్లకు ఏసీజే, టీఎస్ఎల్ఎస్ఏ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్ సూచించారు. సోమాజిగూడలోని సంస్కృతి రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 9 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. 12 వరకు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని వలంటీర్లకు పిలుపునిచ్చారు. న్యాయస్థానాలపై పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంలో మధ్యవర్తిత్వం ప్రధాన భూమిక పోషించనుందని ఆయన అభిప్రాయపడ్డారు. మూడు రోజులపాటు 20 గంటలు శిక్షణ ఇవ్వనున్నట్లు టీఎస్ఎల్ఎస్ఏ సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి పేర్కొన్నారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో కమ్యూనిటీ సెంటర్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తామని వెల్లడించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి 132 మంది హాజరయ్యారు.

ఘనంగా ప్రారంభమైన మేరీమాత ఉత్సవాలు

గుణదలకొండకు పోటెత్తిన భక్తులు



జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న బిషప్ రాజారావు

గుణదల (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గుణదలలో మేరీమాత ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధానాలయం దిగువన ఉన్న బిషప్ గ్రాసి పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. బిషప్ రాజారావు భక్తులకు సందేశమిచ్చారు. జూబిలేరియన్ గురువు పుతుకులంగర జోసెఫ్ వాక్యోపదేశం చేస్తూ..దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదన్నారు. సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఉత్సవాల్లో తొలిరోజైన ఆదివారం నాడు సెలవు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యక్షేత్రానికి వచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వీరి కోసం గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. నలుగురు కూలీల దుర్మరణం

ముప్పాళ్ల: ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు కూలీలు మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం బొల్లవరం గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెంకి చెందిన 20 మంది మహిళా కూలీలు ట్రాక్టర్‌పై మిరపకాయలు కోసేందుకు వెళ్లారు. పనులు ముగించుకుని వారంతా ట్రాక్టర్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా బొల్లవరం సమీపంలోని కాలువ కట్టపై ట్రాక్టర్ ఒక్కసారిగా తిరగబడింది. ట్రాక్టర్‌లో ఉన్న కూలీలంతా చెల్లాచెదురుగా కింద పడిపోయారు. ట్రాక్టర్ కింద నలిగిపోయిన కూలీలు మధిర గంగమ్మ (55), తేనేపల్లి పద్మ (48), చెక్కెర మాధవి (30) అక్కడికక్కడే మృతి చెందారు. మధిర సామ్రాజ్యం (65)కు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను సత్తెనపల్లి వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందింది. మరో 15 మంది కూలీలకు గాయాలయ్యాయి. మృతి చెందిన కూలీలంతా చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన వారే. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ముప్పాళ్ల పోలీసులు సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ముప్పాళ్లలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదం పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సంగారెడ్డి జిల్లా కేరాఫ్ పంట వైవిధ్యం

- రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వాము, ధనియాలు, మెంతులు, వెల్లుల్లి తదితర పంటల సాగు
- నేలల స్వభావం అనుకూలంగా ఉండటంతో విభిన్న పంటలకు వీలు
- జిల్లాలో ప్రత్యేక వాతావరణ పరిస్థితులు ఉండటం కూడా కారణమే
- మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరుకుంటున్న అన్నదాతలు



వాము పంట



ధనియాల పంట

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రంలో సాధారణంగా ఒక జిల్లాలో వరి అత్యధికంగా సాగైతే మరో జిల్లాలో పత్తి, ఇంకోచోట మొక్కజొన్న ఎక్కువగా పండుతుంటుంది. కానీ సంగారెడ్డి జిల్లా మాత్రం వైవిధ్యమైన పంటల సాగుకు నిలయంగా మారింది. జిల్లావ్యాప్తంగా వాము, అల్లం, పసుపు, ధనియాలు, ఎండుమిర్చి, మెంతులు, వెల్లుల్లి వంటి పది రకాల పంటలు సుమారు 2,600 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో కొన్ని సుగంధద్రవ్యాల పంటలు కూడా ఉన్నాయి.

ఏ పంట ఎంత సాగు అంటే..

జిల్లాలో అల్లం పంట ఎక్కువగా కోహీర్, మొగుడంపల్లి, జహీరాబాద్, ఝరాసంఘం వంటి మండలాల్లో సాగవుతోంది. ఉద్యానవనశాఖ గణాంకాల ప్రకారం 1,700 ఎకరాల్లో రైతులు ఈ పంటను పండిస్తున్నారు. అలాగే కొండాపూర్, సంగారెడ్డి, సదాశివపేట మండలాల్లో రైతులు 240 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. మరోవైపు వామును కూడా జిల్లా రైతులు పండిస్తున్నారు. సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట మండలాల పరిధిలో సుమారు 200 ఎకరాల్లో వాము సాగవుతోంది. పోపు దినుసుల్లో ఒకటైన ధనియాల సాగు కూడా జిల్లాలో సుమారు 100 ఎకరాల్లో సాగవుతోందని అధికారులు పేర్కొంటున్నారు. జహీరాబాద్ వ్యవసాయ డివిజన్‌లో ధనియాల సాగు ఎక్కువగా ఉంటోంది. ఇక రాయ్‌కోడ్, ఝరాసంఘం వంటి మండలాల్లో ఎండుమిర్చిని కూడా రైతులు సాగు చేస్తున్నారు. ఇవే కాకుండా కాస్త తక్కువ విస్తీర్ణంలో రైతులు మెంతులు, వెల్లుల్లి సాగు చేపడుతున్నారు.

అనుకూల నేలలు..

విభిన్న పంటలు సాగు చేయాలంటే ప్రత్యేక వాతావరణ పరిస్థితులు ఉండాలి. అలాగే అనుకూలమైన నేలలు కూడా అవసరం. జిల్లాలో నేలల స్వభావం విభిన్నంగా ఉండటంతో వైవిధ్యమైన పంటల సాగుకు యోగ్యమవుతోందని వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలో ల్యాటరైట్ నేలలు, నల్లరేగడి భూములు, గడ్డి నేలలు ఉన్నందువల్లే రకరకాల పంటల సాగు వీలవుతోందంటున్నారు. జహీరాబాద్, సంగారెడ్డి వ్యవసాయ డివిజన్లలో ల్యాటరైట్ నేలలున్నాయి. మరోవైపు సంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. జహీరాబాద్ చుట్టుపక్కల మండల్లాలో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతుంటాయి. కోహీర్ మండలంలో చలికాలంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల దాకా పడిపోతుంటాయి.

మార్కెటింగ్ సౌకర్యం లేక

విభిన్న పంటలను సాగు చేస్తున్న తమకు మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద రైతుల్లా హైదరాబాద్‌కు సొంతంగా పంటలను తరలించే స్తోమత లేక సదాశివపేట, ఆందోల్, సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రైవేటు వ్యాపారులు ఇచ్చే రేటుకే విక్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వం తమ పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ధనియాలు సాగు చేస్తున్నా..



తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వస్తుందని కొన్నేళ్లుగా ధనియాలు వేస్తున్నా. ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. క్వింటాల్‌కు రూ. 5 వేల దాకా ధర పలుకుతోంది. ఖర్చులు పోగా ఎకరానికి రూ. 25 వేలు మిగులుతున్నాయి.

– రాయికోటి నర్సిములు, ధనియాల రైతు, కంబాలపల్లి, సంగారెడ్డి జిల్లా

కష్టానికి తగ్గ ఫలితమని మిర్చి వేస్తున్నా..



ఎకరం విస్తీర్ణంలో రూ. లక్ష పెట్టుబడితో గుంటూరు రకం మిర్చి సాగు చేస్తున్న. ఇప్పటికే 30 క్వింటాళ్ల పచ్చిమిర్చి విక్రయించా. 12 క్వింటాళ్ల ఎండు మిర్చిని వరంగల్ మార్కెట్‌లో విక్రయిస్తే రూ. లక్షన్నర వచ్చాయి. పెట్టుబడులు పోగా పడిన కష్టానికి కొంత ఫలితం దక్కుతోంది.

– శంకర్, మిర్చి రైతు, ఉల్దేర, సంగారెడ్డి జిల్లా

4 ఎకరాల్లో వాము వేశా..



నాకున్న 4 ఎకరాల్లో వాము (ఓమ) పంట వేశా. క్వింటాల్‌కు రూ. 20 వేలు ధర పలికింది. ఎనిమిది క్వింటాళ్ల పంట పండింది. పెట్టుబడి కూడా తక్కువ ఉంది.

– కిష్టారెడ్డి, ఓమ రైతు, మునిదేవునిపల్లి, సంగారెడ్డి జిల్లా

సన్నిధి

మన గుడి... మన ఉత్సవం



మూల విరాట్ విగ్రహం
పరశురామ ప్రతిష్ఠిత

తెలంగాణలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాల్లో ప్రత్యేకమైనది నల్లగొండ జిల్లా చెరువుగట్టులోని పార్వతీ సమేత జడల రామలింగేశ్వరాలయం. పరమ పవిత్ర క్షేత్రంగా భక్తుల నీరాజనాలందుకుంటోంది. ఇక్కడి శివుడికి మొక్కితే ఎలాంటి బాధలైనా పోయి, ఆరోగ్యం ప్రాప్తిస్తుందని నమ్ముతారు. అందుకే ఈ క్షేత్రాన్ని ఆరోగ్యక్షేత్రంగా పిలుస్తారు. 3, 5, 7, 9, 11 అమావాస్య రాత్రులు ఈ క్షేత్రంలో స్వామివారి సన్నిధిలో నిద్రిస్తే చీడ పీడలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఇక్కడ అమావాస్య సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అలాంటి క్షేత్రం ఇటీవలే బ్రహ్మోత్సవాలను పూర్తి చేసుకుంది. ప్రతి ఏటా మాఘ శుద్ధ పంచమి నాటి నుంచి ఆరు రోజుల పాటు ఇక్కడ జాతర నిర్వహిస్తారు. ఆ సమయంలో పెద్ద సంఖ్యలో శివ సత్తులు ఇక్కడకు చేరుకుంటారు. అగ్ని గుండాలు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణ. రథ సప్తమి శివ కళ్యాణానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. లోక కల్యాణార్థం పరశురాముడు 108 క్షేత్రాల్లో స్వయంగా ప్రతిష్ఠించిన శివలింగాలలో ఇది చివరిదిగా ప్రతీతి. పశ్చిమాభిముఖంతో శివుడు కొలువై ఉండడం ఈ క్షేత్రం ప్రత్యేకత.

జడల రామలింగేశ్వరుడు

పూర్వం హైహయ వంశ మూల పురుషుడు, కార్తవీర్యార్జునుడు వేటకోసం దండకారణ్యానికి వెళతాడు. అవిశ్రాంతంగా వేటాడిన పిదప బడలికకు గురైన చక్రవర్తి సపరివారంగా సమీపంలోని జమదగ్ని ఆశ్రమానికి వెళతాడు. అప్పుడు జమదగ్ని మహర్షి తన దగ్గరున్న కామధేనువు సహాయంతో అందరికి భోజనాన్ని ఏర్పాటు చేస్తాడు. ఆ ధేనువు మహత్తును మహర్షి దగ్గర అడిగి తెలుసుకున్న కార్తవీర్యార్జునుడు తనకు ఆ ధేనువును ఇవ్వాలని అడుగుతాడు. అందుకు మహర్షి తిరస్కరించడంతో కోపోద్రిక్తుడైన కార్తవీర్యార్జునుడు, జమదగ్నిని సంహరించి కామధేనువును తీసుకువెళతాడు. ఆ సమయంలో బయటకు వెళ్లి వచ్చిన పరశురాముడు జరిగిన విషయం తెలుసుకొని తన తండ్రిని చంపిన కార్తవీర్యార్జునుని పరశువు (గొడ్డలి) తో సంహరిస్తాడు. అంతేకాదు రాజులపై కోపంతో భూప్రదక్షిణం చేసి క్షత్రియ సంహారం చేస్తాడు. అనంతరం పాప పరిహారార్థం దేశం నలుమూలలా 108 శివలింగాలను ప్రతిష్ఠించి, ఒక్కొక్క లింగం చెంత వేల సంవత్సరాలు తపస్సు చేసి, ఆ తపోఫలాన్ని ఆ క్షేత్రానికి ధారపోసి మానవ కల్యాణానికి పాటుపడతాడు. అలా చివరగా ప్రతిష్ఠించిన 108వ శివ లింగం వద్ద ఎంత తపస్సు చేసినా శివుడు ప్రత్యక్షం కాకపోవడంతో, కోపగించుకున్న పరశురాముడు తన గడ్డలితో శివలింగం ఊర్ధ్వభాగంపై ఒక దెబ్బ వేశాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమై, ఇంతకాలం నువ్వు తపస్సు చేసిన ప్రాంతం, ప్రముఖ శైవక్షేత్రంగా వెలుగొందుతుందని, కలియుగాంతం వరకు తానిక్కడే ఉండి భక్తులను అనుగ్రహి స్తుంటానని చెబుతారు. అనంతరం పరశురాముడు కూడా ఇక్కడే లింగాకృతి పొంది శివైక్యం పొందారని స్థల పురాణం చెబుతోంది.


ఆలయ ప్రాంగణం


పార్వతి జడల రామలింగేశ్వర స్వామి గుట్ట

మూడు గుండ్ల ఆకర్షణ

ఆలయం పక్కనే మూడు గుండ్లు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. వాటిల్లో మొదటి రెండింటినీ ఎక్కి మూడో దాన్ని చేరితే అక్కడ ఓ శివలింగం దర్శనమిస్తుంది. అయితే ఈ రాళ్లను ఎక్కేదారి క్లిష్టంగా ఉంటుంది. రాయి నుంచి రాయిని చేరే మధ్యలో ఉండే సందు చాలా ఇరుకుగా ఒక బక్కపల్చటి మనిషి అతి కష్టం మీద దాటే దారిలా కనిపిస్తుంది. ఎంత శరీరం ఉన్నవారైనా శివ నామస్మరణచేస్తూ వెళితే అందులో నుంచి అవతలికి సులభంగా చేరగలగటం శివుని మహిమకు తార్కాణంగా చెబుతారు. అయితే ప్రసుత్తం మూడు గుండ్లపైకి అందరూ వెళ్లి దర్శనం చేసుకునేందుకు ఇనప మెట్లను ఇరువైపులా ఏర్పాటు చేశారు.

ఎల్లమ్మకు బోనాలు

కొండపైకి కాలినడకన వెళ్లవచ్చు. మెట్ల దారిలో వెళ్లే భక్తులు కాలభైరవుని దర్శనం చేసుకుంటారు. అనంతరం కోనేరుకు చేరుకొని స్నానం చేసి భక్తులు ముడుపుల గట్టు వద్దకు వెళ్లి అక్కడి చెట్టు కింద చెక్కతో చేసిన స్వామి పాదుకలను తమ శరీరం మీద ఉంచుకుని మొక్కుతారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని ఆంజనేయుడు, ఎల్లమ్మ, పరశురాములని దర్శించుకుంటారు. ఇక్కడ ఎల్లమ్మ దేవతకు బోనం తయారు చేసి నైవేద్యం సమర్పిస్తారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. శివశక్తులు నాట్యాలు చేస్తుంటారు.అనంతరం భక్తులు గట్టు కింద ఉన్న పార్వతీ అమ్మవారిని దర్శనం చేసుకుంటారు. కోరికలు నెరవేరిన వారు పల్లకి సేవ, వాహన సేవ, కోడెలు కడతారు. త్వరలో శివరాత్రికి ఇక్కడ జరగనున్న విశేష పూజలకు ముస్తాబవుతోంది ఆలయం.

– చింతకింది గణేష్, సాక్షి ప్రతినిధి, నల్లగొండ


అతిపెద్ద శివుని విగ్రహం

ఆ పేరెలా వచ్చిందంటే...

రామలింగేశ్వరుని ఊర్ధ్వ భాగాన పరశురాముడు గండ్ర గొడ్డలితో దెబ్బవేసిన చోట జడల వంటి రేఖలు ఉండటం వల్ల స్వామిని జడల రామలింగేశ్వరస్వామి అంటారు. చెరువు గట్టున ఉండటంతో చెరువుగట్టు జడల రామలింగేశ్వరాలయం అంటారు. కొండ దిగువన పార్వతీదేవి కొలువై ఉండటంతో పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంగా ప్రసిద్ధికెక్కింది. కొండపై జడల రామలింగేశ్వరునికి 12వ శతాబ్దానికి చెందిన కాకతీయ గణపతి దేవ చక్రవర్తి గుహాలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయంలో తొలి ఏకాదశినాడు, కార్తీక సోమవారాల్లో, పౌర్ణమి, మహాశివరాత్రి పర్వదినాలలో కడువైభవంగా ఉత్సవాలు జరుగుతుంటాయి. అలాగే ప్రతి ఏటా అమావాస్యనాడు అన్నదానం చేస్తాం.

– పోతలపాటి రామలింగేశ్వర శర్మ, ప్రధాన అర్చకులు



మమ్ము ఆశీర్వదించు మేరీమాతా!

గుణదల తిరునాళ్ల సంరంభం


విద్యుత్ దీపాల వెలుగుల్లో మేరీమాత స్వరూపం, గుణదల మాత ఆలయం

దేశంలోని క్రైస్తవ పుణ్య క్షేత్రాలలో రెండవ అతి పెద్ద ఆలయంగా విజయవాడలోని గుణదల మేరీ మాత క్షేత్రం ప్రఖ్యాతి చెందింది. ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు ఈ పుణ్యక్షేత్రానికి వచ్చి మరియమాతను దర్శించుకుంటారు. తమ మొక్కుబడులు చెల్లించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ప్రతి యేటా ఈ పుణ్యక్షేత్రంలో జరిగే ఉత్సవాలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశ విదేశాల నుంచీ లక్షలాది యాత్రికులు తరలి వచ్చి ఈ ఉత్సవాలలో పాల్గొంటారు.

నూరేళ్ల క్రితమే ప్రతిష్ఠ..

కతోలిక క్రైస్తవులు భారతదేశంలో సేవ నారంభించిన తొలినాళ్లలో అనగా 1925లో గుణదల ప్రాంతంలో విద్యాబోధన ప్రారంభించారు. గుణదల కొండ సమీపంలో సెయింట్ జోసెఫ్ ఇన్‌స్టిట్యూట్‌కి అప్పటి రెక్టర్ ఫాదర్ గా పనిచేస్తున్న అర్లాటి స్వామి కొండ పైభాగంలో సహజసిద్ధం గా ఉన్న కొండ గుహను గుర్తించారు. భక్తులలో ఆధ్యాత్మికతను పెంపొందించాలనే సంకల్పంతో ఆ గుహలో మరియమాత స్వరూపాన్ని ప్రతిష్ఠించారు. ఆనాటి నుంచీ కతోలిక క్రైస్తవులు, ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు కొండపై ఉన్న మరియమాత స్వరూపాన్ని ఆరాధించడం ప్రారంభించారు. ఆ రోజుల్లో యేడాదికి ఒకసారి ఫిబ్రవరి 11వ తేదీన మరియమాత ఉత్సవాలను జరుపుకోవడం సంప్రదాయమైంది.

అర్లాటి స్వామి మేరీమాత స్వరూపాన్ని ప్రతిష్ఠ చేసిన నాటి నుంచీ మేరీ మాత పుణ్యక్షేత్రం దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందింది. కొండ శిఖరాగ్రాన యేసుక్రీస్తు శిలువను ప్రతిష్ఠించారు.1937లో కొండగుహలో మేరీమాత విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేశారు. అటుపై ప్రత్యేకప్రార్థనలు, సమిష్టి దివ్యబలి పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు బలిపీఠాన్ని నిర్మించారు. కొండగుహను తొలిచి మెట్ల మార్గాలు ఏర్పాటు చేశారు. 1948లో కొండ శిఖరాగ్రానికి చేరుకునే దారిలో దేవ రహస్యములు తెలియపరిచే విధంగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. గుణదల పుణ్యక్షేత్రంలో పనిచేసే గురువులు భక్తులకోసం మౌలిక సదుపాయాలు, మెట్లమార్గాలు ఏర్పాటు చేశారు. రానురాను ప్రాచుర్యం పెరిగి భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో మేరీ మాత ఉత్సవాలను నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టారు.

మూడు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు

ఉత్సవాల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బిషప్ గ్రాసి స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో సమష్టి దివ్య బలిపూజ ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. అంతేకాకుండా నిరంతరం క్రైస్తవ భక్తి గీతాలాపనలు, ప్రత్యేక ప్రసంగాలు, క్రైస్తవ నాటికలు ప్రదర్శిస్తున్నారు.



ఆచారాలు

కులమతాలకు అతీతంగా భక్తులు ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుంటారు. తొలుత మరియమ్మ తల్లిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటారు. మైనపువత్తులు వెలిగించటం, కొబ్బరికాయ లు కొట్టడం, తలనీలాలు సమర్పించడం, చెట్లకు ఉయ్యాలలు కట్టడం, దివ్యపూజలు చేయించడం, యాత్రికులు నిద్ర చేయటం వంటి ఆచారాలను అనుసరిస్తుంటారు.

మహోత్సవాలు ప్రారంభం

ప్రస్తుతం 101వ తిరునాళ్ల మహోత్సవాలు జరుగుతున్నాయి. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వారు సుమారు 10 లక్షల మందికి పైగా విచ్చేస్తారని అంచనా. మూడు రోజుల పాటు నిర్వహించే ప్రార్థనల్లో కర్నూలు పీఠాధిపతి గోరంట్ల జ్వాన్నేస్, ఖమ్మం పీఠాధిపతి సగతి ప్రసాద్ తదితరులు పాల్గొంటున్నారు.

ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభం

ఆదివారం ఉదయం విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, గుణదల పుణ్యక్షేత్రం రెక్టార్ ఫాదర్ యేలేటి విజయం జయరాజులు ప్రత్యేక ప్రార్థనలు, సమష్టి దివ్యబలి పూజ సమర్పించి తిరునాళ్ల మహోత్సవాలను ప్రారంభించారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవ గురువులు సందేశాలిచ్చారు.

– చక్రాల శరత్ రాజు, సాక్షి, గుణదల (విజయవాడ తూర్పు)

సాక్షి సినిమా


● రవితేజ

క్రేజీ కాంబినేషన్?

హీరో రవితేజ, దర్శకుడు కిషోర్ తిరుమల కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల రవితేజను కలిసి ఓ కథను వినిపించారట కిశోర్ తిరుమల. ఈ స్క్రిప్ట్ నచ్చడంతో ప్రాథమికంగా రవితేజ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, కథ మొత్తం పూర్తయిన తర్వాత ఫైనల్ నరేషన్ విని ఈ సినిమాపై రవితేజ ఓ నిర్ణయం తీసుకుంటారని టాక్. మరి.. ఈ క్రేజీ కాంబినేషన్‌లో మూవీ సెట్ అవుతుందా? వేచి చూడాలి.


● సాహు గారపాటి, అనిల్ రావిపూడి, చిరంజీవి, విశ్వక్ సేన్, రామ్ నారాయణ్, ఆకాంక్షా శర్మ

ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్ - చిరంజీవి

''ఇండస్ట్రీలో అందరూ ఒక కుటుంబ సభ్యుల్లా కలిసి మెలిసి, మంచి సుహృద్భావ వాతావరణంలో ఉన్న రోజున అందరూ ఆనందంగా, గొప్పగా చెప్పుకుంటారు. అందుకే సాహు, విశ్వక్ సేన్ వచ్చి అడగ్గానే 'లైలా' ఫంక్షన్‌కి వచ్చాను. నాకు తెలిసి ఇకపై ఆ కాంపౌండ్.. ఈ కాంపౌండ్ అంటారని అనుకోవడం లేదు. ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్ అంతే'' అని హీరో చిరంజీవి అన్నారు. విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ జంటగా నటించిన చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'లైలా మెగా మాస్ ఈవెంట్'కి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ–''విశ్వక్ సేన్ 'లైలా' ఫంక్షన్‌కి నేను వెళుతున్నానని చెప్పినప్పుడు కొందరు.. 'విశ్వక్ సేన్ ఫంక్షన్‌కి వెళుతున్నావా? అతను మన మనిషి కాదు.. అవతల బాలకృష్ణ... అప్పుడప్పుడు తారక్ అంటాడు' అన్నారు. మనుషులన్నాక వేరే వాళ్లమీద అభిమానం, ప్రేమ ఉండకూడదా? నామీద ఆప్యాయత ఉండకూడదా? ఇదేంటిది?. మా ఇంట్లోనే మా అబ్బాయికి(రామ్‌చరణ్) సూర్య అంటే చాలా ఇష్టం. అంత మాత్రాన వాడి ఫంక్షన్స్‌కి నేను వెళ్లకూడదా? వాడితో కలిసి భోజనం చేయకూడదా? వాడితో ఉండకూడదా?. మా హీరోల మధ్య సఖ్యత ఉండదేమో అనుకుని గతంలో అభిమానులు కొట్టుకుని చచ్చేవాళ్లు. వాల్‌పోస్టర్లు చింపుకునేవాళ్లు. నెల్లూరులోని మా కజిన్స్‌లో ఇద్దరు సొంత అన్నదమ్ములైనా ఒకరు ఎన్టీఆర్, మరొకరు ఏఎన్ఆర్‌గార్లను అభిమానించే వాళ్లు. వాళ్లిద్దరూ ఓ రోజు రక్తం వచ్చేలా కొట్టుకున్నారు.. అప్పుడు నేను వాళ్ల కంటే చిన్నవాణ్ణి కావడంతో కంగారు పడ్డాను. సినిమా హీరోలంటే బాగానే ఉంటారు.. కానీ వీళ్లు కొట్టుకుని చస్తారేంటి అని ఆరోజే అనిపించింది. నేను ఫిల్మ్ యాక్టర్ అయిన తర్వాత హీరోల మధ్య ఓ సఖ్యత, సుహృద్భావ వాతావరణం ఏర్పాటు చేయాలని బలంగా కోరుకున్నాను. మద్రాస్‌లో హనీ హౌస్‌లో అందరం కలిసి పార్టీలు చేసుకునే వాళ్లం. ఈ రోజుకి నేను, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేశ్ అంతా కలిసికట్టుగా ఉంటాం. మా మధ్య ఎలాంటి అరమరికలు లేవు. మన ఇమేజ్, ఫ్యాన్ బేస్ పెరగాలంటే మనం చేసే సినిమాలను బట్టి ఉంటుందే తప్ప మనం దూరంగా ఉండటం వల్ల కాదు. 'పుష్ప 2' సినిమా పెద్ద హిట్ అయినందుకు గర్విస్తాను. మన సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు కానీ, ఇండస్ట్రీలో ఓ సినిమా ఆడిందంటే ప్రతి ఒక్కరూ హర్షించాలి. ఎందుకంటే ఓ సినిమా మీద ఎంతో మంది జీవితాలు ఆధారపడి ఉంటాయి. ఒక్క హిట్ ఏ హీరోకి వచ్చినా సరే అందరం ఆనంద పడాలి. ఆ వచ్చిన డబ్బు మళ్లీ ఇండస్ట్రీలోనే సినిమాలపైనే పెడతారు నిర్మాతలు. 'లైలా' ట్రైలర్ చూసిన తర్వాత విశ్వక్ నిజంగా ఆడపిల్ల అయ్యుంటే గుండెజారి గల్లంతయ్యేది(నవ్వుతూ).. అంతగ్లామర్‌గా ఉన్నాడు. 'లైలా' బ్లాక్‌బస్టర్ గ్యారెంటీ'' అన్నారు. **విశ్వక్ సేన్ మాట్లాడుతూ**–''నా సినిమాని సపోర్ట్ చేయడానికి చిరంజీవిగారు రావడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని తెలిపారు. **డైరెక్టర్ రామ్ నారాయణ్ మాట్లాడుతూ**– ''విశ్వక్ గారు 'లైలా' సినిమా కథ ఒప్పుకోవడమే నాకు ఇచ్చిన పెద్ద గిఫ్ట్.. ఇది జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను'' అన్నారు.



నా హృదయంలో ప్రత్యేక స్థానం - రష్మికా మందన్నా

'పుష్ప: ది రైజ్', 'పుష్ప 2: ది రూల్' సినిమాల్లో శ్రీవల్లి పాత్రతో జాతీయ స్థాయిలో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు రష్మికా మందన్నా. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన 'పుష్ప: ది రైజ్'(2021), 'పుష్ప 2: ది రూల్'(2024) సినిమాలు ఏ స్థాయిలో విజయం సాధించి, వసూళ్లతో పాటు రికార్డులు సాధించాయో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో 'పుష్ప 2: ది రూల్' థ్యాంక్స్ మీట్ ఘనంగా నిర్వహించారు మేకర్స్. అయితే జిమ్‌లో కాలికి తగిలిన గాయం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్న రష్మిక ఈ థ్యాంక్స్ మీట్‌కు హాజరుకాలేకపోయారు. దీంతో చిత్రయూనిట్‌కి కృతజ్ఞతలు చెబుతూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు రష్మిక. ''శనివారం జరిగిన 'పుష్ప 2: ది రూల్' థ్యాంక్స్ మీట్‌లో నేను పాల్గొనలేకపోయాను. కానీ, ఈ మూవీ గురించి కొన్ని విషయాలు పంచుకోవాలనుకుంటున్నా. సుకుమార్ సర్, అల్లు అర్జున్, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థకు కృతజ్ఞతలు. మీరు ఎంతో శ్రమించి మాకు ఇలాంటి మాస్టర్ పీస్‌ను ఇచ్చినందుకు ఒక ప్రేక్షకురాలిగా థ్యాంక్స్. అదే విధంగా శ్రీవల్లిగా చెప్పాలంటే మీకు ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ చిత్రం కోసం అన్ని విభాగాలు బాగా పని చేశాయి. ఈ ప్రయాణంలో నన్ను భాగం చేసినందుకు, నాకు ఎప్పటికీ గుర్తుండిపోయే స్పెషల్ రోల్ ఇచ్చినందుకు ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు రష్మిక.

కొచ్చి టు ఢిల్లీ


● నయనతార, మమ్ముట్టి

మోహన్‌లాల్, మమ్ముట్టి హీరోలుగా మలయాళంలో ఓ భారీ మల్టీస్టారర్ ఫిల్మ్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మహేశ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఫాహద్ ఫాజిల్, కుంచకో బోబన్, ఆసిఫ్ అలీ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారని తెలిసింది. కాగా ఈ చిత్రంలో మరో కీలక పాత్రలో హీరోయిన్ నయనతార నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ కొచ్చిలో జరుగుతోంది. ఈ మూవీ షూటింగ్‌లో నయనతార జాయిన్ అయ్యారని మేకర్స్ ఆదివారం ప్రకటించారు. అలాగే ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ ఢిల్లీలో జరుగనుందని, ఈ షెడ్యూల్‌తో మేజర్ షూటింగ్ పూర్తవుతుందని సమాచారం. మరోవైపు గతంలో 'తస్కరవీరన్ (2005), రప్పకల్ (2005), భాస్కర్ ది రాస్కెల్ (2015), పుతియ నియమం (2016)' వంటి చిత్రాల్లో మమ్ముట్టి–నయనతార స్క్రీన్ షేర్ చేసుకున్న సంగతి తెలిసిందే.


● ఆరాధ్యా దేవి

సైకలాజికల్ థ్రిల్లర్

ఆరాధ్యా దేవి లీడ్ రోల్‌లో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ నేతృత్వంలో రూపొందిన చిత్రం 'శారీ'. గిరి కృష్ణకమల్ దర్శకుడు. ఆర్‌జీవీ– ఏఏఆర్‌వీఐ ప్రొడక్షన్స్‌పై రవి వర్మ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 28న విడుదలకానుంది. కాగా ఆరాధ్య దేవితో ప్రముఖ స్టిల్ ఫోటోగ్రాఫర్ నవీన్ కళ్యాణ్ 'యానిమల్ ఆరాధ్య' అనే ఫోటో సిరీస్ రూపొందించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రామ్ గోపాల్ వర్మ చేతులమీదుగా ఈ సిరీస్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''అడవి మృగాలంటేనే అందరూ భయపడతారు. కానీ, మా ఆరాధ్య ఎంతో ధైర్యంగా వాటిని మచ్చిక చేసుకుని ఈ ఫోటో సిరీస్ చేసింది. ఇలా అడివి జంతువులతో ఒక అమ్మాయి ఫోటో షూట్ చేయడం సమ్ థింగ్ స్పెషల్. ఆరాధ్య కేరళకు చెందిన అమ్మాయి. సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన 'శారీ'లో తన నటన ఆకట్టుకుంటుంది'' అని చెప్పారు. ''ఈ ఫోటో షూట్ గురించి ఆర్జీవీ సర్ చెప్పినప్పుడు వెంటనే ఒప్పుకున్నాను'' అన్నారు ఆరాధ్యా దేవి. నవీన్ కళ్యాణ్, కాస్ట్యూమ్ డిజైనర్ ప్రణతి వర్మ మాట్లాడారు.


● లత, హర్ష

కథే హీరో

''మదం' సినిమాకు కథే హీరో. ఇందులో భావోద్వేగాలు బాగుంటాయి. మా రమేష్‌గారి కథ, వంశీగారి మేకింగ్ అద్భుతంగా ఉంటుంది. మా సినిమా అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను'' అని హర్ష గంగవరపు తెలిపారు. వంశీ కృష్ణ మల్లా దర్శకత్వంలో హర్ష గంగవరపు, లతా విశ్వనాథ్, ఇనయ సుల్తాన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మదం'. ఏకైవ హోమ్స్ బ్యానర్‌పై సూర్యదేవర రవీంద్రనాథ్ (చిన బాబు), రమేష్ బాబు కోయ నిర్మించిన ఈ సినిమా మార్చి 14న రిలీజ్ అవుతోంది. 'తండేల్' సినిమా ఆడుతున్న థియేటర్లలో 'మదం' మూవీ టీజర్‌ను ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వంశీ కృష్ణ మల్లా మాట్లాడుతూ– ''మదం' వంటి రా, రస్టిక్ సినిమా తెలుగులో రావడం అరుదు. ఈ మూవీని చూడాలంటే చాలా గుండె ధైర్యం కావాలి'' అన్నారు. ''మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు లతా విశ్వనాథ్, ఇనయ సుల్తాన.

సస్పెన్స్ థ్రిల్

సురేష్ రవి, ఆశా వెంకటేశ్ జంటగా జీవీ పెరుమాళ్ దర్శకత్వంలో రూపొందిన ఎమోషనల్ ఎంటర్‌టైనర్ మూవీ 'చంద్రేశ్వర'. బేబీ అఖిల సమర్పణలో రవీంద్రచారి నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే పూర్తయింది. రవీంద్రచారి మాట్లాడుతూ–''ఇదొక ఆర్కియాలజీ నేపథ్యంతో సాగే ఎమోషనల్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. ఈ సినిమాలో ఆధ్యాత్మిక అంశాలు కూడా ఉన్నాయి. శివుని నేపథ్యంతో వచ్చే సాంగ్ అందర్నీ ఆకట్టుకుంటుంది. ఈ నెలాఖరులో సినిమాని రిలీజ్ చేస్తాం'' అని తెలిపారు. ఈ సినిమాకు సంగీతం: జెరాడ్ ఫిలిక్స్.


● ఆశ



259 ఇంగ్లండ్‌తో రెండో మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా వన్డేల్లో అరంగేట్రం చేసిన 259వ భారత క్రికెటర్‌గా వరుణ్ చక్రవర్తి గుర్తింపు పొందాడు. ఇంగ్లండ్‌తో తొలి మ్యాచ్‌లో భారత తరఫున యశస్వి జైస్వాల్ (258వ ప్లేయర్), హర్షిత్ రాణా (257వ ప్లేయర్) వన్డేల్లో అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. ఓవరాల్‌గా ఇంగ్లండ్ జట్టుపై అరంగేట్రం చేసిన 46వ భారత క్రికెటర్‌గా వరుణ్ నిలిచాడు.

4 వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన భారత క్రికెటర్ల జాబితాలో రోహిత్ శర్మ (267 వన్డేల్లో 10,987 పరుగులు) నాలుగో స్థానానికి ఎగబాకాడు. ఇప్పటి వరకు నాలుగో స్థానంలో ఉన్న రాహుల్ ద్రవిడ్ (344 వన్డేల్లో 10,889 పరుగులు) ఐదో స్థానానికి చేరాడు. టాప్-3లో సచిన్ టెండూల్కర్ (463 వన్డేల్లో 18,246 పరుగులు), విరాట్ కోహ్లి (296 వన్డేల్లో 13,911 పరుగులు), సౌరవ్ గంగూలీ (311 వన్డేల్లో 11,363 పరుగులు) ఉన్నారు.

2 వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన క్రికెటర్ల జాబితాలో రోహిత్ శర్మ (338 సిక్స్‌లు) రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇప్పటి వరకు రెండో స్థానంలో ఉన్న క్రిస్ గేల్ (వెస్టిండీస్: 331 సిక్స్‌లు) మూడో స్థానానికి పడిపోయాడు. షాహిద్ అఫ్రిది (పాకిస్తాన్: 351 సిక్స్‌లు) టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.

32 వన్డేల్లో రోహిత్ శర్మ సెంచరీలు. అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్ల జాబితాలో రోహిత్ మూడో స్థానంలో ఉన్నాడు. టాప్-2లో విరాట్ కోహ్లి (50), సచిన్ టెండూల్కర్ (49) ఉన్నారు.

8 స్వదేశంలో ఇంగ్లండ్‌పై భారత జట్టు ఎనిమిదోసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను గెల్చుకుంది. ఇప్పటి వరకు సొంతగడ్డపై భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య 11 ద్వైపాక్షిక సిరీస్‌లు జరిగాయి. ఇందులో భారత్ 8 సార్లు నెగ్గగా... ఒకసారి ఇంగ్లండ్ (1984లో) గెలిచింది. మరో రెండు సిరీస్‌లు 'డ్రా'గా ముగిశాయి.

రో'హిట్స్'... భారత్‌దే సిరీస్



చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత శిబిరానికి గొప్ప శుభవార్త! క్రికెట్‌ను శ్వాసించే అభిమానులకు కచ్చితంగా ఇది తీపి కబురు! 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ ఫామ్‌లోకి వచ్చాడు. అట్లాంటి... ఇట్లాంటి... ఆటతో కాదు. 300 పైచిలుకు పరుగుల వేటలో భారత్ ఉండగా... తనశైలి రో'హిట్స్'తో అలరిస్తూ, లక్ష్యాన్ని కరిగిస్తూ, శతకంతో కదంతొక్కాడు. అతని జోరుకు మైదానం హోరెత్తింది. పెద్ద లక్ష్యమే అయినా చిన్నబోయింది. ఇంకో మ్యాచ్ ఉండగానే వన్డే సిరీస్ కూడా టీమిండియా వశమైంది.

రెండో వన్డేలో 4 వికెట్లతో ఇంగ్లండ్‌పై టీమిండియా గెలుపు
- రోహిత్ సూపర్ సెంచరీ
- రాణించిన గిల్, అయ్యర్, జడేజా
- భారీ స్కోరు చేసినా బట్లర్ బృందానికి నిరాశ
- డకెట్, రూట్ అర్ధశతకాలు వృథా
- 12న అహ్మదాబాద్‌లో ఆఖరి వన్డే

కటక్: భారత కెప్టెన్ రోహిత్ శర్మ వరుసగా రెండు, మూడు మ్యాచ్‌లు విఫలమైనా... తక్కువ స్కోరుకు అవుటైనా... విమర్శకులు ఈ మధ్య నెట్టింట తెగ విరుచుకుపడుతున్నారు. ఆదివారం 'హిట్‌మ్యాన్' విరుచుకుపడ్డాడు. నోటితో కాదు... బ్యాట్‌తో! నెట్‌లో కాదు... మైదానంలో! అద్భుతమైన సెంచరీతో కొండంత లక్ష్యాన్ని టీమిండియా అలవోకగా ఛేదించేలా చేశాడు. దీంతో ఆఖరి పోరు మిగిలుండగానే వన్డే సిరీస్ కూడా భారత్ చేతికి చిక్కింది.


జడేజా

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 304 పరుగులకు ఆలౌటైంది. బెన్ డకెట్ (56 బంతుల్లో 65; 10 ఫోర్లు), జో రూట్ (72 బంతుల్లో 69; 6 ఫోర్లు), లివింగ్‌స్టోన్ (32 బంతుల్లో 41; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. బ్యాట్ గర్జిస్తున్న వేళ భారత బౌలర్లంతా పరుగులు సమర్పించుకుంటే... రవీంద్ర జడేజా (10-1-35-3) మాత్రం పూర్తి కోటా వేసి వికెట్లు తీసి పరుగుల వేగాన్ని అడ్డుకున్నాడు. అనంతరం కఠినమైన లక్ష్యమే అయినా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ రోహిత్ (90 బంతుల్లో 119; 12 ఫోర్లు, 7 సిక్స్‌లు) వీరోచిత శతకంతో భారత్ 44.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 308 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (52 బంతుల్లో 60; 9 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (47 బంతుల్లో 44; 3 ఫోర్లు, 1 సిక్స్) ఇద్దరూ కెప్టెన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఈ గెలుపుతో భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. చివరిదైన మూడో వన్డే ఈనెల 12న అహ్మదాబాద్‌లో జరుగుతుంది.

డకెట్, రూట్... ఫిఫ్టీ-ఫిఫ్టీ

ఇంగ్లండ్ ఓపెనర్లు సాల్ట్ (26; 2 ఫోర్లు, 1 సిక్స్), డకెట్ దూకుడుగా ఆడి తొలి వికెట్‌కు 81 పరుగులు జోడించారు. డకెట్ 36 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. అతడు అవుటయ్యాక రూట్, హ్యారీ బ్రూక్ (31; 3 ఫోర్లు, 1సిక్స్) నింపాదిగా ఆడటంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ఆద్యంతం సాఫీగా సాగిపోయింది. రూట్ 60 బంతుల్లో తన వన్డే కెరీర్‌లో 56వ అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అనంతరం కెప్టెన్ బట్లర్ (34; 2 ఫోర్లు), లివింగ్‌స్టోన్ (32 బంతుల్లో 41; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)లు సైతం పరుగులు సాధించడంతో ఇంగ్లండ్ 300 పైచిలుకు స్కోరు చేయగలిగింది. షమీ, రాణా, పాండ్యా, వరుణ్ తలా ఒక వికెట్ తీశారు.

76 బంతుల్లో శతకం

ఎంతటి బ్యాటింగ్ పిచ్ అయినా... 305 పరుగుల లక్ష్యం వన్డేల్లో అంత ఈజీ కానేకాదు. చక్కని శుభారంభం... కడదాకా ఓర్పుగా, నేర్పుగా ఒక బ్యాటరైనా క్రీజులో నిలిస్తేనే గెలుపు ఆశలుంటాయి. సరిగ్గా నాయకుడు రోహిత్ కూడా ఇదే చేశాడు. ఓపెనింగ్‌లో గిల్‌తో జతగా మొదట లక్ష్యానికి అనువైన ఆరంభమిచ్చాడు. దీంతో 6.2 ఓవర్లలోనే భారత్ స్కోరు 50 దాటింది. భారీ షాట్లతో విరుచుకుపడిన 'హిట్‌మ్యాన్' 30 బంతుల్లో అర్ధసెంచరీ సాధించగా, గిల్ 45 బంతుల్లో పూర్తి చేశాడు. ఇద్దరి పట్టుదలతో 14వ ఓవర్లోనే జట్టు 100కు చేరుకుంది. తర్వాత గిల్ నిష్క్రమించినా, కోహ్లి (5) విఫలమైనా... ఆ ప్రభావం ఇన్నింగ్స్‌పై పడకుండా అయ్యర్‌తో కలిసి ధాటిని కొనసాగిస్తూ టీమిండియాను లక్ష్యంవైపు నడిపించాడు. ఈ క్రమంలో 76 బంతుల్లో సెంచరీ సాధించాక భారీ షాట్‌కు యత్నించి అవుటయ్యాడు. అప్పుడు జట్టు స్కోరు 29.4 ఓవర్లలో 220/3. ఇక గెలిచేందుకు 125 బంతుల్లో 85 చేస్తే చాలు. ఈ పనిలో అక్షర్ పటేల్ (43 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు) అజేయంగా భాగమవడంతో 33 బంతులు మిగిలుండగానే భారత్ మ్యాచ్ నెగ్గింది.



ఫ్లడ్‌లైట్లు మొరాయించడంతో...

బారాబతి స్టేడియంలోని ఫ్లడ్‌లైట్లు మొరాయించడంతో ఆటకు అరగంటకు పైగానే అంతరాయం ఏర్పడింది. డేనైట్ వన్డేలు, టి20ల కోసం మైదానం చుట్టూరా... ఎనిమిది చోట్ల ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. ఇందులో ఒకదాంట్లో సమస్య వచ్చింది. భారీ లక్ష్యఛేదనకు దిగిన భారత్ 6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా ధనాధన్ వేగంతో 48 పరుగులు చేసింది. ఈ సమయంలో క్లాక్ టవర్ వద్ద వున్న ఫ్లడ్‌లైట్లు ఆగిపోయాయి. దీంతో 35 నిమిషాల పాటు మ్యాచ్‌ను నిలిపేసి లైట్లు వెలిగాకే తిరిగి మ్యాచ్‌ను నిర్వహించారు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) జడేజా (బి) వరుణ్ 26; డకెట్ (సి) పాండ్యా (బి) జడేజా 65; రూట్ (సి) కోహ్లి (బి) జడేజా 69; బ్రూక్ (సి) గిల్ (బి) రాణా 31; బట్లర్ (సి) గిల్ (బి) పాండ్యా 34; లివింగ్‌స్టోన్ (రనౌట్) 41; ఓవర్టన్ (సి) గిల్ (బి) జడేజా 6; అట్కిన్సన్ (సి) కోహ్లి (బి) షమీ 3; రషీద్ (రనౌట్) 14; మార్క్ వుడ్ (రనౌట్) 0; సఖిబ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్) 304. వికెట్ల పతనం:** 1-81, 2-102, 3-168, 4-219, 5-248, 6-258, 7-272, 8-297, 9-304, 10-304. **బౌలింగ్:** షమీ 7.5-0-66-1, హర్షిత్ రాణా 9-0-62-1, పాండ్యా 7-0-53-1, వరుణ్ 10-0-54-1, జడేజా 10-1-35-3, అక్షర్ 6-0-32-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రషీద్ (బి) లివింగ్‌స్టోన్ 119; గిల్ (బి) ఓవర్టన్ 60; కోహ్లి (సి) సాల్ట్ (బి) రషీద్ 5; అయ్యర్ (రనౌట్) 44; అక్షర్ పటేల్ (నాటౌట్) 41; కేఎల్ రాహుల్ (సి) సాల్ట్ (బి) ఓవర్టన్ 10; పాండ్యా (సి) ఓవర్టన్ (బి) అట్కిన్సన్ 10; జడేజా (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (44.3 ఓవర్లలో 6 వికెట్లకు) 308. వికెట్ల పతనం:** 1-136, 2-150, 3-220, 4-258, 5-275, 6-286. **బౌలింగ్:** సఖిబ్ 6-0-36-0, అట్కిన్సన్ 7-0-65-1, మార్క్ వుడ్ 8-0-57-0, ఆదిల్ రషీద్ 10-0-78-1, ఓవర్టన్ 5-0-27-2, లివింగ్‌స్టోన్ 7-0-29-1, రూట్ 1.3-0-15-0.

జ్యోతి 'హ్యాట్రిక్'

100 మీటర్ల హర్డిల్స్‌లో వరుసగా మూడోసారి స్వర్ణం నెగ్గిన ఆంధ్రప్రదేశ్ అథ్లెట్


జ్యోతి

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఖాతాలో ఐదో స్వర్ణ పతకం చేరింది. ఆదివారం జరిగిన మహిళల అథ్లెటిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 13.10 సెకన్లలో ముగించి జాతీయ క్రీడల్లో కొత్త రికార్డును నెలకొల్పింది. జాతీయ క్రీడల్లో జ్యోతికిది వరుసగా మూడో స్వర్ణ పతకం కావడం విశేషం. ఇటీవల దక్షిణ మధ్య రైల్వేలో జూనియర్ క్లర్క్‌గా చేరిన జ్యోతి 2022 గుజరాత్, 2023 గోవా జాతీయ క్రీడల్లోనూ పసిడి పతకాలు సాధించింది. మరోవైపు 10 క్రీడాంశాల సమాహారమైన డెకాథ్లాన్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రోహిత్ రోమన్ (6753 పాయింట్లు) కాంస్య పతకాన్ని సాధించాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ 12 పతకాలతో (5 స్వర్ణాలు, 1 రజతం, 6 కాంస్యాలు) 18వ స్థానంలో ఉంది.

తెలంగాణకు రెండు కాంస్యాలు



జాతీయ క్రీడల్లో ఆదివారం తెలంగాణకు రెండు కాంస్య పతకాలు లభించాయి. అథ్లెటిక్స్ మహిళల 4x100 మీటర్ల రిలేలో నిత్య, మైథిలి ఆకుమడుగుల, మాలోత్ సింధు, అగసార నందినిలతో కూడిన తెలంగాణ జట్టు (47.58 సెకన్లు) కాంస్య పతకాన్ని సాధించింది. మహిళల నెట్‌బాల్‌లో తెలంగాణ జట్టు సెమీఫైనల్లో 43-48 పాయింట్ల తేడాతో హరియాణా చేతిలో ఓడిపోయి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం తెలంగాణ 9 పతకాలతో (1 స్వర్ణం, 2 రజతాలు, 6 కాంస్యాలు) 29వ స్థానంలో ఉంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

విద్య, ఉద్యోగ సమాచారం

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీఏటీ-బీ)-2025

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ), రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)తో కలిసి దేశంలోని ప్రముఖ యూనివర్శిటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ బయోటెక్నాలజీ, ఎంటెక్ బయోటెక్నాలజీ, ఎంఎస్సీ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, ఎంవీఎస్‌సీ యానిమల్ బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆల్ ఇండియా ప్రవేశ పరీక్ష గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ -బయోటెక్నాలజీ (జీఏటీ-బీ)-2025 పరీక్షను నిర్వహిస్తుంది. ఈ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్, బీఈ, బీవీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. మొత్తం 240 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నాపత్రం ఉంటుంది.

సెక్షన్-ఏలో 60 ప్రశ్నలు- 60 మార్కులు ఉంటాయి. ఇంటర్మీడియట్ స్థాయిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, బయాలజీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. సెక్షన్-బిలో 100 ప్రశ్నలకు-180 మార్కులు.. 60 ప్రశ్నలకు సమాధానాలు తప్పకుండా గుర్తించాలి. డిగ్రీ స్థాయిలో బేసిక్ బయాలజీ, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. సెక్షన్-ఏలో ప్రతి తప్పు సమాధానానికి 0.5 మార్కుల నెగిటివ్ మార్కింగ్ ఉంది. సెక్షన్-బిలో ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్. పరీక్ష సమయం మూడు గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 03.03.2025.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 05.03.2025 నుంచి 06.03.2025 వరకు
- **పరీక్షతేది:** 20.04.2025
- **వెబ్‌సైట్:** https://dbt2025.ntaonline.in/ and www.nta.ac.in.

మిధాని, హైదరాబాద్‌లో 120 ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌లు

మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని)లో ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 120.
- **ట్రేడులు:** ఫిట్టర్-33, ఎలక్ట్రీషియన్-09, మెషినిస్ట్-14, టర్నర్-15, డీజిల్ మెకానిక్-02, ఆర్-ఏసీ-02, వెల్డర్-15, సీవోపీఏ-09, ఫోటోగ్రాఫర్-01, ప్లంబర్-02, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-01, కెమికల్ ల్యాబొరేటరీ అసిస్టెంట్-06, డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్)-01, కార్పెంటర్-03, ఫౌండ్రీమెన్-02, ఫర్నేస్ ఆపరేటర్(స్టీల్ ఇండస్ట్రీ)-02, పంప్ ఆపరేటర్ కమ్ మెకానిక్-03.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు రూ.7000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 10.02.2025.
- **వెబ్‌సైట్:** https://midhani-india.in/

రైట్స్, గుర్గావ్‌లో 18 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

గుర్గావ్‌లో రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్).. అసిస్టెంట్ మేనేజర్(సివిల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(సివిల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 32 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.02.2025.
- **పరీక్ష తేది:** 09.03.2025.
- **వెబ్‌సైట్:** https://www.rites.com/

క్రెడిట్ ఆఫీసర్ వయా పీజీడీబీఎఫ్

- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జాబ్ నోటిఫికేషన్
- జేఎంజీఎస్-1 హోదాలో 1000 క్రెడిట్ ఆఫీసర్ పోస్టులు
- పీజీడీబీఎఫ్‌లో ప్రవేశంతో కొలువు ఖరారు
- నెలకు రూ.70 వేల వరకు వేతనం

బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారా.. బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకుంటున్నారా..! అయితే మీకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది!! ప్రభుత్వ రంగ బ్యాంక్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో పీజీ డిప్లొమాతోపాటు.. బ్యాంకులో క్రెడిట్ ఆఫీసర్ కొలువుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటికి ఏదైనా డిగ్రీతో పోటీ పడొచ్చు. కొలువు ఖరారైతే నెలకు రూ.70వేల వేతనం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో..సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. క్రెడిట్ ఆఫీసర్ పోస్టుల వివరాలు, పీజీడీబీఎఫ్ కోర్సు, ఎంపిక ప్రక్రియ, రాత పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..



బ్యాంక్ జాబ్స్

పోస్టుల సంఖ్య 1000

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1,000 క్రెడిట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కేటగిరీలో 405 పోస్టులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 100 పోస్టులు, ఓబీసీ కేటగిరీలో 270 పోస్టులు, ఎస్సీ కేటగిరీలో 150 పోస్టులు, ఎస్టీ కేటగిరీలో 75 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- నవంబర్ 30, 2024 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదు శాతం మార్కుల సడలింపు లభిస్తుంది.
- వయసు: నవంబర్ 30, 2024 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

పీజీడీబీఎఫ్ పూర్తి చేస్తేనే

క్రెడిట్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. నియామకాల ఖరారులో వినూత్న విధానాన్ని అమలు చేస్తోంది. పలు ప్రముఖ విద్యా సంస్థలతో కలిసి ఏడాది వ్యవధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కోర్సును అందిస్తోంది. ఈ వ్యవధిలో 9 నెలలు థియరీ శిక్షణ, మరో మూడు నెలలు ఆన్ జాబ్ ట్రెనింగ్ పేరిట బ్యాంక్ బ్రాంచ్‌లలో శిక్షణనిస్తారు. క్రెడిట్ ఆఫీసర్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిచిన వారు తప్పనిసరిగా ఈ కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడే వారికి బ్యాంకులో శాశ్వత కొలువు ఖరారు చేస్తారు. పీజీడీబీఎఫ్ కోర్సు చదువుతున్నప్పుడే ఐఐబీఎఫ్ నిర్వహించే డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్/జేఏఐఐబీ కూడా పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.

కోర్సు ఫీజు తిరిగి చెల్లింపు

పీజీడీబీఎఫ్ కోర్సు ఫీజు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉంటుంది. బ్యాంకులో అయిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న తర్వాత ఈ ఫీజు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు. అంటే దాదాపుగా అభ్యర్థులు ఉచితంగా పీజీడీబీఎఫ్ కోర్సును పూర్తి చేసుకునే అవకాశం లభిస్తోంది. ఎంపికైన విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు వీలుగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదా ఇతర బ్యాంక్‌ల నుంచి ఎడ్యుకేషన్ లోన్ మంజూరుకు తోడ్పాటును అందిస్తారు.

స్టయిఫండ్

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంపిక ప్రక్రియ ద్వారా పీజీడీబీఎఫ్ కోర్సులో సీటు ఖరారు చేసుకుంటే.. స్టయిఫండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తారు. ఏడాది వ్యవధిలోని కోర్సు సమయంలో 9 నెలల క్లాస్ రూం లెర్నింగ్ వ్యవధిలో నెలకు రూ.2,500, మూడు నెలల ఆన్ జాబ్ ట్రెనింగ్ సమయంలో నెలకు రూ.10 వేలు చొప్పున స్టయిఫండ్ లభిస్తుంది.

నెలకు రూ.70 వేల వేతనం

పీజీడీబీఎఫ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకుని.. క్రెడిట్ ఆఫీసర్ హోదాలో కొలువు సొంతం చేసుకున్న వారికి జేఎంజీఎస్-1 స్కేల్‌లో వేతనం అందిస్తారు. నెలకు రూ.70 వేల వరకు వేతనం అందుకునే అవకాశం ఉంది.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్రెడిట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి మార్గం వేసే పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కోర్సులో ప్రవేశానికి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.

4 విభాగాల్లో రాత పరీక్ష

పీజీడీబీఎఫ్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే రాత పరీక్ష 120 ప్రశ్నలు-120 మార్కులకు నాలుగు విభాగాల్లో ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 30 ప్రశ్నలు-30 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ (బ్యాంకింగ్) 30 ప్రశ్నలు-30 మార్కులకు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ టెస్ట్ పద్ధతిలో నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి గంటన్నర.

ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్

రాత పరీక్షలో భాగంగానే డిస్క్రిప్టివ్ విధానంలో 30 మార్కులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో లెటర్ రైటింగ్ (15 మార్కులు), ఎస్సే రైటింగ్ (15 మార్కులు) ఉంటాయి. పరీక్ష సమయం 30 నిమిషాలు.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా అందుబాటులో ఉన్న పోస్టులు, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి చివరగా 50 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పీజీడీబీఎఫ్ కోర్సుకు నిర్దేశించిన సీట్లకు మూడు రెట్లకు సమానమైన సంఖ్యలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

జీఎం స్థాయికి

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ ఆఫీసర్ పోస్ట్‌లో కొలువుదీరిన వారు భవిష్యత్తులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయి వరకు చేరుకునే అవకాశం ఉంది. పదోన్నతులను పరిగణనలోకి తీసుకుంటే.. మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్, ఏజీఎం, డీజీఎం, జనరల్ మేనేజర్, సీజీఎం స్థాయి వరకు చేరుకోవచ్చు. బ్యాంకు సర్వీస్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటే.. జీఎం స్థాయికి తప్పనిసరిగా చేరుకునే అవకాశం ఉంటుంది.

రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్: గ్రామర్ అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా వొకాబ్యులరీ, కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. అదే విధంగా సింపుల్, కాంప్లెక్స్, కాంపౌండ్ సెంటెన్స్‌లను ప్రాక్టీస్ చేయాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి మ్యాథమెటిక్స్‌లోని కోర్ అంశాలతోపాటు అర్థమెటిక్ అంశాలు (నిష్పత్తులు, శాతాలు, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, యావరేజెస్, స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, కూడికలు, గుణకారాలు తదితర)పై దృష్టి పెట్టాలి.

రీజనింగ్ ఎబిలిటీ: లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, డైరక్షన్స్, డిస్టెన్స్, అనాలజీ, బ్లడ్ రిలేషన్స్, సిరీస్, డబుల్ లైనప్, డయాగ్రమ్స్, ఫ్లో చార్ట్‌లను ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ అవేర్‌నెస్: ఈ విభాగంలో మంచి మార్కుల కోసం కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. ఎకానమీకి సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు తెలుసుకోవాలి. బ్యాంకింగ్ అవేర్‌నెస్‌లో బ్యాంకింగ్ వ్యవస్థ స్వరూపంతోపాటు తాజా పరిణామాలు, బ్యాంకింగ్ టెర్మినాలజీపై అవగాహన పెంచుకోవాలి. కంప్యూటర్/ఐటీ అవేర్‌నెస్ కోసం కంప్యూటర్ ఆపరేషన్ టూల్స్‌పై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2025, ఫిబ్రవరి 20
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.centralbankofindia.co.in/en/recruitments

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	198	77,860
నిఫ్టీ ▽	43	23,560

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,525	▽	267
డోజోన్స్	44,303	▽	444
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,700	▽	27
డాక్స్	21,787	▽	115
హాంగ్‌సెంగ్	3,304	△	33
నికాయ్	38,787	▽	279

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.05	88.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.00	110.88
€	యూరో	ఎస్‌బీఐ	89.60	92.24
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.85	58.28
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.99	56.21
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.55	66.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.42	23.96
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.92	24.68
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.12	12.94

పన్ను ఆదా.. భవిష్యత్తుకు పెట్టుబడి!

మనది పొదుపు సమాజం. మన తల్లిదండ్రులు, తాతలు ప్రతి రూపాయిని ఆచితూచి ఖర్చు చేసేవారు. భవిష్యత్ కోసం వీలైన ప్రతి రూపాయినీ ఆదా చేసేవారు. కానీ, నేటి తరం ఖర్చు చేయడాన్ని ఇష్టపడుతోంది. సౌకర్యాలు, సుఖాలు, ఆడంబరాలు, ఆనందం కోసం ఖర్చుకు వెనుకాడని ధోరణి పెరిగిపోతోంది. 'ధనవంతుడు కావాలంటే పేదవారిగా బతకాలి' అన్నది ఆర్థిక నిపుణులు చెప్పే సూక్తి. పేదవారిగా జీవించాలని చెప్పడం కాదు ఇందులోని అసలు అర్థం. ఆడంబరాలకు, అనవసర ఖర్చులకు పోకూడదన్న సూచన ఇందులో కనిపిస్తుంది. తాజా కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపన్ను రాయితీలను గణనీయంగా పెంచేశారు విత్త మంత్రి. రూ.12.75 లక్షల వరకు కొత్త విధానంలో పన్ను లేకుండా వరాలు కురిపించారు. దీంతో వివిధ తరగతుల వారికి గరిష్టంగా రూ.లక్ష, అంతకుమించి పన్ను రూపంలో ఆదా కానుంది. ఇలా ఆదా అయ్యే మొత్తాన్ని ఖర్చు బకెట్‌లో వేసేసుకుని సంబరపడిపోకుండా.. పెట్టుబడులకూ కొంత కేటాయించుకోవాలన్నది నిపుణుల సూచన. తద్వారా భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలకు మరింత బలం చేకూరుతుంది. త్వరగా ఆర్థిక స్వేచ్ఛను సొంతం చేసుకోగలరు. పన్ను భారం తప్పించుకునేందుకు కొత్త విధానంలోకి మారిపోయి.. ఇప్పటి వరకు పాత విధానంలో చేస్తున్న పన్ను ఆదా పెట్టుబడులకు మంగళం పాడే తప్పు అస్సలు చేయొద్దని సూచిస్తున్నారు.

- సాక్షి, బిజినెస్ డెస్క్




కొత్త విధానంలో భారీగా పన్ను మిగులు

- ఈ మొత్తం ఖర్చు చేసేయడం సరికాదు
- కొంత మేర పెట్టుబడులకు మళ్లించాలి
- తద్వారా త్వరగా ఆర్థిక లక్ష్యాల సాకారం
- పాత విధానంలో పెట్టుబడులతోనే పన్ను ఆదా

ఆదాయ స్థాయిలకు అనుగుణంగా కొత్త పన్ను విధానంలో ఆదా అయ్యే మొత్తం వేర్వేరుగా ఉంటుంది. ఏడాదికి రూ.12 లక్షలు సంపాదించే వారికి రూ.83,200, రూ.15 లక్షలు సంపాదించే వారికి రూ.32,500 వరకు తాజా ప్రతిపాదనలతో పన్ను ఆదా కానుంది. అలాగే, రూ.24 లక్షల సంపాదనాపరులకు రూ.1.14 లక్షలు, రూ.కోటి ఆదాయ వర్గాలకు రూ.1,25,840, రూ.5 కోట్ల ఆదాయం కలిగిన వారికి రూ.1.43 లక్షల వరకు పన్ను మిగులు లభించనుంది. ఈ కొత్త ప్రతిపాదనలు 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు కానున్నాయి. అంటే 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఇవి వర్తిస్తాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు అమల్లో ఉన్న రేట్లే వర్తిస్తాయి. పాత విధానంలో వివిధ సెక్షన్ల కింద పలు రకాల పెట్టుబడులతోపాటు, స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేలతో కలుపుకుని రూ.8.50 లక్షల ఆదాయంపై పన్ను ఆదాకు అవకాశం ఉంది.

పెట్టుబడులు ఆపొద్దు..

ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రణాళిక ఉండాలి. జీవితంలో అన్ని ముఖ్య అవసరాలను సాధించే మార్గసూచీగా ఇది ఉంటుంది. ఈ లక్ష్యాలకు పెట్టుబడులే ఆధారం. ఆదాయంలో కనీసం 30 శాతం అయినా పెట్టుబడులకు మళ్లించుకోవాలి. అయితే, జీవిత లక్ష్యాల దృష్టితో కాకుండా పన్ను ఆదా కోసమే పెట్టుబడులను ఆశ్రయించే వేతన జీవులు కూడా ఉన్నారు. ప్రజా భవిష్యనిధి (పీపీఎఫ్), సుకన్య సమృద్ధి యోజన, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్), ఐదేళ్ల పన్ను ఆదా ఎఫ్‌డీల్లో పెట్టుబడులు, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై సెక్షన్ 80సీ పరిధిలో (పాత పన్ను వ్యవస్థ) రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంది. దీనికి అదనంగా హెల్త్ ఇన్సూరెన్స్‌కు సెక్షన్ 80డీ పరిధిలో పన్ను మినహాయింపులు ఉన్నాయి. గృహ రుణం తీసుకుని అసలు చెల్లింపులను సెక్షన్ 80సీ పరిధిలో, వడ్డీ చెల్లింపులను సెక్షన్ 24 పరిధిలో చూపించుకోవచ్చు. కొత్త పన్ను వ్యవస్థ ఆకర్షణీయంగా ఉండడంతో, ఇంతకాలం పన్ను ఆదా దృష్టితో కొనసాగించిన ఈ పెట్టుబడులను నిలిపివేసే ప్రమాదం లేకపోలేదు. ఈ తప్పు అస్సలు చేయొద్దు. కొత్త పన్ను విధానం సూటిగా, సరళంగా ఉంటుంది. పన్నుల గందరగోళం వద్దనుకునే వారు కొత్త విధానాన్ని ఎంపిక చేసుకుంటే తప్పేమీ కాదు. కానీ, అదే సమయంలో పాత పన్ను విధానం ప్రోత్సహిస్తున్న ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు, మదుపులను విస్మరించకుండా, వాటిని కొనసాగించడం ద్వారానే గరిష్ఠ ప్రయోజన్ని పొందగలరు. పన్ను ఆదా కోసం ఉద్దేశించినవి కాకపోయినా, మెరుగైన ఇతర సాధనాల్లో అయినా పెట్టుబడులు కొనసాగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన



ప్రజా భవిష్యనిధి (పీపీఎఫ్), సుకన్య సమృద్ధి యోజన ప్రభుత్వ హామీతో కూడిన డెట్ పెట్టుబడి సాధనాలు. వీటిల్లో రిస్క్ సున్నా. ఈ రెండు సాధనాల్లో ఏటా చేసే పెట్టుబడులను పాత పన్ను వ్యవస్థలోని సెక్షన్ 80సీ పరిధిలో చూపించుకుని రూ.1.5 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు ప్రయోజనం పొందొచ్చు. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన పథకాల గడువు ముగిసిన తర్వాత చేతికి అందే మొత్తంపై పాత, కొత్త పన్ను వ్యవస్థల్లో పన్ను లేదు. పన్ను ప్రయోజనాలున్న ఈ మెరుగైన పథకాలు ప్రతి ఒక్కరి పోర్ట్‌ఫోలియోలో ఉండాల్సిందే. తమ మొత్తం పెట్టుబడుల్లో 30-40 శాతం ఈ సాధనాలకు కేటాయించుకుని, మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ ఫండ్స్‌కు మళ్లించుకోవచ్చు. దీనివల్ల పెట్టుబడికి కొంత రక్షణతోపాటు దీర్ఘకాలంలో అధిక రాబడిని సొంతం చేసుకోగలరు.

పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన పథకాల్లో పెట్టుబడులకు వర్తించే వడ్డీ రేటు స్థిరంగా ఉండదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ఆర్థిక శాఖ వీటి రేట్లను ప్రకటిస్తుంటుంది. పీపీఎఫ్‌లో ప్రస్తుతం 7.10 శాతం రేటు అమల్లో ఉంది. దీని కాల వ్యవధి 15 ఏళ్లు. అనంతరం మరో ఐదేళ్లు పొడిగించుకోవచ్చు. సుకన్య సమృద్ధి యోజన పథకంలో పెట్టుబడులపై ప్రస్తుతం 8.2 శాతం రేటు అమల్లో ఉంది. ఒక కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరు కుమార్తెల పేరిట దీన్ని ప్రారంభించుకోవచ్చు. బాలికల వయసు 10 ఏళ్లు మించకూడదు. ఆలోపు వయసున్న వారి పేరుతో ఖాతా తెరిచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కుమార్తెలకు 21 ఏళ్లు నిండగానే పథకం ముగిసిపోతుంది. లేదా 18 ఏళ్లు నిండిన తర్వాత, 21 ఏళ్లు రాక ముందే వారికి వివాహం నిశ్చయమైతే అప్పుడు ఈ పథకం నుంచి వైదొలగొచ్చు. కొత్త పన్ను విధానంలో ఉన్న వారికీ పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన పథకాలు అనుకూలమేనని వేద్ జైన్ అండ్ అసోసియేట్స్ పార్ట్‌నర్ అంకిత్ జైన్ సూచించారు. ఎందుకంటే ఈ రెండు పథకాల్లో పెట్టుబడులపై పన్ను ప్రయోజనం కొత్త వ్యవస్థ కింద లేకపోయినా కానీ, వడ్డీ రాబడికి పన్ను మినహాయింపు ప్రయోజనం ఉన్నట్టు తెలిపారు. కుమార్తెల వివాహం, ఉన్నత విద్య కోసం సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ పెట్టుబడులు ఎంతో ఉపయోగపడతాయి.

ఈక్విటీ ఫండ్స్



ఈక్విటీ ఫండ్స్‌లో ఈఎల్ఎస్ఎస్ ఒక విభాగం. ఇందులో పెట్టుబడులపై మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో ఇతర ఈక్విటీ ఫండ్స్ అంత అమ్మకాల ఒత్తిడి వీటిల్లో ఉండదు. కనుక స్థిరత్వం ఎక్కువ. మల్టీక్యాప్ (ఏ విభాగంలో అయినా ఇన్వెస్ట్ చేయగలదు) విధానంతో పెట్టుబడులు పెడుతుంటుంది. పదేళ్ల కాలంలో 12-18 శాతం మధ్య, ఐదేళ్లలో 13-27 శాతం మధ్య రాబడులు ఈ పథకాల్లో గమనించొచ్చు. కొత్త పన్ను విధానంలోకి మళ్లిన వారు ఈఎల్ఎస్ఎస్‌లోనే ఇన్వెస్ట్ చేయాలని లేదు. వీటికి ప్రత్యామ్నాయంగా లార్జ్ అండ్ మిడ్ క్యాప్, ఫ్లెక్సీక్యాప్, ఇండెక్స్ ఫండ్స్‌లో దీర్ఘకాలానికి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, బీమా పథకాలకు పన్ను ఆదాకు మించి ప్రయోజనాలను ఇచ్చే సామర్థ్యం ఉన్నట్టు సిరిల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ పార్ట్‌నర్ కునాల్ సవాని పేర్కొన్నారు. కొత్త విధానంలోకి వెళ్లినా కానీ, భవిష్యత్ కోసం ఉద్దేశించిన ఈ పెట్టుబడులను నిలిపివేయొద్దని సూచించారు.

> "పేదవారిగా పుట్టడం మీ తప్పుకాదు. కానీ, పేదవారిగా మరణించడం కచ్చితంగా మీ తప్పిదమే" - బిల్‌గేట్స్

లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్



జీవిత బీమా (టర్మ్, ఎండోమెంట్) పాలసీల ప్రీమియం చెల్లింపులపై సెక్షన్ 80సీ కింద పాత వ్యవస్థలో పన్ను మినహాయింపు ఉంది. వార్షిక ప్రీమియం మొత్తం కవరేజీలో (సమ్ అష్యూర్డ్/రక్షణ) 10 శాతం మించకపోతే, మెచ్యూరిటీ మొత్తంపైనా పన్ను లేదు. ఈ పన్ను ప్రయోజనం కోసం ఎండోమెంట్, టర్మ్ పాలసీలను కొందరు తీసుకుంటున్నారు. ఏ పన్ను విధానంలో ఉన్నారనే అంశంతో సంబంధం లేకుండా, కుటుంబానికి ఆర్థికంగా ఆధారమైన ప్రతి వ్యక్తీ తన పేరిట తగినంత బీమా కవరేజీతో అచ్చమైన టర్మ్ పాలసీ తీసుకోవాలన్నది నిపుణుల సూచన. తన వార్షిక ఆదాయానికి సుమారుగా 20 రెట్ల మేర సమ్ అష్యూర్డ్ ఉండేలా చూసుకోవాలి. దురదృష్టవశాత్తూ ఆర్జించే వ్యక్తి ప్రాణానికి ప్రమాదం వాటిల్లితే, వచ్చే బీమా పరిహారంతో అతనిపై ఆధారపడిన కుటుంబం సాఫీగా జీవించే విధంగా ఏర్పాటు చేసుకోవాలి.

నేడు జీవనశైలి వ్యాధులు పెరిగిపోయాయి. కనుక ప్రతి కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్స్ రక్షణ ఉండేలా చూసుకోవడం తప్పనిసరి. ఇది కేవలం పన్ను ఆదా కోసం ఉద్దేశించిన సాధనం కానే కాదు. పెద్ద ప్రమాదం లేదా కరోనా వంటి విపత్తు పరిస్థితుల్లో ఆస్పత్రి పాలైతే, హెల్త్ కవరేజీ లేని పరిస్థితుల్లో అప్పటి వరకు కూడబెట్టినదంతా కరిగిపోయే ప్రమాదం ఎదురవుతుంది. అనారోగ్యంతో ఆస్పత్రి పాలు కావడం వల్ల ఆర్థికంగా సమస్యల్లోకి వెళ్లకూడదని కోరుకుంటే, హెల్త్ ఇన్సూరెన్స్‌ను తీసుకోవాలి. ఒక కుటుంబానికి ఎంత లేదన్నా రూ.10లక్షలు ఉండేలా చూసుకోవాలి. దీనిపై అదనపు కవరేజీని సూపర్ టాపప్ ప్లాన్ రూపంలో తీసుకోవచ్చు. ఉద్యోగం చేసే సంస్థ తరఫున గ్రూప్ హెల్త్ కవరేజీ ఉన్న వారు సైతం విడిగా తమ కుటుంబానికి ఒక హెల్త్ ప్లాన్ తీసుకోవాలి. ఎందుకంటే ఏదైనా కారణంతో కంపెనీని వీడినా, ఉద్యోగం మానేసినా కవరేజీ కొనసాగుతుంది.

ఖర్చు కంటే పెట్టుబడి ముఖ్యం



చాలా మంది తమ ఆదాయంలో ఖర్చులుపోను మిగులుంటే అప్పుడు పెట్టుబడులకు మళ్లిస్తుంటారు. కానీ, ముందు పెట్టుబడులకు కేటాయింపులు చేసిన తర్వాతే ఖర్చులకు వెళ్లాలన్నది నిపుణుల సూచన. కొత్త పన్ను వ్యవస్థలో మిగిలే నిధులను ఎన్‌పీఎస్ తదితర పెన్షన్ ప్లాన్లకు కేటాయించుకోవాలని సింఘానియా అండ్ కో పార్ట్‌నర్ బన్సాల్ సూచించారు. దీనివల్ల గణనీయమైన రిటైర్మెంట్ ఫండ్ ఏర్పడుతుందన్నారు. చాలా మంది రిటైర్మెంట్ లక్ష్యాన్ని పెద్దగా పట్టించుకోరు. 60 ఏళ్ల తర్వాత సంగతి కదా అని తేలికగా తీసుకుంటారు. కానీ, ఉద్యోగంలో చేరిన నాటి నుంచే రిటైర్మెంట్ తర్వాతి జీవితం కోసం పెట్టుబడి చేసుకుంటూ వెళ్లడం ద్వారా స్వల్ప మొత్తమే పెద్ద నిధిగా మారుతుందన్నది తెలుసుకోవాలి.

కొత్త-పాత పన్ను వ్యవస్థలు

ఏ విధానంలో కొనసాగాలన్నది తమ ఆదాయం ఆధారంగానే నిర్ణయించుకోవాలి. హెచ్ఆర్ఏ, గృహ రుణ ప్రయోజనాలు, ఎల్‌టీసీ, పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, ఎన్‌పీఎస్ పెట్టుబడులతో రూ.8 లక్షలు, స్టాండర్డ్ డిడక్షన్‌తో రూ.50 వేలు మొత్తంగా రూ.8.50 లక్షల వరకు పాత పన్ను వ్యవస్థలో మినహాయింపులున్నాయి. వీటిని పూర్తిగా వినియోగించుకుంటే రూ.24 లక్షల నుంచి రూ.5 కోట్ల మధ్య ఆదాయం ఉన్న వారికి పాత వ్యవస్థ అనుకూలమని నిమిత్ కన్సల్టెన్సీ వ్యవస్థాపకుడు నితేష్ బుద్ధదేవ్ తెలిపారు. ఒకవేళ తమ పెట్టుబడులు ఈ స్థాయిలో లేకపోతే కొత్త విధానాన్ని పరిశీలించొచ్చు. రూ.24 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి కొత్త విధానమే అనుకూలం.

ఎన్‌పీఎస్



రిటైర్మెంట్ ఫండ్ ఏర్పాటుకు అందుబాటులో ఉన్న మెరుగైన సాధనాల్లో ఎన్‌పీఎస్ ఒకటి. అతి తక్కువ నిర్వహణ చార్జీలతోపాటు, పెట్టుబడిపైనా, రాబడి ఉపసంహరణపైనా పన్ను ప్రయోజనాలున్నాయి. ఇందులో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేసి, ఆ మొత్తంపై సెక్షన్ 80సీసీఈ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. సెక్షన్ 80సీ గరిష్ఠ ప్రయోజనం కిందకే ఇది కూడా వర్తిస్తుంది. దీనికి అదనంగా సెక్షన్ 80సీసీడీ (1బి) కింద ఎన్‌పీఎస్ టైర్-1 ఖాతాలో మరో రూ.50,000 పెట్టుబడికి సైతం పన్ను మినహాయింపు ఉంది. ఈ సెక్షన్ కిందే ఎన్‌పీఎస్ వాత్సల్య పథకంలో పెట్టుబడికీ పన్ను ఆదా ప్రయోజనాన్ని 2025-26లో బడ్జెట్‌లో కల్పించారు. తమ పేరు మీద లేదా తమ కుమార్తె లేదా కుమారుల పేరిట ఎన్‌పీఎస్ వాత్సల్యలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సెక్షన్ 80సీసీడీ (1బి) కింద గరిష్ఠ ప్రయోజనం రూ.50వేలకు పరిమితం. 60 ఏళ్లు వచ్చిన తర్వాత ఈ పథకంలో సమకూరిన మొత్తం నిధి నుంచి 60 శాతాన్ని ఉపసంహరించుకోవచ్చు. దీనిపై ఎలాంటి పన్ను ఉండదు. మరో 40 శాతం మొత్తానికి పింఛను ఆదాయాన్నిచ్చే యాన్యుటీ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. కార్పొరేట్ కంపెనీ ఉద్యోగి ఎన్‌పీఎస్ ఖాతాలో చేసే జమలపైనా పాత విధానంలో పన్ను ప్రయోజనాలున్నాయి. సెక్షన్ 80సీసీడీ (2) కింద మూలవేతనం, డీఏ మొత్తంలో 10 శాతాన్ని ఉద్యోగి తరఫున యాజమాన్యం ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఆ మొత్తంపై మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఉద్యోగి తరఫున ప్రభుత్వమే జమ చేస్తుంటే అప్పుడు 14 శాతంపై పన్ను మినహాయింపు లభిస్తుంది. కొత్త పన్ను విధానంలోనూ సెక్షన్ 80సీసీడీ (2) కింద పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని కల్పించారు. కొత్త విధానంలో ఉద్యోగి తరఫున యాజమాన్యం ఎన్‌పీఎస్ టైర్-1లో జమ చేస్తే (మూలవేతనం, డీఏలో 10 శాతం / వచ్చే ఏప్రిల్ నుంచి 14 శాతం) ఆ మేరకు పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.

టాటా మోటార్స్ | బ్రోకరేజ్: ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 707 టార్గెట్: రూ. 950

ఎందుకంటే: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ లగ్జరీ కార్ల బ్రిటిష్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో పటిష్ట పనితీరు ప్రదర్శించింది. యూకేలో జాగ్వార్ ఉత్పత్తి తాత్కాలికంగా నిలిపివేసినప్పటికీ హోల్‌సేల్‌లో విక్రయాలు 1,04,000 యూనిట్లను తాకాయి. వార్షికంగా ఇది 3 శాతం వృద్ధికాగా.. త్రైమాసిక వారీగా 20 శాతం అధికం. అత్యుత్తమ మోడల్(మిక్స్) రేంజ్ రోవర్ ఇందుకు సహకరించింది. దీంతోపాటు రేంజ్ రోవర్ స్పోర్ట్, డిఫెండర్ మోడళ్లకు డిమాండ్ కారణంగా వీటి వాటా 70 శాతానికి ఎగసింది. త్రైమాసికవారీగా(క్యూ2) 67 శాతానికి చేరింది. ఉత్పత్తి సాధారణ స్థితికి రావడం, మోడళ్ల ఉత్తమ మిక్స్ నేపథ్యంలో జేఎల్ఆర్ మార్జిన్లు భారీగా బలపడ్డాయి. ఈ ఏడాది క్యూ1లో 15.8 శాతం, క్యూ2లో 11.7 శాతంగా నమోదైన మార్జిన్లు క్యూ3లో 15 శాతానికి మెరుగుపడ్డాయి. ఇక మరో పక్క దేశీయంగా వాణిజ్య వాహన(సీవీ) ఔట్‌లుక్ మెరుగుపడుతోంది. ప్రభుత్వ పెట్టుబడులు ఆలస్యమవుతున్నప్పటికీ నెమ్మదిగా పుంజుకుంటోంది. ఇటీవల కర్వ్ ఎస్‌యూవీ విడుదల నేపథ్యంలోనూ ప్రయాణికుల వాహన(పీవీ) ఔట్‌లుక్ మందకొడిగా కనిపిస్తోంది. ఇక ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) విభాగంలో తీవ్రమవుతున్న పోటీ కారణంగా కంపెనీకి సవాళ్లు ఎదురుకావచ్చు. అయితే జేఎల్ఆర్ పనితీరు అంచనాలకు అనుగుణంగా మెరుగుపడుతుండటంతో ఈ ఏడాది నికర నగదుతో కూడిన బ్యాలన్స్‌షీట్‌తో బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్ ఫ్లో(ఎఫ్‌సీఎఫ్) సాధించే వీలుంది. పీవీ అమ్మకాలలో మందగమన పరిస్థితులు నెలకొన్నప్పటికీ లాభదాయకత పుంజుకోవడం, దేశీయంగా సీవీ విభాగంలో ఆశావహ పరిస్థితులు కంపెనీకి బలాన్నిస్తున్నాయి.

సాక్షి ప్లస్

పటేల్ ఇంజనీరింగ్ | బ్రోకరేజ్: ఐడీబీఐ క్యాపిటల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 47 టార్గెట్: రూ. 76

ఎందుకంటే: కాంప్లెక్స్(సంక్లిష్ట) సివిల్ ఇన్‌ఫ్రా వర్క్‌లు చేపట్టే మౌలిక రంగ కంపెనీ పటేల్ ఇంజనీరింగ్ 1949లో ఏర్పాటైంది. ప్రధానంగా హైడ్రో పవర్(జల విద్యుత్) ప్లాంట్లు, సొరంగాల ఏర్పాటు, పట్టణ మౌలిక సదుపాయాలు, నీటిపారుదల తదితర ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. వెరసి కంపెనీ దేశీయంగా పెట్టుబడి పరిస్థితులలో పలు దశల(సైకిల్స్)ను చవిచూసింది. ప్రస్తుతం కంపెనీ ఆర్డర్ బుక్ విలువ రూ. 19,100 కోట్లను తాకింది. గత 12 నెలల కాలంలో కంపెనీ ఆదాయాన్ని పరిగణిస్తే ఇది 4 రెట్లు అధికం. కోవిడ్-19 మహమ్మారి తదుపరి ఆర్డర్ల సంఖ్య జోరందుకుంది. దీంతో 2023లో వార్షికంగా అత్యధికస్థాయిలో రూ. 7,800 కోట్ల విలువైన కాంట్రాక్టులను అందుకుంది. వెరసి మౌలిక రంగ పెట్టుబడులతో అధిక లబ్ధి పొందిన కంపెనీల జాబితాలో ఒకటిగా నిలిచింది. ప్రధానంగా జల విద్యుత్ రంగ పెట్టుబడులతో 30 గిగావాట్లకుపైగా బిడ్డింగ్‌కు అవకాశాలు లభించనున్నట్లు అంచనా వేస్తోంది. 2020-23 మధ్యకాలంలో ఆదాయంలో రెండంకెల(18 శాతం) వృద్ధిని సాధించింది. గతేడాది(2023-24)లోనూ వార్షికంగా ఆదాయం 20 శాతం వృద్ధి చూపింది. కోవిడ్-19కు ముందుకంటే గతేడాది తొలి 9నెలల్లో కంపెనీ లెవరేజ్(రుణాలు, ఈక్విటీ నిష్పత్తి) తగ్గుముఖం పట్టింది. 1 నుంచి 0.6 రెట్లుకు వెనకడుగు వేసింది. ఇందుకు గత నాలుగేళ్లలో పుంజుకున్న అంతర్గత వనరులు, కీలకం కాని ఆస్తుల విక్రయం, ఈక్విటీ పెట్టుబడుల సమీకరణ దోహదం చేశాయి. వెరసి గత నాలుగేళ్లలో కంపెనీ సానుకూల నిర్వహణ క్యాష్ ఫ్లో(ఓసీఎఫ్) సాధించింది. వర్కింగ్ క్యాపిటల్ 100 రోజులకు చేరింది. దీనిలో అధిక భాగం ఆర్బిట్రేషన్ క్లెయిములు, భూములదే. ఏడాది కాలంలో రూ. 200-300 కోట్ల రికవరీ అంచనా వేస్తోంది. రెండేళ్లలో భూ విక్రయంతో రూ. 300 కోట్లను ఆశిస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఫండ్స్ పెట్టుబడుల్లో మార్పులు ఎప్పుడు చేయాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసర్చ్





మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిన తర్వాత ఎటువంటి సందర్భాల్లో మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటుంది?
- వేణు గోపాల్

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను రెండు కారణాలతో మార్చాల్సి రావచ్చు. మీ లక్ష్యాల్లో మార్పులు చోటు చేసుకున్నప్పుడు వాటికి అనుగుణంగా పెట్టుబడుల్లో మార్పులు అవసరం పడుతుంది. అనుకున్న లక్ష్యాలను చేరుకున్నప్పుడు కూడా ఈ పని చేయొచ్చు. ఉదాహరణకు రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్ చేస్తున్నారు. కావాల్సిన మొత్తం సమకూరితే పెట్టుబడి మొత్తాన్ని తీసేసుకోవచ్చు. నిర్ణీత కాలవ్యవధికి ముందే మీకు కావాల్సిన మొత్తం సమకూరితే అప్పుడు కూడా మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఇక మీరు ఒక పథకంలో సానుకూలతలను చూసి ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. తర్వాతి కాలంలో ఆ సానుకూలతల్లో మార్పులు వచ్చినట్టయితే పెట్టుబడులను విక్రయించుకోవచ్చు. మంచి రాబడిని ఇస్తుందన్న కారణంతో ఒక పథకంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. ఆశించిన విధంగా పనితీరు లేకపోతే, దాని నుంచి తప్పుకోవచ్చు. అలాగే, ఫండ్ మేనేజర్‌లో మార్పు చోటు చేసుకుని, అనంతరం ఆ ఫండ్ రాబడుల పనితీరు మెరుగ్గా లేని సందర్భంలోనూ వేరే పథకంలోకి మారిపోవడాన్ని పరిశీలించొచ్చు.

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాల పెట్టుబడులను విక్రయించగా మూలధన లాభం వచ్చింది. నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులను (ఏడాదిలోపు) విక్రయించగా నష్టం వచ్చింది. ఫండ్స్‌లో వచ్చిన దీర్ఘకాల లాభం నుంచి స్టాక్స్‌లో వచ్చిన స్వల్పకాల మూలధన నష్టాన్ని సర్దుబాటు చేసుకోవచ్చా?
- జ్యోతిస్ టీ.వీ

స్టాక్స్‌లో వచ్చిన స్వల్పకాల మూలధన నష్టాలను ఈక్విటీ ఫండ్స్‌లో వచ్చిన దీర్ఘకాల లాభాలతో సర్దుబాటు చేసుకోవచ్చు. ఈక్విటీల్లో పెట్టుబడులను ఏడాది నిండకుండా విక్రయించినప్పుడు అది స్వల్పకాల క్యాపిటల్ అసెట్ అవుతుంది. లాభంపై 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈక్విటీల్లో పెట్టుబడులను ఏడాది నిండిన తర్వాత విక్రయించినప్పుడు అది దీర్ఘకాల క్యాపిటల్ అసెట్ కిందకు వస్తుంది. మూలధన లాభం మొదటి రూ.1.25 లక్షలపై ఎలాంటి పన్ను లేదు. రూ.1.25 లక్షలకు మించి వచ్చిన లాభంపై 12.5 శాతం పన్ను చెల్లించాలి. ఆదాయపన్ను రిటర్నులను నిర్ణీత గడువులోపు (జూలై 31లోపు) దాఖలు చేయడం ద్వారా, మిగిలిన నష్టాలను తదుపరి ఎనిమిది సంవత్సరాలకు క్యారీ ఫార్వర్డ్ చేసుకోగలరు.

మహిళలకు ప్రత్యేక హెల్త్ ప్లాన్

'హెరిజాన్'ను ఆవిష్కరించిన బజాజ్ అలియాంజ్




పుణె: మహిళల కోసం ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ 'హెరిజాన్ కేర్'ను బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. మహిళల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీన్ని తీసుకొచ్చినట్టు తెలిపింది. క్రిటికల్ ఇల్‌నెస్ (తీవ్రమైన వ్యాధులు/అనారోగ్యాలు), మేటర్నల్ (మహిళల గర్భధారణ, ప్రసవానంతర ఆరోగ్యం), రీప్రొడక్టివ్ హెల్త్, వెల్‌నెస్ తదితర అన్ని అంశాలకు ఈ ప్లాన్‌లో రక్షణ ఉంటుందని తెలిపింది. జీవితంలోని వివిధ దశల్లో మహిళలకు ఆర్థిక భద్రతను ఇచ్చే విధంగా ఉంటుందని పేర్కొంది. విటా షీల్డ్, క్రాడిల్ కేర్ పేరుతో రెండు రకాల సమగ్రమైన కవరేజీలు ఇందులో ఉంటాయి. విటాషాల్డ్ కింద 34 క్రిటికల్ ఇల్‌నెస్‌లకు కవరేజీ ఉంటుంది. కావాలంటే ఈ కవరేజీని పెంచుకోవచ్చు. చైల్డ్ ఎడ్యుకేషన్ కింద.. మహిళ క్రిటికల్ ఇల్‌నెస్ బారిన పడితే ఆమె పిల్లల విద్యా సంబంధిత ఖర్చులను ఈ పాలసీ చెల్లిస్తుంది. క్రిటికల్ ఇల్‌నెస్ కారణంగా ఉద్యోగం కోల్పోతే ఎదురయ్యే ఆర్థిక అనిశ్చితులకూ రక్షణ కల్పిస్తుంది. క్రాడిల్ కేర్ కింద మహిళ పునరుత్పాదక ఆరోగ్య అవసరాలకు తగ్గట్టుగా రక్షణ ఉంటుంది. సరోగేట్ కేర్ (మరొకరి సాయంతో సంతానం పొందడం) కింద.. గర్భాన్ని మోస్తున్న తల్లికి సంబంధించి అయ్యే వైద్య ఖర్చులను చెల్లిస్తుంది. 21-45 ఏళ్ల వయసు మహిళలకు సంతాన లోపాలను అధిగమించే విషయంలోనూ కవరేజీని ఆఫర్ చేస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ధరలు, ప్రపంచ పరిస్థితులు కీలకం
ఆవిష్కరణలతోనే ఫార్మాకు భవిష్యత్

మోతీలాల్ ఓస్వాల్ ఇన్నోవేషన్ అపార్చూనిటీస్

వినూత్నమైన పెట్టుబడి అవకాశాలతో కూడిన నూతన మ్యూచువల్ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో)ను మోతీలాల్ ఓస్వాల్ ప్రారంభించింది. మోతీలాల్ ఓస్వాల్ ఇన్నోవేషన్ అపార్చూనిటీస్ పేరుతో తీసుకొచ్చిన ఈ ఎన్ఎఫ్‌వో ఈ నెల 12న ముగుస్తుంది. వినూత్నమైన వ్యాపార వ్యూహాలను (కొత్త ఉత్పత్తులు, సేవలు, టెక్నాలజీలపై దృష్టి పెట్టేవి) అమలు చేసే కంపెనీల్లో ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంది. ఈక్విటీలకు 80 శాతం నుంచి 100 శాతం వరకు, డెట్‌కు 0-20 శాతం వరకు కేటాయింపులు చేస్తుంది. కనీస పెట్టుబడి రూ.500. రోజువారీ సిప్ అయితే రూ.100 నుంచి, వారం, నెలవారీ సిప్ అయితే రూ.500తో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

‘సైబర్’ రిఫండ్ సగమే..



సైబర్ మోసాల్లో 25 నెలల్లో రూ.**2,745** కోట్లు కోల్పోయిన రాష్ట్రవాసులు

రూ.**389.9** కోట్లు ఫ్రీజ్.. రూ.**195** కోట్లు మాత్రమే రిఫండ్

నెలలు పడుతున్న రిఫండ్ ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బు పోగొట్టుకుంటున్న బాధితులు.. చివరి క్షణంలో నేరగాళ్ల బ్యాంకు ఖాతాల ఫ్రీజ్‌పై ఆశలు పెట్టుకున్నా, ఆ సొమ్ము చేతికి వస్తుందన్న గ్యారంటీ లేక ఆవేదన చెందుతున్నారు. 2023 నుంచి ఈ ఏడాది జనవరి 14 వరకు దాదాపు 25 నెలల్లో రాష్ట్ర వాసుల నుంచి సైబర్ నేరగాళ్లు రూ.2,795 కోట్లు కాజేయగా.. అందులో రూ.389 కోట్లు పోలీసులు ఫ్రీజ్ చేశారు. అందులో బాధితులకు చేరింది రూ.195 కోట్లు మాత్రమే. అంటే కోల్పోయిన సొమ్ములో 14.20 శాతం ఫ్రీజ్ కాగా, ఇందులో 50.11 శాతం మాత్రమే వారికి తిరిగి చేరింది. అందుకు బ్యాంకింగ్ రంగంలోని లోపాలే కారణమని తెలుస్తోంది.




ఫ్రీజింగ్ వరకు తేలిగ్గా జరుగుతున్నా

సైబర్ నేరాల్లో డబ్బు పోగొట్టుకున్నవారు పోలీసులకు ఫిర్యాదు చేయటం, అకౌంట్ల ఫ్రీజింగ్ గతంలో పెద్ద ప్రహసనంగా ఉండేది. 2019 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పీ), 1930 నంబర్‌ను అందుబాటులోకి తెచ్చిన తర్వాత తక్షణం ఫిర్యాదు చేసే సౌకర్యం కలిగింది. ఈ పోర్టల్ ఫిర్యాదు అందిన వెంటనే నిందితుల బ్యాంకు ఖాతాల్లోని మొత్తాన్ని ఫ్రీజ్ చేస్తోంది. కానీ, ఆ మొత్తాన్ని తిరిగి పొందడంలోనే అసలు సమస్య ఉంటోంది. బాధితుల నుంచి దోచిన సొమ్మును క్షణాల్లో పదుల ఖాతాల్లోకి బదిలీ చేస్తుండటంతో, అన్ని ఖాతాల్లోని సొమ్మును ఫ్రీజ్ చేసి బాధితులకు రిఫండ్ చేయటం కష్టంగా మారుతోంది. మరోవైపు ఒకే ఖాతాలో వేర్వేరు ప్రాంతాల బాధితులు డబ్బు జమ చేసినప్పుడు, ఆయా ప్రాంతాల పోలీసులు సదరు ఖాతా ఫ్రీజింగ్ కోసం బ్యాంకులకు లేఖలు రాస్తున్నారు. దీంతో బాధితులకు డబ్బు తిరిగి చేరటంలో సమస్యలు ఎదురవుతున్నాయి.

లేయర్లతో కాలహరణం

ఫ్రీజింగ్‌ను తప్పించుకునేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నారు. దోచిన డబ్బును వీలైనన్ని ఎక్కువ ఖాతాల్లోకి మార్చేస్తున్నారు. ఇలా మార్చడాన్ని లేయర్స్ అంటారు. ఓ నేరంలో బాధితుడి సొమ్ము ఎన్ని లేయర్స్ దాటుతుందో.. రిఫండ్ అంత ఆలస్యమవుతోంది. ప్రతి లేయర్‌కు సంబంధించిన స్టేట్‌మెంట్‌ను తెప్పించి, వాటన్నింటినీ క్రోడీకరించి.. అది బాధితుడి డబ్బేనని నిరూపించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఆపై కోర్టులో ఒక్కో లేయర్‌కు సంబంధించి పిటిషన్ వేసి బాధితుడి ఖాతాకు డబ్బు తిరిగి వచ్చేలా ఆర్డర్ పొందాలి. దీన్ని బ్యాంకు అధికారికి అందించి నగదు రిఫండ్ కోరాల్సి ఉంటుంది. ఓ ఖాతాలో ఎన్ని ప్రాంతాల బాధితులు డబ్బు డిపాజిట్ చేస్తే, అన్ని ప్రాంతాల పోలీసులు ఇలాంటి ఆర్డర్లు పొందుతూ ఉంటారు. బ్యాంకు అధికారులు తొలుత వచ్చిన వారికి తొలి ప్రాధాన్యం లెక్కన ఖాతాల్లోని ఫ్రీజైన సొమ్మును వారికే రిఫండ్ చేస్తున్నారు. దీంతో కోర్టుల్లో ఆలస్యమై చివరన వచ్చే బాధితులకు పైసా కూడా దక్కటంలేదు.



కోర్టుల్లో పిటిషన్లతో మరికొంత ఆలస్యం

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు అందించడానికి మనీమ్యూల్స్ ఉంటున్నారు. వీళ్లు తమ ఖాతాల్లో పడిన మొత్తం నుంచి కమీషన్‌ను మిగుల్చుకుని మిగిలింది నేరగాళ్లు చెప్పిన ఖాతాకు బదిలీ చేస్తుంటారు. మనీమ్యూల్స్ మిగుల్చుకున్న డబ్బుతో బంగారం, వస్తువులు కొని వ్యాపారి ఖాతాలోకి డబ్బు బదిలీ చేస్తారు. సాంకేతికంగా ఈ ఖాతాలన్నీ నేరగాళ్లకు చెందినవిగానే భావిస్తూ పోలీసులు ఫ్రీజ్ చేస్తున్నారు. ఈ చర్యను సవాల్ చేస్తూ ఆయా వ్యాపారులు కోర్టు మెట్లు ఎక్కుతుండటంతో కేసు కొలిక్కి వచ్చే వరకు రిఫండ్ సాధ్యం కావటంలేదు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం సూచించడానికి ఆర్బీఐ సైబర్ క్రైమ్స్ డీసీపీ దార కవిత నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసింది. దీని సిఫార్సుల ఆధారంగా కీలక మార్పుచేర్పులు జరిగే అవకాశం ఉంది.

రెండు కారణాల వల్లే..

సైబర్ నేరాల్లో ఫ్రీజ్ అయిన సొమ్ము బాధితులకు చేరడంలో ఆలస్యానికి రెండు కారణాలున్నాయి. ఫ్రీజ్ అయిన తమ సొమ్మును తిరిగి ఇచ్చేలా బ్యాంకును ఆదేశించాలంటూ బాధితులే కోర్టులో పిటిషన్ వేయాలి. కోర్టు ఆదేశాలు రావటం ఆలస్యమవుతోంది. ఫ్రీజ్ అయిన సొమ్ము వేర్వేరు ప్రాంతాల్లోని వేర్వేరు బ్యాంకు ఖాతాల్లో ఉంటోంది. కోర్టు ఆర్డర్ వచ్చినప్పటికీ ఆయా బ్యాంకుల నోడల్ అధికారులు రిఫండ్ చేయడానికి సమయం తీసుకుంటున్నారు. ఇటీవల ఆర్బీఐతో జరిగిన సమావేశంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఏయే బ్యాంకులు ఆలస్యం చేస్తున్నాయో వివరించారు.



శివమారుతి
ఏసీపీ,
హైదరాబాద్
సైబర్ క్రైమ్ ఏసీపీ

2023-2025 జనవరి 14 మధ్య గణాంకాలు ఇవీ:

	2023	2024	2025	మొత్తం
బాధితులు	91,651	1,20,869	4,645	2,17,165
నష్టం (రూ.ల్లో)	7,78,75,97,512	19,09,55,43,337	57,27,79,952	27,45,59,20,801
ఫ్రీజ్ చేసిన డబ్బు (రూ.ల్లో)	1,28,37,94,969	2,54,50,76,702	7,02,10,293	3,98,90,81,964
రిఫండ్ (రూ.ల్లో)	8,36,13,059	1,83,92,00,703	3,12,88,145	1,95,41,01,907



ఓలా.. ఈవీల్లో భళా

దేశంలో 2025 జనవరి నెలలో రికార్డు స్థాయిలో విద్యుత్ వాహనాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. మొత్తం 88,215 వాహనాల అమ్మకాలు జరిగితే ఇందులో అత్యధికం ఓలా ఎలక్ట్రిక్ వాహనాలే. ఎలక్ట్రిక్ మోటారు సైకిళ్లు, గిగ్ వర్కర్ల కోసం టూ వీలర్ల వంటివి ప్రవేశపెట్టడమే ఇందుకు ప్రధాన కారణం. ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ అమ్మకాలు పెంచేందుకు అవుట్‌లెట్లను 700 నుంచి ప్రస్తుతం 4,000కు పెంచింది. ఓలా తరవాత.. దాదాపు 25 శాతం అమ్మకాలతో టీవీఎస్ రెండో స్థానంలో ఉంది. ఇతరుల జాబితాలో మొత్తం 110కిపైగా కంపెనీలున్నాయి.

కంపెనీ	వాహనాల సంఖ్య	మొత్తంలో శాతం
ఓలా ఎలక్ట్రిక్	22,656	25.68
టీవీఎస్	22,080	25.02
బజాజ్	20,176	22.80
ఏథర్	12,101	13.07
ఇతరులు	11,202	13.43

ఆధారం: వాహన్ పోర్టల్

‘పంబన్’ పాత వంతెన కూల్చేస్తారా?

- దానిని అలాగే ఉంచడం శ్రేయస్కరం కాదని నిపుణుల నివేదిక
- వందేళ్లనాటి ‘అద్భుతాన్ని’ పర్యాటక ప్రాంతంగా మార్చాలన్న డిమాండ్లు
- కేంద్ర ప్రభుత్వం చేతిలో పాత వంతెన భవితవ్యం

(పంబన్ (రామేశ్వరం) నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)




వందేళ్లకు పూర్వమే సముద్రం మీదుగా నిర్మించిన, ప్రపంచ దృష్టిని ఆకర్షించిన రామేశ్వరం పురాతన పంబన్ వంతెన భవిష్యత్తు ఏమిటనే చర్చ జరుగుతోంది. తమిళనాడు తీర ప్రాంతం మండపం నుంచి పంబన్ ద్వీపంలోని రామేశ్వరం మధ్య నిర్మించిన అత్యాధునిక వర్టికల్ లిఫ్ట్ వంతెన కొన్ని రోజుల్లో అందుబాటులోకి వస్తుండటంతో.. పాత పంబన్ వంతెన అవసరం లేకుండా పోయింది. పెద్ద పడవలు వచ్చినప్పుడు దారి కల్పించేందుకు.. వంతెన మధ్యలో రెండు భాగాలుగా విడిపోయి పైకి లేచేలా నిర్మించిన పాత వంతెన పర్యాటకులకు ఇప్పటికీ ప్రత్యేకమే. రామేశ్వరం రామనాథస్వామి దర్శనానికి వచ్చే భక్తులు.. ఈ వంతెనను సందర్శించేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటి ఈ ప్రత్యేక వంతెనను తొలగిస్తారన్న వార్తలతో ఆందోళన వ్యక్తమవుతోంది.

వందేళ్లకుపైగా మన్నికగా..

1902లో పంబన్ పాత వంతెన నిర్మాణం ప్రారంభమై 1914లో పూర్తయింది. దాని జీవితకాలం వందేళ్లలోపే అయినా 110 ఏళ్లుగా సేవలు అందిస్తూనే వచ్చింది. అది శిథిలావస్థకు చేరడంతో 2022 డిసెంబర్ నుంచి రైళ్ల రాకపోకలను నిలిపేశారు. దాన్ని అలాగే ఉంచినా త్వరలో కూలిపోయేలా ఉందని.. అదే జరిగితే పక్కనే ఉన్న రోడ్డు వంతెన, కొత్త రైలు వంతెనకు నష్టం వాటిల్ల వచ్చని, దాన్ని తొలగించాలని నిపుణులు ప్రభుత్వానికి సూచించారు. కానీ సాధారణ మరమ్మతులు చేసి, పర్యాటక స్థలంగా భావి తరాలకు అందించాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. ఇప్పుడిది కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది.

రాజమండ్రి హేవ్‌లాక్ వంతెనలా..


ఏపీలో గోదావరి నదిపై రాజమండ్రి వద్ద వందేళ్లపాటు సేవలందించిన పురాతన హేవ్‌లాక్ రైలు వంతెన.. ప్రస్తుతం పర్యాటక ప్రాజెక్టుగా మారుతోంది. పంబన్ పాత వంతెనను కూడా అలా పర్యాటక ప్రాజెక్టుగా మార్చాలని రైల్వే శాఖకు వినతులు వస్తున్నాయి.



టుడేస్ గ్రాఫిక్

విదేశాలకు వెళ్లొస్తాం..

విదేశాల్లో తిరిగి రావాలని అనుకుంటున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. 2025 గ్లోబల్ ట్రావెల్ అవుట్‌లుక్ నివేదిక ఈ మేరకు తెలిపింది. గతేడాదితో పోలిస్తే.. అన్ని దేశాల ప్రజల్లో ఈ ఆకాంక్ష పెరగ్గా.. యూకే, మెక్సికోలో మాత్రం స్వల్పంగా తగ్గినట్లు పేర్కొంది.



గుట్టుగా ‘ఊపిరి’ తీస్తోంది!

ఏటా ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలకు కారణమవుతోన్న లంగ్ కేన్సర్

- అన్ని కేన్సర్లకంటే ఇది ప్రమాదకరం: యశోద హాస్పిటల్స్ ఎండీ డా.జీఎస్ రావు
- హైటెక్స్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సదస్సు ‘బ్రాంకాస్ 2025’



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జి.ఎస్.రావు

సాక్షి, హైదరాబాద్: ఏటా ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలకు ఊపిరితిత్తుల కేన్సర్ కారణమవుతోందని యశోద గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ జి.ఎస్.రావు అన్నారు. ఇతర కేన్సర్ మరణాలకంటే ఇది చాలా ఎక్కువ అని, ఈ కేన్సర్ చాలా ఆలస్యంగా 3 లేదా 4వ దశలలో నిర్ధారణ కావడం వల్లనే మరణాల సంఖ్య ఎక్కువగా ఉంటుందని అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో రెండు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ పల్మనాలజీ సదస్సుకు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం మాట్లాడుతూ, భారతదేశంలోని అన్ని కేన్సర్ కేసులలో ఊపిరితిత్తుల కేన్సర్ కేసులు 8.5 శాతం ఉన్నాయన్నారు. ఎప్పటికప్పుడు పుట్టుకొస్తున్న కొత్తకొత్త మహమ్మారులు, ఊపిరితిత్తుల వ్యాధులు, సుదీర్ఘకాలంగా వేధించే ఉబ్బస వ్యాధి నుంచి కరోనా వైరస్ వరకు అనేక ఊపిరితిత్తుల వ్యాధులకు ఉపశమనం కలిగించే బ్రొంకియాల్ థర్మో ప్లాస్టీ, ఇంటర్వెన్షనల్ బ్రాంకోస్కోపిక్ థర్మల్ వెపార్ అబ్లేషన్ లాంటి అత్యాధునిక వైద్య విధానాలను దక్షిణాదిలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత యశోద హాస్పిటల్స్ వైద్యులకు దక్కిందన్నారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డా. పవన్ గోరుకంటి మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు ఆధారిత ముందస్తు ఊపిరితిత్తుల కేన్సర్లను గుర్తించే పరికరంతోపాటు అనేక ఇతర కొత్త సాంకేతిక వైద్య విధానాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే వరుసగా నాలుగవసారి నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల ప్రపంచస్థాయి సదస్సులో ప్రాథమికస్థాయి నుంచి అత్యంత క్లిష్టమైన ఆధునిక వైద్య విధానాల గురించి చర్చించడంతోపాటు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించామని సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి, యశోద పల్మనాలజీ వైద్య నిపుణులు డాక్టర్. హరికిషన్ వెల్లడించారు. ప్రపంచ స్థాయి ప్రముఖ వైద్యులు ప్రొఫెసర్ ఫెలిక్స్ హెర్త్- థొరాక్స్ క్లినిక్ (జర్మనీ), ప్రొఫెసర్ కైల్ హోగార్త్- యూనివర్సిటీ ఆఫ్ చికాగో (యూఎస్ఏ), డాక్టర్ మైఖేల్ ప్రిట్చెట్ (యూఎస్ఏ), డాక్టర్ పల్లవ్ షా (లండన్), డాక్టర్ మునవ్వర్ (లండన్), డాక్టర్ లోరెంజో (ఇటలీ), డాక్టర్ జమాలుల్ (మలేసి యా) ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైద్యురాలు అవయవ దానం

- కారు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన డాక్టర్
- ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి దంపతుల సూచనతో అవయవదానం



తలుపుల: రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఓ వైద్యురాలు అయిదుగురి జీవితాల్లో వెలుగులు నింపింది. ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి మేన కోడలు డాక్టర్ నంగి భూమిక (24) హైదరాబాద్‌లోని కామినేని వైద్య కళాశాలలో వైద్యురాలు. ఇటీవల ఓ ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా ఆమె ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. తీవ్రంగా గాయపడిన భూమిక ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆదివారం ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. కల్పలతా రెడ్డి, ప్రతాప్‌రెడ్డి సూచన మేరకు భూమిక తల్లిదండ్రులు లోహిత, నందకుమార్ రెడ్డి ఆమె అవయవాలను దానం చేయడానికి ముందుకొచ్చారు. కుమార్తె చని పోయినా ఆమె అవయవాలు నలుగురికీ ఉపయో గపడాలన్న ఉద్దేశంతో గుండె, రెండు కళ్లు, కిడ్నీలు దానం చేస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

ఏరో ఇండియా-2025లో వెమ్ ‘టెక్నాలజీ’ ప్రదర్శన

- డీఆర్డీవోతో కలిసి అత్యాధునిక యుద్ధ విమానం తయారీ
- హైదరాబాద్‌కు చెందిన వార్ టెక్ సంస్థ ఘనత
- ఏరో ఇండియా–2025 షోలో ప్రధాన ఆకర్షణగా ఈ విమానం
- నేడు ఆవిష్కరించనున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్




సాక్షి, హైదరాబాద్: రక్షణశాఖ, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), డీఆర్‌డీవో సంయుక్తంగా సోమవారం నుంచి 14 వరకు బెంగళూరులో నిర్వహిస్తున్న ఏరో ఇండియా–2025 అంతర్జాతీయ ప్రదర్శనలో హైదరాబాద్‌కు చెందిన వెమ్ (వీఈఎం) టెక్నాలజీస్ ప్రధాన ఆకర్షణగా నిలువనుంది. డీఆర్డీవోతో కలిసి వెమ్ టెక్నాలజీస్ తయారుచేసిన అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ)ను షోలో ప్రదర్శిస్తున్నారు. ఏరో ఇండియా–2025లో భారత పెవిలియన్‌లో ఏఎంసీఏనే ప్రధాన ఆకర్షణ అని డీఆర్డీవో ఆదివారం ట్వీట్ చేసింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సోమవారం ఏఎంసీఏను ఎయిరో ఇండియా షోలో ఆవిష్కరిస్తారని వెమ్ టెక్నాలజీస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 60 దేశాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. హెలికాప్టర్లు, యుద్ధ విమానాల ఆన్‌బోర్డు వ్యవస్థల శ్రేణికి చెందిన ఫ్యూజ్‌లేజ్‌లు, జనరేటర్ల తయారీలో వెమ్ టెక్నాలజీస్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ అత్యాధునిక ఏఎంసీఏను హైదరాబాద్‌లోనే పూర్తిగా అసెంబుల్ చేయటం విశేషం. భారత త్రివిధ దళాలకు అవసరమైన పలు ఆయుధ వ్యవస్థలను కూడా ఈ సంస్థ తయారుచేసింది. ఇటీవలే యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ ‘అసీబల్’ను అభివృద్ధి చేసింది.



మహానగరాల్లో ఈ-కామర్స్

ఆహారం, కూరగాయలు, పండ్లు.. ఇలా నిత్యావసరాలు, సరుకులు ఏది కావాలన్నా ఇప్పుడు నగరాల్లో క్షణాల్లో ఇంటికే వచ్చేస్తున్నాయి. ఇదంతా ఈ-కామర్స్ సంస్థల మహత్యం. మేం అరగంటలో ఇస్తామంటే మేం పావుగంటలో ఇస్తామని ఒకరు చాలెంజ్ చేశారు. మేం 10 నిమిషాల్లోనే ఇచ్చేస్తామని మరొకరు ముందుకొచ్చారు. ఇలా సరుకులను ఇస్తూ.. దేశమంతటా విస్తరించుకుంటూపోతున్నారు. దేశంలో ప్రస్తుతం అత్యధిక నగరాల్లో సేవలు అందిస్తున్న ఘనత స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కి దక్కుతుంది.



ఆధారం: డాటమ్ నివేదిక

ఆర్డీఎస్ఎస్‌లో చేరగానే.. ప్రీపెయిడ్ మీటర్లు

▶ మొదటి పేజీ తరువాయి

బిగిస్తామని ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్/టీజీఎస్పీడీసీఎల్)లు తెలిపాయి. ఆర్డీఎస్ఎస్ కింద సాధారణ ఫీడర్ల నుంచి వ్యవసాయ ఫీడర్లను వేరుచేసి, వాటికి సైతం కమ్యూనికేబుల్ ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) మీటర్లను బిగిస్తామని పేర్కొన్నాయి. దీంతో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు బిగించకుండానే వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని ఆటోమెటిక్‌గా తెలుసుకోవచ్చని వెల్లడించాయి. ఇటీవల తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్) – 2025-26లో ఈ విషయాన్ని నివేదించాయి. సమ్మతితో ముందుకు వచ్చే విద్యుత్ వినియోగదారులందరికీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించాలని గతేడాది జారీచేసిన టారిఫ్ ఆర్డర్‌లో డిస్కంలను ఈఆర్సీ ఆదేశించింది. వినియోగదారులందరి పాత మీటర్ల స్థానంలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి నిర్దేశిత గడువుతో కూడిన కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని కోరింది. వినియోగదారుల గృహాలకు వెళ్లి ప్రతి నెలా మీటర్ రీడింగ్ నమోదుచేసే అవసరం లేకుండా, ఎప్పటికప్పుడు విద్యుత్ వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని డిస్కంలతో పాటు వినియోగదారులకూ తెలియజేసే స్మార్ట్ మీటర్లను బిగించాలని సూచించింది. ఈ ఆదేశాలపై తీసుకున్న, తీసుకోనున్న చర్యలను డిస్కంలు ఏఆర్ఆర్ నివేదికలో పొందుపరిచాయి.


అప్పట్లో నో చెప్పిన కేసీఆర్ సర్కార్..

నష్టాల్లో ఉన్న డిస్కంలను గాడిలో పెట్టడానికి కేంద్రం 2021 ఆగస్టు 17న ఆర్డీఎస్ఎస్ పథకాన్ని తీసుకొచ్చింది. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడంతోపాటు ఇతర చర్యలు తీసుకునే రాష్ట్రాలకు రాష్ట్ర రుణ పరిమితికి మించి 0.5 శాతం అధిక రుణాలను తీసుకోవడానికి అనుమతిస్తామని ప్రకటించింది. అయితే, ఈ సంస్కరణలను గత కేసీఆర్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఆర్డీఎస్ఎస్ పథకంలో చేరేందుకు అనుమతి కోరుతూ అప్పట్లో డిస్కంలు ప్రతిపాదనలు పంపించగా, ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. తాజాగా ప్రభుత్వం మారటంతో ఆ పథకంలో చేరేందుకు డిస్కంలు మళ్లీ ప్రయత్నాలు చేస్తున్నాయి. విద్యుత్ సంస్కరణలను అమలు చేసే రాష్ట్రాలు 0.5 శాతం అదనపు రుణాలు తీసుకొనేందుకు అనుమతి ఇస్తామని ఇటీవలి బడ్జెట్‌లో కూడా కేంద్రం ప్రకటించింది.

మంత్రివర్గం అనుమతి ఇస్తే..

2021 ఆగస్టు 17న సెంట్రల్ ఎలక్ట్రిసిటీ ఆథారిటీ (సీఈఏ) జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం 50% పట్టణ వినియోగదారులను కలిగి ఉండి, 2019–20లో 15 శాతానికి పైగా విద్యుత్ సాంకేతిక, వాణిజ్య నష్టాల మొత్తం (ఏటీఅండ్‌సీ) కలిగిన డివిజన్లతోపాటు 25 శాతానికి పైగా నష్టాలున్న ఇతర డివిజన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో 2023 డిసెంబర్‌కి 100% ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించాల్సి ఉందని డిస్కంలు ఈఆర్సీకి తెలిపాయి. ఇతర ప్రాంతాల్లో 2025 మార్చి నాటికి 100% స్మార్ట్ మీటర్లు బిగించాల్సి ఉందని వివరించాయి. రాష్ట్రంలో రూ.938.37 కోట్ల అంచనాలతో ఆర్డీఎస్ఎస్ పథకం అమలుకు ప్రతిపాదించగా, రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించాల్సి ఉందని తెలియజేశాయి. ఆర్డీఎస్ఎస్‌లో రాష్ట్రం చేరితే ఒక్కో స్మార్ట్ మీటర్‌కు కేంద్రం రూ.900 గ్రాంట్‌గా ఇస్తుంది. తమ పరిధిలోని 81 లక్షల విద్యుత్ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే రూ.729 కోట్ల వ్యయం అవుతుందని టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. వ్యవసాయ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల నుంచి కేంద్రం మినహాయింపు ఇచ్చినట్లు డిస్కంలు తెలిపాయి.

అక్రమంగా మందులు నిల్వ చేస్తే ఐదేళ్ల జైలు: కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మందుల నిల్వ, విక్రయానికి సంబంధించి డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) నుంచి విధిగా లైసెన్స్‌లు తీసుకోవాలని డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి సూచించారు. అక్రమంగా మందులు నిల్వ చేసినా, విక్రయించినా.. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం కింద ఐదేళ్ల వరకు జైలు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ వైద్యుల క్లినిక్‌లపై డీసీఏ అధికారుల సోదాలు కొనసాగుతున్నట్టు తెలిపారు. సోదాల్లో భాగంగా శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బొల్లారం గ్రామంలో క్లినిక్‌ను నిర్వహిస్తున్న నకిలీ వైద్యుడు బి.భరణివంశీగౌడ్‌ను గుర్తించినట్టు పేర్కొన్నారు. నకిలీ క్లినిక్‌లతోపాటు నివాస సముదాయాలు, వాణిజ్య సముదాయాల్లో అక్రమంగా మందుల నిల్వ, తయారీ, విక్రయాలు.. ఇతర అక్రమాలపైనా టోల్‌ఫ్రీ నంబర్ 1800–599–6969లో ఫిర్యాదు చేయాలని కోరారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

అన్నదాతా సుఖీభవ..

మహా యజ్ఞంలా అక్షయపాత్ర అన్నదానం..

- 4 బిలియన్ల భోజనాలు పూర్తి చేసిన ప్రాజెక్ట్..
- రాష్ట్రంలో రోజూ 2 లక్షల మందికి అన్నదానం
- తెలంగాణలో ప్రపంచంలోనే అతిపెద్ద కిచెన్
- 16 రాష్ట్రాల్లో.. విదేశాల్లో సేవలు..
- దేశవ్యాప్తంగా రోజూ 22.5 లక్షల భోజనాల పంపిణీ

ఒకటా రెండా.. రోజూ 22.5 లక్షల మంది ఆకలి తీరుస్తోంది. అక్షరాలా అన్నపూర్ణగా మారింది. ఇప్పుడా సంఖ్య 4 బిలియన్ల భోజనాలు దాటిపోయింది. అమ్మలా ఆకలి తీరుస్తున్న ఘనత దక్కించుకున్న ఆ సంస్థ అక్షయపాత్ర ఫౌండేషన్. ఆకలి తీర్చే మహాన్నదాన యజ్ఞం 2000 సంవత్సరంలో మొదలు పెట్టింది. దాదాపు లక్ష మంది వరకు సరిపడా అన్నాన్ని వండగల అతిపెద్ద వంట గదులతో.. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లోని పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని, అల్పాహారాలను అందిస్తున్న అక్షయ పాత్ర ఫౌండేషన్‌పై సవివర కథనమిది.

– సాక్షి, హైదరాబాద్



అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో రోజూ 2 లక్షల మంది ఆకలిని తీరుస్తున్నారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిక మేరకు కొండంగల్ వేదికగా అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా వికారాబాద్, నారాయణపేట్ జిల్లాల్లోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో 28 వేల మందికి నిత్యం అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇది రాష్ట్రంలోనే అతిపెద్ద బ్రేక్‌ఫాస్ట్ కిచెన్‌గా అవతరించింది.

1500 భోజనాలతో మొదలై..

ఇస్కాన్ బెంగళూరు వేదికగా 2000 సంవత్సరంలో 1500 మందికి భోజనాలను అందించడమే లక్ష్యంగా ఆవిష్కృతమైన ఈ కార్యక్రమాన్ని.. లౌకికతత్వంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించారు. ఇలా మొదలైన అక్షయ పాత్ర అన్నదాన మహా యజ్ఞం కోసం.. 2 వేల నుంచి లక్ష మంది వరకు వండగల 75 కిచెన్లను నిర్మించారు. ఇందులో భాగంగా 16 రాష్ట్రాలతో పాటు 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 23 వేల పాఠశాలల్లో 22.5 లక్షల మందికి రోజూ భోజనం అందిస్తున్నారు. 2001లో కర్ణాటకలో మధ్యాహ్న భోజన పథకంగా ప్రారంభించిన మహత్తర కార్యక్రమం కోసం.. 2008లో సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోని పటాన్‌చెరు వేదికగా దాదాపు 30 వేల మందికి భోజనాలు అందించగల సామర్థ్యంతో తాత్కాలిక పాకశాలను నిర్మించారు. దీన్ని అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రోద్బలంతో ప్రారంభించారు. అప్పుడు మొదలైన అన్నదాన కార్యక్రమం.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మహబూబ్ నగర్, వరంగల్, హన్మకొండ (7) జిల్లాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో.. కంది, నార్సింగి, నవాబ్‌పేట్, వరంగల్ మహబూబ్ నగర్ (5) ప్రాంతాల్లోని కిచెన్‌ల సహకారంతో రోజూ 2 లక్షల మందికి భోజనం అందిస్తున్నారు. ఇందులో భాగంగా అన్నం, కూర, సాంబార్, పండ్లు, మిఠాయితో పాటు ప్రత్యేకంగా స్నాక్స్ అందిస్తున్నారు. భోజనాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో అల్పాహారాలను కూడా అందిస్తున్నారు.

50 శాతం నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి

మధ్యాహ్న భోజనంలో భాగంగా ప్రతీ విద్యా సంవత్సరానికి.. ఒక్కొక్క విద్యార్థికి రూ.1500 ఖర్చవుతుందని నిర్వాహకుడు హెచ్‌జీ సత్య గౌర చంద్ర దాస తెలిపారు. ఈ ఖర్చులో 50 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయి. మిగతా 50 శాతం ఖర్చును అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ వేదికల్లో నిధులు సమీకరిస్తున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు.. ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నగరాలు, పట్టణాల్లోని నిరుపేదల కోసం జీహెచ్ఎంసీ తలపెట్టిన అన్నపూర్ణ (రూ.5కే భోజనం) ప్రాజెక్టును హరేకృష్ణ ఫౌండేషన్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రూ.5కే అన్నం, కూర, సాంబార్, చట్నీ, మజ్జిగ, నీరుతో పాటు అప్పుడప్పుడు మిఠాయి సైతం అందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా హైదరాబాద్‌లో 127 సెంటర్లతో రోజూ 22 వేల భోజనాలను పంపిణీ చేస్తున్నారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, సిరిసిల్ల, కోదాడ, మహబూబ్‌నగర్ వంటి ఇతర మున్సిపాలిటీల్లో 20 సెంటర్లతో 5 వేల భోజనాలను అందిస్తున్నారు.

ఆస్పత్రుల్లో 'భోజనామృతం'

హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఈఎస్ఐ వంటి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులకు ప్రభుత్వ ఆర్థిక సహకారంతో 'భోజనామృతం' పేరుతో రోజూ 3 పూటలా పోషకాహారాన్ని అందించే ప్రాజెక్టునూ హరేకృష్ణ ఫౌండేషన్ నిర్వహిస్తోంది. ఇలా రోజూ 13 కేంద్రాల్లో దాదాపు 2200 భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు సద్ది మూట ప్రాజెక్టులో భాగంగా పలు మార్కెట్ యార్డుల్లోని కార్మికులకు భోజనాలను అందిస్తున్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద కిచెన్

ఈ ప్రాజెక్టు విశిష్టతను తెలుసుకోవడానికి 'సాక్షి'దేశంలోనే అతిపెద్ద కిచెన్ అయిన సంగారెడ్డి సమీపంలోని 'కంది'కిచెన్‌ను పరిశీలించింది. ఈ కిచెన్ సామర్థ్యం అక్షరాలా లక్షానలభై వేలు. విస్తీర్ణం పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద కిచెన్ అని చెప్పవచ్చు. అణువణువూ పరిశుభ్రతను పాటించే ఈ కిచెన్‌లో రిసీవింగ్, ప్రీ ప్రాసెసింగ్, ప్రాసెసింగ్ అనే 3 స్థాయిల్లో సురక్షితమైన, నాణ్యమైన, పోషకాహారాన్ని వండుతుండటం విశేషం. కుక్ టూ కన్జంప్షన్ విధానంతో.. దాదాపు 4 గంటల్లో వేడి వేడి ఆహారాన్ని విద్యార్థులకు చేరవేస్తున్నారు. మొదట ఈ కిచెన్‌లోకి వెళ్లే ప్రతీ ఒక్కరికీ ఆటో సెన్సార్ క్లీనింగ్ స్టెరిలైజేషన్ సాంకేతికత అందుబాటులో ఉంది. దీంతో ఎలాంటి బ్యాక్టీరియల్, ఫంగల్ కంటామినేషన్ జరగడానికి ఆస్కారం లేదు. ఇక్కడ ప్రతీ పని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలకు అనుగుణంగా జరుగుతోంది. ఈ ఒక్క కిచెన్‌లోనే లక్ష మందికి రోజూ.. 3 టన్నుల కూరగాయలు వండుతారని కిచెన్ మేనేజర్ తెలిపారు. మధ్యాహ్న భోజనంలో అందించే 12 రకాల స్నాక్స్‌ను.. ఎలాంటి నూనెలు వినియోగించకుండా విభిన్న ఫ్లేవర్లలో తయారు చేస్తున్నారు. ఈ వంటకాల్లో వినూత్న ప్రయోగాలు చేయడానికి ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. రోజూ వండిన ఆహారాన్ని శాంపిల్ తీసిపెడతారు. ఈ ఆహారం ట్రాలీల మీదుగా ప్యాకింగ్, ఫిల్లింగ్‌కు వెళ్తుంది. ఈ వంటలన్నీ రోజూ ఉదయం 4గంటలకు ప్రారంభమై 8:30 గంటల వరకు పూర్తవుతాయని నిర్వాహకులు వివరించారు.

నిజాయితీగా.. నిస్వార్థంగా సేవలు



నైతికంగా, సైద్ధాంతికంగా, ప్రొఫెషనల్ పద్ధతులను సమన్వయం చేసుకుంటూ నిజాయితీగా, నిస్వార్థంగా సేవలను కొనసాగిస్తున్నాం. అవసరమైన ఆర్థిక సహకారాలను కార్పొరేట్, సీఎస్ఆర్ ఫండింగ్ ద్వారా సేకరిస్తున్నాం. డిజాస్టర్ మేనేజిమెంట్‌కు తగినంత సహకారం అందించడంలో అక్షయపాత్ర ఎల్లప్పుడూ ముందుంటుంది. ఆంధ్రలో, హైదరాబాద్‌లో వరదల సమయంలో రోజూ 2 లక్షల భోజనాలు అందించగలిగాం. కరోనా సమయంలో 30 నుంచి 40 రోజుల్లో కోటిన్నర భోజనం ప్యాకెట్లను అందించి చరిత్ర సృష్టించాం. అక్షయ పాత్ర ఆధ్వర్యంలోని కార్యక్రమాలు ఐక్యరాజ్యసమితి కీలక లక్ష్యాలను నెరవేర్చుతున్నాయి. ఈ నేపథ్యంలో 4 బిలియన్ భోజనాల మైలురాయి దాటినందుకు ఐక్యరాజ్య సమితి వేదికగా వేడుకలు జరుపుకొన్నాం. భారత్‌తో పాటు విదేశాల్లోనూ మా సేవలు అందిస్తున్నాం. లండన్ యూనివర్సిటీల్లో అక్కడి ఆహార అలవాట్లకు అనుగుణంగా, మన సంస్కృతిని ప్రతిబింబించేలా భోజనాలను అందిస్తున్నాం. ఆకలికి చిరునామా లాంటి కెన్యా దేశంలో ఇదే ప్రాజెక్ట్‌ను ప్రారంభించడానికి ఒక సంస్థ ముందుకురాగా.. కార్యాచరణకు సహకరించాం.

– సత్య గౌర చంద్ర దాస, హైదరాబాద్


అన్నం వండే యంత్రం


సాంబార్ తయారు చేసే యంత్రం


ఆహారం వండుతున్న సిబ్బంది

కిటకిటలాడిన యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రీస్వామి ధర్మ దర్శనానికి 3 గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. శ్రీస్వామిని సుమారు 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.49,00,371 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

– యాదగిరిగుట్ట:

ఈ బంధం వీడనిది



ఒక చెట్టు కొమ్మ.. పక్కనే ఉన్న మరో చెట్టును అల్లుకుపోయింది. నువ్వు కూడా నా కుటుంబమే అన్నట్లున్న ఈ రెండు వృక్షాల అనుబంధం ఆకట్టుకుంటోంది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ శివారులో మర్రివృక్షం కొమ్మ మరో మర్రి వృక్షాన్ని అల్లుకుపోయిన ఈ దృశ్యం కనువిందు చేస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

'చెత్త' బంగారు లోకం


కుప్పలుగా పేరుకుపోయిన చెత్త

పెద్దపల్లి మున్సిపల్ డంపింగ్ యార్డులో పదేళ్ల నాటి వ్యర్థాల నిల్వ సంపదగా మారుతోంది. ఏళ్ల తరబడి కుప్పలుగా పేరుకుపోయి.. దుర్గంధం వెదజల్లుతున్న డంపింగ్‌యార్డులో ప్లాస్టిక్, వ్యర్థాలను వేరు చేస్తున్నారు. కేంద్రప్రభుత్వ సహకారంతో సాగర్ మోటార్స్ ఆధ్వర్యంలో.. మూడు దశల్లో చెత్తను జల్లెడ పడుతున్నారు. ప్లాస్టిక్ వస్తువులను ఒకవైపు వేరుచేసి.. మిగతా దాంతో కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్నారు. అంతేకాదు.. బయోవ్యర్థాలను సేంద్రియ ఎరువుగా తయారు చేస్తూ రైతులకు విక్రయిస్తున్నారు. వేరు చేసిన ప్లాస్టిక్‌ను సైతం రీసైక్లింగ్ చేసి విక్రయిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


మెషీన్ ద్వారా వస్తున్న ఎరువు



మైనింగ్ మెషీన్‌లో పొక్లెయిన్‌తో చెత్తను పోస్తున్న సిబ్బంది

సింగరేణి డైరెక్టర్లపై తొలగని ప్రతిష్టంభన

ఐదుగురు డైరెక్టర్లకు విధుల్లో ఇద్దరే..

ఫైనాన్స్ డైరెక్టర్‌గా సీఅండ్ఎండీకి అదనపు బాధ్యతలు

డైరెక్టర్ల నియామకంపై ప్రభుత్వం కాలయాపన

గోదావరిఖని: రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో డైరెక్టర్ల నియామకంపై ప్రతిష్టంభన తొలగలేదు. సంస్థ పురోభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో.. కీలక నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. సంస్థలో ప్రస్తు తం 42 వేల మంది శాశ్వత కార్మికులు, మరో 35 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. కీలకమైన డైరెక్టర్ల పోస్టుల భర్తీ విషయంలో కాలయాపన మూలంగా.. సంస్థలో అనేక అభివృద్ధి పనుల్లో ప్రతిష్టంభన ఏర్పడుతోంది. సంస్థకు ఈ రెండు నెలల కాలం కీలకం. 2024–25 ఆర్థిక సంవత్సరం మరో నెలతో ముగుస్తుండటంతో.. ఉత్పత్తి, ఉత్పాదక, సంస్థ లక్ష్యాల సాధనపై అన్ని గనుల అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టించాల్సిన డైరెక్టర్లు ప్రస్తుతం ఎవరూ లేరు. సంస్థకు కీలకమైన డైరెక్టర్ ఆపరేషన్స్ పోస్టులో ఐదునెలల కిందటి వరకు ఎన్వీఆర్కే శ్రీనివాస్ కొనసాగారు. ఆతర్వాత ఏమైందో ఏమో.. డైరెక్టర్ పోస్టుకు ఆయన దూరంగా ఉన్నారు. శ్రీనివాస్ డైరెక్టర్ ఆపరేషన్స్‌తో పాటు డైరెక్టర్(పా) బాధ్యతలు అదనంగా నిర్వహించారు. శ్రీనివాస్ దూరంగా ఉండటంతో రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. కొద్ది నెలల వరకు కీలకమైన రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శ్రీనివాస్ పదవీ కాలం 2025 జనవరి చివరికి ముగియడంతో.. ఆయన కూడా విధులకు దూరంగా ఉన్నారు.


హైదరాబాద్‌లోని సింగరేణి సీఅండ్ఎండీ కార్యాలయం

ఇద్దరు డైరెక్టర్లు.. నాలుగు పోస్టులు..

డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ దూరంగా ఉండటంతో.. కొద్ది రోజుల తర్వాత ఆ రెండు పోస్టుల అదనపు బాధ్యతలను ప్రస్తుతం ఉన్న ఇద్దరు డైరెక్టర్లకు అప్పగించారు. ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి డైరెక్టర్(పా)గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావుకు డైరెక్టర్ ఆపరేషన్స్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. జనవరి చివరి వరకు అలాగే కొనసాగగా.. డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి పదవీకాలం గడువు ముగిసింది. ఆ పోస్టులో ఆయనను కొనసాగించేందుకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు రావాల్సి ఉంది. కానీ సకాలంలో ఉత్తర్వులు అందక.. రెండు డైరెక్టర్ పోస్టులను నిర్వహిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి.. ప్రస్తుతం బాధ్యతలకు దూరంగా ఉన్నారు. సింగరేణిలో సత్యనారా యణరావు ఈఅండ్ఎం డైరెక్టర్‌తో పాటు డైరెక్టర్ (ఆపరేషన్స్)గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఏళ్ల తరబడి ఖాళీగా డైరెక్టర్ (పా) పోస్టు

సింగరేణిలో డైరెక్టర్ (పా) బాధ్యతలు ఐఏఎస్ అధికారికి కేటాయించే ఆనవాయితీ ఉంది. కీలకమైన డైరెక్టర్ (పా) పోస్టును అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నెట్టుకొస్తున్నారు. పర్సనల్, అడ్మినిస్ట్రేటివ్ వింగ్ బాధ్యతలు సంస్థలో చాలా కీలకం. దీనికి ఐఏఎస్ అధికారి ఉండటమే సరైందని కార్మిక సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. ప్రతి కార్మికుని పదోన్నతి నుండి.. ప్రతి అంశంపై పర్సనల్ విభాగం అధికారి కీలకంగా వ్యవహరిస్తారు. ఇలాంటి క్రమంలో ఈపోస్టు ఖాళీగా ఉండటంతో పాటు అదనపు బాధ్యతలతో సరిపెట్టడంతో సకాలంలో పనులు ముందుకు సాగడం లేదని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి.

సీఅండ్ఎండీ, ఫైనాన్స్ డైరెక్టర్‌గా బలరాం

సింగరేణి సీఅండ్ఎండీగా కొనసాగుతున్న బలరాం ఫైనాన్స్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీఅండ్ఎండీ వాస్తవానికి ఐఆర్ఎస్ అధికారి కావడంతో.. కొన్నేళ్లుగా ఫైనాన్స్ డైరెక్టర్‌గా సంస్థకు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది డిసెంబర్ చివరి వరకు గత సీఅండ్ఎండీగా ఎన్.శ్రీధర్ కొనసాగారు. ఆయన పదవీకాలం పూర్తికావడంతో.. శ్రీధర్‌ను పక్కన బెట్టి 2025 జనవరి ఒకటి నుండి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సీఅండ్ఎండీగా బలరాంను నియమించింది. అప్పటివరకు డైరెక్టర్ (ఫైనాన్స్)గా కొనసాగుతున్న బలరాం సీఅండ్ఎండీగా రెండు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సంస్థను లాభాల బాటలో ముందుకు తీసుకెళ్లడంతో అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో 2025 జనవరి1 నాటికి సీఅండ్ఎండీగా గడువు పూర్తయ్యింది. ఆ తర్వాత పొడిగింపు రాలేదని కొందరు, కొనసాగింపు వచ్చిందని మరి కొందరు చెబుతున్నారు. ఐఆర్ఎస్‌గా ఫైనాన్స్ బాధ్యతలు మాత్రమే నిర్వహిస్తున్నారని మరికొందరు అంటున్నారు.

కొనసాగింపా?.. కొత్త అధికారి నియామకమా..?

సింగరేణిలో జనవరి చివరి నాటితో గడువు ముగిసిన డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి భవితవ్యాన్ని యాజమాన్యం నేటికీ తేల్చలేదు. గత ఆనవాయితీ ప్రకారం మరో ఐదు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న వెంకటేశ్వర్‌రెడ్డికి అదే పోస్టు కేటాయించాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం, యాజమాన్యం ఏలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఏవిధులు నిర్వహించాలో తెలియక ఆయన దూరంగా ఉంటున్నట్లు సమాచారం.

నేడు హైదరాబాద్‌కు సచిన్ పైలట్

సాక్షి, హైదరాబాద్: రాజస్థాన్ కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ సోమవారం హైదరాబాద్ రానున్నారు. ఉదయం 12 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన.. అక్కడి నుంచి నేరుగా జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ సీఎం రేవంత్‌తో అర్ధగంట పాటు మర్యాదపూర్వకంగా సమావేశమైన అనంతరం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామానికి వెళ్తారు. అక్కడ భగవాన్ శ్రీ దేవ్ నారాయణ ఆలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్తారని ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ వెల్లడించారు.

సండే సందడి



వారమంతా పనిఒత్తిడితో బిజీబిజీగా గడిపిన నగరప్రజలు ఆదివారం వచ్చేసరికి ఇలా సముద్ర తీరానికి చేరుకుని సేదతీరారు. పర్యాటకుల సందడితో ఆదివారం సాయంత్రం విశాఖ ఆర్కేబీచ్ ఇలా సందడిగా కనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బంతికాదది భానుడే



చీకట్లను చీల్చుకుని వెలుగులు వెదజల్లుతూ పైకి వస్తున్న బాలభానుడు ఇలా ఓ దీపస్తంభం పైన ఎర్రని బంతి ఉంచినట్లు కనిపించాడు. కడప ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం ఉదయం ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

ఆరున్నొక్కరు.. జారితే దక్కరు



హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలంటూ ఓ వైపు పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా వాహనదారులు లెక్కచేయడం లేదు. విజయవాడ అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలో ఆరుగురు పిల్లలతో బైక్‌పై ఇలా దాడు తీస్తూ ఫొటోకి చిక్కాడు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇంత మోసమా?

అమరావతి రైల్వే లైన్ భూసేకరణపై రైతులు ఆగ్రహం

భూ సేకరణ కాకుండా సమీకరణ చేయాలని డిమాండ్



డిసెంబర్ నెలలో భూసేకరణను వ్యతిరేకిస్తూ తాడికొండ గ్రామ సభ తీర్మానం చేస్తున్న దృశ్యం

- రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంపు
- అమరావతి పరిసర ప్రాంతాల్లో మాత్రం పెంచని ప్రభుత్వం
- దీనివల్ల రైల్వే ఇచ్చే పరిహారం చాలా తక్కువవొస్తుందని ఆందోళన
- రైతుల అభ్యంతరాలు స్వీకరించకుండానే పెగ్‌మార్కింగ్‌కు సిద్ధం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు
- రైల్వే లైన్‌కు ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించాలని డిమాండ్

సాక్షి ప్రతినిధి, గుంటూరు : అమరావతి రైల్వే ప్రాజెక్టు భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని రాజధాని గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించ రైల్వే లైన్‌కు భూమి ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. భూ సేకరణ కాకుండా సమీకరణ చేయాలని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు ఆరోపిస్తున్నారు. బలవంతంగా భూసేకరణకు సిద్ధమైతే కోర్టును ఆశ్రయించక తప్పదని స్పష్టం చేస్తున్నారు.అమరావతి రైల్వే లైన్ కోసం గుంటూరు జిల్లాలో 1,753 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అమరావతి మండలం కర్లపూడి గ్రామంలోనే 232 ఎకరాలు సేకరించనున్నారు. ఇదే గ్రామంలో ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం 153 ఎకరాలు, ఈ7, ఈ8, ఈ9 రోడ్లు, అవుటర్ రింగ్ రోడ్డు కోసం 900 ఎకరాలు కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రైల్వే లైన్‌కు భూమి ఇవ్వాలని, దీనికి కేంద్రం ఇచ్చే ప్యాకేజీ సరిపోదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విమానాశ్రయం కోసం ఎక్కడో ఉన్న గన్నవరంలో భూములిచ్చిన వారికి రాజధానిలో 1,450 గజాలు ల్యాండ్‌పూలింగ్ ప్యాకేజీ కింద ఇచ్చారని, తమకు మాత్రం ఇవ్వకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రైతులతో సమావేశాలు పెట్టినా, వారి అభ్యంతరాలు స్వీకరించకుండానే రైల్వే లైన్ భూసేకరణకు పెగ్‌మార్కింగ్‌కు సిద్ధపడుతోంది. ఇలా ఇష్టానుసారం పెగ్ మార్కింగ్‌కు షెడ్యూల్ ప్రకటించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అమరావతి తహసీల్దార్‌తో జరిగిన సమావేశంలో కర్లపూడి రైతులు ఇదే విషయాన్ని చెప్పారు.

పెగ్ మార్కింగ్ ఎలా చేస్తారు?

పోలీసు బందోబస్తుతో పెగ్‌మార్కింగ్‌కు రావడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని, ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రాజధాని పరిసర ప్రాంతాల్లోని కంతేరు, కొప్పురావూరు, తాడికొండ, మోతడక గ్రామాల రైతులు రైల్వే లైన్ భూసేకరణను వ్యతిరేకిస్తూ గ్రామసభల్లో తీర్మానాలు కూడా చేశారు. రైల్వేలైన్ వల్ల పక్కన ఉన్న భూముల ధరలు కూడా పడిపోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పక్కనే 500 మీటర్ల వరకూ భూమిని సేకరించి, రైల్వే లైన్‌కు రెండువైపులా సర్వీస్‌రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇంత అన్యాయమా?

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా భూముల ప్రభుత్వ విలువ పెంచిన రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రాజధాని, పరిసర ప్రాంతాల్లో మాత్రం పెంచలేదు. ఇదేమి అన్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల రైల్వే లైన్ భూసేకరణలో తాము తీవ్రంగా నష్టపోతామని చెబుతునానరు. తమ గ్రామంలో భూమి ప్రభుత్వ విలువ రూ. 16 లక్షలు ఉంటే దాన్ని కేవలం రూ. 4 లక్షలు పెంచి రూ. 20 లక్షలు చేశారని, మిగిలిన చోట్ల అసలు పెంచలేదని కర్లపూడి రైతులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో తమ భూముల ఎకరా దాదాపు రూ. 4 కోట్లు ఉండగా, ఇప్పుడు రైల్వే నుంచి రూ. 50 లక్షలు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క రైల్వే ప్యాకేజీకి అదనంగా ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చే ప్యాకేజీలో 33 శాతం అంటే 410 గజాల స్థలం ఇప్పిస్తామని మంత్రి నారాయణ ఇటీవల రైతులకు సర్దిచెప్పారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ 650 గజాల వరకు ఇప్పించడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. అయితే దీనికి కూడా రైతులు అంగీకరించడంలేదు. పూర్తిగా పూలింగ్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతున్నారు. రాజధాని రైతులకు ఇచ్చినట్లుగా ఫారం.9.14 ఇవ్వాలని, అందులో ఎంత భూమి ఇస్తారు, ఇళ్ల స్థలం ఎంత, వాణిజ్య స్థలం ఎంత? కౌలు ఎన్ని సంవత్సరాలు ఇస్తారన్న విషయాలను స్పష్టం చేయకుండా భూములు ఇచ్చేది లేదని వారు చెబుతున్నారు. అసలు రైల్వే లైన్ అలైన్‌మెంటే తప్పు అని రైతులు అంటున్నారు. ల్యాండ్ పూలింగ్ చేసిన గ్రామాల నుంచి కాకుండా బయట నుంచి రైల్వే లైన్ వెళ్లడం వల్ల 4 కిలోమీటర్ల దూరం పెరుగుతుందని వాదిస్తున్నారు. గతంలో ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌ను కదపకుండా బయట నుంచి అలైన్‌మెంట్ ఇచ్చామని మంత్రి నారాయణ చెబుతున్నారు.

ఉపాధ్యాయులకు త్వరలో పాత పెన్షన్!

మండలి విప్ శ్రీకాంత్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు వెల్లడి



తాడేపల్లి రూరల్: కేంద్రం 2020లో ఇచ్చిన మెమో 57 ప్రకారం రాష్ట్రంలో పనిచేస్తోన్న ఉపాధ్యాయులు, పోలీస్ కానిస్టేబుల్స్, ఇతర ఉద్యోగులు 11,000 మందికి పాత పెన్షన్ ఇవ్వవలసి ఉందని, ఈ సమస్యను త్వరలో సీఎం చంద్రబాబు పరిష్కరిస్తారని మండలిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చెప్పారు. గుంటూరు జిల్లా కుంచనపల్లిలోని అరవింద హైస్కూల్‌లో ఆదివారం టీచర్స్ ఫోరం అధ్వర్యంలో జరిగిన 2023లో నియామకం పొందిన ఉపాధ్యాయ, ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు మాట్లాడుతూ..అర్హులైన 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వబోతున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై లారీ దగ్ధం



రాజమహేంద్రవరం రూరల్: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు సమీపంలోని గామన్ బ్రిడ్జిపై ఓ లారీ దగ్ధమైంది. స్థానికులు, అగ్నిమాపక అధికారుల కథనం ప్రకారం.. మిర్యాలగూడ నుంచి కాకినాడ పోర్టుకు పలు గురాయి లోడుతో ఈ లారీ వెళ్తుంది. పదహారో నంబర్ జాతీయ రహదారిలో గోదావరి నదిపై ఉన్న గామన్ బ్రిడ్జి పైకి చేరుకునేసరికి లారీ వెనుక భాగంలో మంటలు వచ్చాయి. వెనుక వస్తున్న లారీ డ్రైవర్ దీన్ని గమనించి ముందున్న లారీ డ్రైవర్‌ను అప్రమత్తం చేశాడు. డ్రైవర్ లోడంకి శ్రీశైలం వెంటనే ఆ లారీ నుంచి దిగిపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్, 16 టైర్లు, ఇంజిన్ మొత్తం కాలిపోయాయి. సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి లూథర్‌కింగ్ తెలిపారు.

విమానం ఎమర్జెన్సీ డోర్ తెరచిన ప్రయాణికుడు

మధురపూడి: విమానం ఎమర్జెన్సీ డోర్‌ను తెరచిన ప్రయాణికుడిపై తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్యామ్‌సుందర్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయానికి శనివారం రాత్రి ఆఖరి ఇండిగో విమానం వచ్చింది. విమానం ల్యాండ్ అయిన తర్వాత రాజమహేంద్రవరానికి చెందిన ఓ ప్రయాణికుడు పొరపాటున ఫ్లైట్ ఎమర్జెన్సీ డోర్ తెరిచాడు. దీంతో ఉత్కంఠ నెలకొంది. విమానంలోని వారందరూ ఏదైనా ప్రమాదం జరిగిందా అని ఆందోళన చెందారు. దీంతో ప్రయాణికులు విమానం దిగి టెర్మినల్ భవనానికి చేరడంతో పాటు, ఆ విమానం తిరిగి హైదరాబాద్ వెళ్లడంలో జాప్యం జరిగింది.

తిరుపతి అడ్డాగా మతోన్మాదుల కుయుక్తులు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

తిరుపతి కల్చరల్: తిరుపతి, తిరుమలను అడ్డాగా చేసుకుని మనువాద మతోన్మాదులు కుయుక్తులకు పాల్పడుతున్నారని, రచయితలు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తిరుపతిలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో శనివారం రాత్రి తెలుగులో ఖురాన్ విశ్లేషించిన పుస్తకాన్ని చించి తగలపెట్టడానికి ప్రయత్నించిన ఘటనను తీవ్రంగా తప్పుపట్టారు. సాహిత్యం, భావప్రకటనా స్వేచ్ఛపై మతోన్మాద శక్తులు దాడులను అరికట్టాలని కోరుతూ అభ్యుదయ వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్యలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఓ మంత్రిగారు.. చించినాడ పూతరేకులు..

కూటమి ప్రభుత్వం వస్తే వలంటీర్ల వేతనం రూ.10 వేలంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన 'నిమ్మల'

- గెలిచాక తనకు చించినాడ పూతరేకులు తెచ్చివ్వాలంటూ ప్రచారం
- నాటి వీడియోను ఇప్పుడు వైరల్ చేస్తున్న నెటిజన్లు
- పూతరేకులు దొరకడం లేదంటూ సెటైర్లు
- హామీలు విస్మరిస్తే సోషల్ మీడియా నుంచి తప్పించుకోలేరంటూ పోస్టులు
- ఇప్పటికే నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. వీడియోతో ఆటాడుకున్న నెటిజన్లు



ఎన్నికల ప్రచారంలో వలంటీర్లతో మాట్లాడుతున్న నిమ్మల రామానాయుడు

సాక్షి, భీమవరం : 'చంద్రబాబునాయుడుగారు, పవన్‌కళ్యాణ్‌గారు చెప్పారమ్మా.. మీ వలంటీరు జాబ్‌కు రూ.5 వేలు ఏ మూలకి సరిపోతాయి? ఖర్చులు బోలెడు పెరిగిపోయాయి కదా? మన ప్రభుత్వంలో వలంటీరు వ్యవస్థను కొనసాగిస్తాం. మీకు రూ.10 వేలు జీతం ఇస్తాం. రేపొద్దున్న మన ప్రభుత్వంలో అన్నయ్య ఇదిగో 10 వేలు అందుకున్నానని ఆనందంగా మన చించినాడ పూతరేకుల ప్యాకెట్ పట్టుకుని రావాలి'.. అంటూ పాలకొల్లు నియోజకవర్గం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేగా నిమ్మల రామానాయుడు ఎక్కడ వలంటీరు కనిపించినా ఈ హామీ ఇచ్చేవారు. రూ.10 వేలు తీసుకున్నాక ఆనందంగా చించినాడ పూతరేకుల ప్యాకెట్ కానుకగా ఇవ్వాలని చెప్పి ఆకట్టుకునే ప్రయత్నం చేసేవారు. అప్పట్లో ఆయన పాలకొల్లు కళాకారులనే మించిపోయారు. ఇంటింటికీ వెళ్లి అమ్మ, అక్క, చెల్లి, బావ, తమ్ముడు.. అని అందరితో వరసలు కలుపుతూ సూపర్ సిక్స్‌లో ఎవరెవరికి ఎంత నగదు వస్తుందో తనదైన శైలిలో వివరించేవారు. ఆనక ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టులు చేయించుకునే వారు. ఇప్పుడదే ఆయన్ను వెంటాడుతోంది. పాలన పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు కావస్తోంది. ఆర్థిక పరిస్థితి చూస్తుంటే హామీల అమలు సాధ్యంకాదంటూ సీఎం చంద్రబాబు చేతులెత్తేయ్యడంతో సూపర్ సిక్స్ కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలు సోషల్ మీడియా వేదికగా తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్, నిమ్మల ప్రసంగాలు, వాటి అమలుకు ఇప్పుడు చేతులెత్తేసిన దృశ్యాలతో రీల్స్ ద్వారా ఓ రేంజ్‌లో ఆడుకుంటున్నారు.

మంత్రి నిమ్మలకు రీల్స్ సెగ..

ఇక పాలకొల్లులోని ఒక ఇంటి వద్ద ఉన్న చిన్నపిల్లలను చూపిస్తూ నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ నాడు నిమ్మల రామానాయుడు చెప్పిన వీడియో ఎంత పాపులర్ అయ్యిందో తెలిసిందే. తల్లికి వందనం ఇప్పట్లో రాదని తెలిసి ఆ వీడియోకు గోదావరి వెటకారం, యాసను జోడించి మరీ నెటిజన్లు రీల్స్ చేసి మంత్రి నిమ్మలకు వ్యతిరేకంగా పోస్టు చేస్తున్నారు. కొందరైతే తమ సెల్‌ఫోన్లకు ఈ ఆడియోను రింగ్‌టోన్లుగా పెట్టేసుకున్నారు. ఇలా గత రెండ్రోజులుగా నిమ్మల హామీకి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ట్రెండవుతున్నాయి. అలాగే, మన ప్రభుత్వంలో మీకు రూ.10 వేలు వేతనం వచ్చిన ఆనందంతో కానుకగా తనకు చించినాడ పూతరేకులు తీసుకొచ్చి ఇవ్వాలంటూ వలంటీర్లతో చెప్పిన వీడియోలను జతచేసి సోషల్ మీడియాలో వేల సంఖ్యలో షేర్ అవుతున్నాయి. వలంటీర్లను కొందరు కూటమి నేతలు వంచించిన తీరును ఎండగడుతుండగా, మరికొందరు వాటికి మద్దతుగా కామెంట్లు పెడుతూ నిరసన తెలుపుతున్నారు. పూతరేకులు దొరక్క కలవలే కపోయారంటూ వంటి పోస్టులతో ఆడుకుంటున్నారు. అధికారం కోసం హామీలిచ్చేయ్యడం, గద్దెనెక్కాక వాటిని విస్మరించడం పూర్వపు రోజులని.. ఇప్పుడు సోషల్ మీడియా నుంచి తప్పించుకోలేరంటూ సెటైర్లు వేస్తున్నారు.


జేఎన్‌టీయూకేకి ఈఏపీ సెట్ నిర్వహణ బాధ్యత



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీసెట్ 2025–26 నిర్వహణ బాధ్యతను జేఎన్‌టీయూ–కాకినాడకు అప్పగించారు. ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతను జేఎన్‌టీయూకే తొమ్మిదోసారి చూస్తోంది. 2015 నుంచి 2019 వరకూ వరుసగా ఐదుసార్లు ఈఏపీ సెట్ నిర్వహించగా ప్రొఫెసర్ సాయిబాబు కన్వీనర్‌గా వ్యవహరించారు. తిరిగి 2021, 20022 సంవత్సరాల్లో రెండుసార్లు ప్రొఫెసర్ వి.రవీంద్ర, 2024లో ప్రొఫెసర్ వెంకటరెడ్డి కన్వీనర్లుగా ఈ పరీక్ష నిర్వహించారు. ఈసారి వర్సిటీ పూర్వపు రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావును ఈఏపీ సెట్ కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో పీజీ సెట్‌తో పాటు కాపు విద్యోన్నతి అర్హత పరీక్ష, పలు ఉద్యోగ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు.

ఆధ్యాత్మిక సమాచారం

రేపు కాణిపాకం ఆలయ హుండీ లెక్కింపు



కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కింపు జరగనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా లెక్కింపులో పాల్గొనాలని పేర్కొన్నారు.

16న సంకటహర చతుర్థి వత్రం

కాణిపాకం : ఈనెల 16న సంకటహర గణపతి వ్రతంను నిర్వహిస్తున్నట్లు కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. దేవస్థాన ఆస్థాన మండపంలో ఈ వ్రత ఏర్పాట్లు ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్రతం నిర్వహిస్తారన్నారు. అలాగే రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ రథోత్సవం జరుగుతుందన్నారు. వ్రత సేవల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందవచ్చునని పేర్కొన్నారు.

కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ ఆశీర్వదించమ్మా అంటూ పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాఘ మాసం సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకొని గంగమ్మకు పూజలు చేశారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. చిరు జల్లులను సైతం భక్తులు లెక్క చేయకుండా దర్శన కోసం భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, డీవెలతో మేళ తాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

విద్యా సమాచారం

ఐజర్‌లో వేడుకగా 'బర్డ్స్ అట్లాస్'

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం జంగాలపల్లె సమీపంలోని తిరుపతి ఐజర్‌లో ఆదివారం వేడుకగా బర్డ్స్ అట్లాస్ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతికి చెందిన నేచర్ సొసైటీ, అటవీశాఖ సహకారంతో ఐజర్, ఐఐటీ విద్యార్థులు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పర్యటించి వివిధ రకాల పక్షులు, వాటి వైవిధ్యతను సమగ్రంగా తెలుసుకుని బర్డ్ అట్లాస్ ద్వారా వెల్లడించారు.

ఎస్వీయూలో కత్తిపోట్ల కలకలం



తిరుపతి క్రైమ్/ తిరుపతి సిటీ: ఎస్వీయూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందా..? సరస్వతీ నిలయంలో అరాచకశక్తులు తిష్టవేస్తున్నారా..? అవుననే అంటున్నారు. విద్యార్థులు. వర్సిటీ హాస్టళ్లను అధికారులు సక్రమంగా పర్యవేక్షించకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. వర్సిటీలోని హెచ్ బ్లాక్ హాస్టల్‌లో శనివారం అర్ధరాత్రి 12.45గంటలకు జరిగిన ఘర్షణతో విద్యార్థులు, సిబ్బంది వణికిపోయారు. ఎస్వీయూ హెచ్ బ్లాక్ హాస్టల్‌లోకి ఎకనామిక్స్ విభాగం విద్యార్థి రాత్రి 12గంటలకు మద్యం సేవించి ప్రవేశించాడు. హాస్టల్‌లోని తోటి విద్యార్థులతో గొడవకు దిగాడు. ముగ్గురిపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టాడు. మరో విద్యార్థిని తన వెంట తీసుకువచ్చిన కత్తితో పొడిచేశాడు. ఈ విషయం గమనించిన పక్క రూమ్‌లోని విద్యార్థులు వెంటనే ఎస్వీయూ క్యాంపస్ పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు. వర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతోనే హాస్టళ్లలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బయట వ్యక్తులు నిత్యం హాస్టళ్లలోకి ప్రవేశించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. మద్యం సేవించి విద్యార్థులను గొడవలకు పురిగొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో అనధికారికంగా తిష్ట వేసిన వారిని వెంటనే బయటకు పంపించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇక్కడ మనం చూస్తున్నవన్నీ ఢిల్లీ గొప్పదనాలు.
వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా యునెస్కో గుర్తించిన నిర్మాణాలు.
ఆగ్రాలో ఉన్న తాజ్‌మహల్... ఆగ్రా రెడ్‌ఫోర్ట్...
ఈ రెండింటికీ గుర్తింపు 1983లో వచ్చింది.
కుతుబ్ మినార్... హుమయూన్ సమాధి...
వీటికి 1993లో ఆ హోదా వచ్చింది.
దేశ రాజస దర్పణం రెడ్‌ఫోర్ట్ మాత్రం...
ఈ గౌరవాన్ని 2007లో అందుకుంది.



మన ఢిల్లీ... మన హెరిటేజ్



తుఝే సలామ్ | రెడ్ ఫోర్ట్

మొఘలుల సామ్రాజ్య విస్తరణలో రెడ్‌ఫోర్ట్‌ది కీలకమైన స్థానం. షాజహాన్ తన రాజధానిని ఆగ్రా నుంచి ఢిల్లీకి మార్చాడు. ఇందులో షాజహాన్ నివసించిన ప్యాలెస్, ముంతాజ్ మహల్, రంగ్ మహల్, మోతీ మసీదు, ఇతర ప్యాలెస్‌లు ప్రతిదీ దేనికదే ప్రత్యేకమైన నిర్మాణాలే. ఇక్కడున్న దివానీ ఖాస్, దివానీ ఆమ్‌లు ఆగ్రాఫోర్ట్‌లో ఉన్న వాటికంటే భారీ నిర్మాణాలు. ఈ కోట ప్రాంగణం అంతా కలియదిరిగినప్పుడు ఇంత గొప్పగా డిజైన్ చేసిన ఆర్కిటెక్ట్ ఎవరో అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఉస్తాద్ అహ్మద్ లాహోరీ దీనిని డిజైన్ చేశాడు. ఇందులో ఇండియన్ నిర్మాణశైలితోపాటు పర్షియన్ శైలి స్పష్టంగా కనిపిస్తుంది. దీనిని కట్టడానికి పదేళ్లు పట్టింది. రాజసాన్ని ప్రదర్శించే ఈ కోట 1648- 1857 వరకు మొఘలుల అధీనంలో ఉంది. సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ స్వాధీనంలోకి వెళ్లింది. స్వాతంత్ర్య సాధనతో మన జాతీయపతాకం ఎగిరింది. అప్పటి నుంచి ఏటా పతాకా విష్కరణ సందర్భంగా టీవీలు, పత్రికల్లో దేశ ప్రజలకు దర్శనమిస్తోంది.



రెడ్‌ఫోర్ట్‌లోని ముంతాజ్ మహల్

నిర్వహణ భేష్!

రెడ్‌ఫోర్ట్ నిర్వహణ బాధ్యత ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా చేపట్టిన తర్వాత కోట ప్రాంగణం టూరిస్ట్ ఫ్రెండ్లీగా మారింది. నిర్మాణాలను దుమ్ము లేకుండా శుభ్రంగా ఉంచడంతోపాటు పచ్చటి లాన్‌లను మెయింటెయిన్ చేయడంతో ఇక్కడ ఎండాకాలంలో కూడా టూరిస్టులు సౌకర్యంగా తిరుగగలుగుతున్నారు. టాయిలెట్‌లు, మంచినీటి సౌకర్యాలు కూడా బాగున్నాయిప్పుడు. అనేక కాంప్లెక్స్‌లను మ్యూజియాలుగా మార్చడం మరొక మంచి పరిణామం. రెడ్‌ఫోర్ట్ టూర్‌ను ఆద్యంతం ఆస్వాదించే క్రమంలోనే ముంతాజ్ మ్యూజియం, ఇండియన్ ఆర్ట్ మ్యూజియం వంటి వాటిని కూడా కవర్ చేయవచ్చు.


దిగుడుబావి ఉంది!

రెడ్‌ఫోర్ట్ ఆవరణలో ఒక స్టెప్‌వెల్ ఉంది. రెడ్‌ఫోర్ట్‌ని ఓ పదేళ్ల కిందట చూసిన వాళ్లు దీనిని గమనించి ఉండకపోవచ్చు. ఈ సారి వెళ్లినప్పుడు మర్చిపోకుండా చూడాలి. అయితే ఈ బావిలోకి దిగడానికి ఏ మాత్రం వీల్లేదు. ఢిల్లీ నగరంలోని అగ్రసేన్‌కీ బావోలీ వంటి కొన్ని స్టెప్‌వెల్స్‌లోకి ఒకటి- రెండు అంతస్థుల వరకైనా అనుమతిస్తారు. కానీ ఈ రెడ్‌ఫోర్ట్ స్టెప్‌వెల్‌ని పూర్తిగా లాక్ చేసి పైన గ్రిల్ అమర్చారు. నేల మీద నుంచి వంగి చూడాల్సిందే.


రెడ్ ఫోర్ట్ ఆవరణలోని స్టెప్ వెల్


– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వాహ్ తాజ్ | ప్రేమ చిహ్నం


యమునానది తీరాన తాజ్ మహల్

ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ తబలా వాయించి ‘అరే హుజూర్ వాహ్ తాజ్ బోలియే’ అన్న ప్రకటనను మనదేశంలో దాదాపుగా అందరూ చూసి ఉంటారు. బ్యాక్‌గ్రౌండ్‌లో తాజ్‌మహల్ ఎంత అందంగా ఉంటుందో చెప్పలేం. ఇక్కడ ఓ విషయాన్ని గుర్తు చేసుకుందాం. రెడ్‌ఫోర్ట్‌కి తాజ్ మహల్‌కి ఓ దగ్గరి సంబంధం ఉంది. రెండింటి ఆర్కిటెక్ట్ ఒకరే... అతడే ఉస్తాద్ అహ్మద్ లాహోరీ. ఎన్నిసార్లు చూసినా మళ్లీ మళ్లీ చూడాలనిపించేటంతటి సౌందర్యం తాజ్‌మహల్‌ది. ఉత్తరప్రదేశ్‌లో కర్మాగారాల నుంచి విడుదలయ్యే కాలుష్యం కారణంగా పాతికేళ్ల కిందట తాజ్‌మహల్ గోడలు పసుపురంగులోకి మారాయి. ఆ సమయంలో తాజ్‌మహల్‌ని చూసిన వాళ్లు ఫొటోల్లోనే బాగుందనుకున్నారు. ఇప్పుడు అలాంటి అసంతృప్తి ఉండదు. మనదేశానికి అమెరికా అధ్యక్షుడు (తొలి దఫా అధ్యక్షుడుగా ఉన్న సమయం) డొనాల్డ్ ట్రంప్ వచ్చిన సందర్భంగా తాజ్‌మహల్‌కి మెరుగులు దిద్దారు. ఇప్పుడు పాలరాయి తెల్లగా మెరుస్తోంది. 42 ఎకరాల్లో నిర్మించిన తాజ్‌మహల్ నిర్మాణం రెడ్‌ఫోర్ట్ నిర్మాణం కంటే ఎనిమిదేళ్లు ముందు మొదలైంది. రెడ్‌ఫోర్ట్ పూర్తయిన తర్వాత ఐదేళ్లకు పూర్తయింది. అంటే 1631- 1653 వరకు 22 ఏళ్లు కట్టారు. ప్రధాన ద్వారం నుంచి లోపలికి అడుగు పెట్టిన తర్వాత ముందుకు నడిచే కొద్దీ తాజ్ మహల్‌ను తలెత్తి చూడాలి. తాజ్‌మహల్ నుంచి ఆగ్రాఫోర్ట్, షాజహాన్ ప్యాలెస్ చూడవచ్చు. తాజ్‌మహల్ వెనుక వైపు నుంచి బేస్‌మెంట్ కిందకు చూస్తే యమునా నది గంభీరంగా ప్రవహిస్తుంటుంది.

హుమయూన్ సమాధి | భార్య ప్రేమకు చిహ్నం



హుమయూన్ కా మఖ్బారా... హుమయూన్ సమాధి. మనదేశానికి పర్షియా ఉద్యానవన శైలిని మనకు పరిచయం చేసిన కట్టడం ఇది. మనదేశంలో మొఘల్ వాస్తుశైలిలో నిర్మితమైన తొలికట్టడం. తాజ్ మహల్, హుమయూన్స్ టూంబ్ రెండూ సమాధి నిర్మాణాలే. రెండూ ఆర్కిటెక్చర్ పరంగా గొప్ప కట్టడాలే. తాజ్ మహల్‌ని భార్య జ్ఞాపకార్థం భర్త కట్టించాడు. హుమయూన్ టూంబ్‌ను భర్త జ్ఞాపకార్థం భార్య కట్టించింది. ప్రేమ చిహ్నంగా గొప్ప ప్రమోషన్ రాలేదు, కానీ నిర్మాణపరంగా ఇది కూడా గొప్ప కట్టడమే.

హుమయూన్ సమాధి ఢిల్లీ శివార్లలో నిజాముద్దీన్‌లో ఉంది. ఈ సమాధి పైన గుమ్మటం ఎత్తు 42.5 మీటర్లు. ఈ సమాధి మొత్తం నేలకు ఒకటిన్నర మీటర్ల ఎత్తున్న గట్టు మీద ఉంటుంది. దాని మీద ఆరు మీటర్లకు పైగా ఎత్తున్న భవనాన్ని నిర్మించారు. ప్రధాన కట్టడం నిర్మాణం మాత్రమే కాకుండా దాని చుట్టూ ఉన్న ఉద్యానవనాల నిర్మాణం కూడా ప్రత్యేకమైనదే. మొఘల్ ఉద్యానవన శైలి చార్‌బాగ్ శైలి ఇందులో కూడా కనిపిస్తుంది. ఈ గార్డెన్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నీటి పంపులు, వాటర్‌ఫౌంటెయిన్‌లతో ఆధునిక సాంకేతికత కనిపిస్తుంది.

హుమయూన్ సమాధి నిర్మాణం క్రీ.శ 1562లో మొదలైంది. ఈ సంగతి తెలియగానే వచ్చే సందేహం ఒక్కటే... హుమయూన్ మరణించింది క్రీ.శ 1556 జనవరి 20వ తేదీ. మరి సమాధి అప్పుడు కట్టలేదా అనే ప్రశ్న నిజమే. మరణించిన వెంటనే పురానాఖిలాలో ఖననం చేశారు. కొంతకాలానికి శవపేటికను పెకలించి పంజాబ్ లోని సిర్‌హింద్‌కు తీసుకెళ్లారు. రాజ్యంలో పరిస్థితులు చక్కబడిన తర్వాత హుమయూన్ భార్య హమీదాబేగం (అక్బర్ తల్లి) భర్త జ్ఞాపకార్థం గొప్ప నిర్మాణం చేయాలనుకుంది. అదే ఇప్పుడు మనం చూస్తున్న హుమయూన్ సమాధి. ఈ నిర్మాణం పూర్తవడానికి పదేళ్లు పట్టింది. ఢిల్లీకి ట్రెన్‌లో వెళ్లేటప్పుడు నగరంలోకి ప్రవేశించడానికి ముందే నిజాముద్దీన్ స్టేషన్ వస్తుంది. సమాధి నిర్మాణం ఎత్తైన బేస్‌మెంట్ మీద ఉండడంతో ట్రెన్‌లోకి కనిపిస్తుంది.

టూర్ ప్యాకేజ్‌లిలా ఉంటాయి!


- ఢిల్లీకి విమానం లేదా రైల్లో వెళ్లిన తర్వాత లోకల్ టూర్ ప్యాకేజ్ తీసుకోవడం సౌకర్యంగా ఉంటుంది. ఢిల్లీ డే టూర్ ప్యాకేజ్‌లుంటాయి. ఏసీ బస్సు లేదా విడిగా కారు మాట్లాడుకోవచ్చు. కారుకు రోజుకు ఏడు లేదా ఎనిమిది వేలుంటుంది. బస్సులో ఒకరికి వెయ్యి రూపాయలకు అటూఇటూగా ఉంటుంది.
- ఢిల్లీకి వెళ్లడానికి ముందే నగరంలో చూడాల్సిన ప్రదేశాల జాబితాతోపాటు సిటీ టూర్ మ్యాప్‌ను పరిశీలించాలి. ఏయే ప్రదేశాలను ఒక క్లస్టర్‌గా ప్లాన్ చేసుకోవచ్చనే అవగాహన వస్తుంది. అలాగే ఆయా ప్రదేశాలకు సెలవు దినాల వివరాలను కూడా ఆయా వెబ్‌సైట్‌ల ద్వారా నిర్ధారించుకోవాలి.
- ఆహారం విషయానికి వస్తే చోలే-బటూరా, బటర్ చికెన్, జిలేబీ, రబ్రీ ఫాలూదాలను తప్పనిసరిగా రుచి చూడాలి.

తొలి ఎర్రకోట | ఆగ్రా ఫోర్ట్



ఈ ఎర్రకోట ఆగ్రాలో ఉంది. ఢిల్లీ ఎర్రకోట కంటే ముందుది. ఈ కోట యమునాతీరాన తాజ్ మహల్‌కు పక్కన ఉంది. ఇక్కడి నుంచి చూస్తే తాజ్‌మహల్ అందంగా కనిపిస్తుంది. తాజ్ మహల్ నుంచి ఈ కోట ఠీవిగా కనిపిస్తుంది. ఈ కోటలో ఏమేమి ఉన్నాయంటే ఢిల్లీ రెడ్‌ఫోర్ట్ అన్నవన్నీ ఉన్నాయి. వంద ఎకరాల్లో విస్తరించిన కోట ఇది. దివానీ ఆమ్, దివానీ ఖాస్ వంటి పాలన భవనాలతోపాటు ప్యాలెస్‌లున్నాయి. షాజహాన్ అంత్యకాలంలో నివసించిన ప్యాలెస్ షా బుర్జ్ ఇక్కడే ఉంది. ఈ ప్యాలెస్ నుంచి తాజ్‌మహల్ వ్యూ అందంగా ఉంటుంది. షాజహాన్‌ను కొడుకు ఔరంగజేబు ఖైదు చేశాడని తెలిసినప్పుడు సానుభూతి కలుగుతుంది. కానీ ఈ ప్యాలెస్‌ను చూస్తే రాజు జైల్‌లో ఉన్నా రాజరికపు సౌకర్యాలేమీ తగ్గవనే వాస్తవం తెలిసి వస్తుంది.

అక్బర్ కట్టించిన ‘జహంగీర్ మహల్’ ఒక అద్భుతం. మధ్య ఆసియా నుంచి అక్కడ ప్రసిద్ధులైన వాస్తు శిల్పులను పిలిపించి, స్థానికంగా ఉన్న హిందూ వాస్తుశిల్పులలో నిపుణులను ఎంపిక చేసి అందరి సమష్టి కృషితో గొప్ప నిర్మాణం జరగాలని ఆదేశించాడట. ఆ మేరకే వాళ్లు దీనిని డిజైన్ చేశారట.


జహంగీర్ బాత్‌టబ్


మొఘలుల ఉత్థానపతనాలకు ఈ కోట ప్రత్యక్షసాక్షి. కోట లోపల అక్బర్‌కు విజయం అందించిన ఆయుధాగారం ఉంది. రతన్‌సింగ్ హవేలీ, బెంగాల్‌మహల్, శీష్‌మహల్, షాజహాన్ మహల్, జహంగీర్ బాత్‌టబ్‌లను చూడడం మరువకూడదు. ఈ ఎర్రకోటలోకి పర్యాటకులను అమర్‌సింగ్ గేట్ నుంచి అనుమతిస్తారు. పాలరాతిలో ఇన్‌లే వర్క్ ఇక్కడి ప్యాలెస్‌లలోనూ కనిపిస్తుంది. టూర్ ఆపరేటర్‌లు తాజ్‌మహల్ కంటే ఈ కోటకు తీసుకువెళ్తారు. త్వరగా రాకపోతే తాజ్‌మహల్ చూడడానికి సమయం చాలదని తొందరపెడుతుంటారు. దాంతో పర్యాటకులు ప్రశాంతంగా ఆస్వాదించలేకపోతారు.

కుతుబ్ మినార్ | వారసత్వ మేడ

కుతుబ్‌మినార్ ఐదు అంతస్థుల కట్టడం. ఢిల్లీ శివారులో మెహ్రౌలీలో ఉంది. దీని నిర్మాణం క్రీ.శ 1199 నుంచి 1220 వరకు అనేక దఫాలుగా జరిగింది. అనంగపాల్ తోమార్ నుంచి పృథ్వీరాజ్ చౌహాన్, కుతుబుద్దీన్ ఐబక్ షంషుద్దీన్ ఇల్టుట్‌మిష్ వరకు అనేక రాజవంశాల చరిత్రలో ఈ మినార్‌ది కేంద్రస్థానం. హుమయూన్‌కి అక్బర్‌కి మధ్య కాలంలో షేర్‌షా సూరి కూడా తన వంతుగా కొన్ని మెరుగులు దిద్దాడు. ఈ 62 మీటర్ల ఎత్తున్న ఈ మినార్‌కు 14వ శతాబ్దంలో ఫిరోజ్‌షా తుగ్లక్ పై అంతస్తును నిర్మించాడు. ఈ నిర్మాణం ఇండో ఇస్లామిక్ సమ్మేళనం. సూక్ష్మంగా పరిశీలిస్తే ఇందులో అరబిక్ భాషలో రాసిన ఖురాన్ సూక్తులు కనిపిస్తాయి. నిర్మాణంలో వలలాంటి అల్లికల నిర్మాణం పర్షియన్ వాస్తుశైలిని ప్రతిబింబిస్తుంది. తామర రేకులను పోలిన అంచులు హిందూ నిర్మాణాల శైలికి నిదర్శనం. ఇందులో ఉపయోగించిన ఇటుకలను ఆఫ్ఘనిస్థాన్ నుంచి తెప్పించారు. ఈ ప్రాంతాన్ని ఏలిన పాలకులందరూ ఈ నిర్మాణానికి ఏదో ఒక సొబగులద్ది చరిత్రలో తమ పేరు కూడా ఉండేటట్లు జాగ్రత్తపడ్డారు.

ఐరన్ పిల్లర్ ప్రత్యేక ఆకర్షణ

కుతుబ్‌మినార్‌తోపాటు అనేక కట్టడాలున్నాయి. విశాలమైన ప్రాంగణంలో ఇతమిద్ధంగా ఇదీ అని చెప్పడానికి వీల్లేని నిర్మాణాల అవశేషాలుంటాయి. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆ శిథిలాలకు రూపమిచ్చే ప్రయత్నం చేస్తోంది. వివరాల్లోకి వెళ్తే కుతుబ్ మినార్ కట్టడం లాల్ కోట్ శిథిలాల మీద మొదలైందని చరిత్రకారులు నిర్ధారించారు. ఇక్కడున్న ఐరన్ పిల్లర్ మరో చారిత్రక గొప్పదనం. అది ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉంటుంది. కానీ తుప్పు పట్టదు. మనదేశంలో లోహశాస్త్రం ఎంత శాస్త్రబద్ధంగా అభివృద్ధి చెందిందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ. ఏయే లోహాలను ఎంతెంత నిష్పత్తిలో వాడారనే విషయంలో రీసెర్చ్ స్కాలర్స్ పరిశోధనలు చేస్తుంటారు.


కుతుబ్ కాంప్లెక్స్‌లోని ఐరన్ పిల్లర్

బిజినెస్ రీల్

బజాజ్ ఆటో నుంచి త్వరలోనే ఈ-రిక్షా


ఈ ఆర్థిక సంవత్సరం చివరికి సిద్ధం



న్యూఢిల్లీ: బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికి (మార్చి) ఈ-రిక్షా విభాగంలోకి ఎంట్రీ ఇవ్వనుంది. ఇప్పటి వరకు అసంఘటితంగా ఉన్న ఈ విభాగంలో గణనీయమైన వాటాపై దృష్టి సారించింది. ప్రస్తుత త్రైమాసికం చివరికి అనుమతులు రావచ్చని, నెలవారీ రూ.45,000 యూనిట్ల విక్రయ అంచనాతో ఉన్నట్టు బజాజ్ ఆటో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేశ్ శర్మ తెలిపారు. ''ఆధునిక 'ఈ-రిక్'ను ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఆవిష్కరించే ఉద్దేశ్యంతో ఉన్నాం. ఈ విభాగంలో ఇది కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుంది. అటు యజమానులు, ఇటు ప్రయాణికులకు సంతోషాన్నిచ్చే విధంగా ఉత్పత్తి ఉంటుంది''అని రాకేశ్ శర్మ వివరించారు. ఆటో విభాగం స్థాయిలోనే ఈ-రిక్ విభాగం కూడాఉంటుందని చెప్పారు.

ఎఫ్‌డీఐలకు మరింత దన్ను

- కొన్ని రంగాలపై ప్రభుత్వ దృష్టి
- విధానాల సవరణకు యోచన




న్యూఢిల్లీ: దేశంలోకి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐలు)ను ఆకట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా కొన్ని రంగాలలో విధానాలను సవరించాలని యోచిస్తోంది. తద్వారా మరిన్ని ఎఫ్‌డీఐలకు దారి చూపాలని చూస్తున్నట్లు ప్రభుత్వ అధికారి ఒకరు తాజాగా పేర్కొన్నారు. ఈ బాటలో వివిధ ప్రభుత్వ శాఖలు, నియంత్రణ సంస్థలు, పారిశ్రామిక సహచర సంస్థలు, అడ్వయిజరీ, న్యాయ సంస్థలు, పెన్షన్ ఫండ్స్, ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) సంస్థలు, వెంచర్స్ క్యాపిటల్(వీసీ) ఫండ్స్ తదితరాలతో అంతర్గత వాణిజ్యం, పారిశ్రామిక ప్రోత్సాహక శాఖ(డీపీఐఐటీ) సమావేశాన్ని ఏర్పాటు చేసింది. తద్వారా దేశీయంగా మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించుకునేందుకు అభిప్రాయాలు, సూచనలకు ఆహ్వానం పలికింది. వెరసి వివిధ శాఖలు, విభాగాలతో చర్చలు పూర్తిచేసినట్లు ప్రభుత్వ అధికారి వెల్లడించారు. దీంతో విభిన్న సమస్యలపై సలహాలు, సూచనలు అందుకున్నట్లు తెలియజేశారు. అయితే ఇంతవరకూ ఏ అంశాలపైనా తుది నిర్ణయాలకు రాలేదని తెలియజేశారు. నిబంధనలు, విధానాలను సరళతరం చేయడంపై ప్రస్తుతం దృష్టి సారించినట్లు వివరించారు. కాగా.. ఏఏ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందీ వెల్లడించలేదు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-2-2025	
విశాఖ	465-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

ధరలు, ప్రపంచ పరిస్థితులు కీలకం

- విదేశీ ఇన్వెస్టర్ల తీరుపైనా దృష్టి
- ఢిల్లీ అసెంబ్లీ ఫలితాల ఎఫెక్ట్
- ఈ వారం దేశీ మార్కెట్ల ట్రెండ్!
- స్టాక్ విశ్లేషకుల తాజా అంచనాలు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసిక ఫలితాల సీజన్ ముగింపునకు వస్తున్న నేపథ్యంలో ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు పలు ఇతర అంశాలపై దృష్టి పెట్టనున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. ప్రధానంగా ద్రవ్యోల్బణ గణాంకాలు, ప్రపంచ స్టాక్ మార్కెట్లలో నెలకొనే పరిస్థితులు ప్రభావం చూపనున్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు యూఎస్ రిటైల్ సేల్స్, యూకే జీడీపీ గణాంకాలు తదితరాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు వివరించారు. ఇతర వివరాలు చూద్దాం..

క్యూ3 ఫలితాలకు రెడీ

ఇప్పటికే అక్టోబర్-డిసెంబర్(క్యూ3) ఫలితాల సీజన్ ముగింపునకు వచ్చింది. ఈ బాటలో మరికొన్ని కంపెనీలు క్యూ3 పనితీరు ప్రకటించనున్నాయి. జాబితాలో ఐషర్ మోటార్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, వొడాఫోన్ ఐడియా, సెయిల్, నాల్కో, లుమాక్స్, అపోలో హాస్పిటల్స్, అశోకా బిల్డ్‌కాన్, అవంతీ ఫీడ్స్, రెయిన్‌బో చిల్డ్రన్స్, బిర్లా కేబుల్, బామర్‌లారీ, బాటా, ఎస్కార్ట్స్, గలక్సీ సర్ఫక్టేంట్స్, జిలెట్ తదితరాలున్నట్లు మాస్టర్ ట్రస్ట్ గ్రూప్ డైరెక్టర్ పునీత్ సింఘానియా పేర్కొన్నారు.

12న గణాంకాలు

బుధవారం(12న) జనవరి నెలకు రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ), డిసెంబర్ నెలకు పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ) గణాంకాలు వెలువడనున్నాయి. డిసెంబర్‌లో సీపీఐ 5.22 శాతంగా నమోదైంది. ఇక నవంబర్‌లో ఐఐపీ 3.5 శాతం వృద్ధిని చూపింది. ఈ బాటలో జనవరి నెలకు టోకు ధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ) గణాంకాలు 14న విడుదలకానున్నాయి. డిసెంబర్‌లో డబ్ల్యూపీఐ 2.37 శాతంగా నమోదైంది. ఇదే విధంగా జనవరి వాణిజ్య గణాంకాలు వెల్లడికానున్నాయి. డిసెంబర్‌లో వాణిజ్య లోటు 21.94 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అంతర్జాతీయంగా యూఎస్ రిటైల్ అమ్మకాలు, ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ ప్రసంగం, యూకే జీడీపీ గణాంకాలూ కీలకంగా నిలవనున్నట్లు సింఘానియా తెలియజేశారు. ఫెడ్ గత పాలసీ సమీక్షలో వడ్డీ రేట్లను యథాతథంగా 4.25-4.5 శాతంవద్దే కొనసాగించేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇవికాకుండా డాలరుతో మారకంలో రూపాయి కదలికలు, ముడిచమురు ధరలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) తీరు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు నిపుణులు వివరించారు.

గత వారమిలా

గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో నిలిచాయి. సెన్సెక్స్ 354 పాయింట్లు(0.5 శాతం) బలపడి 77,860 వద్ద ముగిసింది. నిఫ్టీ 78 పాయింట్లు(0.3%) పుంజుకుని 23,560 వద్ద స్థిరపడింది.

అమ్మకాలు వీడని ఎఫ్‌పీఐలు

ఇటీవల దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే ప్రాధాన్యమిస్తున్న విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) గత వారం సైతం ఇదే బాటలో సాగారు. ఫిబ్రవరి తొలి వారంలో నికరంగా రూ. 7,300 కోట్ల(84 కోట్ల డాలర్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. జనవరిలోనూ ఎఫ్‌పీఐలు నగదు విభాగంలో రూ. 78,027 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించిన విషయం విదితమే. అయితే అంతకుముందు అంటే డిసెంబర్ మధ్యలో అమ్మకాలను వీడి కొనుగోళ్లు చేపట్టారు. దీంతో 2024 చివరి నెలలో నికరంగా రూ. 15,446 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం!

చివరికి ఢిల్లీ కోటలో పాగా

దాదాపు మూడు దశాబ్దాల తదుపరి మళ్లీ న్యూఢిల్లీ కోటలో బీజేపీ పాగా వేసింది. తాజా అసెంబ్లీ ఎన్నికలలో ఆప్ దశాబ్ద కాలం పాలనకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చెక్ పెట్టింది. పార్లమెంట్ ఎన్నికల బాటలో రాష్ట్రంలోనూ సీట్లు సాధించడంతో స్థానికంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. దీంతో స్టాక్ మార్కెట్లలో స్వల్ప కాలానికి సెంటిమెంటు బలపడనున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త వీకే విజయకుమార్ పేర్కొన్నారు. ప్రోత్సాహకర బడ్జెట్, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత దీనికి జత కలవనున్నట్లు అభిప్రాయపడ్డారు.

దిరియాపై దేశీ దిగ్గజాల కన్ను

- సౌదీ అరేబియా గిగా ప్రాజెక్ట్
- 63 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- టాటా, ఒబెరాయ్ గ్రూప్ ఆసక్తి




న్యూఢిల్లీ/దావోస్: సౌదీ అరేబియాలో దిరియా పేరుతో తలపెట్టిన అతిభారీ(గిగా) టూరిజం ప్రాజెక్టుపై దేశీ కార్పొరేట్ దిగ్గజ గ్రూప్‌లు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. 63 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రూపొందనున్న ఈ ప్రాజెక్టులో దేశీ దిగ్గజాలు టాటా గ్రూప్, ఒబెరాయ్ గ్రూప్ తదితరాలు ఇన్వెస్ట్ చేయనున్నట్లు దిరియా సీఈవో జెర్రీ ఇన్‌జెరిల్లో పేర్కొన్నారు. సిటీ ఆఫ్ ఎర్త్‌గా పేర్కొంటున్న ఈ ప్రాజెక్టును సౌదీ అరేబియా రాజధాని రియాద్ చివర్లో నెలకొల్పుతున్నారు. లక్ష మంది ప్రజలకు గృహాలు, మరో లక్ష మందికి కార్యాలయ ప్రాంతాలతో ప్రాజెక్టు రూపొందనుంది. ఈ కొత్త నగరం 40 విలాసవంత హోటళ్లు, 1,000కుపైగా షాపులు, 150 రెస్టారెంట్లు, 20,000 సీట్ల సామర్థ్యం గల మల్టీపర్పస్ ఈవెంట్లకు వీలయ్యే ఒపేరా హౌస్‌సహా గోల్ఫ్ కోర్స్, కేఫ్‌లు, యూనివర్శిటీలు, కల్చరల్ అసెట్స్, మ్యూజియంలు తదితరాలతో ఏర్పాటుకానుంది.

సెంచురీ ప్లై లాభం రూ.59 కోట్లు

కోల్‌కతా: సెంచురీ ప్లై బోర్డ్స్ (ఇండియా) లిమిటెడ్ డిసెంబర్ త్రైమాసికానికి మిశ్రమ పనితీరు నమోదు చేసింది. రూ.59 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.63 కోట్లతో పోల్చితే 6 శాతానికి పైగా క్షీణించింది. ఆదాయం ఇదే కాలంలో 22 శాతం మేర పెరిగి రూ.1,140 కోట్లకు చేరింది. వ్యయాలు సైతం రూ.862 కోట్ల నుంచి రూ.1,063 కోట్లకు ఎగిశాయి. 'సెంచురీ ప్యానెల్స్ బీవీ' పేరుతో నెదర్లాండ్స్‌లో కొత్త సబ్సిడరీని ఏర్పాటు చేసింది. ల్యామినేట్, ఎండీఎఫ్ డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం దీని ద్వారా నిర్వహించనుంది. సెంచురీ ఇన్ఫోటెక్ లిమిటెడ్ కొనుగోలు పూర్తయిందని, కంపెనీ సబ్సిడరీగా మారినట్టు సెంచురీ ప్లైబోర్డ్స్ ప్రకటించింది.

ఎన్‌హెచ్‌పీసీ లాభాలకు గండి

47 శాతం క్షీణతతో రూ.330 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌హెచ్‌పీసీ.. డిసెంబర్ త్రైమాసికంలో బలహీన పనితీరు ప్రదర్శించింది. నికర లాభం రూ.330 కోట్లకు క్షీణించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.623 కోట్లతో పోల్చి చూసినప్పుడు 47 శాతం తగ్గిపోయింది. ఆదాయం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు రూ.2,550 కోట్ల నుంచి రూ.2,617 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు పెరిగిపోవడమే కంపెనీ లాభాల క్షీణతకు దారితీసింది. డిసెంబర్ క్వార్టర్‌లో వ్యయాలు రూ.2,217 కోట్లకు చేరాయి. వాటాదారుల వద్దనున్న ప్రతి షేరుకు రూ.1.40 చొప్పున మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ నిర్ణయించింది.

ఆవిష్కరణలతోనే ఫార్మాకు భవిష్యత్

- లేదంటే మనుగడే ప్రశ్నార్థకం
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: ఆవిష్కరణలతోనే భారత ఫార్మా పరిశ్రమ రాణించగలదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఆవిష్కరణలు లేకపోతే ఈ పరిశ్రమే మనుగడ సాగించలేదని హెచ్చరించారు. ఫార్మా రంగం పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) కోసం ఎప్పుడూ ప్రభుత్వంపైనే ఆధారపడడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ''దురదృష్టవశాత్తూ మన దేశంలో ప్రతి దాని కోసం ప్రభుత్వం వైపు చూసే బలహీన మనస్తత్వ ధోరణి నెలకొంది. ప్రభుత్వం పన్ను రాయితీలు కల్పించినప్పుడే పరిశోధన నిర్వహిద్దామని అనుకుంటారు. విజయానికి ఆవిష్కరణలే ఆధారమైన పరిశ్రమ ఇది. ఎవరైతే ఆవిష్కరణకు దూరంగా ఉంటారో వారి కథ ముగిసినట్టే'' అని ముంబైలో ఫార్మా కంపెనీలు నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మంత్రి వ్యాఖ్యానించారు. మారుతున్న జీవనశైలి తీరులు, సమాజం, రోగుల డిమాండ్లు, అవసరాలకు అనుగుణంగా పరిశ్రమ కూడా మారాలని సూచించారు. ప్రాజెక్టులతో ఫార్మా పరిశ్రమ ముందుకు వచ్చి.. ప్రభుత్వం, విద్యా సంస్థల సహకారంతో పరిశోధనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇక్కడ ఆవిష్కరణలతో పేటెంట్లు సంపాదించుకుని, ఇక్కడి నుంచి ఎగుమతులు చేయాలని పిలుపునిచ్చారు. 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' (ఏఎన్ఆర్ఎఫ్) కింద 2023-28 కాలానికి కేంద్రం రూ.50,000 కోట్ల నిధిని ప్రకటించడం గమనార్హం. దీని కింద పరిశోధన, ఆవిష్కరణలకు చేయూతనివ్వనుంది.

ఆ దేశాల్లో ఆవిష్కరణలే బలం..

స్విట్జర్లాండ్, యూఎస్, జపాన్ దేశాల్లో తలసరి ఆదాయం చాలా పెద్ద మొత్తంలో ఉందని, ఇందుకు అక్కడి కంపెనీల ఆవిష్కరణలే కారణమని మంత్రి గోయల్ చెప్పారు. ''నాణ్యత, ఆవిష్కరణ అన్న రెండు అంశాలపై మీ మనుగడ ఆధారపడి ఉంది''అని పేర్కొన్నారు. ప్రజావేగులుగా మారి తప్పుడు విధానాలకు పాల్పడుతున్న, నకిలీ మందులు తయారు చేస్తున్న కంపెనీల గుట్టు బయటపెట్టాలని పులుపునిచ్చారు. పెద్ద కంపెనీలు చిన్న కంపెనీలను దత్తత తీసుకుని, ఉత్తమ తయారీ విధానాలను అనుసరించడం ద్వారా అవి వృద్ధి చెందేందుకు సహకారం అందించాలని కోరారు.

తగ్గిన బంగారం అక్రమ రవాణా

- దిగుమతి సుంకం తగ్గింపు తర్వాత మార్పు
- సీబీఐసీ చైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్



న్యూఢిల్లీ: బంగారం అక్రమ రవాణాకు దిగుమతి సుంకం తగ్గింపు కొంత చెక్ పెట్టింది. గతేడాది జూలైలో బంగారంపై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి కేంద్రం తగ్గించడం గమనార్హం. అనంతరం అక్రమ రవాణా (స్మగ్లింగ్/దొంగ రవాణా) గణనీయంగా తగ్గినట్టు పరోక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీఐసీ) చైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ మధ్య దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో 847 కిలోల బంగారాన్ని (రూ.544 కోట్లు) డీఆర్ఐ అధికారులు జప్తు చేసినట్టు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అంతర్జాతీయ ప్రయాణికులు, సరిహద్దులు, దేశంలోకి వచ్చే కార్గోల వద్ద అధికారుల నిఘా పెరిగినట్టు సంజయ్ కుమార్ చెప్పారు. కస్టమ్స్ డ్యూటీ ఎగ్గొట్టేందుకు సరిహద్దుల ద్వారా వస్తు అక్రమ రవాణా జరుగుతుండడం తెలిసిందే. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డీఆర్ఐ అధికారులు ఈశాన్య సరిహద్దుల వద్ద 1,319 కిలోల బంగారం అక్రమ రవాణాన్ని అడ్డుకుని, ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, మయన్మార్ సరిహద్దుల వద్ద ఎక్కువ మొత్తం పట్టుబడింది. కస్టమ్స్ విభాగం సహా సీబీఐసీ కలసి గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద జప్తు చేసిన బంగారం 4,870 కిలోలుగా ఉంది. దిగుమతి సుంకం తగ్గింపుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ బంగారం ఆభరణ వర్తకుల (జ్యుయలర్లు) ఆదాయం 22-25 శాతం పెరుగుతుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేయడం గమనార్హం.

వినియోగపనిషత్తు..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి   కె.వి.ఎన్ లావణ్య

ట్యాక్సేషన్ నిపుణులు

''ఇది ప్రజల బడ్జెట్టు. ప్రజల సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్లు, వినియోగం పెరుగుతాయి'' అని అన్నారు ప్రధాన మంత్రి. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు నెరవేరతాయి అని ఆశిస్తున్నారు మోదీ గారు. ''ప్రజలకు ఒరిగిందేమీ లేదు. స్కీముల సంఖ్య పెరిగిందే కానీ సంతోషపడాల్సినదేమీ లేదు. ఆర్థిక మందగమనానికి నాంది'' అని అంటున్నారు ఒకప్పటి ఆర్థికమంత్రి చిదంబరం. ఇక రాష్ట్రాల విషయానికొస్తే.. ప్రతి రాష్ట్రం ఎంతో కొంత అసంతృప్తిగానే ఉంది. ఆరోగ్యరంగానికి సరిపోయినంత మందు పడలేదంటున్నారు. రైల్వేను పట్టాల నుంచి తప్పించారంటున్నారు. రైతులకు అంతంతమాత్రమే అని ఒకరు .. పరిశ్రమలకు ఫర్వాలేదని మరొకరు.. ఆటలకి పెద్ద పీట.. చిన్న తరహా పరిశ్రమలకు ఊతం..కృత్రిమ మేధస్సుకు ఎక్సలెన్సు, మందుల ధరల తగ్గుముఖం .. ఆహార భద్రతకు అవకాశం .. ఆభరణాల మీద కస్టమ్స్ తగ్గుదల, పత్తికి కొత్త ఊపు, జౌళి పరిశ్రమకు దన్ను, ఎయిర్ పోర్టుల విస్తరణ, రోడ్ల మీద చిన్న చూపు, అంతరిక్ష రంగాన్ని మరింత పైకి తీసుకెళ్లే ప్రయత్నం, చిన్న తరహా పరిశ్రమలకు భారీ ఊరట, యాత్రా స్థలాల సుందరీకరణ, ఎలక్ట్రిక్ వాహనాల ధరల తగ్గుదల.. ఇలా ఒక్కో రంగానిది ఒక్కో పరిస్థితి.

ఏది ఎలా ఉన్నా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్లు పతనం, విజయకేతనం. ఈ పరిణామం దిక్కూచి కాకపోయినా, ఇదో వెంటాడే బూచి. ''నా తలరాత మారింది. నా ఇష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టుకోవచ్చు'' అని మురిసిపోతోంది మధ్యతరగతి మహిళ. భారీగా పెన్షన్ వచ్చే దంపతులు .. ఇక కంపల్సరీ సేవింగ్స్ మానేసి ''పదవే గౌరీ, పరమాత్ముని చూడ'' అని తీర్థయాత్రలకు విమానంలో ప్లాన్ చేస్తున్నారు. పింగళిగారు రాసిన పాటను పదే పదే పాడి ''ప్రేమించిన పతికి ఎదురునుండగా తీర్థయాత్రలెందుకని'' అంటూ పతిభక్తి చాటుకున్న భార్య సత్యవతి .. పదండి పదండి ఎప్పుడూ ఈ పాడు కొంపేనా అంటూ ట్రావెలింగ్ ఏజంటు దగ్గరకి పరుగెత్తింది, మొగుడి క్రెడిట్ కార్డు పట్టుకుని.


'వెకేషన్'కి పెద్ద ప్లాన్ చేస్తోంది లావణ్య. అక్కతో పాటు నేనూ, మా ఆయనా వస్తాం అంటోంది చెల్లెలు త్రిష. 'మ్యుచువల్ ఫండ్స్'లో ఇన్వెస్ట్ చేయడానికి రెడీ అవుతున్నాడు రవి. 'నాకు జీతం పెంచకపోయినా ఫర్వాలేదు' అంటోంది ఉద్యోగిని ఊర్మిళ.. వాళ్లబాసుతో. ఇంట్లో పాత ఫర్నిచరు, టీవీలు తీసేసి కొత్తవి కొనుక్కుందాం అని అంటోంది మరో మహిళ లలిత. ఇల్లు కొత్తది కాకపోయినా మంచిగా ఇంటీరియర్స్ చేయిద్దాం అంటోంది హరిత. ''సేవింగ్స్‌తో మంచిగా అప్‌స్కేలింగ్ వైపు వెళ్తాను'' అని అంటున్నాడు అక్షిత్. లేటెస్టు మ్యూజిక్ పరికరాలు కొని సంగీతం సాధన చేస్తానంటోంది మరో వనిత అభిజ్ఞ. షేరు మార్కెట్లో ఎంటర్ అయ్యి వెల్త్ క్రియేట్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాడు వారెన్ బఫెట్ బుక్ చదివి రత్నాకర్. ''పొరుగింటి మీనాక్షమ్మని చూశారా'' అనే ప్రశ్న మానేసి తనకి కావాల్సిన బంగారం ఆభరణాలను ప్లాన్ చేస్తోంది నాగమణి.

వీళ్ళందరి ఆలోచనలూ నిజమయ్యేనా? అంటే నిజమే అనిపిస్తోంది. తన ప్రతిపాదనలతో సంవత్సరానికి లక్ష కోట్ల రూపాయల నష్టమని చెప్పన్నారు సీతమ్మ తల్లి. రెండు కోట్ల మంది ట్యాక్స్ పేయర్లకు లబ్ధి చేకూరుతుందని ఫైనాన్స్ సెక్రటరీ పాండేగారి ఉవాచ. జనాల చేతిలో మిగులు. అలా మిగిలిన మొత్తం వెచ్చించడానికి ఇక హద్దులుండవు. ఇప్పటికి ప్రైవేటు వారి చేతిలో వినియోగం నిమిత్తం ఆర్థిక వ్యవస్థలోకి వచ్చేది రెండు వందల లక్షల కోట్లు. దానికి అదనంగా ఒక లక్ష కోట్లు అంటే సామాన్యం కాదు. పెద్ద సంఖ్యే. క్రమేపీ, పాత విధానం పన్నుల సేకరణ ఉండదు. కొత్త విధానానికి మొగ్గ చూపిస్తున్నారు. ద్రవ్యోల్బణం కొనసాగుతున్నా ఖర్చుల స్థాయి తగ్గలేదు. కోడి పందాల్లో వేల కోట్లు. కుంభమేళా సందర్భంగా కొన్ని వేల కోట్లు. ఆకలి చావులుండవచ్చు.. కానీ కోడి పులావ్ అమ్ముడుపోతుంది. అందరి ఖర్చులు పెరుగుతాయి. లిక్విడిటీ పెరుగుతుంది. ఈ యాగంలో ''వినియోగమే'' యోగప్రదమైనది.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలంలో స్థిరమైన రాబడి..

ఎస్‌బీఐ లాంగ్‌టర్మ్ ఈక్విటీ ఫండ్



దీర్ఘకాల లక్ష్యాలకు సంబంధించి పెట్టుబడుల్లో ఈక్విటీలకు కచ్చితంగా చోటు కల్పించుకోవాలని నిపుణులు సూచిస్తుంటారు. ఎందుకంటే ఇతర సాధనాలతో పోల్చితే ఈక్విటీలు దీర్ఘకాలంలో మెరుగైన రాబడిని ఇచ్చినట్టు చారిత్రక డేటా తెలియజేస్తోంది. ద్రవ్యోల్బణమే సగటున 5-6 శాతం స్థాయిలో ఉంటోంది. ఇంతకుమించిన రాబడిని సంపాదించుకున్నప్పుడే అసలైన సంపద వృద్ధి సాధ్యపడుతుంది. అందుకు ఈక్విటీలు అవకాశం కల్పిస్తాయి. ఈక్విటీల్లోనూ పన్ను ఆదా ప్రయోజనం కోరుకునే వారు ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఈ విభాగంలో దీర్ఘకాల చరిత్ర కలిగిన పథకాల్లో ఎస్‌బీఐ లాంగ్‌టర్మ్ ఈక్విటీ ఫండ్ ఒకటి.

రాబడులు

ఈ పథకంలో ఏడాది కాల రాబడి 14 శాతంగా ఉంది. అదే మూడేళ్లలో చూసుకుంటే వార్షికంగా 23 శాతం చొప్పున రాబడిని తెచ్చిపెట్టింది. ఐదేళ్లలోనూ ఏటా 23 శాతం రాబడి ఈ పథకంలో గమనించొచ్చు. ఏడేళ్లలో ఏటా 16 శాతం, పదేళ్లలో 14 శాతం చొప్పున పెట్టుబడులపై ఇన్వెస్టర్లకు ప్రతిఫలాన్ని అందించింది. ఎల్ఎస్ఎస్ విభాగం సగటు రాబడితో పోల్చి చూసినప్పుడు ఈ పథకంలోనే మెరుగైన రాబడి కనిపిస్తోంది. వివిధ కాలాల్లో 1-8 శాతం మధ్య అధిక రాబడిని ఈ పథకమే అందించింది. అంతేకాదు బీఎస్ఈ 500 టీఆర్ఐ కంటే కూడా ఈ పథకమే మెరుగైన పనితీరు నమోదు చేసింది. 1993 మార్చి 31న ఈ పథకం ఆరంభం కాగా, అప్పటి నుంచి చూస్తే వార్షిక రాబడి 16.99 శాతంగా ఉండడం గమనార్హం. ఈ పథకంలో మొదటిసారి రూ.10,000 లంప్‌సమ్ ఇన్వెస్ట్ చేసి, ఆ తర్వాత నుంచి ప్రతి నెలా రూ.2,000 చొప్పున సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో గడిచిన ఐదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేసి ఉంటే.. మొత్తం పెట్టుబడి రూ.1.30 లక్షలు కాగా, రాబడులతో కలసి అది ఇప్పుడు రూ.2,54,592గా మారి ఉండేది. అంటే ఐదేళ్లలో పెట్టుబడి దాదాపు వృద్ధిని చూసి ఉండేది. అదే డెట్ సాధనం అయిన నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో పెట్టుబడి రెట్టింపునకు ప్రస్తుతమున్న 7.7% రేటు ఆధారంగా 10 ఏళ్ల 4 నెలలు పడుతుంది.



పెట్టుబడుల విధానం/ పోర్ట్‌ఫోలియో

ఈ పథకంలో పెట్టుబడిని ఆదాయపన్ను పాత విధానంలో సెక్షన్ 80సీ పరిధిలో చూపించుకుని రూ.1.5 లక్షల మొత్తంపై పన్ను మినహాయింపు ప్రయోజనం పొందొచ్చు. ఈ పథకంలో పెట్టుబడికి మూడేళ్ల లాకిన్ ఉంటుంది. ఆ తర్వాతే పెట్టుబడిని వెనక్కి తీసుకోవడానికి అనుమతిస్తారు. పన్ను ఆదాతోపాటు పెట్టుబడుల వృద్ధి ప్రయోజనం ఈ పథకంతో లభిస్తుంది. పెట్టుబడుల్లో వైవిధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. కాంపౌండింగ్‌తో దీర్ఘకాలంలో పెట్టుబడి మెరుగైన వృద్ధికి నోచుకుంటుంది. ఈ పథకం నిర్వహణలో రూ.27,791 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 90 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్‌లో కేవలం 0.14 శాతమే పెట్టుబడి ఉంది. మిగిలిన 9.6 శాతం నగదు, నగదు సమానాల్లో కలిగి ఉంది. స్టాక్స్ విలువలు గరిష్టానికి చేరిన నేపథ్యంలో మెరుగైన పెట్టుబడి అవకాశాల కోసం నగదు నిల్వలు నిర్వహిస్తున్నట్టు కనిపిస్తోంది. ఈక్విటీల్లోనూ 76 శాతం పెట్టుబడులు లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీలకు 16.44 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 7.84 శాతం వరకు కేటాయింపులు చేసింది. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో 26 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 14.51 శాతం, ఎనర్జీ, యుటిలిటీ కంపెనీల్లో 12.47 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.49
రిలయన్స్ ఇండస్ట్రీస్	3.53
ఐసీఐసీఐ బ్యాంక్	3.42
భారతీ ఎయిర్‌టెల్	3.18
టోరెంట్ పవర్	2.77
మహీంద్రా అండ్ మహీంద్రా	2.72
ఎస్‌బీఐ	2.67
టాటా స్టీల్	2.58
ఐటీసీ	2.51
టెక్ మహీంద్రా	2.32

యూపీ వారియర్స్ కెప్టెన్‌గా దీప్తి శర్మ



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో మరో జట్టుకు కొత్త కెప్టెన్ నియామకం జరిగింది. ఈనెల 14 నుంచి జరిగే మూడో సీజన్‌లో యూపీ వారియర్స్ జట్టుకు భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ నాయకత్వం వహించనుంది. గత సీజన్‌లో ఆ్రస్టేలియా స్టార్ అలీసా హీలీ కెప్టెన్సీలో యూపీ వారియర్స్ జట్టు బరిలోకి దిగింది. అయితే గాయం కారణంగా అలీసా హీలీ మూడో సీజన్ డబ్ల్యూపీఎల్ నుంచి వైదొలిగింది. దాంతో యూపీ వారియర్స్‌కు కొత్త కెప్టెన్‌గా దీప్తి శర్మను నియమించారు. గత సీజన్‌లో దీప్తి శర్మ ఎనిమిది ఇన్నింగ్స్‌లు ఆడి 136.57 స్ట్రయిక్‌రేట్‌తో 295 పరుగులు సాధించడంతోపాటు 10 వికెట్లు తీసింది. గత సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టుకు బెత్ మూనీ కెప్టెన్‌గా వ్యవహరించగా... ఈసారి ఆ్రస్టేలియాకే చెందిన ఆ్రస్టేలియా గార్డ్‌నర్ గుజరాత్ జెయింట్స్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైంది. డబ్ల్యూపీఎల్‌లోని మిగతా మూడు జట్లకు హర్మన్‌ప్రీత్ (ముంబై ఇండియన్స్), స్మృతి మంధాన (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు), మెగ్ లానింగ్ (ఢిల్లీ క్యాపిటల్స్) కెప్టెన్‌లుగా ఉన్నారు.

14 ఏళ్ల తర్వాత...



శ్రీలంకలో టెస్టు సిరీస్ గెలిచిన ఆ్రస్టేలియా ● రెండో టెస్టులో 9 వికెట్ల తేడాతో ఘనవిజయం

గాలె: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆ్రస్టేలియా... శ్రీలంకలో 14 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ అందుకుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం ముగిసిన చివరిదైన రెండో టెస్టులో ఆ్రస్టేలియా 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా సిరీస్‌ను 2–0తో చేజిక్కించుకుంది. కంగారూ జట్టు చివరిసారిగా 2011లో శ్రీలంకలో టెస్టు సిరీస్ గెలిచింది. ఇప్పటికే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించిన ఆసీస్... లంక పర్యటనలో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. ఓవర్‌నైట్ స్కోరు 211/8తో ఆదివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక చివరకు 68.1 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ మెండిస్ (50; 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కంగారూ బౌలర్లలో కూనెమన్, లయన్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. కుశాల్ మెండిస్ క్యాచ్ పట్టడం ద్వారా టెస్టు క్రికెట్‌లో 200 క్యాచ్‌లు అందుకున్న ఐదో ప్లేయర్‌గా ఆ్రస్టేలియా కెప్టెన్ స్మిత్ రికార్డుల్లోకి ఎక్కాడు. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనకు దిగిన ఆ్రస్టేలియా రెండో ఇన్నింగ్స్‌లో 17.4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 75 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖ్వాజా (27 నాటౌట్), ట్రావిస్ హెడ్ (20), లబుషేన్ (26 నాటౌట్) రాణించారు. ఆసీస్ వికెట్ కీపర్ అలెక్స్ కేరీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... స్మిత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

కరుణరత్నే వీడ్కోలు

శ్రీలంక సీనియర్ బ్యాటర్ దిముత్ కరుణరత్నే పరాజయంతో కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఈ పోరు ద్వారా టెస్టు క్రికెట్‌లో 100 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న 36 ఏళ్ల కరుణరత్నే మాట్లాడుతూ... 'కెరీర్ ఆరంభంలో ఒక్క టెస్టు మ్యాచ్ ఆడితే చాలు అనుకున్నా. వంద మ్యాచ్‌లు ఆడటం అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నాడు. సుదీర్ఘ కెరీర్‌లో కరుణరత్నే 39.25 సగటుతో 7,222 పరుగులు చేశాడు. అందులో 16 శతకాలు, 39 అర్ధశతకాలు ఉన్నాయి.

డబ్ల్యూటీసీ పట్టికలో ఆసీస్‌కు రెండో స్థానం

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023–25 పాయింట్ల పట్టికలో ఆ్రస్టేలియా రెండో స్థానంలో నిలిచింది. లంకతో సిరీస్‌కు ముందే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించిన ఆసీస్ జట్టు చివరకు 67.54 విజయాల శాతంతో రెండో స్థానం దక్కించుకుంది. రెండేళ్ల వ్యవధిలో 19 టెస్టు మ్యాచ్‌లు ఆడిన ఆసీస్ 13 విజయాలు, 4 పరాజయాలు, 2 'డ్రా'లు నమోదు చేసుకుంది. మరోవైపు దక్షిణాఫ్రికా 69.44 విజయాల శాతంతో పట్టిక 'టాప్' ప్లేస్ దక్కించుకుంది. ఆ్రస్టేలియా, దక్షిణాఫ్రికా మధ్య జూన్ 11 నుంచి డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది. గత రెండు పర్యాయాలు డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడిన భారత జట్టు 50.00 విజయాల శాతంతో పట్టికలో మూడో స్థానానికి పరిమితమైంది.

200 టెస్టుల్లో స్టీవ్ స్మిత్ పట్టిన క్యాచ్‌లు. రాహుల్ ద్రవిడ్ (210: భారత్), జో రూట్ (207: ఇంగ్లండ్), మహేళ జయవర్ధనే (205: శ్రీలంక), జాక్వెస్ కలిస్ (200: దక్షిణాఫ్రికా) మాత్రమే 200 క్యాచ్‌ల మైలురాయిని దాటారు.

ఆసియా 'మిక్స్‌డ్' బ్యాడ్మింటన్ టోర్నీకి సింధు దూరం



న్యూఢిల్లీ: ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత పతకావకాశాలకు దెబ్బ పడింది. భారత స్టార్ షట్లర్, ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు కండరాల గాయం కారణంగా ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. క్రితంసారి 2023లో దుబాయ్‌లో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో సింధు సభ్యురాలిగా ఉన్న భారత జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. గువాహటిలో ఈనెల నాలుగో తేదీన మొదలైన జాతీయ శిక్షణ శిబిరం సందర్భంగా సింధు ప్రాక్టీస్ సమయంలో గాయపడింది. ఎంఆర్‌ఐ స్కాన్ తీయగా సింధు కండరాల గాయం నుంచి కోలుకోవడానికి కొన్ని వారాల సమయం పడుతుందని తేలింది. దాంతో సింధు ఈ టోర్నీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఆసియా మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఈనెల 11 నుంచి 15 వరకు చైనాలోని కింగ్‌డావో నగరంలో జరుగుతుంది. గ్రూప్ 'డి'లో ఉన్న భారత్ ఈనెల 12న మకావు జట్టుతో, 13న దక్షిణ కొరియా జట్టుతో ఆడుతుంది. ఇరు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల (పురుషుల, మహిళల సింగిల్స్, పురుషుల, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్) చొప్పున జరుగుతాయి.

భారత బ్యాడ్మింటన్ జట్టు: లక్ష్య సేన్, ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిల, అర్జున్, సతీశ్ కుమార్, మాళవిక బన్సోద్, గాయత్రి గోపీచంద్, ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టో, ఆద్య.

అంకిత్ సూపర్ సెంచరీ



అంకిత్

- హరియాణా తొలి ఇన్నింగ్స్ 263/5
- ముంబై తొలి ఇన్నింగ్స్ 315 ఆలౌట్
- రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్ రౌండప్

కోల్‌కతా: కెప్టెన్ అంకిత్ కుమార్ (206 బంతుల్లో 136; 21 ఫోర్లు) సెంచరీతో కదంతొక్కడంతో ముంబైతో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో హరియాణా జట్టు దీటుగా బదులిస్తోంది. సహచరుల నుంచి పెద్దగా సహకారం లభించకపోయినా... అంకిత్ కుమార్ ఒంటరి పోరాటం చేశాడు. ఫలితంగా ఆదివారం ఆట ముగిసే సమయానికి హరియాణా తొలి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 263 పరుగులు చేసింది. లక్షయ్ దలాల్ (34), యశ్‌వర్ధన్ దలాల్ (36) ఫర్వాలేదనిపించారు. ముంబై బౌలర్లలో షమ్స్ ములానీ, తనుశ్ కొటియాన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 278/8తో ఆదివారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన డిఫెండింగ్ చాంపియన్ ముంబై చివరకు 88.2 ఓవర్లలో 315 పరుగులకు ఆలౌటైంది. తనుశ్ కొటియాన్ (173 బంతుల్లో 97; 13 ఫోర్లు) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. హరియాణా బౌలర్లలో అన్షుల్ కంబోజ్, సుమిత్ కుమార్ చెరో 3 వికెట్లు తీశారు. చేతిలో 5 వికెట్లు ఉన్న హరియాణా ప్రస్తుతం... ముంబై తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 52 పరుగులు వెనుకబడి ఉంది. రోహిత్ శర్మ (22 బ్యాటింగ్), అనూజ్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

రాణించిన హర్ష్‌దూబే, ఆదిత్య



హర్ష్

విదర్భ పేసర్ ఆదిత్య ఠాకరే (4/18) సత్తా చాటడంతో తమిళనాడుతో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విదర్భ జట్టు మంచి స్థితిలో నిలిచింది. నాగ్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ పోరులో ఆదివారం ఆట ముగిసే సమయానికి తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 46 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. 18 ఏళ్ల సిద్ధార్థ్ (89 బంతుల్లో 65; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకం సాధించగా... తక్కినవాళ్లు విఫలమయ్యారు. మొహమ్మద్ అలీ (4), నారాయణ్ జగదీశన్ (22), సాయి సుదర్శన్ (7), భూపతి కుమార్ (0), విజయ్ శంకర్ (22) విఫలమయ్యారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 264/6తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ... చివరకు 121.1 ఓవర్లలో 353 పరుగులకు ఆలౌటైంది. సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (243 బంతుల్లో 122; 18 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ అనంతరం అవుట్ కాగా... హర్ష్ దూబే (69; 9 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తమిళనాడు బౌలర్లలో విజయ్ శంకర్, సోను యాదవ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. చేతిలో నాలుగు వికెట్లు ఉన్న తమిళనాడు జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 194 పరుగులు వెనుకబడి ఉంది. కెప్టెన్ సాయి కిశోర్ (6 బ్యాటింగ్), ప్రదోశ్ రంజన్ పాల్ (18 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

అఖీబ్ నబీ 'పాంచ్' పటాకా



అఖీబ్

పేస్ బౌలర్ అఖీబ్ నబీ ఐదు వికెట్లతో మెరిపించడంతో... కేరళతో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో జమ్మూ కశ్మీర్ జట్టు మెరుగైన స్థితిలో నిలిచింది. పుణే వేదికగా జరుగుతున్న పోరులో ఆదివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి కేరళ జట్టు 63 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. జలజ్ సక్సేనా (78 బంతుల్లో 67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... సల్మాన్ నజీర్ (49 బ్యాటింగ్; 8 ఫోర్లు), నిదీశ్ (30) రాణించారు. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో రెండు వికెట్లు పడగొట్టిన అఖీబ్‌ను ఎదుర్కొనేందుకు కేరళ బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 228/8తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూకశ్మీర్ జట్టు చివరకు 95.1 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. యుధ్‌వీర్ సింగ్ (26), అఖీబ్ నబీ (32) కీలక పరుగులు జోడించారు. కేరళ బౌలర్లలో నిధీశ్ 6 వికెట్లతో అదరగొట్టాడు. ప్రస్తుతం చేతిలో ఒక వికెట్ మాత్రమే ఉన్న కేరళ జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 80 పరుగులు వెనుకబడి ఉంది. సల్మాన్ నజీర్ క్రీజులో ఉన్నాడు.

మెరిసిన మనన్, జైమీత్



జైమీత్

బ్యాటర్లు రాణించడంతో సౌరాష్ట్రతో జరుగుతున్న జరుగుతున్న క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. రాజ్‌కోట్ వేదికగా జరుగుతున్న పోరులో ఆదివారం ఆట ముగిసే సమయానికి గుజరాత్ 95 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసింది. మనన్ హింగ్‌రాజియా (219 బంతుల్లో 83; 8 ఫోర్లు, 1 సిక్స్), జైమీత్ పటేల్ (147 బంతుల్లో 88 బ్యాటింగ్; 9 ఫోర్లు) అర్ధశతకాలతో మెరిశారు. అంతకుముందు సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 216 పరుగులకు ఆలౌట్ కాగా... ప్రస్తుతం చేతిలో 6 వికెట్లు ఉన్న గుజరాత్ 44 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. జైమీత్‌తో పాటు వికెట్ కీపర్ ఉర్విల్ పటేల్ (29 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

విజేత ఎంఐ కేప్‌టౌన్



- తొలిసారి ఎస్‌ఏ20 ట్రోఫీ కైవసం చేసుకున్న ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ
- ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌పై ఘన విజయం

జొహన్నెస్‌బర్గ్: బ్యాటర్ల సమష్టి కృషికి... రబడ, బౌల్ట్ బుల్లెట్ బౌలింగ్ తోడవడంతో... ముంబై ఇండియన్స్ (ఎంఐ) ఫ్రాంచైజీకి చెందిన కేప్‌టౌన్ జట్టు దక్షిణాఫ్రికా 20 (ఎస్‌ఏ20) ట్రోఫీ చేజిక్కించుకుంది. శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఫైనల్లో రషీద్ ఖాన్ సారథ్యంలోని ఎంఐ కేప్‌టౌన్ జట్టు 76 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ టీమ్‌పై విజయం సాధించింది. గత రెండు పర్యాయాలు విజేతగా నిలిచిన సన్‌రైజర్స్ ఫ్రాంచైజీకి చెందిన ఈస్టర్న్ కేప్ జట్టు... ఈసారి రన్నరప్‌తో సరిపెట్టుకోగా... ఎంఐ కేప్‌టౌన్ తొలిసారి ట్రోఫీ హస్తగతం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఎంఐ కేప్‌టౌన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. రికెల్టన్ (15 బంతుల్లో 33; 1 ఫోర్, 4 సిక్స్‌లు), ఎస్టెర్‌హ్యూజెన్ (39; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్రెవిస్ (18 బంతుల్లో 38; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), డసెన్ (23) తలా కొన్ని పరుగులు చేశారు. సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ బౌలర్లలో మార్కో యాన్సెన్, రిచర్డ్ గ్లీసన్, లియామ్ డాసన్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఎంఐ కేప్‌టౌన్ బౌలర్ల ధాటికి సన్‌రైజర్స్ జట్టు నిలవలేకపోయింది. 18.4 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌటైంది. టామ్ అబెల్ (30) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ మార్క్‌రమ్ (6), స్టబ్స్ (15), యాన్సెన్ (5), బెడింగ్‌హామ్ (5) విఫలమయ్యారు. ఎంఐ బౌలర్లలో రబడ 4 వికెట్లు పడగొట్టగా... బౌల్ట్ 4 ఓవర్లలో కేవలం 9 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీశాడు. బౌల్ట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', మార్కో యాన్సెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'అవార్డులు దక్కాయి.

ఎస్‌ఏ20 అవార్డుల జాబితా

ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్	బౌల్ట్ (ఎంఐ కేప్‌టౌన్)
స్పిరిట్ ఆఫ్ ద సీజన్	ఎంఐ కేప్‌టౌన్
క్యాచ్ ఆఫ్ ద సీజన్	బ్రెవిస్ (ఎంఐ కేప్‌టౌన్)
రైజింగ్ స్టార్	బ్రెవిస్ (ఎంఐ కేప్‌టౌన్)
బ్యాటర్ ఆఫ్ ద సీజన్	ప్రిటోరియస్ (పార్ల్ రాయల్స్)
బౌలర్ ఆఫ్ ద సీజన్	యాన్సెన్ (ఈస్టర్న్ కేప్)
ప్లేయర్ ఆఫ్ ది సీజన్	యాన్సెన్ (ఈస్టర్న్ కేప్)

ఎస్‌ఏ20 2025 విశేషాలు

అత్యధిక పరుగులు	ప్రిటోరియస్ 397
అత్యధిక వికెట్లు	యాన్సెన్ 19 వికెట్లు
అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన	రబడ 4/25
అత్యధిక సిక్స్‌లు	బ్రెవిస్ 25
అత్యధిక ఫోర్లు	ప్రిటోరియస్ 47

ప్రైజ్‌మనీ ఎవరికెంత? ▶ విజేత జట్టుకు 3,25,00,000 ర్యాండ్‌లు (రూ. 15 కోట్ల 46 లక్షలు) | రన్నరప్ జట్టుకు 1,62,00,000 ర్యాండ్‌లు (రూ. 7 కోట్ల 70 లక్షలు)



శభాష్ మానస్

న్యూఢిల్లీ: భారత పురుషుల టెన్నిస్ రైజింగ్ స్టార్ మానస్ ధామ్నే తన కెరీర్‌లో తొలి ప్రొఫెషనల్ టైటిల్ సాధించాడు. ట్యూనిషియాలో జరిగిన అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఎం15 టోర్నీలో 17 ఏళ్ల మానస్ విజేతగా నిలిచాడు. ఐటీఎఫ్ ర్యాంకింగ్స్‌లో 64వ స్థానంలో ఉన్న ఈ మహారాష్ట్ర కుర్రాడు ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో 2–6, 6–0, 6–2తో ఇటలీకి చెందిన లొరెంజో కార్బోనిపై గెలుపొందాడు. తద్వారా భారత్ నుంచి ఐటీఎఫ్ టైటిల్ నెగ్గిన రెండో అతి పిన్న వయస్కుడిగా మానస్ గుర్తింపు పొందాడు. ఈ రికార్డు యూకీ బాంబ్రీ (16 ఏళ్ల 10 నెలలు; 2009లో న్యూఢిల్లీ ఫ్యూచర్స్ టోర్నీ) పేరిట ఉంది. క్వాలిఫయర్‌గా ట్యూనిషియా ఎం15 టోర్నీలో మెయిన్ 'డ్రా'లోకి అడుగు పెట్టిన మానస్ వరుసగా 8 మ్యాచ్‌లు గెలిచి చాంపియన్‌గా అవతరించడం విశేషం. ప్రస్తుత ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ మాజీ కోచ్ రికియార్డో పియాటి వద్ద మానస్ శిక్షణ తీసుకుంటున్నాడు.



రక్తపుటేరు

అర్జెంటీనాలో ఓ కాలువ ఏకంగా ఎరుపు రంగులోకి మారింది. రాజధాని బ్యూనస్ ఎయిర్స్ సమీపంలో ఉన్న అవెల్లెనెడా మున్సిపాలిటీలోని సరండ్ కాల్వ ఒక్కసారిగా రంగు మారడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అసలేం జరిగిందంటే అర్జెంటీనా, ఉరుగ్వే మధ్య రియో డి లా ప్లాటాలోకి ప్రవహించే జల మార్గంలో స్థానిక తోలు, వస్త్ర పరిశ్రమలు విపరీతంగా రంగులు, రసాయన వ్యర్థాలను వదులుతున్నాయి. దాంతో కాల్వ ఎప్పుడూ పసుపు రంగులో కనిపిస్తూ యాసిడ్ వాసనలు వస్తుంటుంది. అలాంటిది గురువారం అవెల్లెనెడా వాసులు నిద్రలేచే సరికి అది ఉన్నట్టుండి రక్త వర్ణంలోకి మారి భయంకరంగా కనిపించడమే గాక తీవ్ర దుర్గంధం వెదజల్లింది. ఆ విపరీతమైన దుర్వాసనకే ఉలిక్కిపడి లేచామని చాలామంది వాపోయారు. కాలుష్యంపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారంటున్నారు. అర్జెంటీనా పర్యావరణ శాఖ దీనిపై స్పందించింది. రంగు మార్పుకు కారణాలను గుర్తించడానికి కాల్వ నుంచి నీటి నమూనాలను సేకరించింది. సమీప ఫ్యాక్టరీ నుంచి రంగు లీకవడం వల్లే కాల్వ నీళ్లు ఎర్రగా మారాయని అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

నేడు కుంభ మేళాకు రాష్ట్రపతి ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాకు 10న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరవుతున్నారు. ఈమేరకు ఆదివారం రాష్ట్రపతి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు. త్రివేణీ సంగమంలో ముర్ము పవిత్ర స్నానం ఆచరిస్తారు. అక్షయవత్, హనుమాన్ మందిర్‌లలో పూజలు చేస్తారు. అనంతరం డిజిటల్ కుంభ్ అనుభవ్ కేంద్రాన్ని సందర్శిస్తారని రాష్ట్రపతి కార్యాలయం తెలిపింది.

మహా కుంభ్‌లో మళ్లీ మంటలు

మహాకుంభ్ నగర్: మహాకుంభ్‌లో మరో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సెక్టార్ 19లో ఉన్న కల్పవాసి టెంట్‌కు ఆదివారం మంటలు అంటుకున్నాయి. గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా జరిగిన ఘటనలో టెంట్ పూర్తిగా కాలిపోయిందని అధికారులు తెలిపారు. మంటలను కేవలం పది నిమిషాల్లోనే అదుపు చేశామని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదని వివరించారు. జనవరి 19, 25, ఫిబ్రవరి 7వ తేదీల్లో కూడా మహాకుంభ్ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

వచ్చే ఎన్నికల్లో బెంగాల్‌లో అధికారం మాదే

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ధీమా

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీకి 2026లో జరిగే ఎన్నికల్లో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టనుందని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కేంద్ర పథకాలు అమలు కాకుండా మమతా బెనర్జీ ప్రభుత్వం మోకాలడ్డుతోందని ఆరోపించారు. రాష్ట్రాన్ని కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. '2019 ఎన్నికల నుంచి రాష్ట్రంలో బీజేపీ ఓటింగ్ శాతం 30 నుంచి 40 శాతం వరకు ఉంటోంది. మరో పది శాతం ఓట్లను దక్కించుకోగలిగితే మమతా బెనర్జీ ప్రభుత్వం అధికారం కోల్పోతుంది'అని ఆదివారం ఆయన మీడియాతో అన్నారు. బీజేపీపై ప్రజలుంచిన విశ్వాసం, కేజ్రీవాల్ అవినీతి వల్లే ఆప్ అధికారం కోల్పోయిందన్నారు.

79.39% అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సహా పలు పార్టీల అభ్యర్థులు ఘోరంగా ఓడిపోయారు. కనీసం డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయారు. ఈ ఎన్నికల్లో మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీ చేయగా, వీరిలో 555 మందికి(79.39 శాతం) కనీసం డిపాజిట్లు కూడా రాలేదు. కాంగ్రెస్ అభ్యర్థుల్లో కేవలం ముగ్గురికే డిపాజిట్లు దక్కాయి. మిగతా వారంతా తెల్లమొహం వేయాల్సి వచ్చింది. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన చాలామందికి డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీతోపాటు బీజేపీ మిత్రపక్షాలైన జనతాదళ్(యునైటెడ్), లోక్‌జనశక్తి పార్టీ(రామ్‌విలాస్) అభ్యర్థులంతా డిపాజిట్లు నిలబెట్టుకోవడం విశేషం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మొత్తం 70 మంది బరిలోకి దిగారు. 67 మంది డిపాజిట్లు కోల్పోయారు. ఏఐఎంఐఎం అభ్యర్థులు రెండు స్థానాల్లో పోటీ చేయగా, కేవలం ఒక్కచోటే డిపాజిట్ దక్కింది.

ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం ... ఎన్నికల్లో పోటీ చేసే జనరల్ కేటగిరీ అభ్యర్థి ఎన్నికల సంఘం వద్ద రూ.10,000 డిపాజిట్ చేయాలి. దీన్ని సెక్యూరిటీ డిపాజిట్ అంటారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5,000 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల చట్టం ప్రకారం.. ఎన్నికల్లో పోలై చెల్లుబాటు అయిన మొత్తం ఓట్లలో అభ్యర్థికి ఆరింట ఒక వంతు ఓట్లు లభిస్తే డిపాజిట్ సొమ్మును వెనక్కి ఇచ్చేస్తారు. లేకపోతే డిపాజిట్ కోల్పోయినట్లే. అంటే ప్రతి ఆరు ఓట్లలో కనీసం ఒక్క చోటు వచ్చి ఉండాలి.

10 శాతం తగ్గిన ఆప్ ఓట్ల శాతం

దేశ రాజధానిలో బీజేపీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగింది. పదేళ్లలో 13 శాతం పెరగడం విశేషం. అదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ బలం 10 శాతం పడిపోయింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నెగ్గగా, ఆప్ పరాజయం పాలైంది. కానీ, రెండు పార్టీలు సాధించిన ఓట్ల మధ్య తేడా కేవలం 2 శాతమే. ఈసారి పోలైన మొత్తం ఓట్లలో

ఢిల్లీ ఫలితాల్లో విశేషాలెన్నో!

ఆమ్ ఆద్మీ పార్టీకి 43.57 శాతం ఓట్లు లభించాయి. బీజేపీకి 45.56 శాతం ఓట్లు దక్కాయి. కాంగ్రెస్ పార్టీ బలం కూడా స్వల్పంగా పెరిగింది. 2020 ఎన్నికల్లో 4.3 శాతం ఓట్లు సాధించిన ఆ పార్టీ ఈసారి 6.34 శాతం ఓట్లు తన ఖాతాలో వేసుకుంది. అంటే కాంగ్రెస్ ఓట్లు 2 శాతానికి పైగానే పెరిగాయి.

నేర చరితులు 31 మంది

దేశ రాజధాని ఢిల్లీ 8వ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 70 మంది ఎమ్మెల్యేల్లో 31 మంది, 44% మంది నేర చరితులున్నారు. ఈ ఎమ్మెల్యేల్లో 17 మందిపై తీవ్రమైన అభియోగాలున్నాయి. 2020 ఎన్నికల్లో ఎన్నికైన వారిలో నేర చరితులు 43 మంది, అంటే 61% మంది కాగా వీరిలో తీవ్రమైన నేరారోపణలున్న వారు 37 మంది. ఈ సంఖ్య తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తగ్గింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్(ఏడీఆర్), ఢిల్లీ ఎలక్షన్ వాచ్ సంస్థలు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారి అఫిడవిట్లను విశ్లేషించి ఆదివారం ఒక నివేదికను విడుదల చేశాయి. దీని ప్రకారం.. బీజేపీ టిక్కెట్‌పై గెలిచిన 48 మందిలో 16 మంది అంటే 33% మందిపై క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో ఆప్ నుంచి గెలిచిన 22 మందిలో 15 మంది, 68% నేరచరితులున్నారు. మరోవైపు మొత్తం 70 మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురు బిలియనీర్లు కాగా షాకుర్‌బస్తీ స్థానం నుంచి బీజేపీ తరఫున గెలిచిన కర్నయిల్ సింగ్ రూ.259 కోట్లతో అత్యంత సంపన్న ఎమ్మెల్యేగా నిలిచారు. ఆ తర్వాతి రెండు స్థానాల్లో రూ.248 కోట్లతో రాజౌరి గార్డెన్స్ ఎమ్మెల్యే మంజిందర్ సింగ్ సిర్సా, రూ.115 కోట్లతో న్యూఢిల్లీ ఎమ్మెల్యే పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ ఉన్నారు. అప్పులున్న ఎమ్మెల్యేల జాబితాలోనూ రూ.74 కోట్లతో పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ అగ్రస్థానంలో నిలవడం విశేషం. మొత్తం 70 మంది ఎమ్మెల్యేల ఆస్తుల విలువ రూ.1,542 కోట్లుగా ఉంది. వీరిలో 45 మంది, 64% గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకోగా, 23 మంది, 33% మంది 5వ నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు. అంతేగాక 41– 60 ఏళ్ల మధ్య వయస్కులైన ఎమ్మెల్యేలు 47 మంది (67% కాగా 14 మంది అంటే 20% మంది వయస్సు 61– 80 ఏళ్ల మధ్య ఉంది. రాజిందర్ నగర్ నుంచి గెలిచిన 31 ఏళ్ల ఉమంగ్ బజాజ్ పిన్న వయస్కుడైన ఎమ్మెల్యేగా నిలిచారు. అదేవిధంగా, సిట్టింగుల్లో 22 మంది మరోసారి అసెంబ్లీలోకి అడుగు పెట్టనున్నారు. వీరిలో ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి 14 మంది, బీజేపీ నుంచి 8 మంది ఉన్నారు.

38 శాతం మంది పట్టభద్రులు

ఢిల్లీ అసెంబ్లీకి ఈసారి ఎక్కువ మంది పట్టభద్రులు ఎన్నికయ్యారని పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ పేర్కొంది. ఈ సంస్థ ఇందుకు సంబంధించి నివేదిక విడుదల చేసింది. మొత్తం 70 మంది శాసనసభ్యులకుగాను ఈ దఫా కేవలం ఐదుగురు మాత్రమే, అంటే 7 శాతం మంది మహిళలు ఎన్నికయ్యారని తెలిపింది. వీరిలో నలుగురు బీజేపీ నుంచి, ఒకే ఒక్కరు ఆతిశీ ఆప్ నుంచి గెలిచారంది. 2020 ఎన్నికల్లో ఢిల్లీ అసెంబ్లీలో 8 మంది మహిళలు ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేసింది. అదేవిధంగా, గత అసెంబ్లీలో 34 శాతం మంది పట్టభద్రులుండగా ఈసారి వీరి సంఖ్య 38 శాతానికి పెరిగింది. పీజీ, అంతకంటే ఉన్నత చదువులు చదివిన వారి సంఖ్య 26 శాతంగానే ఉందని వివరించింది. కొత్త శాసనసభ్యుల్లో 61 శాతం మంది రాజకీయాలు, సామాజిక సేవను తమ వృత్తిగా పేర్కొన్నారంది. గత అసెంబ్లీలో 29% మంది వ్యాపారాన్ని వృత్తిగా పేర్కొనగా ఈ దఫా వీరి సంఖ్య ఏకంగా 49 శాతానికి పెరిగిందనిఆ నివేదిక తెలిపింది. సభ్యుల సరాసరి వయస్సు 52 ఏళ్లుగా పేర్కొంది. కొత్త ఎమ్మెల్యేల్లో 25–40 ఏళ్ల మధ్య ఉన్న వారు 13% కాగా, గత అసెంబ్లీలో వీరు 23 శాతంగా ఉన్నారని విశ్లేషించింది. 70 ఏళ్లు పైబడిన వారి వాటా 4శాతమని తెలిపింది.

కేజ్రీవాల్ ఓటమితో హజారేకు ఆనందం

- మోదీ ప్రభుత్వంపై ఆరోపణలపై మాత్రం మౌనం
- శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ ధ్వజం

ముంబై: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ ఓటమిపై సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే ఎంతో సంతోషంగా ఉన్నారని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో, గతంలో ప్రధాని మోదీ ప్రభుత్వంపై చేసిన ఆరోపణల విషయంలో మాత్రం హజారే మౌనంగా ఉంటున్నారంటూ తప్పుబట్టారు. 'మోదీ హయాంలో ఇంతగా అవినీతి జరుగుతూంటే హజారే ఎక్కడున్నారు? కేజ్రీవాల్ పరాజయంపై ఆయన సంతోషంగా ఉన్నారు సరే.. ఒక వైపు దేశంలో దోపిడీ కొనసాగుతోంది. సంపదంతా ఒకే ఒక్క పారిశ్రామిక వేత్త గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం మనుగడ ఎలా సాధ్యం? ఇటువంటి సమయంలో అన్నా హజారే మౌనం దాల్చడం వెనుక పరమార్థం ఏమిటి?'అని రౌత్ ప్రశ్నించారు. 'మహారాష్ట్రలో జరిగిన అవకతవకలే ఢిల్లీ ఓటర్ల జాబితాలోనూ చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ హజారే కిమ్మనడం లేదు. హరియాణాలోనూ ఇదే జరిగింది. వచ్చే బిహార్ ఎన్నికల్లోనూ ఇలాంటివే జరగనున్నాయి'అని ఆయన మీడియాతో వ్యాఖ్యానించారు. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ సూత్రాలు అమలుకావడం లేదని ఆరోపించారు. డబ్బు, అవకతవకల ద్వారానే బీజేపీ విజయం ఎన్నికల్లో గెలుస్తోందని విమర్శించారు.

ప్రిన్స్ హ్యారీని బహిష్కరించబోం: ట్రంప్



వాషింగ్టన్: బ్రిటిష్ రాయల్ ప్రిన్స్ హ్యారీ ఇమ్మిగ్రేషన్ స్టేటస్ చుట్టూ కొనసాగుతున్న చట్టపరమైన సవాళ్ల మధ్య.. మాజీ డ్యూక్ ఆఫ్ ససెక్స్‌ను బహిష్కరించే యోచన లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇప్పటికే హ్యారీకి తన భార్యతో చాలా సమస్యలు ఉన్నాయని, ఆయనను దేశం నుంచి వెళ్లిపొమ్మనే ఆలోచన లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ''నేను అలా చేయదలచుకోలేదు. అతన్ని ఒంటరిగా వదిలేస్తాను. భార్యతో చాలా సమస్యలు ఉన్నాయి. ఆమె చాలా భయంకరమైనది''అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ససెక్స్ మాజీ డ్యూక్ ప్రిన్స్ హ్యారీ, ఆయన భార్య మేఘన్ మార్కెల్ 2020 జనవరిలో బ్రిటిష్ రాజకుటుంబ పదవులను వదులుకొని మేఘన్ సొంత రాష్ట్రం కాలిఫోర్నియాకు మకాం మార్చారు. అప్పటి నుంచి లాభాపేక్షలేని సంస్థను ప్రారంభించి అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు. అయితే హ్యారీ వీసా దరఖాస్తుపై కన్జర్వేటివ్ థింక్‌ట్యాంక్ హెరిటేజ్ ఫౌండేషన్ ఆందోళనలు లేవనెత్తింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రకటన చేశారు. హ్యారీ తన జ్ఞాపకాలలో పేర్కొన్నట్లుగా గత చట్టవిరుద్ధమైన మాదకద్రవ్యాల వాడకాన్ని వెల్లడించలేదని సంస్థ ఆరోపించింది. అమెరికా ఇమ్మిగ్రేషన్ చట్టాల ప్రకారం, గతంలో మాదకద్రవ్యాల వాడకం వీసా అర్హతను ప్రభావితం చేస్తుంది. హ్యారీ ఈ సమాచారాన్ని నిజాయితీగా వెల్లడించారా? అనే దానిపై హెరిటేజ్ ఫౌండేషన్ అనుమానాలు లేవనెత్తింది. యునైటెడ్ స్టేట్స్‌కు వీసాకు దరఖాస్తు చేసే ఎవరైనా నిజాయితీగా ఉండాలని, ప్రిన్స్ హ్యారీ విషయంలో ఇది స్పష్టంగా లేదని హెరిటేజ్ ఫౌండేషన్‌కు చెందిన నైల్ గార్డినర్ తెలిపారు. హ్యారీ బహిష్కరణను ట్రంప్ తోసిపుచ్చినప్పటికీ, వీసా హోదాపై న్యాయపోరాటం అపరిష్కృతంగానే ఉంది.

గతంలోనూ ట్రంప్ విమర్శలు..

ట్రంప్ గతంలోనూ హ్యారీ, మేఘన్‌లపై విమర్శలు చేశారు. బైడెన్ ప్రభుత్వం ఈ జంటకు ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. అంతేకాదు.. హ్యారీపై మేఘన్ కొరడా ఝుళిపిస్తారని హేళన చేశారు. ''పాపం హ్యారీని ముక్కుతో నడిపిస్తున్నారని నేను అనుకుంటున్నాను''అని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌ను మేఘన్ తీవ్రంగా విమర్శించారు. ఆయన విచ్ఛిన్నకర వ్యక్తని, స్త్రీ వ్యతిరేకి అని పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో డాక్యుమెంట్లు లేని వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం మోపిన నేపథ్యంలో ప్రిన్స్ హ్యారీ వీసా అంశం కూడా తెరపైకి వచ్చింది.

స్వదేశానికి చేరుకున్న థాయ్ బందీలు

బ్యాంకాక్: 500 రోజులపాటు హమాస్ చెరలో ఉన్న థాయ్‌లాండ్ వ్యవసాయ కార్మికులు స్వదేశానికి చేరుకున్నారు. 2023 అక్టోబర్లో జరిగిన దాడుల్లో దక్షిణ ఇజ్రాయెల్‌లో పనిచేస్తున్న పొంగ్సాక్ థేన్నా, సతియాన్ సువన్నాఖమ్, వాచరా శ్రీవూన్, బన్నావత్ సేథావో, సురసాక్ లామ్నావోలను కూడా హమాస్ అపహరించింది. ఎట్టకేలకు వారు ఆదివారం ఉదయం బ్యాంకాక్‌కు చేరుకున్నారు. సువర్ణభూమి ఎయిర్‌పోర్టులో దిగిన ఐదుగురు కుటుంబాలను కలుసుకోవడంతో విమానాశ్రయంలో భావోద్వేగ వాతావరణ నెలకొంది. కాగా, వారు మళ్లీ తిరిగి ఇజ్రాయెల్‌కు వెళ్లకుండా ఉండేందుకు నెలకు 725 పౌండ్ల వేతనంతో పాటు సుమారు 14,510 పౌండ్లను ఒకేసారి ఇవ్వనున్నట్లు థాయ్ కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే.. ఒక థాయ్ బందీ ఆచూకీ లభించలేదు. గాజాలో ఇంకా ఉన్న ఆరో థాయ్ బందీ విడుదల కోసం ప్రయత్నిస్తామని, గెలుస్తామనే ఆశ ఉందని విదేశాంగ మంత్రి సంగియంపోంగ్సా అన్నారు. అక్టోబర్ 2023 నుంచి మొత్తం 46 మంది థాయ్ కార్మికులు మరణించారు. వీరిలో ఎక్కువ మంది హమాస్ దాడిలో, కొందరు హెజ్‌బొల్లా ప్రయోగించిన క్షిపణుల వల్ల మరణించారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా జనవరి 30న విడుదలయ్యారు. అయితే 10 రోజులపాటు వారికి ఇజ్రాయెల్ ఆసుపత్రిలోనే ఉంచి ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. అనంతరం స్వస్థలాలకు పంపించారు. బ్యాంకాక్ చేరుకున్న అనంతరం బందీలు మీడియాతో మాట్లాడారు. ''ఈ ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. మేం ఇక్కడ నిలబడానికి సహాయం చేసిన అధికారులందరికీ కృతజ్ఞతలు. స్వదేశానికి తిరిగి వచ్చినందుకు సంతోషంగా ఉన్నాం''అని చెప్పారు. తమవారిని మళ్లీ ఇంటికి దూరంగా పంపించాలనుకోవడం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.



తమ వారిని ఆలింగనం చేసుకుని బందీల ఆనంద బాష్పాలు



ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆదివారం తేజస్ విమానంలో కలిసి ప్రయాణించి చరిత్ర సృష్టించారు. నేషనల్ డిఫెన్స్ అకాడెమీలో వీరు బ్యాచ్‌మేట్లు కావడం విశేషం. వాయు, పదాతి దళాధిపతులు ఇలా కలిసి యుద్ధ విమానంలో ప్రయాణించడం ఇదే తొలిసారి.

నేటి నుంచి ఏరో ఇండియా

మొదటిసారిగా ఎస్‌యూ-57, ఎఫ్-35ల విన్యాసాలు

న్యూఢిల్లీ: ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్ షో 'ఏరో ఇండియా'15వ ఎడిషన్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు బెంగళూరు సమీప యలహంకలోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఇందుకు వేదిక కానుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రారంభించే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ప్రపంచంలోనే అత్యంత అధునాతన ఐదో తరం యుద్ధ విమానం రష్యా తయారీ ఎస్‌యూ–57, అమెరికాకు చెందిన ఎఫ్–35 లైట్నింగ్ 2 ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ వివరాలను ఆదివారం రక్షణ శాఖ వెల్లడించింది. మొత్తం 42 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 150 విదేశీ కంపెనీలు సహా మొత్తం 900 ఎగ్జిబిటర్లతో అతిపెద్ద ఏరో ఇండియా కార్యక్రమంగా నిలవనుంది. ఈ ఎడిషన్‌ను 'ది రన్ వే టు ఎ బిలియన్ అపార్చునిటీస్'అనే ఇతివృత్తంతో చేపట్టినట్లు రక్షణ శాఖ తెలిపింది . ఇందులో 90 వరకు దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని వివరించింది. సుమారు 30 దేశాల రక్షణ మంత్రులు, వారి ప్రతినిధులతో పాటు మరో 43 దేశాల నుంచి వైమానిక దళాధిపతులు, కార్యదర్శులు హాజరవుతున్నారని తెలిపింది.

పొట్టలో రూ.26 కోట్ల విలువైన కొకైన్

ఇద్దరు విదేశీయుల అరెస్ట్

డ్రగ్ నెట్‌వర్క్ ప్రమేయంపై దర్యాప్తు

న్యూఢిల్లీ: మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు విదేశీయులను కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. రూ.26 కోట్ల విలువైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జనవరి 24న ఢిల్లీ విమానాశ్రయంలో అరెస్టు చేసి... అనంతరం కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు ఆదివారం వెల్లడించారు. జనవరి 24న సావోపాలో నుంచి వచ్చిన బ్రెజిల్ మహిళ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ తనిఖీలను తప్పించుకొనేందుకు గ్రీన్ చానల్ దాటుతుండగా పట్టుకున్నారు. డ్రగ్స్ క్యాప్సూల్స్ తీసుకున్నట్లు విచారణలో అంగీకరించడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసి 100 క్యాప్సూల్స్‌ను బయటకు తీశారు. వాటిలో కొకైన్‌గా అనుమానిస్తున్న తెల్లటి పొడి ఉన్నట్లు తేలింది. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ బరువు 802 గ్రాములు కాగా, వీటి విలువ రూ.12.03 కోట్లు ఉంటుందని అంచనా.

అదే రోజు అడిస్ అబాబా నుంచి వస్తున్న కెన్యా ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు అడ్డుకున్నారు. విచారణలో కొకైన్ క్యాప్సూల్స్ మింగినట్లు అంగీకరించాడు. అతడిని కూడా ఆస్పత్రికి తరలించి మొత్తం 70 క్యాప్సూల్స్‌ను బయటకు తీశారు. క్యాప్సుల్స్‌లో 996 గ్రాముల హై ప్యూరిటీ కొకైన్ ఉన్నట్లు గుర్తించారు. రూ.14.94 కోట్ల విలువైన డ్రగ్స్‌గా గుర్తించారు. ఇద్దరినీ అరెస్టు చేసి.. ఈ ఆపరేషన్ వెనుక ఉన్న మాదకద్రవ్యాల సిండికేట్‌పై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



ఆదివారం ఢిల్లీలోని చాణక్యపురి శాంతిపథ్‌లో జరిగిన తులిప్ వేడుకలో ఫొటోలు తీసుకుంటున్న ఓ సందర్శకురాలు

వేధిస్తాడు.. మొరటోడు

ట్రంప్‌పై నటుడు రిచర్డ్ గెరె వ్యాఖ్యలు



వాషింగ్టన్: అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిపాలనా విధానాలను ప్రముఖ హాలీవుడ్ నటుడు రిచర్డ్ గెరె తీవ్రంగా తప్పుబట్టారు. ఇటీవల స్పెయిన్‌లో 'గోయా'అవార్డ్‌ల ప్రదానోత్సవంలో రిచర్డ్‌కు జీవితకాల సాఫల్యత పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా రిచర్డ్ మాట్లాడుతూ ట్రంప్ విధాన నిర్ణయాలు, ట్రంప్ చుట్టూ ఉన్న నేతాగణాన్ని ప్రస్తావించారు. గిరిజనులు అడవుల్లో గిరిజనేతరుల ఆధిపత్యాన్ని కోరుకోరు అనే అర్థంలో మాట్లాడుతూ.. ''ఇప్పుడో అనాలోచిత ట్రైబలిజం అమెరికాలో మొదలవుతోంది. ఇతరులతో పోలిస్తే మేం ప్రత్యేకం అన్న ధోరణి పెరుగుతోంది. అలాంటి ఆలోచనలను తుంచేయాల్సిన ప్రజాప్రతినిధులే ఈ ఆలోచనలకు అంటుకట్టడం విషాదకరం. ఇప్పుడు అమెరికాలో చీకటిరోజులు మొదలయ్యాయి. అందర్నీ అవహేళన చేస్తూ వేధించే మొరటు మనిషి ట్రంప్ ఏలుబడిలో ఉన్నాం. ఈయన విషయంలో ఒక్క అమెరికాలో మాత్రమే కాదు యావత్ ప్రపంచదేశాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన తరుణమిది. అధికారం, పెట్టుబడిదారుల సంకర వివాహమిది. బాధ్యతారాహిత్యంతో ప్రభుత్వ ఖజానానే దోచేసే బడా పారిశ్రామికవేత్తలు, సంపన్నులు కొలువైన ప్రభుత్వమిది. ఇది మానవళికే ప్రమాదకరం. ఇతరుల పట్ల దయ లేని పరిణతి సాధించని సంపన్న మూకలు ట్రంప్ చుట్టూ చేరారు. ఇలాంటి వ్యక్తుల కలయిక ఎంతో వినాశకరం''అని రిచర్డ్ ఆందోళన వ్యక్తంచేశారు. అమెరికాలో ఉండే రిచర్డ్ ఇటీవలే తన భార్య అలెజాండ్రా సిల్వాతో కలిసి స్పెయిన్‌కు మకాం మార్చారు.

ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమే అని తీర్పునిచ్చిన కేసు?

ప్రవేశిక - విమర్శనాత్మక పరిశీలన

వివాదాలు - సుప్రీంకోర్టు తీర్పులు

రాజ్యాంగ సారాంశం మొత్తం ప్రవేశికలో నిక్షిప్తమై ఉంటుంది. ఇది రాజ్యాంగంలో అంతర్భాగమా, కాదా అనే అంశంపై సుప్రీంకోర్టు భిన్నమైన తీర్పులను వెలువరించింది.

1960లో బెరుబారి వర్సెస్ యూనియన్ కేసులో సుప్రీంకోర్టు ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని పేర్కొంది. ఈ సందర్భంలో ప్రకరణ 143 ప్రకారం సలహా పూర్వక అభిప్రాయాన్ని చెప్పింది. కానీ 1973లో కేశవానంద భారతి కేసులో తీర్పునిస్తూ దీనికి పూర్తి భిన్నంగా.. ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమేనని వ్యాఖ్యానించింది. 1995లో ఎల్ఐసీ ఆఫ్ ఇండియా కేసులో కూడా అత్యున్నత ధర్మాసనం ఇదే అభిప్రాయాన్ని పునరుద్ఘాటించింది.

రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశికపై ఓటింగ్ నిర్వహించినప్పుడు కూడా 'ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం' అని డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు స్థిరీకరించింది.

ప్రవేశిక ప్రయోజనం

ప్రవేశిక రాజ్యాంగ ఆత్మ, హృదయం. ఇది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను తెలుసుకోవడానికి ఆధారం. ఇది రాజ్యాంగానికి సూక్ష్మరూపం (Constitution in Miniature). ఇందులో రాజ్యాంగ తాత్విక పునాదులు ఉన్నాయి.

ప్రయోజనాలు

- ఇది రాజ్యాంగ ఆధారాలను తెలుపుతుంది.
- రాజ్యాంగ ఆమోద తేదీని తెలుపుతుంది.
- రాజ్యాంగాన్ని సక్రమంగా వ్యాఖ్యానించడానికి న్యాయస్థానాలకు చట్టపర సహాయకారిగా ఉపయోగపడుతుంది.

విమర్శ

- ప్రవేశికకు న్యాయ సంరక్షణ (Non-Justiciable) లేదు. ఇందులో పేర్కొన్న ఆశయాలను అమలు పరచకపోతే న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవు.
- ఇందులో పేర్కొన్న భావజాలానికి నిర్దిష్ట నిర్వచనాలు లేవు.
- హక్కుల ప్రస్తావన లేదు.
- శాసనాధికారాలకు ఇది ఆధారం కాదు.
- సమకాలీన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో ప్రవేశికలోని కొన్ని ఆదర్శాలు అమలుకు నోచుకోవట్లేదని చెప్పవచ్చు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రవేశిక - పరిశీలన

భారత రాజ్యాంగానికి హృదయం, ఆత్మగా పరిగణిస్తున్న ప్రవేశిక ప్రాముఖ్యంపై భిన్న అభిప్రాయాలున్నాయి. ప్రవేశికకు న్యాయ సంరక్షణ లేదు. అంటే ఇందులో పొందుపర్చిన ఆశయాలు, లక్ష్యాలు స్వతంత్రంగా అమల్లోకి రావు. వాటిని అమలుపరచాలని పౌరులు న్యాయస్థానాన్ని ఆశ్రయించలేరు. ఆ విధంగా న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేయలేవు. కాబట్టి అత్యంత పవిత్రమైన ఈ ఆశయాలకు ఆచరణ లేదా అమలు చేయకపోవడం వల్ల వాటి సార్థకతపై తీవ్ర విమర్శ ఉంది. అయితే రాజ్యాంగంలోని ప్రకరణల భావం లేదా ఆచరణీయతపై సక్రమంగా వ్యాఖ్యానించడానికి ప్రవేశికలోని సారాంశాన్ని న్యాయస్థానాలు ప్రాతిపదికగా తీసుకుంటాయి. ప్రవేశికకు స్వతంత్రంగా ప్రాముఖ్యం లేకపోయినా, ఇందులోని ఆదర్శాలను అమలు చేస్తూ పార్లమెంటు చట్టం చేసినప్పుడు లేదా ఆ విధంగా చేసిన చట్టాలను అమలు చేయనప్పుడు, న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు.

ప్రవేశికపై ప్రముఖుల అభిప్రాయాలు

- ప్రవేశిక అనేది భారత ప్రజాస్వామ్య గణతంత్రానికి రాజకీయ జాతకం (Political Horoscope) -కె.యం. మున్షీ
- రాజ్యాంగంలో ప్రవేశిక అత్యంత పవిత్ర మైన భాగం. ఇది రాజ్యాంగ ఆత్మ. రాజ్యాంగానికి తాళంచెవి లాంటిది. - పండిట్ ఠాకూర్‌దాస్ భార్గవ
- రాజ్యాంగానికి ప్రవేశిక ఒక గుర్తింపు పత్రం లాంటిది. - ఎం.ఎ. నాని పాల్కీవాలా
- రాజ్యాంగానికి ప్రవేశిక కీలక సూచిక లాంటిది. అలాంటి సూచికలు సాధారణంగా పాశ్చాత్య రాజ్య వ్యవస్థలో ఉంటాయి. ఇది భారత రాజ్యాంగంలో ఉన్నందుకు నేను పులకించి గర్వపడుతున్నాను. - సర్ ఎర్నస్ట్ బార్కర్
- ప్రవేశిక మన కలలు, ఆలోచనలకు రాజ్యాంగంలో వ్యక్తీకరించుకున్న అభిమతం. - అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
- భారత రాజ్యాంగ ప్రవేశిక అమెరికా స్వతంత్ర ప్రకటన మాదిరిగానే రాజ్యాంగ ఆత్మ. రాజకీయ వ్యవస్థ స్వరూపం, పవిత్ర నిర్ణయాన్ని తెలియజేస్తుంది. విప్లవం తప్ప మరొకటి దీన్ని మార్చలేదు. - జస్టిస్ హిదయతుల్లా
- ప్రవేశిక ఒక నిశ్చితమైన తీర్మానం, హామీ. - నెహ్రూ
- రాజ్యాంగ ప్రాధాన్యాల లక్షణ సారం ప్రవేశిక. - మథోల్కర్
- ప్రవేశిక అనేది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను, లక్ష్యాలను తెలుసుకోవడానికి ఒక తాళం చెవి లాంటిది. - జి. దయ్యర్
- ప్రవేశిక రాజ్యాంగానికి ఆధారం కాదు, అలాగే పరిమితి కాదు. - సుప్రీంకోర్టు

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రవేశిక భావాన్ని మన రాజ్యాంగకర్తలు ఏ దేశ రాజ్యాంగం నుంచి తీసుకున్నారు?
   ఎ) యు.ఎస్.ఎ. బి) యు.కె.
   సి) యు.ఎస్.ఎస్.ఆర్. డి) జర్మనీ
2. భారత రాజ్యాంగంలోని రిపబ్లిక్ అనే పదాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
   ఎ) ఫ్రెంచి రాజ్యాంగం
   బి) జర్మనీ రాజ్యాంగం
   సి) యు.ఎస్. రాజ్యాంగం
   డి) యు.కె. రాజ్యాంగం
3. రాజ్యాన్ని మతం నుంచి వేరు చేయడాన్ని ఏమంటారు?
   ఎ) నాస్తికవాదం బి) సామ్యవాదం
   సి) లౌకికవాదం డి) సాంఘికన్యాయం
4. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ అధికారాలను పరిమితం చేసేది?
   ఎ) ప్రజలు బి) రాజ్యాంగం
   సి) పార్లమెంటు డి) పత్రికలు

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) సి; 4) బి.

మాదిరి ప్రశ్నలు

1. ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగం అని, అదేవిధంగా కాదనీ పరస్పర వివాదాస్పదమైన తీర్పులను సుప్రీంకోర్టు ఏయే కేసుల్లో వ్యక్తీకరించింది?
   ఎ) ఎ.కె.గోపాలన్, గోలక్‌నాథ్
   బి) కేశవానంద భారతి, గోలక్‌నాథ్
   సి) మేనకాగాంధీ, మినర్వా మిల్స్
   డి) పైవేవీ కాదు
2. ప్రవేశిక నుంచి ఏం రాబట్టవచ్చు?
   ఎ) రాజ్యాంగానికి ఆధారం
   బి) రాజకీయ వ్యవస్థ లక్ష్యాలు
   సి) ప్రభుత్వ స్వరూపం డి) పైవన్నీ
3. సమగ్రత అనే పదజాలాన్ని ప్రవేశికలోకి చేర్చడానికి కారణం?
   ఎ) ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగం
   బి) వేర్పాటువాద ఉద్యమాలు
   సి) సుప్రీంకోర్టు తీర్పులు డి) ఎ, సి
4. ప్రవేశికలో సమకాలీన ప్రాముఖ్యతను, వివాదాన్ని సంతరించుకున్న పదాలు?
   ఎ) లౌకికతత్వం, సామ్యవాదం
   బి) ఐక్యత, సమగ్రత
   సి) గణతంత్రం, సార్వభౌమాధికారం
   డి) పైవన్నీ
5. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ ప్రవేశికలో చేర్చిన పదాలేవి?
   ఎ) సామ్యవాద, లౌకిక
   బి) ప్రజాస్వామిక
   సి) సార్వభౌమ డి) రిపబ్లిక్
6. భారత రాజ్యాంగంలో సంక్షేమ రాజ్యం అనే భావనను ఎక్కడ పొందుపరిచారు?
   ఎ) ప్రాథమిక హక్కులు
   బి) పీఠిక
   సి) రాజ్య విధానం - ఆదేశిక సూత్రాలు
   డి) నాలుగో షెడ్యూల్
7. కింది వాటిలో భారత రాజ్యాంగంలోని సమాఖ్య లక్షణాలు?
   i) దృఢ రాజ్యాంగం
   ii) ద్విసభా విధానం
   iii) సి.ఎ.జి. కార్యాలయం
   iv) సమష్టి బాధ్యత
   ఎ) i, ii, iii బి) i, iv
   సి) i, ii, iii, iv డి) i, ii
8. 'రాజ్యాంగానికి ప్రవేశిక ఒక గుర్తింపు పత్రం లాంటిది' అని పేర్కొన్నవారు?
   ఎ) జస్టిస్ హిదయతుల్లా
   బి) అంబేద్కర్
   సి) మహాత్మాగాంధీ
   డి) ఎం.ఎ. నాని పాల్కీవాలా
9. ప్రవేశిక-గ్రహించిన అంశాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత?
   ఎ) ప్రజాస్వామ్యం - అమెరికా
   బి) గణతంత్రం - ఫ్రాన్స్
   సి) సామ్యవాదం - రష్యా
   డి) లౌకిక - బ్రిటన్
10. సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని తీర్పునిచ్చింది?
    ఎ) కేశవానంద భారతి కేసు
    బి) బెరుబారి వర్సెస్ యూనియన్ కేసు
    సి) ఎస్.ఆర్. బొమ్మాయ్ కేసు
    డి) మినర్వా మిల్స్ కేసు

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) ఎ; 5) ఎ; 6) సి; 7) డి; 8) డి; 9) డి; 10) బి.

ప్రవేశిక - సుప్రీంకోర్టు తీర్పులు వివాదం	సంవత్సరం	సుప్రీంకోర్టు తీర్పు సారాంశం
ఎ.కె. గోపాలన్ కేసు	1950	ప్రవేశిక రాజ్యాంగ ప్రకరణల అర్థాన్ని, పరిధిని నియంత్రిస్తుంది.
బెరుబారి వర్సెస్ యూనియన్ కేసు	1960	ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదు.
గోలక్‌నాథ్ కేసు	1967	ప్రవేశిక రాజ్యాంగ ఆదర్శాలకు, ఆశయాలకు సూక్ష్మ రూపం.
కేశవానంద భారతి కేసు	1973	ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగమే. మౌలిక నిర్మాణం పరిధిలోకి వస్తుంది. పరిమితంగా సవరించవచ్చు.
ఎక్సెల్ వేర్ కేసు	1979	సామ్యవాదం పద నిర్వచనం.
నకారా కేసు	1983	సామ్యవాదం అనేది గాంధీయిజం, మార్క్సిజం కలయిక.
ఎస్.ఆర్.బొమ్మాయ్ కేసు	1994	లౌకికతత్వం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది.
ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా	1995	ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగమని పునరుద్ఘాటించింది.
అశోక్‌కుమార్ గుప్తా కేసు	1997	సామాజిక న్యాయం అనేది ప్రాథమిక హక్కు.
అరుణా రాయ్ కేసు	2002	విద్యా సంస్థల్లో మత విలువల బోధన లౌకికతత్వానికి వ్యతిరేకం కాదు.

వెయ్యి స్తంభాల గుడిని నిర్మించింది ఎవరు?

తొలి కాకతీయులు

తొలి కాకతీయులు (కాకతీయ వంశంలోని ఆదిపురుషులు) రాష్ట్రకూటుల సేనానులుగా తెలంగాణకు వచ్చారని పీవీ పరబ్రహ్మశాస్త్రి నిరూపించారు. వీరు తమ పేరు చివరన రాష్ట్రకూట నామాన్ని (గుండియ రాష్ట్రకూట, ఎర్రయ రాష్ట్రకూట) ధరించేవారు. రాష్ట్రకూటుల రాజ చిహ్నమైన 'గరుడ'(గరుడబేతయ)ను తమ పతాకాలపై ఉంచుకునేవారు. రాష్ట్రకూటుల ఆస్థాన మతమైన జైనాన్ని అవలంబించడం, వారి వృష్టి వంశాన్నే తమ వంశంగా చెప్పుకోవడం లాంటి కారణాల వల్ల కాకతీయులు రాష్ట్రకూట వంశస్థులేనని స్పష్టమవుతోంది. స్థానిక (తెలంగాణ) బోయ, పుళింద జాతులవారు జైనమతం ద్వారా సాంఘికోన్నతి సాధించి రాష్ట్రకూటుల వద్ద సైనికోద్యోగులుగా చేరి క్రమంగా సామంతులయ్యారనే అభిప్రాయమూ ఉంది.

ఈ వంశానికి ఆద్యుడైన వెన్నరాజు (క్రీ.శ. 750 -768) రాష్ట్రకూట సేనాని, సామంతుడు. ఆదిలాబాద్ పశ్చిమప్రాంతం, బాసర, ముథోల్, కుబేరు (కుబీర్), భైంసా(మహిషా) ప్రాంతాలు ఇత ని రాజ్యంలో ఉండేవి. ఇతడి తర్వాత మొదటి గుండరాజు (క్రీ.శ.768-824), రెండో గుండరాజు (క్రీ.శ.824- 870), మూడో గుండరాజు (క్రీ.శ.870 - 895) రాష్ట్రకూటుల సేనానులుగా, సామంతులుగా పనిచేశారు. వీరి కాలం తదితర విషయాల్లో చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి.

ఎర్రయరాజు (895-940)


ఈ వంశంలో మొదటి నలుగురి తర్వాత ఎర్రయరాజు (క్రీ.శ.895-940) కూడా రాష్ట్రకూటుల సేనానిగా కురవాడి సీమను పాలించాడు. వేంగి చాళుక్యులకు లోబడి ముదిగొండ చాళుక్యులు పాలించిన నేటి ఖమ్మం, వరంగల్ జిల్లాలోని కొరవి ప్రాంతమే కురవాడి సీమ. ముదిగొండ చాళుక్యులను తరిమేసి రాష్ట్రకూటులు ఎర్రయరాజును ఈ ప్రాంతానికి సామంతుడిగా నియమించారు. అయితే క్రీ.శ.934లో ముదిగొండ చాళుక్యులు ఆ ప్రాంతాన్ని తిరిగి ఆక్రమించారు. ఎర్రయ కొడుకు బేతియకు పెద్ద ప్రాధాన్యం లేదు. తర్వాత బేతియ కొడుకు నాలుగో గుండరాజు(క్రీ.శ.955-990) రాష్ట్రకూటుల సేనానిగా నియమితుడై కొరవిసీమను తిరిగి ఆక్రమించాడు. తూర్పు చాళుక్యులైన రెండో అమ్మరాజు, దానార్ణవుడి మధ్య కుటుంబ కలహాలు తలెత్తాయి. నాలుగో గుండరాజు దానార్ణవుడి పక్షం వహించి కొరవిసీమను పొందాడు.

క్రీ.శ.973లో కల్యాణీ చాళుక్య రెండో తైలపుడు రాష్ట్రకూట రాజ్యాన్ని ఆక్రమించాడు. దీంతో తైలపుణ్ని ఆశ్రయించిన ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజు.. విరియాల ఎర్రసేనాని ద్వారా తిరిగి కొరవిసీమను పొందగలిగాడు. దీంతో కాకతీయులు గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. కానీ తన భార్య విరియాల కామసాని వినతి మేరకు ఎర్రసేనాని కల్యాణీ చాళుక్య చక్రవర్తిని ఒప్పించి మొదటి బేతరాజు(క్రీ.శ.992-1052)ను అనుమకొండ విషయపాలకుడిగా నియమించాడు. కామసాని మొదటి బేతరాజు (గరుడ బేతరాజు) మేనత్త, గుండరాజు సోదరి.

మొదటి ప్రోలరాజు

బేతరాజు కల్యాణీ చాళుక్య సామంతుడిగా స్థిరపడ్డాడు. ఇతడి రాజ్యం కొరివిసీమ సరిహద్దు నుంచి కరీంనగర్ మండలంలో ఉన్న శనిగరం వరకు వ్యాపించింది. బేతరాజు తర్వాత అతడి కొడుకు మొదటి ప్రోలరాజు (క్రీ.శ.1052-1076) రాజ్యానికొచ్చాడు. ఇతడు వేములవాడ చాళుక్యరాజు భద్రగుణ్ణి (మూడో బద్దెగుడు) ఓడించి సబ్బిసాయర మండలం(కరీంనగర్ ప్రాంతం)లోని కొన్ని ప్రాంతాలను జయించాడు. అనుమకొండ విషయాన్ని మొదటి బేతరాజు తొలుత పొందినప్పటికీ శాశ్వతమాన్యంగా పొందింది మాత్రం ప్రోలరాజే.

ప్రోలుడు చిత్రకూటలో అరాచకత్వాన్ని అణచివేయడం, బద్దెగుణ్ని జయించడం, కొంకణంపై విజయం సాధించడం వల్ల అతడి శౌర్యప్రతాపాలకు గుర్తింపుగా చక్రవర్తి అనుమకొండను శాశ్వతమాన్యంగా ఇచ్చాడు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

రెండో బేతరాజు

ఒకటో సోమేశ్వరుడు క్రీ.శ.1068లో మరణించాడు. తర్వాత చక్రవర్తిగా వచ్చిన రెండో సోమేశ్వరుణ్ని తొలగించి అధికారంలోకి రావాలని ఆరో విక్రమాదిత్యుడు వీలైనంత మంది మాండలికులను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేశాడు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రోలుడు, అతడి కుమారుడు రెండో బేతరాజు.. ఆరో విక్రమాదిత్యుడికి అండగా నిలిచారు. అది ప్రోలుడి తర్వాత రాజైన రెండో బేతరాజు (క్రీ.శ.1076-1108)కు ఉపయోగపడింది. పారమార జగద్దేవుడు స్వాతంత్ర్యం ప్రకటించుకోవడమూ దీనికి దోహదం చేసింది. జగద్దేవుడి నుంచి సబ్బి సహస్రం మొత్తాన్ని విక్రమాదిత్యుడు బేతరాజుకు ఇచ్చినట్లు పద్మాక్షి ఆలయ శాసనం ద్వారా తెలుస్తోంది. శనిగరం ప్రాంతంతోపాటు సబ్బి సహస్రం కాకతీయ రాజ్యంలో చేరాయి. ముదిగొండ చాళుక్యుల రాజ్యంలోని కొన్ని భాగాలు కూడా ఇతడి రాజ్యంలో చేరాయి. ఇతడు అనుమకొండలో బేతేశ్వరాలయాన్ని, తన తండ్రి పేరుతో ప్రోలేశ్వరాలయాన్ని నిర్మించాడు.

రెండో ప్రోలరాజు

బేతరాజు తర్వాత ఇతడి పెద్ద కొడుకు దుర్గరాజు (క్రీ.శ.1108-క్రీ.శ.1116) రాజయ్యాడు. పదవీచ్యుతుడైన కొలనుపాక రాజు జగద్దేవుని ప్రోత్సాహంతో పాలవాస పాలకుడు మేడరాజు స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో పారమార జగద్దేవుని స్థానంలో కుమార సోమేశ్వరుడు(క్రీ.శ.1108-1125) కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడయ్యాడు. ఈ తిరుగుబాట్లను అణచడానికి కుమార సోమేశ్వరుడికి అండగా నిలిచిన రెండో ప్రోలరాజు(క్రీ.శ.1116-1157) జగద్దేవుడిని పారదోలి సోదరుడు దురరాజును పదవీచ్యుతుణ్ని చేసి సింహాసనం అధిష్ఠించాడు. చాళుక్య చక్రవర్తుల నుంచి స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించిన సామంతులందరితో యుద్ధం చేసి ఓడించాడు. ఈ రకంగా తెలంగాణ మొత్తాన్ని జయించి కల్యాణీ చాళుక్య ప్రతాపచక్రవర్తి రెండో జగద్దేకమల్లుడు (క్రీ.శ.1138 -1150)కి విధేయుడిగా ఉన్నాడు.

రెండో ప్రోలరాజు విజయాలు

కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడైన కుమార సోమేశ్వరుడు తన తండ్రి విక్రమాదిత్యుడి అనంతరం క్రీ.శ.1126లో మూడో సోమేశ్వరుడిగా రాజ్యానికొచ్చాడు. అంతకుముందు నుంచే కందూరునాడును పాలిస్తున్న యువరాజు కుమార తైలపుడు (క్రీ.శ.1110-1137) తన సోదరుడు మూడో సోమేశ్వరుడికి వ్యతిరేకంగా దక్షిణ తెలంగాణలో స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఈ ప్రయత్నంలోనే మూడో సోమేశ్వరుడికి అనుకూలుడైన కందూరి చోడ మొదటి గోకర్ణుడిని చంపించి కందూరునాడును శ్రీదేవి తొండయ, గోవింద దండేశులకు పంచి సామంతులుగా చేసుకున్నాడు. దీంతో మొదటి గోకర్ణుడి కుమారుడు రెండో ఉదయచోడుడు మూడో సోమేశ్వరుణ్ని ఆశ్రయించాడు. సోమేశ్వరుడి ఆదేశంతో రెండో ప్రోలుడు శ్రీదేవి తొండయ, గోవింద దండేశులను ఓడించి ఉదయచోడుడికి(క్రీ.శ.1131-36) పట్టం కట్టాడు. ఈ రకంగా దక్షిణ తెలంగాణ మీద ప్రోలుడు ఆధిక్యం సాధించాడు.

తన అనుయాయుల ఓటమిని జీర్ణించుకోలేని తైలపుడు కాకతీయుల ఉత్తర సరిహద్దులో ఉన్న పాలవాస రాజైన మేడరాజును, అతడి తమ్ముడు గుండరాజును ప్రేరేపించాడు. అప్పటికే వీరు చాళుక్య చక్రవర్తుల పట్ల అవిధేయులుగా ఉన్నారు. రెండో జగద్దేకమల్లుడి(క్రీ.శ.1138-1150) పక్షాన నిలబడి ప్రోలరాజు గుండనను సంహరించాడు. గుండన కుటుంబానికి చెందిన ఏడో రాజును పారదోలాడు. ఈ విజయంతో ప్రోలరాజు ఉత్తర తెలంగాణ మీద ఆధిక్యత సాధించాడు. చక్రవర్తి పక్షాన కుమార తైలపుడిని ఓడించాడు. ఈ విజయోత్సాహంతో కృష్ణానది దాటి శ్రీశైలంలో విజయస్తంభం నాటించాడు. తెలంగాణపై ఆధిక్యం సాధించాక తీరాంధ్రను జయించే ప్రయత్నంలో మరణించాడు. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని ఇతడే ప్రారంభించాడు. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ప్రోలరాజు భార్య. వీరి కుమారులు.. రుద్రదేవుడు, మహాదేవుడు, హరిహరుడు, గణపతి, రేపాల్ల దుర్గరాజు. తండ్రి మరణానంతరం పెద్దకుమారుడైన రుద్రదేవుడు(క్రీ.శ.1158-క్రీ.శ.1195) రాజ్యానికొచ్చాడు.

మూడు సామంత రాజ్యాలు

కాకతీయ రాజ్య పరిసరాల్లో మూడు సామంత రాజ్యాలు ఉండేవి. తూర్పున ముదిగొండ చాళుక్యులు, వాయవ్యంగా కరీంనగర్ జిల్లాలో పొలవాస నాయకులు, దక్షిణాన కందూరు చోడులు ఉండేవారు. అనుమకొండ విషయానికి పశ్చిమాన ఉన్న ప్రాంతం రాజు ప్రత్యక్ష ఆధీనంలో ఉండేది. అనుమకొండకు నైరుతి దిశగా కొలనుపాక కేంద్రంగా రాజప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పాలించేవారు. ప్రోలరాజు వీరిపై ఆధిక్యత సాధించిన సందర్భంలో రుద్రదేవుడు సింహాసనం అధిష్ఠించాడు.

రుద్రదేవుడు

తైలపుడు తన సోదరుడు జగదేక మల్లుని పదవీచ్యుత్యుణ్ని చేసి అధికారంలోకి వచ్చాడు. కాబట్టి పరబ్రహ్మ శాస్త్రి పేర్కొన్న తైలపుడు ఈ మూడో తైలపుడు కావడానికే ఎక్కువ అవకాశం ఉంది. పదవీభ్రష్టులైన కల్యాణీ చాళుక్య రాజులు తమ పూర్వవైభవాన్ని తిరిగి సంతరించుకోలేరని నిర్ణయించుకున్న రుద్రదేవుడు క్రీ.శ.1162/3లో సార్వభౌమత్వాన్ని ప్రకటించుకున్నాడు. తెలంగాణలో తిరుగులేని ప్రభువుగా మారిన తర్వాత తీరాంధ్రపై దృష్టి పెట్టాడు.

వేయి స్తంభాల గుడి

రుద్రదేవుడు(క్రీ.శ.1158-క్రీ.శ.1195) తన తండ్రిని చంపిన వెలనాటి రాజుపై మొదట విజృంభించాడు. పల్నాటి యుద్ధంలో నలగామరాజుకు సహాయపడ్డాడు. ధాన్యకటకాన్ని స్వాధీనం చేసుకున్నాడు. దుర్జయులను ఓడించి త్రిపురాంతకాన్ని జయించాడు. క్రీ.శ.1186 నాటికి తీరాంధ్రను గెలిచాడు. ఈ రకంగా రుద్రదేవుడు కాకతీయ సామ్రాజ్యానికి గట్టి పునాదులు వేశాడు. ఈ విజయాల్లో సహాయం చేసిన రేచర్ల బేతిరెడ్డికి నల్లగొండ జిల్లాలోని ఆమనగల్లును, చెరకు రెడ్లకు జమ్ములూరును ఇచ్చాడు. ఇతడి రాజ్యం ఉత్తరాన గోదావరి, పశ్చిమాన బీదరు, దక్షిణాన శ్రీశైలం, తూర్పున సముద్రం వరకు విస్తరించిందని వేయి స్తంభాల గుడి శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రదేవుడు ఓరుగల్లు కోట నిర్మాణాన్ని కొంతమేర పూర్తిచేశాడు. రుద్రేశ్వర దేవాలయాన్ని కట్టించాడు. ఇదే వేయి స్తంభాల గుడి.

మహాదేవుడు

రుద్రదేవుడికి కుమారులు లేకపోవడం వల్ల తమ్ముడు మహాదేవుడు(క్రీ.శ.1195-1198) రాజ్యానికి వచ్చాడు. ఇతడు జైతుగి (క్రీ.శ.1192-1200) కాలంలో యాదవరాజ్యం మీద చేసిన యుద్ధంలో మరణించాడు. మహాదేవుని భార్య రాణి బయ్యాంబ. గణపతిదేవుడు, మైలాంబ, కుందమాంబ వీరి సంతానం. యాదవరాజులు గణపతిని బంధించారు. ఇదే అదనుగా ముదిగొండ చాళుక్యులు, వెలనాటి చోళులు, చోళరాజులు కాకతీయ సామ్రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించారు. కానీ సామంతసేనానైన రేచర్ల రుద్రారెడ్డి(రుద్రసేనాని) మిగతా సేనానులు, సామంతులైన విరియాల, మాల్యాల సహాయంతో వీరిని ఓడించినట్లు పాలంపేట శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రసేనాని గణపతిదేవుడిని విడిపించి క్రీ.శ.1199లో కాకతీయ రాజ్య పట్టాభిషిక్తుడిని చేశాడు.

మాదిరి ప్రశ్నలు

1. కాకతీయ వంశానికి ఆద్యుడు?
   1) గణపతిదేవుడు 2) మొదటి గుండన
   3) వెన్నరాజు 4) మొదటి బేతరాజు
2. ఓరుగల్లు కోట నిర్మాణానికి పునాదులు వేసినవాడు?
   1) మొదటి ప్రోలరాజు
   2) రెండో ప్రోలరాజు
   3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
3. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ఎవరి భార్య?
   1) మొదటి ప్రోలరాజు
   2) గణపతిదేవుడు 3) మొదటి బేతరాజు
   4) రెండో ప్రోలరాజు
4. తొలి కాకతీయులు ఎవరికి సామంతులుగా ఉన్నారు?
   1) శాతవాహనులు 2) రాష్ట్రకూటులు
   3) బాదామి చాళుక్యులు 4) ఇక్ష్వాకులు
5. మలి కాకతీయులు ఎవరి సామంతులు?
   1) రాష్ట్రకూటులు
   2) కల్యాణి చాళుక్యులు
   3) బాదామి చాళుక్యులు
   4) కందూరి చాళుక్యులు
6. రుద్రదేవుడు ఏ కాలంనాటికి తీరాంధ్రను జయించాడు?
   1) క్రీ.శ. 1186 2) క్రీ.శ. 1180
   3) క్రీ.శ. 1176 4) క్రీ.శ. 1190
7. పల్నాటి యుద్ధంలో నలగామ రాజుకు సహాయపడ్డ కాకతీయ రాజు?
   1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు 4) రెండోబేతరాజు
8. రుద్రదేవుడు యుద్ధాల్లో తనకు సహాయం చేసిన ఏ రాజును ఆమనగల్లు సామంతునిగా నియమించాడు?
   1) రేచర్ల నామిరెడ్డి 2) రేచర్ల చెవిరెడ్డి
   3) రేచర్ల లోకిరెడ్డి 4) రేచర్ల బేతిరెడ్డి
9. వేయి స్తంభాల గుడి (రుద్రేశ్వరాలయం) ని కట్టించినవారు?
   1) రుద్రదేవుడు 2) గణపతిదేవుడు
   3) రుద్రమదేవి 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు

1) 3 2) 2 3) 4 4) 2 5) 2
6) 1 7) 3 8) 4 9) 1

కణజాలం అనే పదాన్ని మొదట వాడింది ఎవరు?

కణజాలాలు

జీవుల్లో నిర్మాణాత్మక, క్రియాత్మక ఆధార ప్రమాణం కణం. అనేక కణాల సముదాయాన్ని కణజాలం అంటారు. కణజాలాలు కలిసి వివిధ అవయవాలను, అవయవాలు కలిసి అవయవ వ్యవస్థలను ఏర్పరుస్తాయి. వివిధ వ్యవస్థల సముదాయమే జీవి. మొక్క లేదా జంతువు రూపొందేందుకు మొదట రెండు కణాల సంయోగం జరిగి సంయుక్త బీజకణం (జైగోట్) ఏర్పడుతుంది. అది అనేక మార్పులకు (విభజనలు) గురై మొక్క లేదా జంతువుగా మారుతుంది. ఈ క్రమంలో వివిధ రకాల కణాలు కలిసి వివిధ రకాలైన కణజాలాలను ఏర్పరుస్తాయి. కణజాలాలు మొక్కల్లో, జంతువుల్లో నిర్మాణాలు, వాటి పనితీరును బట్టి వివిధ రకాలుగా ఉన్నాయి. కణజాలాల అధ్యయనాన్ని హిస్టాలజీ అంటారు. కణజాలం (టిష్యూ) అనే పదాన్ని మొదటవాడింది బిచాట్.



మొక్కల్లో కణజాలం

మొక్కల్లో సాధారణంగా మూడు రకాల కణజాలాలు ఉంటాయి. అవి..

1. సరళ కణజాలం
2. సంక్లిష్ట కణజాలం
3. ప్రత్యేక కణజాలం

1. **సరళ కణజాలం:** నిర్మాణం, విధుల్లో ఒకే విధంగా ఉండే కణాల సముదాయాన్ని సరళ కణజాలం అంటారు. ఇది మొక్కల్లో ఎక్కువ శాతం ఉండే కణజాలం. దీనిలో

ఎ. మృదు కణజాలం
బి. స్థూలకోణ కణజాలం
సి) దృఢ కణజాలం అనే రకాలుంటాయి.

మృదు కణజాలం: మొక్కల్లోని లేత, మెత్తని భాగాల్లో, పత్రాలు, పుష్పాలు, ఫలాలు, విత్తనాల్లో ఎక్కువగా ఉంటుంది. మృదు కణజాలం గాయాలను మాన్పడానికి, అంట్లు కట్టినప్పుడు, పునరుద్భవం మొదలైన అంశాల్లో దోహదపడుతుంది. కణజాల వర్ధనంలో అసంఖ్యాకంగా మొక్కలు ఏర్పడటానికి ఇది తోడ్పడుతుంది.

స్థూల కోణ కణజాలం (కోలెన్‌కైమా): ఇది ఎక్కువగా లేత కాండాలు, పత్ర వృంతాలు, పుష్ప వృంతాలు, పత్రాల అంచులు, ఈనెలు మొదలైన భాగాల్లో ఉంటుంది. ఏక దళ బీజ మొక్కల కాండం, పత్రాల్లో ఉండదు. ఈ కణాలు వివిధ ఆకృతులతో ఉంటాయి. వీటి కణ కవచం ప్రత్యేకత ఏమిటంటే సెల్యూలోజ్, పెక్టిన్‌తో నిర్మితమై ఉంటుంది. కణ కవచంలో 60 శాతం నీరు ఉంటుంది. స్థూల కోణ కణజాలం మొక్కల భాగాలకు సమ్యత (Flexibility), స్థితిస్థాపకతను కలగజేయడం వల్ల వృంత భాగాలు సులువుగా వంగుతాయి. పత్ర, పుష్ప వృంతాలు వంటి సున్నిత భాగాలు ప్రతిబలాన్ని (Stress), ప్రయాస (Strain) ను ఎదుర్కొంటాయి. పత్రాల పై భాగాన ముదురు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం స్థూల కోణ కణజాలమే.

దృఢ కణజాలం: ఇది నిర్జీవ సరళ యాంత్రిక కణజాలం. ఇది మొక్కల భాగాలకు యాంత్రిక బలాన్ని, గట్టిదనాన్ని కలుగజేస్తుంది. ఇది ఎక్కువగా ఎడారి మొక్కల్లో అభివృద్ధి చెంది ఉంటుంది. వీటి కణ కవచాలు లిగ్నిన్‌తో నిర్మితమై ఉంటాయి. నారలు,శిలా కణాలు ఈ కణజాలానికి చెందినవే. అతి పొడవైన నారలు.. రామి నారలు (బొహెమిరియా నీవియా). నారల్లో సెల్యూలోజ్ ఉన్న వాటిని ఫ్లాక్స్ నారలు అంటారు. ఇవి వాణిజ్య పరంగా విలువైనవి. ఫ్లాక్స్ నారలు, హెంప్, రామినారల్లో లిగ్నిక్ ఉండదు.

కండ ఉన్న ఫలాలు, విత్తనాలు మొదలైన వాటిలో శిలా కణాలు ఎక్కువగా ఉంటాయి. **ఉదా:** కొబ్బరి, యాపిల్, పియర్.

2. **సంక్లిష్ట కణజాలం:** భిన్న రకాలైన కణాలు కలిసి ఒకే పనిని నిర్వర్తించేందుకు ఏర్పడే కణ

టెట్, డీఎస్సీ - ప్రత్యేకం
బయాలజీ

జాలం ఇది. ముఖ్యంగా మొక్కల్లో నీటిని, ఖనిజ మూలకాలను, ఆహార పదార్థాలను రవాణా చేసేందుకు ఉపయోగపడుతుంది. సంక్లిష్ట కణజాలంలో 1) దారువు (Xylem) 2) పోషక కణజాలం (Phloem) అనే రెండు రకాలుంటాయి. దారువును హైడ్రోమ్ అని కూడా అంటారు. ఇది నీటిని, ఖనిజ మూలకాలను మొక్కకు రవాణా చేస్తుంది. దీనిలో దారు కణాలు, దారు నారలు, దారు నాళాలు, దారు మృదు కణాలు మొదలైనవి ఉంటాయి. దారువులో ఉండే కణాలు లిగ్నిన్ కణ కవచాలను కలిగి, కేంద్రకం లేకుండా నిర్జీవంగా ఉంటాయి. ఇవి మొక్కకు భౌతిక ఆధారాన్ని, దృఢత్వాన్ని ఇస్తాయి. పరిణతి చెందిన వృక్షాల్లో దారు నాళాల్లోకి బెలూన్ల వంటి నిర్మాణాలు ఏర్పడతాయి. వీటిని టైలోసిస్‌లు అంటారు. ఇవి కాండందృఢత్వాన్ని పెంచుతాయి. కలప ఎక్కువ మన్నిక ఉంది అనడానికి కారణం టైలోసిస్‌లు ఏర్పడటమే.

పోషక కణజాలాన్ని లెప్టోమ్ అని కూడా అంటారు. ఇది ఆహార పదార్థాలను మొక్క అన్ని భాగాలకు సరఫరా చేస్తుంది. దీనిలో చాలనీ కణాలు, చాలనీ నాళాలు, సహకణాలు, నారలు,



మృదు కణాలు మొదలైనవి ఉంటాయి. మొక్కల్లో కేంద్రక రహిత సజీవ కణాలు చాలనీ నాళాలు (ఆర్‌బీసీ మాదిరిగా). కణాల మధ్య కణ ద్రవ్య పోగులు (ప్లాస్మా డెస్మెటా) కన్వేయర్ బెల్టుల మాదిరిగా పనిచేస్తాయి.

3. **ప్రత్యేక కణజాలం:** విభిన్న కణాలు విభిన్న ప్రక్రియలను జరిపే కణజాలాన్ని ప్రత్యేక కణజాలం అంటారు. ఇది ముఖ్యంగా స్రావక క్రియలో తోడ్పడుతుంది. కీటకాహార మొక్కల్లో జీర్ణరసాలను స్రవించేందుకు జీర్ణగ్రంథులుంటాయి. ఇవి కీటకాలను జీర్ణం చేసేందుకు ప్రోటిమోలైటిక్ ఎంజైమ్‌లను ఉత్పత్తి చేస్తాయి. తేనెటీగలు గ్రహించే మకరందం పుష్పాల్లో ఉండే మకరంద గ్రంథుల నుంచి వస్తుంది.

కొన్ని మొక్కలు సుగంధ పరిమళాన్ని వెదజల్లుతాయి. దీనికి కారణం ఆస్మోఫోర్‌లు. పైనస్ వంటి మొక్కల్లో రెసిన్లను ఉత్పత్తి చేసేది స్రావక కుహరాలు. శీతాకాలంలో కొన్ని మొక్కలు **ఉదా:** గడ్డి, టమాటా వంటి మొక్కల పత్రాల చివరి భాగం నుంచి నీరు బిందువుల రూపంలో వెలువడుతుంది. దీన్నే బిందుస్రావం (Guttation) అంటారు. ఇది జరిగేందుకు హైడథోడ్స్ (జలగ్రంథులు) తోడ్పడతాయి. కొన్ని మొక్కల్లో వాటిని గిల్లినప్పుడు తెల్లని పాల వంటి పదార్థం వెలువడుతుంది. దీన్నే లేటెక్స్ అంటారు. దీన్ని ఉత్పత్తి చేసే కణజాలం లాటిసి ఫెరస్ కణజాలం. లేటెక్స్ నుంచి రబ్బర్‌ను తయారు చేస్తారు. హీవియా బ్రెజిలియన్సిస్ నుంచి పారా రబ్బర్, ఫైకస్ ఎలాస్టికా నుంచి ఇండియన్ రబ్బర్‌ను తయారు చేస్తారు.

కణజాల వ్యవస్థలు: మొక్క భాగాలను వేరు, కాండం, పత్రం వంటి వాటిని ఛేదించినప్పుడు వాటిలో వివిధ రకాల కణజాలాలు వివిధ రీతుల్లో కనిపిస్తాయి. సాధారణంగా వెలుపలి వరుసలో బాహ్య చర్మం, మధ్యలో వల్కలం, లోపలి తలంలో ప్రసరణ స్తంభం అనే భాగాలుంటాయి.

వేరు బాహ్య చర్మంలోని కేశాలు నీటిని శోషించేందుకు, కాండంలోని బాహ్య చర్మ కేశాలు రక్షణకు తోడ్పడతాయి. పత్రం బాహ్య చర్మంలో పత్ర రంధ్రాలుంటాయి. పత్ర రంధ్రాలుండే భాగంలో రక్షక కణాలుంటాయి. పత్ర రంధ్రాల ద్వారా నీరు ఆవిరి అవడాన్ని భాష్పోత్సేకం అంటారు. వేరు, కాండం వంటి భాగాల్లో వల్కలం అధికంగా ఉంటుంది.

ఇది ముఖ్యంగా పదార్థాల రవాణా నిల్వలో తోడ్పడుతుంది. ప్రసరణ స్తంభంలో దారువు, పోషక కణజాలం ఉంటాయి. సాధారణంగా వేరులో బాహ్య ప్రథమ దారుకం (Exarch), కాండంలో అంతర ప్రథమ దారుకం (Endwich) స్థితులు ఉంటాయి.

వృక్షాల కాండాలు బాగా వృద్ధి (లావెక్కడం) చెందడాన్ని ద్వితీయ వృద్ధి అంటారు. దీనిలో వార్షిక వలయాలు ఏర్పడతాయి. వీటి సంఖ్యను బట్టి వృక్షాల వయసును లెక్కిస్తారు. కాండం మధ్యలో ముదురు రంగులో ఉన్న భాగాన్ని డ్యూరామెన్ అని, లేత రంగులో ఉన్న భాగాన్ని అల్బర్నం అంటారు. వెలుపలి భాగాన పొలుసుల మాదిరిగా ఏర్పడిన దాన్ని బెరడు అంటారు. బాగా వృద్ధి చెందిన వృక్షాల పై భాగాన సూక్ష్మ రంధ్రాలు ఏర్పడతాయి. వీటినే వాయురంధ్రాలు అంటారు.

జంతువుల్లో

జంతువుల్లో కణజాలాలు పని చేసే విధానాన్ని బట్టి నాలుగు రకాలు.

1. ఉపకళా కణజాలం
2. సంయోజక కణజాలం
3. కండర కణజాలం
4. నాడీ కణజాలం

1. **ఉపకళా కణజాలం (ఎపిథీలియల్):** ఇది ముఖ్యంగా శరీర బాహ్య తలంలోనూ, శరీరంలోని వివిధ అంగాల బాహ్య, అంతర తలాల్లోనూ పొర మాదిరిగా ఉంటుంది. **ఉదా:** చర్మం.

వెంట్రుకలు, గోళ్లు, కొమ్ములు మొదలైనవి ఉపకళా కణజాలాలతో నిర్మితమైనవే. ఇవి బాహ్య ప్రేరణను కూడా కలుగజేస్తాయి. ఉప కళాకణజాలంలో కణాలు ఘనాకారంలో, స్తంభాకారంలో, మరికొన్ని శైలికలను కలిగి ఉంటాయి. **ఉదా:** జీర్ణాశయంలో శైలికల వంటి నిర్మాణాలు ఆహార పదార్థాలను కదిలించేందుకు తోడ్పడతాయి. వివిధ రకాలైన హార్మోన్‌లను, రసాయన పదార్థాలను స్రవించడంలో కూడా ఉపయోగపడతాయి.

2. **సంయోజక కణజాలం:** ఇది వివిధ కణజాలాలను, అంగాలను కలిపి ఉంచుతుంది. శరీర రక్షణ, శరీర భాగాలను బాగు చేయడంలో ఉపయోగపడుతుంది. కొవ్వులను నిల్వ చేయడం మొదలైన పనులను నిర్వర్తిస్తుంది. వివిధ కణజాలాలను కలిపే కణజాలం ఏరిమోలార్ కణజాలం. దెబ్బతిన్న భాగాలను బాగు చేసేది ఏరిమోలార్ కణజాలమే.

మృదులాస్థి అనేది మరొక సంయోజక కణజాలం. ఇది ఎముకల చివర చెవిదొప్ప, వాయునాళం, ముక్కు మొదలైన భాగాల్లో ఉంటుంది. పిండ దశలో ఎక్కువగా ఉండేవి మృదులాస్థులే. వీటిలోని కణాలను ఆస్టియోసైట్స్ అంటారు. ఎముక నిర్మాణానికి కాల్షియం ఫాస్ఫేట్, కాల్షియం కార్బొనేట్‌లు అవసరం. వీటిని అస్థిమజ్జలో ఉండే ఆస్టియోసైట్స్ స్రవిస్తాయి.

లిగమెంట్ అనేది ఎముకను మరొక ఎముకతో కలిపి ఉంచే ఒక సంయోజక కణజాలం. ఇది కొల్లాజెన్ అనే ప్రోటీన్‌తో తయారై ఉంటుంది. టెండాన్ (స్నాయుబంధనం) అనేది ఎముకను, కండరాన్ని కలిపి ఉంచే మరొక సంయోజక కణజాలం. ఎడిపోస్ కణజాలం అనేది కొవ్వును నిల్వ చేస్తుంది. ఇది ఉపవాసం సమయంలో శరీరానికి శక్తిని సమకూరుస్తుంది. అదే మాదిరిగా శరీరంలోని వేడిని బయటకు పోకుండా చేస్తుంది.

రక్తం కూడా ఒక సంయోజక కణజాలం. దీనిలో ప్లాస్మా అనే ద్రవ పదార్థ రక్త కణాలు ఉంటాయి. ప్లాస్మాలో అనేక రకాల ఆహార పదార్థాలు, లాక్టిక్ ఆమ్లం, యూరియా వంటి విసర్జక పదార్థాలు, హెపారిన్, ప్రోథ్రాంబిన్ వంటి ప్రోటీన్స్ మొదలైనవి ఉంటాయి. రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, థ్రాంబోసైట్స్ అనే మూడు రకాల కణాలుంటాయి. ఎర్ర రక్తకణాల్లో కేంద్రకం ఉండదు కానీ చేపలు, ఉభయ చరాలు, సరీసృపాలు, గుర్రం వంటి వాటిలో కేంద్రాన్ని కలిగిన ఎర్ర రక్త కణాలుంటాయి. ఇవి O_2, CO_2 రవాణాలో తోడ్పడతాయి.తెల్ల రక్తకణాలు కేంద్రకాన్ని కలిగి వివిధ రీతుల్లో ఉంటాయి. ఇవి శరీరంలో వ్యాధి నిరోధకతను పెంచుతాయి. రక్త ఫలకికలు (థ్రాంబోసైట్లు) కేంద్ర రహితం. ఇవి రక్తాన్ని గడ్డ కట్టించేందుకు తోడ్పడతాయి.

3. **కండర కణజాలం:** శరీరంలోని దాదాపు ఎక్కువ భాగాలు కండర కణజాలంతో నిర్మితమై ఉంటాయి. పూర్తిగా కండర కణజాలంతో నిర్మితమైంది గుండె, నాలుక మొదలైన కండరాలు వివిధ భాగాల చలనానికి తోడ్పడతాయి. కండరాలు ముఖ్యంగా మూడు రకాలు.

1. రేఖీత కండరాలు
2. అరేఖిత కండరాలు
3. హృదయ కండరాలు.

మాదిరి ప్రశ్నలు

1. **శరీరంలో వివిధ అవయవ వ్యవస్థలు ఏర్పడేందుకు అవసరమైనవి?**
   1) కణాలు 2) కణజాలం
   3) కేంద్రకం 4) కణాంగాలు
2. **నిరంతరం కణ విభజన జరపని కణజాలం?**
   1) హృదయ కండరం 2) అస్థి కణజాలం
   3) 1, 2 4) కండర కణజాలం
3. **అతి పొడవైన కణాలను కలిగిన కణజాలం?**
   1) కండర కణజాలం
   2) ఎడిపోజ్ కణజాలం
   3) నాడీ కణజాలం
   4) సంయోజక కణజాలం
4. **పేగు గోడలపై ఉండే కణజాలం?**
   1) సంయోజక కణజాలం
   2) ఉప కళా కణజాలం
   3) కండర కణజాలం 4) నాడీ కణజాలం
5. **అసంకల్పిత చర్యలను జరిపే కండరాలు?**
   1) హృదయ కండరాలు
   2) రేఖిత కండరాలు
   3) అరేఖిత కండరాలు 4) 1, 3
6. **మొక్కల్లో నీటిని, ఖనిజ మూలకాలను రవాణా చేసే కణజాలం?**
   1) సరళ కణజాలం 2) సంక్లిష్ట కణజాలం
   3) ప్రత్యేక కణజాలం 4) 1, 3
7. **వృక్షాల్లో వాటి వయసును కొలవడానికి ఉపయోగపడే వార్షిక వలయాల్లో ఉండే కణజాలం?**
   1) దారువు 2) పోషక కణజాలం
   3) దవ్వ 4) బాహ్య చర్మం

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 2;
5) 4; 6) 2; 7) 1.

How many such pairs of letters are there..

MODEL QUESTIONS

BANK EXAMS
REASONING



Directions (Q.No.1-5): Read the following information carefully and answer the questions which follow:

» If 'A * Z' means 'A is the wife of Z'.
» If 'A × Z' means 'A is the husband of Z'.
» If 'A + Z' means 'A is the sister of Z'.
» If 'A - Z' means 'A is the brother of Z'.
» If 'A > Z' means 'A is the son of Z'.
» If 'A < Z' means 'A is the daughter of Z'.

1. Which of the following relations will not be true if the expression 'A < P × T + F > L × M' is definitely true?
   1) A is the daughter of T
   2) F is the son of M
   3) P is the son-in-law of L
   4) A is the cousin of F
   5) M is the grandmother of A
2. Which of the following means N is the daughter-in-law of A?
   1) M + N * P > A
   2) N < M + P + A
   3) M - N × P < A
   4) A < P + N × M
   5) A < N < P * M
3. How is P related to F if 'Q × P < B + F'?
   1) Daughter 2) Niece
   3) Daughter-in-law
   4) Grand daughter 5) Aunt
4. Which of the following means P is the father of R?
   1) R > S < P * J
   2) J + R - S < P
   3) R > S * P- J
   4) S + J × R < P
   5) None of these
5. How is M related to B if 'A * B > Z × S + M'?
   1) Aunt 2) Grand father
   3) Uncle 4) Cousin
   5) Can't be determined

Directions (Q.No.6-10): Answer the following questions based on the three digit numbers

612 589 743 468 297

6. If two is added to the first digit of each of the numbers, how many numbers thus formed will be completely divisible by three?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. If the positions of the second and the third digits of each of the numbers are interchanged, in how many numbers thus formed will the last digit be a perfect square? ('1' is also a perfect square?
   1) One 2) Two 3) Three
   4) Four 5) Five
8. What will be the resultant if the third digit of the second lowest number is divided by the second digit of the highest number?
   1) 4 2) 1 3) 6 4) 5 5) 2
9. If all the digits in each of the numbers are arranged in descending order within the number which of the following will form the highest number in the new arrangement?
   1) 612 2) 589 3) 743
   4) 468 5) 297
10. If all the numbers are arranged in ascending order from left to right, which of the following will be the sum of all the three digits of the number which is second from the right of the new arrangement thus formed?
    1) 14 2) 9 3) 18
    4) 16 5) 12

Directions(Q.No.11-15): Answer these questions referring the symbol-letter -number sequence given below:

L 2 M 3 S P @ = J 5 B $ R 7 N # T D 6 B K V 9 4 % A F 8

11. How many such symbols are there each of which is either immediately preceded by a number or immediately followed by a letter?
    1) One 2) Two 3) Three
    4) More than three 5) None
12. Four of the following five are alike in a certain way based on their position in the above arrangement and hence form a group. Which one does not belong to the group?
    1) 2 S 2) 9 K % 3) # R D
    4) $ 5 7 5) = P 5
13. How many such numbers are there each of which is either immediately preceded by a symbol or immediately followed by a letter?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
14. Which of the following is the seventh to the left of 15th from the right end of the above arrangement?
    1) @ 2) P 3) J 4) 5 5) B
15. If the positions of twenty four elements from the right end are reversed, which of the following will be the 15th element from the left end?
    1) B 2) 4 3) 6
    4) # 5) None of these


Directions (Q.No.16-17): Study the following information carefully and answer the questions given below :

F is the grandson of U. M is the mother of F. M is married to P. P is the son of G. G is married to K.

16. How is K related to M?
    1) Cannot be determined
    2) Daughter-in-law
    3) Father 4) Mother
    5) Daughter
17. If D is the father of M, then how is F related to D?
    1) Father 2) Grandson
    3) Son 4) Brother
    5) Grandfather
18. How many such pairs of letters are there in the word SHARED each of which has as many letters between them in the word (in both forward and backward directions) as they have between them in English alphabetical series?
    1) Three 2) None 3) One
    4) More than three 5) Two
19. All the letters of the word GLACIERS are arranged in alphabetical order from left to right. Then all the consonants are replaced with the next alphabet (as per the English alphabetical order), then which of the following will be the fourth letter from the left end?
    1) I 2) C 3) R
    4) M 5) H
20. In a straight line of twelve persons (all facing north), only five persons sit to the left of L. Only three persons between C and L. G sits second to the right of C. Only five persons sit between G and M. How many persons sit between M and L?
    1) Two 2) None
    3) Five 4) Three
    5) Cannot be determined

SOLUTIONS


1. A < P × T + F > L × M means



From the above it can be concluded that the relation "A is the cousin of F" is not true *Ans: 4*

2. In options (3) and (4) N is a male, hence these are eliminated in option (5) N and A have a direct relation. So this also can be eliminated. In option (2) N is the daughter of M and P, M are sisters of A. So N is the Niece of of A. So this option(2) can be eliminated. In option (1) N is wife of P and P is son of A. so N is daughter-in-law of A. *Ans: 1*

3.



P is F's sister's daughter
⇒ P is F's Niece *Ans: 2*

4. In option (1) P is A female and In option (2) and (4) P's gender is not known. Hence these options are ruled out.
Draw family tree for option (3)
S → P – J
|
R
∴ P is R's father *Ans: 3*

5. Here M is at the end of the relational string and M's gender is an unknown. Hence M's relation to B cannot be established. *Ans: 5*

6. Find the numbers whose sum of the digits is one more than 3 multiple (because after addition of 2 it will become a 3- multiple)
The only number satisfying the condition is 589 (5 + 8 + 9 = 22) *Ans: 2*

7. If the position of second and third are interchanged, then the second digit of the original number will become the last digit of the resultant number. So find out the original numbers whose second digits are perfect square. The numbers satisfying the conditions are 6<u>1</u>2 7<u>4</u>3 and 2<u>9</u>7 *Ans: 3*

8. Second lowest number is 468 and its third digit is 8. Highest number is 743 and its second digit is 4.
The Req. result = 8 ÷ 4 = 2 *Ans: 5*

9. If all the digits are arranged in descending order within the number the number 589 will become the highest number in new arrangement *Ans: 2*

10. If the numbers are arranged in ascending order the second highest number will be second from right in the new arrangement The second highest number is 612 and the sum of its digits
= 6 + 1 + 2 = 9 *Ans: 2*

11. The symbols satisfying the conditions are <u>=</u> J, <u>$</u> R, <u>#</u> T, and <u>%</u> A. i.e. four symbols satisfy the condition *Ans: 4*


12. In each of the options second and third characters are second to the left of and second to the right of first character except in option (3) *Ans: 3*

13. The numbers satisfying the conditions are
<u>2</u>M <u>3</u> <u>5</u>B <u>7</u>N <u>6</u>B *Ans: 5*

14. 7th to left of 15th from right ⇒ 7 + 15 = 22nd from right 22nd from right ⇒ 30 – 22 = 8th from left ⇒ @ *Ans: 1*

15. If the position of last 24 elements are reversed then 15th from left end in new arrangement will be 10th letter from right in original arrangement (∵ First 5 elements remain same)
The 10th element from right = 6 *Ans: 3*

(16-17)



16. K's gender is unknown. Hence K's relation to m cannot be established *Ans: 1*

17. If D is father of M then E is Grandson of D *Ans: 2*

18. The pairs satisfying the condition are AD, DE, DH and EH *Ans: 4*

19. Fourth letter from left if the letters arranged in alphabetical order = G Now G is replaced by next consonant H *Ans: 5*

20. _ C _ G _ L _ _ _ M _ _
Three persons sit between M and L *Ans: 4*